# వేదాంతం తెలుసుకుందాం


**స్వామి పరమార్థానంద సరస్వతి**

చెన్నై, ఇండియా


**క్లాస్‌రూమ్ బోధల సారాంశం**

http:www.vedantavidyarthisangha.org//homeindex.html


రచన


**శ్రీనివాసులు గొల్లపూడి**

టొరొంటో, కెనడా

స్వేచ్ఛానువాదం

**మద్దూరి రాజ్యశ్రీ**

హైదరాబాద్, ఇండియా



జననం 28-04-1936 శ్రీ గొల్లపూడి శ్రీనివాసులు గారు నిర్యాణం 22-10-2022

# i స్వామీజీ గురించి

స్వామీ పరమార్థానంద గారు వేదాంతంలో శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు. ఆయన పాల్ఘాట్లో జన్మించారు. 11 సంవత్సరాల లేత్రప్రాయంలోనే భగవద్గీతలోని 700 శ్లోకాలు, మరికొన్ని శ్లోకాలు కంఠతా వచ్చు. డిగ్రీ చేతపుచ్చుకున్నాక, బొంబాయిలో షుమారుగా ఒక సంవత్సరం పాటు ఒక ప్రసిద్ధి చెందిన సంస్థలో ఉద్యోగం చేశారు. పూజ్య స్వామీజీ, స్వామీ దయానంద సరస్వతిగారి బోధ ఒక్కరోజు విని, మర్నాడే తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, స్వామి చిన్మయానంద, ముంబయిలో నడుపుతున్న సాందీపనీ విద్యాశ్రమంలో అడుగుపెట్టారు. అందరిలోకి శ్రేష్ఠులైన స్వామి దయానంద సరస్వతిగారి దగ్గర మూడు సంవత్సరాల కోర్సులో వేదాంత అధ్యయనం చేశారు.

బ్రహ్మచారి దీక్షతో మద్రాసుకు వేదాంతబోధ చేసే ఆచార్యునిగా వచ్చారు. మద్రాసు మహానగరంలో అనేక ప్రాంతాల్లో, కొన్ని సంవత్సరాలు వేదాంతబోధ చేస్తూ వస్తూండగా, 1983లో ఒకరోజు, స్వామీ దయానంద సరస్వతిగారు ఒక పెద్ద సభలో పరమార్థానంద వారిని **'శ్రేష్ఠమైన ఆచార్యుడు,'** అని కీర్తించారు. 1983నుంచీ, పరమార్థానందులవారి వద్ద, అనేకమంది గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ప్రకరణ గ్రంథాలు అభ్యసించటం మొదలుపెట్టారు.

1984లో పరమార్థానందులవారు సన్న్యాసదీక్ష తీసుకుని, మద్రాసు నగరమంతటా అద్వైత వేదాంత స్థాపన చేస్తూ వచ్చారు. మద్రాసు నగరంలోనే కాదు, కోయంబత్తూర్, తేని, రాజపాలయం, బెంగుళూర్లలో కూడా బోధిస్తున్నారు.

స్వామీజీ చాలా నిరాండబర జీవి. ఆయన బోధ చాలా తేలికగా అర్థం చేసుకునేలా ఉంటుంది. స్వామీజీ బోధ శాస్త్రంమీద ఎంతో లోతైన అవగాహనను కలిగించి, విశ్లేషణాత్మకంగా ఉంటుంది. స్వామీ చిన్మయానంద మహారాజు స్వామీజీని, **'బెస్ట్ టీచర్,'**గా ప్రశంసిస్తారు.

# ii Foreword from Swamiji

I am very happy to know that Sri. Srinivasulu is picking up some of the important topics which have been discussed by me during the course of my discourses and he is presenting it in a simple form for anyone who likes to know more about Hindu culture. I saw some of these articles and they have been well written. I am very happy to know about this project. May this project become successful and may more and more people come to know about the greatness of our Vedic culture.

With best wishes,

Hari Om.

Swami Paramarthananda Saraswati
March 2015
Chennai.

# iii రచయిత మనోభావాలు

నా వయస్సు 80 సంవత్సరములు. నేను, టొరంటో, కెనడా లో నివసిస్తున్నాను. వేదాంతంలో చాలా ఆలస్యంగా అడుగు పెట్టాను. మా అన్నగారైన గొల్లపూడి శ్రీరాములుగారు దాదాపు 30 సంవత్సరాలుగా స్వామి పరమార్థానంద సరస్వతి గారి శిష్యులు. నేను కెనడాకు వలస వెళ్ళే ముందు మా అన్నగారితో స్వామీజీ క్లాసులు కొన్నింటికి వెళ్ళటం తటస్థించింది. కానీ ఆ రోజుల్లో నాకేమీ అర్థంకాక నిద్రవచ్చేది. అయినా యేదో శక్తి నన్ను యెలాగో కొన్ని క్లాసులకు వెళ్లేలా చేసింది.

షుమారు పన్నెండు సంవత్సరాల క్రితం స్వామి చిన్మయానంద వ్రాసిన వివేకచూడామణి పుస్తకం నా భార్య పద్మావతి కంటపడింది. ఆవిడ చదువుదామన్నది. ఇద్దరం కలిసి అప్పుడప్పుడు చదివాము. కానీ విషయం మాకు అంతగా బోధపడలేదు. మా పరిస్థితి విన్న మా అన్నయ్య పరమార్థానంద సరస్వతి స్వామీజీయొక్క వివేకచూడామణి క్లాసుల ఆడియో వినమని సలహా యివ్వటమే కాక ఆ సి. డి. లు తెచ్చి యిచ్చాడు.

ఆ స్వామీజీ క్లాసుల సి. డి. లు కూడా యథాలాపంగా విన్నాను. కానీ వేదాంతంమీద కొంత కుతూహలం యేర్పడింది. అయినా నాకు లోతైన జ్ఞానం కలగలేదు. ఉదాహరణకు కారణశరీరం అంటే అర్థమయ్యేది కాదు. అర్థంకాక పోయినా వేదాంతంమీద నా శ్రద్ధ మాత్రం తగ్గలేదు. అది బాగా స్థిరంగా నిల్చిపోయింది. ఇలా లాభంలేదని నా మనస్సుకు అనిపించింది. మళ్లీ రెండవసారి వినటం మొదలు పెట్టాను. ఈసారి ఒక పరీక్షకు సిద్ధమవుతున్నంత శ్రద్ధగా విన్నాను. ఇలా విన్నాక వేదాంతం వైపు బాగా ఆకర్షింపబడ్డాను.

మొదటిసారిగా పరమార్థానంద స్వామిని ప్రత్యేకంగా కలిసి వేదాంతం యింకా నేర్చుకోవాలనే నా కోరికను వెలిబుచ్చాను. స్వామీజీ నన్ను ఆదరంగా పలకరించి, ఓపికగా నా విషయాలన్నీ విని , నేను అధ్యయనం చేయవలసిన గ్రంథాల వరుసక్రమం సూచించారు. ముందు తత్వబోధ, భగవద్గీత, ఉపనిషత్తులు యిలా నేర్చుకోమన్నారు. వీటికి సంబంధించిన ఆడియోలన్నీ సేకరించి చాలా అంకితభావంతో, ఎంతో శ్రద్ధగా వినటం మొదలు పెట్టాను.

అలా వింటున్న రోజుల్లో నాకోసం చాలా అంశాలు వ్రాసుకుంటూ వచ్చేవాడిని. తర్వాత అనిపించింది, యిది నాలాగా వేదాంతంమీద ఎవరికైనా శ్రద్ధ ఏర్పడితే, వారికి కూడా ఉపయోగ పడుతుంది కదా అని . ఆ ఆలోచన రాగానే యిలా పుస్తకరూపంలో ఆవిష్కరించటానికి స్వామీజీ అనుమతి కోరాను. ఆ ప్రయత్నమే స్వామీజీ ఆశీస్సులతో ఈ విధంగా రూపుదిద్దుకుంది.

ఒక్కొక్క అంశం ఒకటి, రెండు పేజీలను మించకుండా ఉండేలాగా, రెండు నిముషాలలో చదవగలిగేలాగా ఏర్చి కూర్చబడింది. అంటే మీరు రోజుకొక అంశం చదివి పక్కన పడేయకుండా, ఒక్కొక్కదాన్నీ వీలున్నన్నిసార్లు చదివి, వాటిమీద, ప్రతిరోజూ, కొన్ని నిముషాలపాటు ధ్యానం చేయాలని నా ఉద్దేశ్యం. అలా చేస్తే, వేదాంతం నేర్చుకోవాలనే తపన మీకు కూడా కలిగి, స్వామీజీ చేసిన బోధలను మీరే స్వయంగా విని, వేదాంతం ఒక క్రమపద్ధతిలో నేర్చుకుని, స్థితప్రజ్ఞులు అవాలని ఆశిస్తున్నాను.

ఈ పుస్తక ప్రచురణకు ప్రూఫ్ రీడింగ్‌లో నాకు సహాయ సహకారాలు అందించిన నా కుటుంబసభ్యులకు, ఈ పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్ది, నేను చెన్నైలో లేకపోయినా ఆశించిన సమయానికి వెలుగు చూసేలా చేసిన రత్న ఆఫ్‌సెట్ ప్రింటర్స్‌కు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకంలో ఏమైనా తప్పులు దొర్లినా, ఏమైనా పొరపాట్లు కనబడినా, దానికి పూర్తి బాధ్యత నేను వహిస్తాను.

మే 2016 **శ్రీనివాసులు గొల్లపూడి**

**2016 లో ఈ పుస్తకం తొలిసారి ప్రచురించిన సమయంలో రచయిత వ్రాసిన నోటుయొక్క తెలుగు అనువాదం**

# iv శ్రద్ధాంజలి

ఎన్నోకవితలు వ్రాసాను యింతకుముందు
వ్రాయలేకపోతున్నానిప్పుడు మీరులేక నాముందు
విమర్శలు, ఆలోచనలు, సలహాలు యిచ్చేవారు లేక
నిలిచిపోయింది నాకలం ముందుకు సాగలేక

23 ఏళ్లవయసులో Fruitnik ప్రారంభించిన సామర్థ్యం
మరల Unique Enterprises స్థాపించిన సాహసం
ప్రతిదీ పరిశీలించి క్షుణ్ణంగా తెలుసుకునే కాంక్ష
తెలిసినదానిని అందరికీ అందించాలనే ఆకాంక్ష

నమ్మిన దానికోసం పోరాడే నిర్భయత్వం
తనకున్నది ఎదుటివారికి పంచే మానవత్వం
ముక్కుకు సూటిగా పోయే వ్యక్తిత్వం
నలుగురినీ ఒకటిగా నడిపించే నాయకత్వం

అనుకోని సంఘటన పిడుగులా పడినా
ఎంతమాత్రం చెక్కుచెదరని మనోనిబ్బరం
తృటిలో జీవితం అంధకార బంధురమయినా
చలించక భగవధేచ్ఛగా స్వీకరించిన మనస్థైర్యం

ఆ వైకల్యం మార్చలేదు మీ జీవితవిధానం
యథాతథంగా సాగించారు మీ జీవనప్రయాణం
అంధకారామే ఆయుధంగా వెలుగుని సాధించారు
ఆధ్యాత్మికలోకంలో అడుగుపెట్టి ఎక్కడికోవెళ్ళిపోయారు

సాంస్కృతిక కళలన్న మీకున్న అభిమానం
అందుకోసం అందరికీ మీరిచ్చే ప్రోత్సాహం
సూప్ కిచెన్ అంటే మీకెంతోమక్కువ
సీనియర్ కబ్లో ప్రారంభించటం కాదేమీ తక్కువ

నిర్మించారు చదువుకునే పిల్లలకు వసతిగృహం
కల్పించారు వారందరికీ ఒక జీవనాధారం
కలిగించారు ఎందరెందరికో స్ఫూర్తి
అదే కదా మీరు సంపాదించిన కీర్తి

సకుటుంబంగా ఘన వీడ్కోలునందుకున్నారు
రామనామం జపిస్తూ వదలి వెళ్ళిపోయారు
చేసుకున్నారు మీ జన్మసాఫల్యం
అందుకున్నారు అందరాని కైవల్యం

ఏ జన్మలో నే చేసిన పుణ్యమో మన కలయిక
జన్మజన్మకీ మీరే కావాలనే నా కోరిక
ఎప్పటికీతీరదని నాకు తెలుసు యిక
ఎందుకంటే మీకు మరుజన్మ లేదు కనుక

బరువెక్కిన హృదయంతో ఘటిస్తున్నాను అంజలి
ఇదే నేను మీకు అందిస్తున్న శ్రద్ధాంజలి

– గొల్లపూడి పద్మావతి

# v The creation of this book

After moving to Canada having wound up his thriving boat building yard in India due to sudden loss of vision from retinal detachment in both eyes, Srini had to rebuild his life all anew as a blind person. He joined mobility and skills training classes for the visually impaired and was able to resurrect his life in a remarkable journey of rehabilitation.

Aiding Srini in this journey, apart from his determination and willpower, was Vedanta. He became a spiritual seeker and devoted himself to learning Vedanta from Swamiji Paramarthananda's teachings. Being an out-and-out engineer, both by nature anv d training, he found the likeness of Vedanta to Science in its reasoning approach very appealing which made him an ardent devotee of Vedanta. Not satisfied with being a long-distance student of Swamiji, Srini undertook a solo journey from Toronto to Chennai and lived there for a couple of months to attend the classes in person, a daring mission really for blind man to accomplish, an act which precisely illustrates the very courageous nature of Srini which has been his hallmark throughout his life.

Eventually, wanting to share this profound knowledge so that it reaches more people he started abridging Swamiji's one-hour long classes into 5-minute audio capsules and distributed it to friends and family as a daily broadcast. Taking it a step further, he decided to create short summations of various topics in simple language to publish in book form, intending to give an overview of the subject which might interest the reader to pursue further study through Swamiji's original lessons or similar. The result of this effort is this book titled 'Know your Scriptures'.

This project, challenging for even a normal person, was no easy task for a blind person. It took hours of strenuous work on the laptop, listening to the audio files repeatedly several times, copying and editing clips of the lectures, and making notes. It took all of Srini's

computer skills working with screen reading software and keyboard shortcuts to accomplish the task.

This book is a testament to Srini's resilience, dedication, and passion for making Vedanta accessible to everyone.

P.S The family has continued the daily broadcast of the 5-minute audio lessons even after Srini, anyone wishing to receive the lessons please send an email to five.minute.gita.lessons@gmail.com.

# vi About Srini

Srinivasulu Gollapudi, the main contributor and creator of this booklet, or Srini as he was also fondly known as, passed away in 2022. We are honored to publish this booklet in English and Telugu to commemorate his life and legacy. We hope this booklet will inspire you to discover the inner strength, calmness, and joy that is within us.

Srini (1936 – 2022) was a remarkable man with many talents and achievements. He had a degree in Chemical Engineering and a passion for entrepreneurship. He started his first successful venture at the young age of 23 and continued to create many others until he retired due to a personal tragedy that caused his blindness in 1999. More than his accomplishments, he is remembered for his character and values.

Srini's life was a testament to courage and resilience. He faced many difficulties and obstacles that he overcame with a positive attitude. He was a natural leader who not only ran his businesses but also contributed to society through various cultural and voluntary organizations. He always tried to help others in need. He was an optimist who never gave up on his dreams and goals. His crowning achievement was the establishment of the GVKC student home that provides free boarding and lodging for 150 disadvantaged children.

His life took a tragic turn when he lost his sight at the age of 63. He never complained or succumbed to his fate. Instead, he pivoted to explore his spiritual side. As a blind man, he had to learn new skills and adapt to a new lifestyle. He embraced technology and learned how to use a computer. He immersed himself in the study of Vedanta under his Guru Swami Paramarthananda.

This book, Srini's compilation of the summary of the teachings and lectures of his Guru, is dedicated to the memory of Srini who inspired many to the wisdom of Vedanta. He is watching from up above and will be joyed if this booklet makes you delve more into Vedanta and enrich your life leading to spiritual freedom.

# vii Acknowledgements

Nothing of this booklet is possible without the grace and wisdom of SwamyParamarthananda. Our sincere salutation and thanks to Swamiji for his blessings.

We cannot thank enough Smt. Rajya Sri and Sri. Raghava Rao of Hyderabad. Smt. Rajya Sri did the translation to Telugu pro bono. Both Rajya Sri and Raghava Rao are ardent followers of Swamiji and enthusiastically jumped into the project when Swamiji made the introduction. Together they have published about 63 books and their work can be seen on www.telugubhakti .com

Finally, we thank all subscribers of Paramaratha Study Circle for a daily 5 minute nugget sized dose of Swamiji's audio lessons. To join email five.minute.gita.lessons@gmail.com

**- Anu, Bhaskar, Saritha, Chandu , Vijitha and Padma**

five.minute.gita.lessons@gmail.com

# viii మా జన్మ ధన్యమైంది!

ఆరోజు, జనవరి 26, 2023. మా జీవితంలో మరపురాని, మరువలేని రోజు. మావారు రాఘవరావు గారు, నేనూ అనంతపూర్‌లో ఒక పెళ్ళికి వెళ్ళాము. పెళ్ళిసందడి అయ్యాక ఫోన్ చూస్తే మిస్స్‌డ్ కాల్స్‌లో స్వామి పరమార్థానంద అనివుంది. మా కళ్ళను మేమే నమ్మలేకపోయాము. స్వామీజీనుంచి మాకు ఫోను రావటం అదే మొదటిసారి మరి!

అంతే ఆశ్చర్యంగా, స్వామీజీకి ఫోన్ చేసి, 'స్వామీజీ, మీరేమైనా మాకు ఫోన్ చేశారా?' అని మొహమాటంగా అడిగారు మావారు. 'అఫ్‌కోర్స్ ఐ రాంగప్,' అన్నారు స్వామీజీ. విషయం ఏమిటంటే స్వామీజీ శిష్యులు, శ్రీనివాసులు అనే ఆయన ఒక బుక్‌లెట్ రాశారనీ, దానిపేరు 'Know Your Scriptures' అనీ, ఆయన అక్టోబర్ 2022లో పరమపదించారనీ, ఆయన కుటుంబ సభ్యులు దీన్ని తెలుగులో ప్రచురించి, ఆయన సంవత్సరీకాలలో పంచుదాం అనుకుంటున్నారనీ చెప్పారు. వారు పోయి స్వామీజీని సలహా అడిగితే, 'నాకు మద్దూరి రాజ్యశ్రీ అని ఒక ఆమె తెలుసు. ఆమె అనువదిస్తుందేమో కనుక్కుని మీకు చెబుతాను,' అన్నారుట.

అన్నట్టుగానే మాకు ఫోన్ చేశారు. మా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. స్వామీజీ అడగటం, మేము కాదనటమా! 'స్వామీజీ, మీ మాట మాకు వేదవాక్కు. మీరు అడగటమా, ఆజ్ఞాపించండి, తప్పకుండా చేస్తాము,' అన్నాము. 'సరే, అయితే వారిని మీతో మాట్లాడమంటాను,' అన్నారు స్వామీజీ.

నిజానికి స్వామీజీ ఇలా మమ్మల్ని రాయమని కోరటం మొదటిసారి కాదు. అదేమిటో తెలియాలంటే, స్వామీజీతో మాకున్న అనుబంధం గురించి కొంచెం చెప్పాలి.

గత పదిహేను సంవత్సరాలుగా మావారూ, నేనూ స్వామీజీ శిష్యులం. వారి ద్వారా ప్రస్థానత్రయం, ప్రకరణ గ్రంథాలు అధ్యయనం చేశాము; వాటిని మేమిరువురం అధ్యాపనం కూడా చేస్తున్నాము. అప్పటికే నేను జైకో బుక్స్ ఇంగ్లీషునుంచి తెలుగులోకి అనువదిస్తుండే దానిని. ఆ ఒరవడిలో స్వామీజీ బోధల్లో ముందస్తుగా అద్వైత వేదాంత పరిచయం, మావారి ప్రోత్సాహంతో, అనువదించాను. అది ప్రచురించాము. అది చాలా జనాదరణ పొందింది. 'స్వామీజీ నా చిన్ని మెదడులో మీది ఏది వింటే అది రాయాలనిపిస్తుంది. ఏది రాస్తానో తెలియదు కాని,' అన్నాను. స్వామీజీ రెండు చేతులూ ఎత్తి, మనసారా దీవించారు, 'అన్నీ రాస్తావమ్మా!' అన్నారు.

గురువు దీవిస్తే, దైవకృప ఉంటే జరిగితీరుతుందన్నది అక్షరసత్యం. స్వామీజీ దీవెనల వర్షం కురిసి, ప్రస్థానత్రయం, ప్రకరణ గ్రంథాలు కలిపి 18 గ్రంథాలు ప్రచురించగలిగాము.

ఆ రాస్తున్న ఒరవడిలో, 'స్వామీజీ, మీ బోధలో, నేనేదైనా అనువదించాలని మీరు భావిస్తున్నారా?' అని అడిగాను ఒకసారి. వెంటనే తన బీరువాలోంచి నాలుగు చిన్న పుస్తకాలు తీసి, '**వేదాంతిక్ స్నాక్స్** పేరిట నేనిచ్చే జనరల్ టాక్స్ ఇవి. వీటిని అనువదించు,' అన్నారు. అవీ, మరికొన్ని బోధలు క్యాసెట్లలో వినీ, వేదాంత జీవనవిధానం పేరిట ప్రచురించాము. అది కూడా ఎన్నో ప్రశంసలు పొందింది.

తర్వాత భగవద్గీత మూడు షట్కాలుగా ప్రచురించి స్వామీజీ దగ్గరకు పోయిన సంవత్సరం వెళ్ళినప్పుడు, 'భగవద్గీతను ఇలా పుస్తకరూపంలో ప్రచురించిన ఘనత మీకే దక్కింది,' అని మెచ్చుకుంటూ, మరో రెండు అసైన్‌మెంట్లు ఇచ్చారు. స్వామీజీ భగవద్గీత అంటే శాస్త్రం తెలియనివారికి, కేవలం అధ్యాయాల సారాంశం బోధించారుట. అది ఇంగ్లీషులో సంస్కృత ఎకాడమీవారు ప్రచురించారుట. దానికి బాగా డిమాండ్ ఉందిట. దాన్ని తెలుగులో రాయమన్నారు. ఆయన శిష్యుని దగ్గర ఆ పుస్తకాలు (3 షట్కాలు) ఉంటే, అప్పటికప్పుడు ఆ శిష్యుడు తెచ్చి ఇచ్చారు. అలాగే తన జనరల్ టాక్స్ చాలా ఉన్నాయనీ, వాటిని కూడా అనువదించమనీ చెప్పారు.

అలా స్వామీజీ కొన్ని అనువదించమని చెప్పినా, ప్రచురించమని చెప్పినా, వేరే ఎవరికో మా గురించి చెప్పి, మాకు వారే స్వయంగా ఫోను చేయటం మాకు ఏనుగెక్కినంత సంతోషం వేసింది. తర్వాత శ్రీనివాసులు గారి అబ్బాయి, చంద్రకిరణ్‌గారితో ఫోనులో మాట్లాడాము; శ్రీనివాసులుగారి భార్య, పద్మావతిగారిని కలిశాము. ఆయన గురించి వింటుంటే కళ్ళనీళ్ళు తిరిగాయి. వేదాంతంలో నేర్చుకున్నదానికి ప్రతీకగా నిలిచారు ఆయన. స్థితప్రజ్ఞుడు, జీవన్ముక్తుడు ఎలా ఉంటాడో అలా ఉన్నారు ఆయన. నిజంగా ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం.

శాస్త్రం మనం ఎక్కడ ఉంటే ఆ స్థాయికి దిగివచ్చి బోధిస్తుందని స్వామీజీ అంటారు. అదే చేశారు శ్రీనివాసులుగారు కూడా. అసలు శాస్త్రం గురించి విననివారు, విన్నా, అందులో ఓనమాలు కూడా తెలియనివారు, తెలిసినా అది తలమీదనుంచి వెళ్ళిపోతుంది, మాకేం అర్థమవుతుంది అనుకునేవారు చాలా తేలికగా అర్థం చేసుకునేలాగా, చాలా చక్కగా, తేలిక భాషలో, సంస్కృత పదాలతో కాని, వేదాంత పరిభాషతో కాని హడలగొట్టకుండా రాశారు.

స్వామీజీ బోధ ఎలా ఉంటుందంటే, అసలేమీ తెలియని ప్రపంచంలోకి స్వయంగా మన చేయి పట్టుకుని, ఒక్కొక్క మెట్టూ పైకి ఎక్కించి, ఎక్కడ జారిపోతామో అని మధ్యమధ్యలో జాగ్రత్తగా చూసుకుంటూ, పైకి తీసుకువెళ్ళి ఒక అద్భుత ప్రపంచం చూపిస్తారు. అలా చేసే స్వామీజీ బోధ ఎక్కడా తగ్గకుండా, శ్రీనివాసులు గారు, ఆయన పద్ధతిలోనే మనకు వేదాల పరిచయంతో మొదలుపెట్టి, పురుషార్థాలు చెప్పి, కర్మయోగం, భక్తియోగాల గురించి చెప్పి,

జ్ఞానయోగానికి తీసుకువచ్చి, జ్ఞానయోగం దశలు చూపించి, జీవాత్మ పరమాత్మ ఐక్యం బోధించారు.

ఒక సాధకుని ప్రయాణం – కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం పాటించి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి మోక్షం పొందాలి. ఈ పుస్తకాన్ని శ్రద్ధగా చదివి, జీర్ణించుకుంటే, ఈ దశలన్నీ దాటుకుంటూ వస్తారు.

శ్రీనివాసులుగారి అమూల్యమైన గ్రంథానికి, స్వామీజీ నమ్మకానికి న్యాయం చేకూర్చాలనే ఆశిస్తున్నాను.

**మద్దూరి రాజ్యశ్రీ**

+ 91 9849092368

గమనిక: **స్వామి పరమార్థానందజీ పుస్తకాలు సరళమైన తెలుగులో** ఈ క్రింద లింకులో ఉచితంగా డౌనులోడు చేసుకోవటానికి వీలుగా పెట్టాము. ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకోగలరు.

http://telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

# విషయసూచిక


| | | |
|---|---|---|
| i | స్వామీజీ గురించి | 05 |
| ii | Foreword from Swamiji | 06 |
| iii | రచయిత మనోభావాలు | 07 |
| iv | శ్రద్ధాంజలి | 09 |
| v | The creation of this book | 11 |
| vi | About Srini | 13 |
| vii | Acknowledgements | 14 |
| viii | మా జన్మ ధన్యమైంది! | 15 |
| 1. | మన శాస్త్రాలు ఏమిటి? | 20 |
| 2. | వేదం ప్రమాణమా? | 21 |
| 3. | వేదాంతశాస్త్రం – విజ్ఞానశాస్త్రం | 22 |
| 4. | వేద విభజన | 24 |
| 5. | శాస్త్రంలోని స్థాయిలు | 25 |
| 6. | శాస్త్రంలో భిన్న అంశాలు ఉన్నాయా? | 28 |
| 7. | జీవితంలో ఏం కోరుకుంటున్నారు? | 29 |
| 8. | ఆనందం రూపురేఖలు | 31 |
| 9. | బాహ్యప్రపంచంలో లేకపోతే, ఎక్కడుంది ఆనందం? | 33 |
| 10. | నా గురించి నేను కొత్తగా నేర్చుకునేదేముంది? | 34 |
| 11. | విషయానందం – ఆత్మానందం | 35 |
| 12. | ఆత్మానందాన్నిచ్చే ఆత్మజ్ఞానం పొందటమెలా? | 37 |
| 13. | 'నేను' అంటే ఆత్మను అని ఎందుకంటుంది శాస్త్రం? | 39 |
| 14. | ఆత్మ నిర్వచనం | 40 |
| 15. | ఆశ్చర్యాలలోకెల్ల ఆశ్చర్యం! | 42 |
| 16. | సంసారం, కర్మ సిద్ధాంతం | 44 |
| 17. | కర్మ సిద్ధాంతం అంటే ఏమిటి? | 47 |
| 18. | పురుష ప్రయత్నమా, ఈశ్వరకృపా? | 49 |
| 19. | వేదాంతంయొక్క ప్రాథమిక బోధ ఏమిటి? | 51 |
| 20. | ఆత్మజ్ఞానం సాధ్యం అయితే, ఏది సాధన? | 53 |
| 21. | సాధన చతుష్టయ సంపత్తి | 56 |

| | |
|---|---|
| 22. శమాది షట్కసంపత్తి | 58 |
| 23. సృష్టి, స్థితి, లయకారకుడు పరమాత్మ | 60 |
| 24. పురుషార్థాలు | 61 |
| 25. ఆశ్రమవ్యవస్థ | 63 |
| 26. వర్ణవ్యవస్థ | 66 |
| 27. దేవతా దృష్ట్యా భక్తిత్రయం | 67 |
| 28. భావనాదృష్ట్యా భక్తిత్రయం | 69 |
| 29. సాధనాదృష్ట్యా భక్తిత్రయం | 71 |
| 30. కర్మయోగం – ఆధ్యాత్మిక రంగంలో తొలిమెట్టు | 73 |
| 31. పంచమహాయజ్ఞాలు | 75 |
| 32. కర్మయోగానికి ఐదు మెట్లు | 77 |
| 33. ఉపాసనయోగం | 79 |
| 34. ఉపాసనకు బహిరంగ సాధనలు | 81 |
| 35. ఉపాసనకు అంతరంగ సాధనలు | 83 |
| 36. జ్ఞానయోగం | 85 |
| 37. జ్ఞానయోగానికి సాక్షాత్ సాధనలు | 87 |
| 38. జ్ఞానయోగానికి సహకారీ సాధనలు | 89 |
| 39. ఆత్మ గురించి తెలుసుకోవటమెలా? | 91 |
| 40. శరీరత్రయం | 93 |
| 41. అవస్థాత్రయం | 96 |
| 42. ఆత్మ అంటే ఏమిటి? | 98 |
| 43. విజ్ఞానశాస్త్రం – వేదాంతశాస్త్రం | 100 |
| 44. ఆత్మవిద్యను శ్రేష్ఠం అని ఎందుకంటారు? | 102 |
| 45. చైతన్యం – కాంతి | 104 |
| 46. ఆత్మకు నిదర్శనం ఏమిటి? | 106 |
| 47. ఆత్మ నా స్వస్వరూపం | 108 |
| 48. బ్రహ్మస్వరూపం | 110 |
| 49. సత్, చిత్ రెండు భిన్నవస్తువులా? | 112 |
| 50. సచ్చిదానంద ఆత్మ విశ్లేషణ | 114 |
| 51. మోక్షం అంటే ఏమిటి? | 116 |
| 52. మహావాక్యం | 118 |

# Know Your Scriptures
# వేదాంతం తెలుసుకుందాం

## 1. మన శాస్త్రాలు ఏమిటి?

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్ ।**
**అస్మదాచార్యపర్యంతాం వందేగురుపరంపరామ్ ॥**

మన శాస్త్రాలలో మూలగ్రంథం అంటే మొట్టమొదటి గ్రంథం, వేదాలు. వాటిని అపౌరుషేయాలు అంటారు. సాక్షాత్తూ భగవంతుణ్ణుంచే మన ఋషులు వారి సత్త్వగుణంతో అందుకుని, గురుపరంపరగా, ముందుతరాల వారికి అందజేశారు. భగవంతుడైన సదాశివుణ్ణుంచి వచ్చింది అని పై శ్లోకం చెబుతుంది.

**నారాయణం పద్మభవం వసిష్ఠం, శక్తిం చ తత్పుత్ర పరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాంతం, గోవిందయోగీంద్రమథాస్య శిష్యమ్ ॥**
**శ్రీ శంకరాచార్యమథాస్య పద్మపాదం చ, హస్తామలకం చ శిష్యమ్ ।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతత మానతోస్మి ॥**

నారాయణుణ్ణి ఆదిగురువుగా కొలుస్తూ, ఈ శ్లోకం ఉంది. నారాయణుడు అన్నా సదాశివుడు అన్నా ఇద్దరూ ఒకరే. సాక్షాత్తూ భగవంతుణ్ణుంచి వచ్చాయి కాబట్టి అపౌరుషేయాలు అంటారు. అంటే పురుషబుద్ధినుంచి వచ్చినవి కావు. ఋషులు వారి సత్త్వగుణంచేత విని అందుకున్నారు కాబట్టి శ్రుతి అని కూడా అంటారు.

వేదాలు, మనిషి మనుగడను సాగించటానికి వీలుగా, ఒక మాన్యువల్‌లాగా ఇవ్వబడ్డాయి. భగవంతుడు జగత్తును సృష్టించాక, మనుష్యులను సృష్టించాక, వైదిక జీవనవిధానాన్ని సూచిస్తూ వేదాలను ఇచ్చాడు. మన నిజజీవితంలో కూడా చూడండి, ఏదైనా ఒక వస్తువు కొంటే, దాన్ని ఎలా వినియోగించాలో వివరిస్తూ, దానితోపాటు ఒక మాన్యువల్ ఇస్తారు. ఒక మామూలు వస్తువుకే మాన్యువల్ ఉండాలి అంటే ఇంత ఖరీదైన, ఇంత తెలివైన మానవయంత్రానికి ఇంకెన్ని సూచనలు ఇవ్వాలి? మన మానవయంత్రం ఎంత ఖరీదైనదో తెలియాలంటే అంగాల మార్పిడి చూస్తే తెలుస్తుంది. అన్నింటిలోకి శ్రేష్ఠమైన మనుష్యజన్మను సద్వినియోగం చేసుకోవటానికి సాక్షాత్తూ పరమాత్మే అటువంటి మాన్యువల్‌ను అంటే ధర్మశాస్త్రాన్ని మనకు కానుకగా ఇచ్చాడు. అందువల్ల మన హిందూమతాన్ని సనాతన ధర్మశాస్త్రం అనికూడా అంటారు.

వేదాలు సంస్కృతంలో ఉండటంవల్ల మామూలు మనిషికి తేలికగా అర్థం కావు కాబట్టి, మానవాళి మేలుకోసం తక్కిన గ్రంథాలు మన ఆచార్యులు, వేదాలను ఆధారంగా చేసుకుని

రచించారు. అవి భగవద్గీత, బ్రహ్మసూత్రములు, భాష్యములు మొదలైనవి. ఇవికాక, శంకరాచార్యులవారు వివేకచూడామణి, వేదాంతసాహస్రి వంటి ఎన్నో ప్రకరణగ్రంథాలు రచించారు. పది ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు భాష్యాలు రాశారు. శంకరాచార్యులవారి భాష్యాలమీద అనేక ఉపభాష్యాలు కూడా వచ్చాయి. అందువల్ల మనది అనంతశాస్త్రం అంటారు. మన గ్రంథాలన్నింటినీ కలిపితే ఒక పెద్ద గ్రంథాలయమే ఉంటుంది.

వేదాంతం నేర్చుకునేందుకు వచ్చేటంతవరకూ అసలు మనకు అంత పెన్నిధి ఉందనే తెలియదు. అందువల్ల అంత పెద్ద విజ్ఞానభాండాగారంలోంచి కొంతైనా విజ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నం చేద్దాము.

## 2. వేదం ప్రమాణమా?

మనకు పంచజ్ఞానేంద్రియాలు ఉన్నాయి. అవి కన్ను, ముక్కు, చెవి, చర్మం, నోరు. వాటితో మనం ప్రపంచాన్ని ఐదుగా చేసి శబ్దస్పర్శరూపరసగంధాలను అనుభవిస్తాము. చెవులతో శబ్దాలను వింటాము; చర్మంతో స్పర్శను అనుభవిస్తాము; కనులతో రూపాలను చూస్తాము; నోటితో రసాస్వాదన చేస్తాము; ముక్కుతో సుగంధాలను పీలుస్తాము. ఈ ఐదు జ్ఞానేంద్రియాలను ప్రత్యక్షప్రమాణం అంటారు.

ఈ జ్ఞానేంద్రియాలు వాటిమేరకు అవి ప్రమాణాలు. ఒక ప్రమాణం చేసే పనిని ఇంకొక ప్రమాణం అవుననీ నిరూపించలేదు, కాదనీ కొట్టివేయలేదు. ఉదాహరణకు కన్ను ఒక పూవును చూసి ఇది గులాబీపువ్వు అంటే చెవి అవును గులాబీపువ్వే అనీ చెప్పలేదు; కాదు అనీ ఖండించలేదు. గుడ్డివాడు రూపం, రంగులు తనకు కనబడవు కాబట్టి, వాటిని నా చెవులతోనో, ముక్కుతోనో నిరూపిస్తేనే నేను నమ్ముతాను అని అనలేడు. గుడ్డివానికి పంచప్రమాణాలలో ఒక ప్రమాణం పనిచేయదు కాబట్టి, అతను రూపం, రంగులతో కూడిన ప్రపంచాన్ని అనుభవించలేడు.

భగవంతుడు ఈ ప్రత్యక్షప్రమాణాల్లో దేనికీ అందడు. ఈ ప్రమాణాలకు అందకపోతే, సైన్సుకు అందుతాడా? సైన్సుకు కూడా అందడు. సైన్సు కూడా ఈ ప్రమాణాలమీదే ఆధారపడివుంది. గుడ్డివాడు ఎలాగైతే రూపం, రంగులతో కూడిన ప్రపంచాన్ని అనుభవించలేడో, అలా సైన్సుమీద ఆధారపడితే, పరమాత్మ గురించిన జ్ఞానం కూడా పొందలేము. పరమాత్మ, సృష్టి గురించి సైన్సు చెప్పలేదు. సైంటిస్టులు కూడా 'బిగ్ బ్యాంగ్' ముందేముందో చెప్పలేరు; 'బిగ్ క్రంచ్' తరువాత ఏమవుతుందో చెప్పలేరు. ఇప్పుడేదో 'థియరీ ఆఫ్ ఎవ్విరిథింగ్' గురించి పరిశోధనలు జరుపుతున్నారు. గమనించాల్సిన ఇంకొక విషయం ఏమిటంటే

విజ్ఞానశాస్త్రం కాలం పెట్టే పరీక్షలకు తట్టుకుని నిలబడలేకుండా ఉంది. అంతకుముందు శాస్త్రజ్ఞులు కనుగొన్న అంశాలలో కొన్నింటిని, వారి తరువాత వచ్చిన శాస్త్రజ్ఞులు తప్పని నిరూపించారు. అంతకుముందు కనుగొనబడిన కొన్ని మందులను ఇప్పుడు నిషేధించారు. కాని శాస్త్రం ఒక్కటే కాలం పెట్టే పరీక్షలకు తట్టుకుని నిలబడింది. శాస్త్రాన్ని సైన్సు ద్వారా అవుననీ నిరూపించలేరు, కాదనీ ఖండించలేరు.

పంచజ్ఞానేంద్రియాల ద్వారా తెలుసుకున్న అంశాలను ఎలా ప్రత్యక్షప్రమాణంగా నమ్ముతారో, శాస్త్రాన్ని కూడా ఆరవ ప్రమాణంగా స్వీకరించాలి. జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, బంధం, మోక్షం, సాధనలు – వీటి గురించి తెలుసుకోవాలంటే శాస్త్రమొక్కటే ప్రమాణం. అంతేకాదు, మనుష్యులు వెంపర్లాడే శాంతి, ఆనందం, భద్రత ఎలా దొరుకుతాయో, ఎక్కడ దొరుకుతాయో తెలుసుకోవాలన్నా శాస్త్రమొక్కటే ప్రమాణం.

అందువల్ల మనకున్న ఐదు ప్రమాణాలు బాహ్యావస్తువులు అంటే ఆబ్జెక్ట్ గురించి మాత్రమే చెప్పేవనీ, ఆత్మ గురించి అంటే సబ్జెక్ట్ అయిన నాగురించి చెప్పే ప్రమాణం శాస్త్రం లేదా వేదం ఒక్కటేననీ, దాన్ని ఆరవ ప్రమాణంగా స్వీకరించాలనీ అర్థం చేసుకోవాలి.

## 3. వేదాంతశాస్త్రం – విజ్ఞానశాస్త్రం

వేదాంతశాస్త్రం ఒక ప్రమాణం, విజ్ఞానశాస్త్రం ఇంకొక ప్రమాణం. వేదాంతశాస్త్రం ఆధ్యాత్మిక జీవనవిధానం గురించి బోధిస్తే, విజ్ఞానశాస్త్రం లౌకిక జీవనవిధానం గురించి పరిశోధనలు జరుపుతున్నది. రెండూ, రెండు భిన్నప్రమాణాలు. ఒకదానితో ఇంకొకదాన్ని నిరూపించనూ లేము, ఖండించనూ లేము. కాని రెండింటి మధ్య సాధర్మ్యం లేకపోలేదు.

ఇప్పుడు అలాంటి కొన్ని సాధర్మ్యాలు చూద్దాము. మనం తరచు సైన్సునుంచి చెప్పే మాట ఒకటి ఉంది. పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అంటుంది విజ్ఞానశాస్త్రం. వేదాంతశాస్త్రం కూడా అదే అంటుంది. సృష్టి పదం వాడతాము కాని కొత్తగా ఏదీ సృష్టించబడలేదు, నాశనం చేయబడటం లేదు. భగవంతుడు కూడా కొత్తగా ఏమీ సృష్టించలేదు, నాశనం చేయలేదు; అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి రావటాన్ని సృష్టి అంటారనీ, వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళటాన్ని ప్రళయం అంటారనీ వేదాంతశాస్త్రం బోధిస్తుంది. కృష్ణపరమాత్మ ప్రళయంలో నీటిలో ఆకుమీద తేలుతున్న చిత్రం ఈ సిద్ధాంతానికి ప్రతీక.

కనబడని శక్తి, కనబడే పదార్థంగా మారుతుందనీ, మళ్ళీ పదార్థం శక్తిగా మారుతుందనీ విజ్ఞానశాస్త్రం అంటుంది; కనబడని చైతన్యం కనబడే జగత్తుగా వ్యక్తమయిందనీ, మళ్ళీ కనబడని చైతన్యంగా అవ్యక్తంలోకి వెళ్ళిపోతుందనీ, వేదాంతశాస్త్రం అంటుంది.

వేదాంతం సమస్త భూతాలూ (జీవులూ) పంచభూతాలనుంచి వచ్చాయని చెబుతుంది. పంచభూతాలు – ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. పంచభూతాలనుంచి వచ్చాయి

కాబట్టి వాటిని పాంచభౌతికం అంటారు. వీటినే సైన్సు వంద పైనే ఎలిమెంట్స్ ఉన్నాయనీ, వాటినుంచి సృష్టి జరిగిందనీ అంటుంది.

భగవద్గీతలో జగత్తులో అన్నీ ఒక వృత్తాకారంలో జరుగుతాయని, అందువల్ల జగత్తులో ఒక సమతుల్యత ఉందనీ, కృష్ణపరమాత్మ బోధిస్తాడు. ఉదాహరణకు నీటివృత్తం తీసుకుంటే, సముద్రంనుంచి నీటిని మేఘాలు తీసుకుని, వర్షంరూపంలో కురిపిస్తే, అవి నదులుగా కొండల్లో పుట్టి, మళ్ళీ వెళ్ళి సముద్రంలో కలుస్తాయని చూస్తాము. అలాగే ఈ శరీరం పంచభూతాలనుంచి పుట్టిందనీ, మళ్ళీ మరణించాక పంచభూతాలలో కలిసిపోతుందనీ చూస్తాము. ఇలాంటి వృత్తాలను సైన్సులో కూడా చూస్తాము. మనుష్యులు ఆక్సిజన్ పీల్చుకుని, కార్బన్‌డైఆక్సైడ్‌ను వదిలితే, వృక్షాలు కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకుని, ఆక్సిజన్‌ను వదులుతాయి.

సైన్సు వేటినైతే ప్రకృతిసూత్రాలు అంటుందో, వాటినే శాస్త్రం దైవసూత్రాలు అంటుంది. ప్రకృతిలో అనేక అధిష్ఠానదేవతలు ఉన్నారనీ, వారందరికీ అధిష్ఠానదేవత పరమాత్మ అనీ, పరమాత్మ ఎక్కుపెట్టిన వజ్రాయుధంతో తిరుగుతాడు కాబట్టి ఆ అధిష్ఠానదేవతలు వారి కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తిస్తారనీ కఠోపనిషత్తులో వస్తుంది. అక్కడ ఐదు అధిష్ఠానదేవతలను పేర్కొంటాడు యమధర్మరాజు. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, అగ్ని జ్వలిస్తున్నది, వాయువు వీస్తున్నది, ఇంద్రుడు, యమధర్మరాజు తమ కర్తవ్యాలను నెరవేరుస్తున్నారు అంటే వారి అధిష్ఠానదేవతమీద భయంవల్లనే అంటాడు.

ఈ విధంగా అధిష్ఠానదేవతలను పేర్కొనటంవల్ల మనలో ప్రకృతిలోని ప్రతి అంశంమీద పూజ్యభావన ఏర్పడేలా చేస్తుంది వేదాంతం. సైన్సు వాతావరణ పరిరక్షణ చేయాలనీ, ధర్మో రక్షతి రక్షితః అని అంటుంది. పేరేదైనా రెండింటిలోనూ భావమొక్కటే.

వేదాంతసారం – **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

జగన్మిథ్యా అంటే కంటికి ఎదురుగా ప్రత్యక్షంగా కనిపిస్తున్న ప్రపంచం నిజంగా లేదు అంటుంది. దానికి వేదాంతం ఇచ్చే వివరణ, జగత్తు అంతా బ్రహ్మే ఉన్నాడు. బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేని వస్తువు ఉన్నా లేనట్టే అర్థం. అందువల్ల జగత్తును మిథ్య అంటుంది వేదాంతం. దాన్నే మరో విధంగా నిరూపిస్తుంది సైన్సు. కంటికి కనబడే పదార్థం మాలిక్యూల్స్‌తో తయారుచేయబడిందనీ, దాన్ని ఆటమ్స్‌గా, ఆటమ్స్‌ని ఇంకా ఎలక్ట్రాన్స్‌గా, ప్రోటాన్స్‌గా, సబ్ ఎటామిక్ పార్టికల్స్‌గా విభజించవచ్చనీ, అవి నిరంతరం తిరుగుతూనే ఉంటాయనీ అంటుంది సైన్సు. దాని ప్రకారం, మన కంటికి కనబడే గోడ నిజంగా అంత స్థిరంగా, అంత పెద్ద గోడగా ఉందా?

ఒక సైంటిస్ట్ ఈ సబ్ ఎటామిక్ పార్టికల్స్ నిరంతర కదలికని, నిరంతరం నాట్యం చేసే నటరాజుతో పోలుస్తాడు.

అన్నింటినీ మించి బిగ్ బ్యాంగ్ సృష్టిని, బిగ్ క్రంచ్ ప్రళయాన్నీ సూచిస్తే, థియరీ ఆఫ్ సింగ్యులారిటీ అద్వైతాన్ని సూచిస్తుంది. జగత్తులో ఉన్నదంతా ఒక్కటే పరబ్రహ్మ.

**సర్వం బ్రహ్మమయమ్ జగత్!**

## 4. వేద విభజన

ఒకప్పుడు ఎన్నో వేదమంత్రాలు ఉండేవి. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. కలిసిపోయినవి కలిసిపోగా, మిగిలినవి కూడా ఒక క్రమపద్ధతిలో లేవు. వ్యాసమహర్షి ఐదువేల సంవత్సరాల క్రితం ఆ మిగిలిన మంత్రాలను ఒక పద్ధతిలో క్రోడీకరించి, వాటిని ఒక పద్ధతిలో ఏర్పాటుచేసి, నాలుగు వేదాలుగా వాటిని విభజించారు. వ్యాసమహర్షి అలా వేదాలకు ఒక రూపునిచ్చారు కాబట్టి ఆయనను వేదవ్యాసులు అంటారు. ఆయన అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. ఈ వేదవ్యాసులే మహాభారతాన్ని, అష్టాదశ పురాణాలనూ కూడా రచించటమేకాక, అద్వైత వేదాంతానికి ఆయువుపట్టైన బ్రహ్మసూత్రాలను కూడా రచించారు.

వేదవ్యాసులవారు వేదాలను నాలుగుగా విభజించారని చూశాము కదా. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. ఋగ్వేదం, అథర్వణవేదం పద్యరూపంలో ఉంటే, యజుర్వేదం గద్యరూపంలో ఉంటే, సామవేదం గీతరూపంలో ఉంటుంది. అందువల్ల ఋగ్వేద, యజుర్వేద, అథర్వణ వేదాలను అధ్యయనం చేసినప్పుడు వేదపారాయణం అంటారు. సామవేదాన్ని అధ్యయనం చేసినప్పుడు మాత్రం సామగానం అంటారు.

వేదాలలో ఉన్నవి పద్యరూపంలో ఉన్నా, గద్యరూపంలో ఉన్నా, గీతరూపంలో ఉన్నా, వాటిని వేదమంత్రాలు అంటారు. ఈ మంత్రాలు పదం ఒక్క వేదాలకే వాడతారు, వేదాలనుంచి వచ్చిన తక్కిన స్మృతిగ్రంథాలకు వాడరు. ఈ మంత్రాలను ఉచ్చరించటానికి వీలుగా స్వరం ఉంటుంది. శిష్యులు ఆ రోజుల్లో కర్ణపరంపరంగా విని నేర్చుకునేవారు. విని నేర్చుకునేవారు కాబట్టి శ్రుతి అనికూడా అంటారు. శ్రుతి అంటే విన్నది.

వేదాలను ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగంలో మళ్ళీ రెండు భాగాలు ఉంటాయి. అవి కర్మకాండ, ఉపాసనకాండ. వేద అంతభాగంలో జ్ఞానకాండ వస్తుంది. కర్మకాండలో అనేక యజ్ఞాలు, యాగాలు ఉంటాయి. ఈ కర్మకాండ ద్వారా నాలుగు పురుషార్థాలలో మూడు పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ పురుషార్థాలను తీర్చుకోవచ్చు. అవి ముందు సకామంగా మొదలుపెట్టినా, నెమ్మదిగా నిష్కామకర్మలుగా మలుచుకోవాలి. వేదం ఈ కర్మకాండలో మనం చేయాల్సిన నిత్యనైమిత్తిక కర్మలను నిర్దేశిస్తుంది, నిషిద్ధకర్మలను నిషేధిస్తుంది.

దాని తర్వాత ఉపాసనకాండలో ఇష్టదేవతమీద ఉపాసన ఉంటుంది. ఇది మానసిక కర్మలోకి వస్తుంది కాబట్టి దీన్ని కూడా పూర్వభాగంలోనే కలిపారు. ఈ రెండింటినీ కలిపి

వేదపూర్వభాగంగా, కర్మకాండగా వ్యవహరిస్తారు. కర్మకాండలో బాహ్యాముఖంగా కర్మలు చేస్తే ఉపాసనకాండలో అంతర్ముఖులు అవుతారు. జగత్తుమీద ఆధారపడటం తగ్గించుకుని, భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకుంటారు.

దాని తర్వాత వేద అంతభాగానికి వస్తే ఈ రెండు పదాలనీ కలిపి (వేద+అంతం) వేదాంతం అంటారు. అది జ్ఞానప్రధానంగా ఉంటుంది కాబట్టి జ్ఞానకాండ అంటారు. జ్ఞానకాండలో ఉపనిషత్తులు ఆత్మస్వరూపాన్ని, జీవ ఈశ్వర ఐక్యాన్ని బోధిస్తాయి. అంటే భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి మీమీదే (చైతన్యపరంగా) ఆధారపడటం నేర్చుకుంటారు.

వేదవిభజనను లోతుగా పరిశీలిస్తే ఒక సాధకుని వైదిక జీవనవిధానం ఎలా ఉండాలో చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. కర్మయోగం పాటిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది; ఉపాసనయోగం పాటిస్తే చిత్త ఏకాగ్రత కలుగుతుంది; జ్ఞానయోగం పాటిస్తే జ్ఞానం కలిగి, మోక్షం కలుగుతుంది.

అందువల్ల సాధకుని ప్రయాణం ఇలా సాగాలి.

కర్మయోగం → ఉపాసనయోగం → జ్ఞానయోగం → మోక్షం.

ప్రపంచంమీద ఆధారపడటం → భగవంతునిమీద ఆధారపడటం → తనమీదే ఆధారపడటం.

జ్ఞానయోగానికి వస్తే ఉపనిషత్తులు, భగవద్గీత కూడా గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటాయి. దాన్నిబట్టి శాస్త్రాన్ని స్వంతంగా అధ్యయనం చేయకూడదనీ, గురువు ద్వారానే శాస్త్రాన్ని నేర్చుకోవాలనీ తెలుస్తుంది. శాస్త్రం సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, పొరపాటుగా అర్థమయితే మాత్రం ప్రమాదం. వైదిక జీవనవిధానం పాటిస్తే, కర్మ, ఉపాసనల ద్వారా జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందుతారు. అప్పుడు మీకు తప్పకుండా గురుప్రాప్తి కలుగుతుంది.

## 5. శాస్త్రంలోని స్థాయిలు

సంస్కృతంలో ఉన్న గ్రంథాలన్నింటినీ కలిపి శాస్త్రం అంటారు. శాస్త్రం పదం 'శాస్' అన్న ధాతువునుంచి వచ్చింది. దానికి రెండు అర్థాలు ఉన్నాయి – శాసించటం, బోధించటం. అందువల్ల శాస్త్రం అంటే మొదట్లో మానవజాతిని శాసించి, ఆ తరువాత బోధిస్తుంది అని అర్థం. 'త్ర' అంటే కాపాడుతుంది.

**శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్**

మానవాళిని సమస్యలనుంచి మొదట శాసనం ద్వారా, తరువాత బోధన ద్వారా కాపాడేది శాస్త్రం. శాస్త్రాన్ని వేదమాత అంటారు. అనేక తల్లులతో సమానం. మొదట్లో పిల్లవాడికి విషయం అర్థం చేసుకునే పరిపక్వత లేనిస్థితిలో అతన్ని శాసిస్తుంది, తరువాత బోధిస్తుంది.

శాస్త్రాన్ని ఏడు స్థాయిలుగా విభజించవచ్చు.

1. **వేదాలు** – మొట్టమొదటి శాస్త్రాన్ని వేదాలు అంటారు. వేదాలే చాలా పెద్ద గ్రంథాలు. ఇరవైవేల పైచిలుకు మంత్రాలున్నాయి వేదాల్లో. మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం.

వేదాలు అపౌరుషేయం. అంటే పురుషబుద్ధినుంచి రాలేదు. అవి దేవుడే ఇచ్చాడు. ఋషులు వారి సత్త్వబుద్ధితో పరమాత్మనుంచి అందుకున్నారు. వారు శబ్దరూపంలో అందుకున్నారు కాబట్టి శ్రుతి అంటారు. తరువాత తరాలకు కూడా శబ్దరూపంలోనే అందజేశారు. వేదాలను ప్రాథమిక గ్రంథాలనీ, మూలగ్రంథాలనీ అంటారు.

2. **సూత్రాలు** – ఈ నాలుగు వేదాలను వివరించి, విడమర్చి చెప్పటానికి, మనకు ఎన్నో ద్వితీయగ్రంథాలు ఉన్నాయి. వాటిని గొప్ప ఆచార్యులు రచించారు. అందుకని వాటిని పౌరుషేయశాస్త్రం అంటారు.

ద్వితీయగ్రంథాలు ఎందుకు? వేదం చాలదా? వేదాల్లో భావాలు స్పష్టంగా ఉండవు. అంతేకాదు, వేదాల్లో బోధించినవి ఒక క్రమపద్ధతిలో ఉండవు. అది ఒక అడవిలాంటిది. సూత్రాలు ఆ బోధను స్పష్టంగా అర్థం అయ్యేలాగా చేస్తాయి. సూత్రం అంటే దారం అని ఒక అర్థం ఉంది. ఈ శాస్త్రం వేదాల్లో ఉన్న అనేక అంశాలను ఒక్కొక్క దారంతో గుచ్చుతుంది.

సూత్రాల్లో చిన్న పదమో, వాక్యమో ఉంటుంది. అందువల్ల వీటిని కంఠతా పట్టటం తేలికవుతుంది. మనకు ఎన్నో సూత్రాలు ఉన్నాయి. ఉదాహరణకు గౌతమసూత్రాలు, పరాశరసూత్రాలు, ఆపస్తంభసూత్రాలు, బ్రహ్మసూత్రాలు. అంటే పదాలు రచయితలవి, పదార్థం వేదంలోది. వీటిలో వ్యాసాచార్యులవారు వ్రాసిన బ్రహ్మసూత్రాలు పేరుపొందాయి.

3. **స్మృతి** – స్మృతి అంటే గుర్తుంచుకున్న జ్ఞానం. అంటే ఋషులు వేదాల్లోనూ, సూత్రాల్లోనూ నేర్చుకున్న జ్ఞానాన్ని మళ్ళీ వివరంగా రచించారు. సూత్రాలు టూకీగా ఉండటంవల్ల ఒక్కోసారి అర్థం స్పష్టంగా తెలియకపోవచ్చు. అక్కడ అర్థంకానివి స్మృతి బాగా విడమర్చి చెబుతుంది.

భగవద్గీత స్మృతిగ్రంథంలోకి వస్తుంది. అందులో 700 శ్లోకాలు ఉన్నాయి. ఇంకా పెద్ద స్మృతిగ్రంథాలు కూడా ఉన్నాయి. ఉదా: మనుస్మృతి, పరాశరస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి. వాటిల్లో కూడా అనేక అంశాలు వివరిస్తారు. సృష్టి, విద్యార్థి, గ్రహస్థు, సంఘజీవి, స్త్రీ, పురుషుడు – ఇలా అన్నింటి గురించీ ఉంటుంది.

4. **పురాణాలు** – నాలుగవ స్థాయి పురాణాలు. అవి స్మృతికన్నా మరింత వివరంగా ఉంటాయి. పురాణం అంటే అది ప్రాచీనగ్రంథం అయినా, ఇప్పటికీ వర్తిస్తుంది. ఇవి కూడా వేదాల్లోని అంశాలను క్రోడీకరించి, స్పష్టత చేకూర్చి, ఉన్నతంగా చూపిస్తాయి. ఇంకో ప్రత్యేకత – వేదాల్లో చెప్పిన ధర్మాలకు కథలు ఉంటాయి. ఈ ధర్మాలను పాటించటం ఎంత కష్టమో చూపిస్తూ, అయినా వీటికి కట్టుబడి ఉన్నవారి కథలు వివరిస్తాయి. స్మృతిలో కొన్నివేల శ్లోకాలుంటే, ఒక్కొక్క పురాణంలో 15,000 నుంచి 80,000 శ్లోకాలుంటాయి. కేవలం

ఒక్క వేదమంత్రం **సత్యం వద** (సత్యమే పలుకు) వాక్యానికి పురాణంలో మొత్తం హరిశ్చంద్రుని కథ ఉంది. కామ, క్రోధ, అహంకారం భావాలకు రూపునిచ్చాయి రాక్షసుల రూపంలో.

మనకు 18 పురాణాలు, 18 ఉపపురాణాలు ఉన్నాయి. వ్యాసాచార్యులు రచించినవే అవి. అన్నింటిలోకి ప్రముఖమైనది భాగవతపురాణం. శ్రీకృష్ణలీలలు ఆబాలగోపాలాన్నీ అలరిస్తాయి.

5. **ఇతిహాసాలు** – ఇవి చరిత్రను ఆధారంగా చేసుకుని రచింపబడిన గ్రంథాలు. నిజంగా జరిగిన విషయం ఉంటుంది. మనకు రెండు ఇతిహాసాలు ఉన్నాయి. అవి రామాయణం, మహాభారతం. రామాయణంలో 24,000 శ్లోకాలు ఉంటే, మహాభారతంలో లక్ష శ్లోకాలు ఉన్నాయి. రామాయణాన్ని వాల్మీకి రచిస్తే, మహాభారతాన్ని వ్యాసాచార్యులు రచించారు.

ఇవి చరిత్ర గురించి చెబుతాయి కాని, చారిత్రాత్మక విశేషాలకు పెద్దపీట వేయవు. ఇక్కడ చరిత్రని ఆధారంగా తీసుకుని, వేదంలో ఉన్న జ్ఞానాన్ని బోధిస్తాయి. కొన్ని పాత్రలు మంచికి మారుపేరుగా ఉంటే, మరికొన్ని పాత్రలు దుర్మార్గానికి రూపుదిద్దినట్టుగా ఉంటాయి. ఈ ఇతిహాసాల్లో కొంత నిజం, కొంత కల్పన ఉంటుంది.

6. **భాష్యం** – పైన ఉదహరించిన అన్ని గ్రంథాలకీ ఇచ్చిన వ్యాఖ్యానాలని భాష్యం అంటారు. ఈ గ్రంథాలలో భగవద్గీతను, ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలను కలిపి ప్రస్థానత్రయం అంటారు. భగవద్గీత స్మృతిప్రస్థానం, ఉపనిషత్తులు శ్రుతిప్రస్థానం, బ్రహ్మసూత్రాలు న్యాయప్రస్థానం. వీటన్నింటినీ మనం అధ్యయనం చేయటానికి వీలుగా శంకరాచార్యులవారు అద్వైతపరంగా భాష్యం రాశారు. శంకరులవారి భాష్యాలు వేదాంతవాఙ్మయంలో చాలా ముఖ్యమైనవి. వీరే కాక రామానుజాచార్యులవారు, మధ్వాచార్యులవారు కూడా భాష్యాలు రాశారు. ఇంకా ఆసక్తికరమైన విషయం, ఈ భాష్యాలకు అనేక ఉపభాష్యాలు, ఆ ఉపభాష్యాలకు ఇంకా ఉపభాష్యాలు కూడా వచ్చాయి.

7. **ప్రకరణ గ్రంథాలు** – శాస్త్రం చర్చించే అంశాలు ఆరు. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, సంసారం, మోక్షం, సాధనలు. ప్రకరణ గ్రంథాలు రెండు రకాలు. కొన్ని ఈ ఆరు అంశాలనూ తీసుకుని వివరిస్తాయి. వీటిని ఉపోద్ఘాత గ్రంథాలుగా తీసుకోవచ్చు. ఉదాహరణకు తత్త్వబోధ. మరికొన్ని ఈ ఆరు అంశాల్లో ఏదో ఒక అంశాన్నో, లేదా కొన్నే అంశాలనో తీసుకుని వాటిని లోతుగా చర్చిస్తాయి. ఉదాహరణకు దృక్‌దృశ్యవివేకం. ఇందులో ఈశ్వరుని గురించి రాదు.

ఇవికాక కొన్ని ముఖ్యమైన ప్రకరణగ్రంథాలను చూస్తే అవి – వివేకచూడామణి, అష్టావక్రగీత, హంసగీత, ఉద్ధవగీత, ఆత్మబోధ, వేదాంతడిండిమ, ఉపదేశసాహస్రి, సర్వవేదాంత సిద్ధాంతసారసంగ్రహం, పంచదశి.

ఈ ఏడు స్థాయిల్లోని గ్రంథాలన్నింటినీ కలిపి శాస్త్రం అంటారు. వీటన్నిటినీ అధ్యయనం చేయటానికి మనకు ఒక జీవితకాలం సరిపోదు. అందువల్ల ఈ అనంతసాగరంలోంచి దాని సారాన్ని దిగ్విజయంగా అర్థం చేసుకోగలిగేటట్టు ప్రార్థన చేసుకుని ముందుకు సాగుదాము.

## 6. శాస్త్రంలో భిన్న అంశాలు ఉన్నాయా?

వేదాలు అపౌరుషేయమనీ, వాటిని ఋషులు వారి సత్త్వగుణంతో అందుకున్నారనీ చూశాము. వేదవ్యాసులవారు కొన్ని వేల సంవత్సరాల కిందట నాలుగు వేదాలుగా విభజించి, వాటికి రూపురేఖలు ఇచ్చారు. కాని వచ్చిన సమస్య ఏమిటంటే ఇవి శ్రుతిప్రమాణం కాబట్టి, కర్ణపరంగా వచ్చాయి కాబట్టి, అక్షరరూపంలో రాలేదు కాబట్టి, వ్రాతపతిలో ఉండే కామాలు, ఫుల్‌స్టాప్‌లు, కొటేషన్ మార్కులు ఉండవు. అందువల్ల గురుశిష్య సంవాదరూపంలో ఉపనిషత్తులు ఉన్నా, ఎవరు ఏం మాట్లాడారో మామూలు మనుష్యులకు అర్థం కాదు. ఇది ఒక సమస్య.

ఇంకొక సమస్య, అందరికీ అర్థం చేసుకునే సామర్థ్యం, మానసిక పరిపక్వత ఒక్కలాగా ఉండదు. కొందరికి స్థూలబుద్ధి ఉంటే, మరికొందరికి సూక్ష్మబుద్ధి ఉంటుంది. వేదాలు అన్ని స్థాయిలవారినీ సంబోధిస్తూ బోధ చేస్తాయి. అందువల్ల కొన్ని వాక్యాలు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చినట్టుగా ఉంటాయి. ఉదాహరణకు కొన్నిచోట్ల స్వర్గలోకం అమృతత్వాన్ని ఇస్తుందని వస్తే, కొన్నిచోట్ల స్వర్గలోకానికి వెళ్ళినా వెనక్కి తిరిగివస్తారు అని ఉంటుంది. అంటే స్వర్గసుఖాలు శాశ్వతం కాదని వస్తుంది.

మరొక సమస్య, ఉపనిషత్తుల్లో వాడే పదాలు, ఒక్కొక్కచోట ఒక్కొక్క అర్థాన్నిస్తాయి. ఉదాహరణకు ఆత్మ పదానికి అనేక అర్థాలు వస్తాయి. నేను, బ్రహ్మ, ఆత్మ, మనస్సు, శరీరం. ఏ సందర్భంలో ఏ అర్థం తీసుకోవాలో తెలియదు. సంస్కృతభాష వచ్చినా, ఆ పదానికి నిఘంటువులో చెప్పిన అర్థం తీసుకుందామంటే కుదరదు. ఉదాహరణకు ఈశావాస్యోపనిషత్తులో చాలా పదాలకు నిఘంటువులోని అర్థాలు రావు. అంతేకాదు, అందులో కర్మ, ఉపాసన పదాలను ఆ పదాలతో వ్యవహరించదు. కొన్ని భిన్నలక్షణాలను పక్కపక్కనే ఉదహరిస్తుంది. ఆత్మ కదలదు, వేగంగా వెళుతుంది అంటుంది.

ఇలాంటి సమస్యలు ఉంటాయి కాబట్టి శాస్త్రాన్ని ఎవరూ స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు. గురువు దగ్గర సాంప్రదాయ 'కీ' ఉంటుంది, శాస్త్రాన్ని తెరవటానికి. కేనోపనిషత్‌లో నీ ప్రశ్నకు నేను జవాబు చెప్పలేను అని చెప్పి, కాని మా గురువులు మాకెలా చెప్పారో, నేను అదే పద్ధతిలో నీకు చెబుతాను అంటాడు గురువు. ఆ విధంగా ప్రతిగురువూ

తన గురువునుంచి నేర్చుకున్నానంటాడు. పరమార్థానందస్వామీజీ కూడా తన గురువులైన దయానంద సరస్వతి స్వామీజీ గురించీ, చిన్మయానంద స్వామీజీ గురించీ చెప్పకుండా ఉండరు తమ బోధలో. అలా గురుపరంపరగా వచ్చిన ఈ బోధ చేసిన ఆదిగురువుకు వెనక్కి వెళితే సదాశివుడు లేదా నారాయణుడు వస్తారు.

అందువల్ల శాస్త్రాన్ని ఒక గురువు దగ్గర శ్రవణం చేయాలి. శ్రవణం అంటేనే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువద్ద వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. అలా చేయాలంటే శాస్త్రంమీదా, గురువుమీదా శ్రద్ధ ఉండాలి. శాస్త్రం చెప్పినది మొదట్లో నమ్మలేకపోయినా, శాస్త్ర అధ్యయనం మానకూడదు; శాస్త్రాన్నీ తప్పు పట్టకూడదు. బాగా అర్థమయ్యేదాకా మళ్ళీ వినాలి. ఈ జన్మలో అర్థం కాకపోతే, వచ్చే జన్మలో వినాలి.

కృష్ణపరమాత్మ భగవద్గీతలో ఇలా శాస్త్రం అధ్యయనం చేస్తూ మధ్యలో చనిపోతే, అది వృథాపోదనీ, వచ్చే జన్మలో అక్కడినుంచీ మొదలుపెడతారనీ చెప్పాడు. బ్యాలన్స్‌షీట్‌లో జమాఖర్చులను ఎలా క్యారీఫార్వర్డ్ చేస్తామో అలా ఈ జన్మలో చేసిన హోమ్‌వర్క్ వచ్చే జన్మకి క్యారీఫార్వర్డ్ అవుతుంది. అనేక రంగాల్లో బాలమేధావులు ఉండటానికి ఇదే కారణం. లౌకికవిద్యలో ఐన్‌స్టీన్, రామానుజం మేధావులు అయితే, ఆధ్యాత్మిక రంగంలో గొప్ప జ్ఞానులు ఆదిశంకరాచార్యులు, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి.

అందువల్ల ముందుగా కావాల్సింది శాస్త్రంమీద, గురువుమీద శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ ఉండగానే సరిపోదు, అది నేర్చుకోవాలనే తపన ఉండాలి, దృఢనిశ్చయం ఉండాలి, పట్టు వదలని దీక్ష ఉండాలి. 'నేను సముద్రాన్ని ఔపోసన పడతాను, నేను కొండలను పిండి చేస్తాను,' అనగలిగే పట్టుదల ఉండాలి. అందువల్ల లేవండి, ముందుకు సాగండి, అంతిమ లక్ష్యం పొందేదాకా ఆగకండి, నిరాశ పడకండి.

## 7. జీవితంలో ఏం కోరుకుంటున్నారు?

జీవితమనే పరుగుపందెంలో ప్రతివారూ ఏదో ఒక లక్ష్యాన్ని పొందటానికి పరుగులు తీస్తూనే ఉంటారు. ఒకరు ఇల్లు అమ్మాలని చూస్తే, ఇంకొకరు ఇల్లు కొనాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు; ఒకరు కట్టుకున్న భార్యకు విడాకులిచ్చే ఆలోచనలో ఉంటే, ఇంకొకరు ఎప్పుడెప్పుడు పెళ్ళి చేసుకుందామా అని ఉవ్విళ్ళూరుతుంటారు. ఇలా లక్ష్యాలు భిన్నరీతుల్లో ఉండవచ్చు, కాలక్రమేణా మారుతూ రావచ్చు, సంఖ్య కూడా ఎక్కువ, తక్కువ అవచ్చు. అంతేకాదు, కొన్ని దీర్ఘకాలిక ప్రణాళికలు అయితే, కొన్ని తక్షణ ప్రణాళికలు అవవచ్చు.

ఏదేమైనా ఈ లక్ష్యాలన్నీ ప్రోగేసి, వాటిని కొన్ని తెగలక్రింద విభజిస్తే, వాటిని మూడే లక్ష్యాల కింద పేర్కొనవచ్చు. ఎవరు, ఎప్పుడు, ఏ దేశంలో, ఏ కాలంలో, ఏం కోరుకున్నా

అవి ఈ మూడు ప్రాథమిక లక్ష్యాలను దాటిపోవు. అవి శాంతి, ఆనందం, భద్రత. స్వామీజీ వాటిని పీస్, హ్యాపీనెస్, సెక్యూరిటీ (PHS) అంటారు.

**భద్రత** – ముందు భద్రత చూద్దాము. ప్రతి ఒక్కరూ జీవితంలో కోరుకునే ప్రాథమిక లక్ష్యం భద్రత. జీవితం సాఫీగా సాగిపోవాలని, దానికి కావలసిన తిండి, గూడు, బట్ట ఉండాలనీ కోరుకుంటారు. ఈ అభద్రతాభావన చిన్నప్పటినుంచే వస్తుంది. అందువల్లనే చిన్నపిల్లవాడు తల్లికొంగుచాటున దాక్కుంటాడు. పెద్దయ్యాక కూడా ఈ అభద్రతాభావన పోదు. భద్రత కోసం ఎల్.ఐ.సీ. పాలసీలు తీసుకుంటాడు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో డబ్బు దాచుకుంటాడు.

**శాంతి** – అందరూ కోరే రెండవ లక్ష్యం శాంతి. ఆ శాంతికోసమే అనేక మార్గాలు వెతుక్కుంటారు. కొంతమంది ఇల్లు వదిలి పారిపోతారు, కొంతమంది విదేశాల్లో శాంతి దొరుకుతుంది అనుకుంటారు.

**ఆనందం** – అందరూ కోరే మూడవ లక్ష్యం ఆనందం. ఏం చేసినా అది వారికి ఆనందం కలుగుజేస్తుందనే భావనతోనే చేస్తారు. పెళ్ళి చేసుకుంటే ఆనందం ఉంటుందనుకుంటారు.

శాస్త్రం అడుగుతుంది, 'మీరు కోరుకున్న శాంతి, ఆనందం, భద్రత పొందారా?' నిజంగా వీటిని పొంది ఉండివుంటే, ఇంక ఈ పరుగులు ఆపి, నిశ్చితంగా ఉండివుండాలి కాని అలా ఎవరూ లేరే! జీవితంలో ఆఖరిశ్వాస వదిలేవరకూ దేనివెంటో పడుతూనే ఉన్నారు.

ఇల్లు కొంటే భద్రత ఉంటుందనుకుని రాజసౌధం కొంటారు. అక్కడితో సమస్య తీరిందా? ఆ ఇంటిని దొంగలు దోచుకోకుండా మరికొన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తారు. ఇంటి ముందొక సెక్యూరిటీగార్డు, అతని చేతిలో ఓ తుపాకీ, అతనిమీద నమ్మకం లేక పెద్దపులి అంత పెద్ద కుక్క, గోడకి ఇనపతీగెలు – ఒకటేమిటి ఇలా పెరుగుతూ పోతాయి. అప్పుడూ శాంతి ఉండదు. బాగా డబ్బు సంపాదిస్తే భవిష్యత్తులో కృష్ణా, రామా అంటూ కాలుమీద కాలేసుకుని కూర్చోవచ్చు అనుకుంటారు. కాని డబ్బు సుఖాలను ఇస్తుందేమో కాని శాంతిని ఇవ్వదు.

**ధనం ఇంటిని కొనగలదు కాని అనురాగాన్ని కొనలేదు.**

**ధనం మంచాన్ని కొనగలదు కాని నిద్రను కొనలేదు.**

**ధనం గడియారాన్ని కొనగలదు కాని సమయాన్ని కొనలేదు.**

పోనీ మనశ్శాంతి కలుగుతుందా అంటే అదీ ఉండదు. ఒక ఆశ్రమాన్ని చూడటానికి వెళ్ళిన ఒక యాత్రికుడు, ఆ ఆశ్రమాన్ని నిర్వహించే స్వామీజీకోసం చూస్తే ఆయన కనబడలేదు. స్వామీజీ ఎక్కడని ఎవరినో అడిగితే, 'ఆయన మనశ్శాంతికోసం పక్క ఆశ్రమానికి వెళ్ళారు,' అన్నారుట. ఈ ఆశ్రమంలో శాంతిగా జీవనం గడుపుదామని వచ్చిన ఆ యాత్రికుడు ఖంగుతిన్నాడుట. ఇది కేవలం జోక్ కావచ్చు, కాని అది సత్యదూరం కాకపోవచ్చు కూడా.

ఆనందం విషయం ఏమిటి? కొన్ని సంవత్సరాలుగా కలలు కన్న కారు కొంటే ఆనందంలో మునిగితేలుతున్నారా? కోరి చేసుకున్న భార్యతో స్వర్గసుఖాలు అనుభవిస్తున్నారా? ఖరీదైన

ప్రాంతంలో ఖరీదైన ఇల్లు కొంటే జీవితాశయం నెరవేరిందన్న ఆనందంలో ఓలలాడుతున్నారా? అక్కడితో ప్రయాణం ముగియలేదు. ఇది ఒక అంతులేని కథ. వాటిలో ఆనందం దొరికితే కారు ఎందుకు మారుస్తారు, ఇల్లెందుకు మారుస్తారు, భార్యకు విడాకులెందుకు ఇస్తారు?

ఈ పరుగులు తీయటంలో ఎంతగా మునిగిపోయారంటే, దురదృష్టవశాత్తూ ఒక్కక్షణం ఆగి ఆలోచించే తీరికే లేదు మీకు. మీ ప్రయాణం సరియైన దిశలోనే సాగుతోందో లేదో తెలుసుకునే తీరిక అసలే లేదు. మీ పరిస్థితి కొత్త దేశంలో అవస్థలు పడ్డ వ్యక్తిలాగే ఉంటుంది. ఒక వ్యక్తి పరాయిదేశంలో తను వెళ్ళాల్సిన గమ్యానికి ఏ బస్సు ఎక్కాలో అడిగి తెలుసుకున్నాడు, అతి జాగ్రత్తగా అదే బస్సు ఎక్కాడు కూడా. కాని తను అనుకున్న గమ్యం చేరలేదు. ఎందుకు? అతను ఎక్కవలసిన బస్సే ఎక్కాడు కాని, ఎక్కవలసిన వైపు ఎక్కలేదు. దానికి వ్యతిరేకదిశలో ఎక్కాడు. అలాగే మీ ప్రయాణం ఎటు సాగుతోందో తేల్చుకోవాల్సిన కనీసబాధ్యత ఉంది మీకు.

శాస్త్రం మీరు కోరే శాంతి, ఆనందం, భద్రత కోసం మీరు సరియైన ప్రదేశంలో వెతకటంలేదు అంటుంది. అందువల్ల ముందు సమస్య ఎక్కడుందో తెలుసుకోవాలి. ఒక అనారోగ్యాన్ని సరిగ్గా నయం చేయాలంటే, ముందు అనారోగ్యం ఏమిటో సరిగ్గా కనుగొనాలి. మీరు పరుగులు తీస్తున్న దిశలో మీరు కోరుకున్న శాంతి, ఆనందం, భద్రత పొందుతున్నారా? లేదు. వాటికి శాశ్వత పరిష్కారం కావాలంటే నా దగ్గరికి రండి, నేను చూపిస్తాను అంటుంది శాస్త్రం.

## 8. ఆనందం రూపురేఖలు

జీవితంలో మీరు ఏం కోరుకున్నా, వాటిని ఎందుకు కోరుకుంటున్నారు? అవి మీకు ఆనందాన్ని ఇస్తాయనే ఆశతో. కొంతమంది మనుష్యులను ఇష్టపడ్డా, కొన్ని పరిస్థితులను ఇష్టపడ్డా ఆనందం ఒక్కటే కారణం. ఈ మనుష్యుల వెంటో, వస్తువుల వెంటో, పరిస్థితుల వెంటో ఎందుకు పడతారు? మీలో ఉన్న **అపూర్ణత్వంవల్ల**. మీకేదో తగ్గిందనీ, ఆ మనిషో, ఆ వస్తువో ఉంటే అది పూర్తవుతుందనీ భావిస్తారు. ఒకవ్యక్తిమీద మమకారం పెంచుకుంటారు. వారు మీతో ఉంటే ఆనందం కలుగుతుంది అనుకుంటారు. కొన్నాళ్ళయ్యాక వారిమీద మోజు పోతుంది. వారిని ఎలా వదిలించుకోవాలా అని చూస్తారు.

'కొంతమంది మనుష్యులు వస్తే ఆనందం కలుగుతుంది, కొంతమంది మనుష్యులు వెళితే ఆనందం కలుగుతుంది,' అంటారు స్వామీజీ. అందువల్ల మీ జీవితమంతా దేనివెంటో పరుగులు తీయటమో లేదా దేనినుంచో దూరంగా పారిపోవటంతోనో సరిపోతుంది. శాస్త్రం వాటిని ప్రవృత్తి, నివృత్తి అంటుంది.

ఇప్పుడు శాస్త్రం, మిమ్మల్ని మీ సమస్యను కొంచెం లోతుగా విశ్లేషించమంటుంది. ఒకవేళ బాహ్యవస్తువులో ఆనందం ఇమిడివుంటే, ఆ వస్తువు అందరికీ, అన్ని వేళలా సమానంగా ఆనందాన్నివ్వాలి. కొంతమందికి పాశ్చాత్య సంగీతం ఇష్టమయితే, కొంతమందికి అస్సలు నచ్చదు. కొంతమందికి స్వంత ఇంట్లో ఉండటం ఇష్టమయితే, కొంతమంది అద్దె ఇంట్లో ఉంటేనే సుఖం అంటారు. అంతేకాదు, మీరు కూడా ఒకప్పుడు ఎంతో ఇష్టమయిన వస్తువును ఇప్పుడు చూస్తే అసలు ఇష్టపడరు. ఇప్పుడు చెప్పండి, ఆనందం వస్తువులో ఉందా, మీలో ఉందా? ఆనందం మీలో ఉంది. లోకోభిన్నరుచిః అంటారు. అందువల్లనే ఇన్నిరకాల కార్లు, ఇన్ని రకాల ఇళ్ళు, ఇన్ని వేషభాషలు వచ్చాయి. ఇది ఆనందం గురించి.

పోనీ భద్రత ఉందా బాహ్యవస్తువుల్లో? ఐశ్వర్యం పొందితే భద్రత ఉంటుంది, హోదా, అంతస్తు ఉంటే భద్రత ఉంటుంది అంటే బయట సెక్యూరిటీగార్డులు ఎందుకు? పదవిలో భద్రత ఉంటే మంత్రులు, రాజకీయనాయకులు ఎంత భద్రతను అనుభవించాలి? కాని అది అందరికీ అందుబాటులో లేదు.

అంటే ఎక్కడో, ఏదో లోపం ఉంది – శాస్త్రం దాన్ని పొరపాటు అంటున్నది. మీరు పుట్టటమే అజ్ఞానం అనే పెట్టుబడితో పుట్టారు. ఆ అజ్ఞానం తీసుకుని వచ్చిన పొరపాటు ఇది. శాశ్వతం కాని వస్తువులు, మనుష్యులు శాశ్వతమైన ఆనందాన్ని ఎలా ఇవ్వగలరు? శంకరాచార్యులవారు భజగోవిందంలో అద్భుతంగా వర్ణిస్తారు, 'బాల్యం అంతా ఆటలతో గడిచిపోయింది; యౌవనం అంతా భార్యతో గడచిపోయింది; వృద్ధాప్యం అంతా చింతలతో గడచిపోతుంది, ఇంక విద్య నేర్చుకునే సమయం ఏది?'

శాస్త్రం చెప్పేది ఒక్కటే. బాహ్యవస్తువులు, జగత్తు, మనుష్యులు – ఏది తీసుకున్నా, ఎవరిని తీసుకున్నా వాటికి శాశ్వతత్వం లేదు. అన్నింటికీ రాకపోకలు ఉంటాయి. ఒక కాలంలో వచ్చి, ఒక కాలంలో వెళ్ళిపోతాయి. అవే శాశ్వతం కానప్పుడు, అవి మీకు ఎలా శాశ్వతంగా భద్రతను ఇస్తాయి చెప్పండి?

'నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు,' అంటారెవరో. కాని కొన్నాళ్ళయ్యాక అతని మనస్సు మారవచ్చు, మిమ్మల్ని బెదిరించవచ్చు కూడా. భగవంతుని దయవల్ల ఇవేవీ కాకపోయినా, మీకన్నా ముందే అతనే భూమినుంచి వెళ్ళిపోవచ్చు. అప్పుడూ అతను మీకు భద్రతను ఇవ్వలేడు.

దీన్నిబట్టి స్పష్టంగా ఒక విషయం తెలుస్తున్నది. బాహ్యప్రపంచంలో శాంతి, ఆనందం, భద్రత దొరకవు. సరే బాహ్యప్రపంచంలో దొరకకపోతే వేరే ఎక్కడ ఇవి శాశ్వతంగా దొరుకుతాయి? అలా దొరికే ఒక చోటంటూ ఉందా?

## 9. బాహ్యప్రపంచంలో లేకపోతే, ఎక్కడుంది ఆనందం?

ఇన్నాళ్ళూ బాహ్యప్రపంచంలో శాంతి, భద్రత, ఆనందం దొరుకుతుందని వాటి వెంట పరుగులు తీశారు. కాని అవి ఎండమావులని తెలిసింది. మీకు దొరికే ఫలాలకు మూడు దోషాలు ఉన్నాయని తెలుసుకుంటారు. అవి దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం.

జీవితంలో ఏం పొందాలన్నా దానికి శ్రమపడాలి. పొందినది ఉంటుందో లేదో తెలియదు. అది పోతే ఇంకా బాధ. అందువల్ల అది దుఃఖమిశ్రితత్వం. ఏది పొందినా, ఇంకా ఏదో కావాలనిపిస్తుంది; అది అతృప్తికరత్వం. పొందినదానిమీద బంధం పెంచుకుంటారు; అది బంధకత్వం. ఈ దోషాలను తెలుసుకున్న తెలివైన వ్యక్తి ఇవికాక నిర్దోషఫలం ఏమైనా ఉందా అని పరిశోధిస్తాడు.

శాస్త్రం 'మే ఐ హెల్ప్ యూ?' బోర్డు పట్టుకుని నిల్చుంటుంది. అలాంటి నిర్దోషఫలం దొరికేచోటు ఉంది. అంటే శాశ్వతమైన శాంతి, ఆనందం, భద్రత దొరికేచోటు ఉంది. వేదపూర్వభాగంనుంచి, వేద అంతభాగానికి రండి; అది కూడా గురువు ద్వారా రండి అంటుంది.

వేద అంతభాగానికి వెళితే, శాస్త్రం పిడుగులాంటి వార్త వేస్తుంది. మీరు వెతికే శాంతి ఎక్కడో వైకుంఠలోనో, కైలాసంలోనో లేదు. మీరే శాంతిస్వరూపులు అంటుంది. భద్రత కావాలంటే, మీలోనే భద్రత ఉంది. మీరే పరిపూర్ణులు అంటుంది; ఆనందం కావాలంటే మీరే ఆనందస్వరూపులు అంటుంది.

వెతుకుతున్న మీరే మూర్తీభవించిన ఆనందస్వరూపులు, మీరే నిత్యవస్తువు. మీరు వెతుకుతున్న బాహ్యప్రపంచంలో శాంతి, ఆనందం, భద్రత దొరకవు అంటుంది. చంకలో బిడ్డను పెట్టుకుని ఊరంతా వెతికింది అని సామెత. అలా మీరే ఆనందస్వరూపులు అంటుంది. దానికి ఎప్పుడూ చూసే ఉదాహరణ నువ్వే ఆ పదవ వ్యక్తివి. పరమానందయ్య శిష్యుల కథగా చూస్తాము దీన్ని.

పదిమంది శిష్యులు కలిసి ఒక నదిని దాటారు. అందరూ వచ్చారో లేక ఎవరైనా నీటిలో మునిగిపోయారో తేల్చుకోవాలనుకుని, వారి నాయకుడు వారిని లెక్కపెట్టటం మొదలుపెట్టాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా తొమ్మిదిమందే వస్తున్నారు కాని, పదవవ్యక్తి రావటం లేదు. అప్పుడు దారేపోయే దానయ్య వచ్చి లెక్కబెట్టి, 'వెతుకుతున్న నువ్వే పదవ వ్యక్తివి,' అన్నాడు. శాస్త్రం చెప్పేదీ అదే. నువ్వు బాహ్యంగా వెతుకుతున్నావు కాని వెతుకుతున్న నువ్వే ఆనందస్వరూపుడివి అంటుంది. అంతేకాదు, నీలో తప్ప బాహ్యంగా అసలు దొరకదు అని కూడా తేల్చి చెప్పేస్తుంది. నువ్వే ఆనందస్వరూపుడివి. వినటానికి చాలా బాగున్నా, నమ్మశక్యంగా లేదు. అనుభవం వేరేగా ఉంది. నేను దోషభూయిష్టమైన మనిషినా, దోషరహితమైన బ్రహ్మనా? అనుభవప్రమాణాన్ని నమ్మాలా, శాస్త్రప్రమాణాన్ని నమ్మాలా?

ఇది తెలుసుకోవాలంటే ఆత్మవిచారణ చేయాలి. కాని మనకున్న ప్రమాణాలన్నీ బాహ్యవస్తువులను తెలుసుకోవటానికి ఉన్నాయి. బాహ్యప్రపంచాన్నంతా చూసే విశాలనేత్రాలు, తమను తాము చూసుకోలేవు. కనులు తమను తాము చూసుకోవాలంటే, అద్దం కావాలి. అలాగే మీ గురించి మీరు తెలుసుకోవాలంటే గురుశాస్త్రదర్పణం కావాలి. దర్పణం అంటే అద్దం. శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో గురువు దగ్గర అధ్యయనం చేయాలి.

నీ జీవితలక్ష్యం నీ స్వరూపాన్ని తెలుసుకోవటమై ఉండాలని కృష్ణపరమాత్మ కూడా భగవద్గీతలో చెబుతాడు. వేదం నువ్వు వెతుకుతున్న శాంతి, భద్రతలు, ఆనందం బాహ్యంగా దొరకవు. ఎందుకంటే వెతుకుతున్న నువ్వే శాంతి, భద్రత, ఆనందాలకు నెలవు అంటుంది. అందువల్ల మీ పరుగులు బాహ్యంగా ఆపి, శాస్త్రం వైపుకు తిప్పాలి. మీరెలా ఆనంద స్వరూపులో, మీరెలా చైతన్యస్వరూపులో శాస్త్రం ఒక పద్ధతిలో నేర్పిస్తుంది.

## 10. నా గురించి నేను కొత్తగా నేర్చుకునేదేముంది?

శాస్త్రానికి వెళితే, శాస్త్రం ఒక క్రమపద్ధతిలో ఆత్మవిద్యను నేర్పిస్తుంది అంటే, నా గురించి నేను కొత్తగా నేర్చుకునేదేముంది అనే సందేహం కలుగుతుంది మీకు. నా గురించి నాకు అంతా తెలుసు. నేనెవరు, ఎక్కడ పుట్టాను, ఏం చదివాను, ఏం చేస్తున్నాను, ఎలా ఉంటాను? ఇవన్నీ కొత్తగా ఎవరి ద్వారానో తెలుసుకునేందుకేముంది? శాస్త్రం మీ ఆలోచనే తప్పు అంటుంది. మీ గురించి మీకు తెలిసినది మీ స్వరూపం గురించి కాదు అంటుంది.

'నేను **లావుగా** ఉన్నాను.' – ఆ నేను శరీరం.

'నాకు **ఆనందంగా** ఉంది.' – ఆ నేను మనస్సు.

'నాకు **ఈ విషయం తెలుసు**.' – ఆ నేను బుద్ధి.

అలా మీరు నేను అని పలికి దాని తరువాత ఏం చెప్పినా అది వీటిల్లో దేనికోదానికి వర్తిస్తుంది. మీరెవరు? శరీరమా, ఇంద్రియాలా, మనస్సా, బుద్ధా? అసలు మీరెవరు? ఇవేవీ కాని ఇంకొకటి ఉందని మీకు తెలుసా?

మీరెవరు అని మిమ్మల్ని ప్రశ్నించినప్పుడల్లా నేను ఫలానా అనో, నేను ఫలానా వ్యక్తి కొడుకుని అనో, ఫలానా చదువు చదివాననో ఏదో ఒకటి చెబుతూ వస్తారు. కాని అవేవీ మీ అసలు నేను కాదు, అవన్నీ మీ అజ్ఞానంనుంచి వచ్చిన పొరపాట్లు అంటుంది శాస్త్రం. మీ అసలు 'నేను' తెలుసుకోవాలంటే శాస్త్రానికి రాకతప్పదు. శాస్త్రం 'నేను' ఎవరో కొత్తగా చెప్పకపోయినా, 'నేను' గురించి మీకున్న అపోహలను తొలగిస్తుంది. నేతి–నేతి (ఇది కాదు, ఇది కాదు) పద్ధతి ద్వారా మీచుట్టూ కప్పుకున్న అపోహలను ఒకటొకటిగా తొలగిస్తుంది. అందువల్ల ఆత్మజ్ఞానం అంటే ఆత్మ గురించిన కొత్త జ్ఞానం కాదు, ఆత్మ గురించిన అపోహలను తొలగించటం.

నేను లావుగా ఉన్నాను, నేను బియ్యే చదివాను, నేను ఇల్లు కొనుక్కున్నాను – ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా వస్తున్న **నేను, నేను, నేను** ఏదైతే ఉందో ఆ నేనును చూడు అంటాడు గురువు. నీ అనుభవాలు మారుతున్నాయి, నీ గుణాలు మారుతున్నాయి, నీ ఆలోచనలు మారుతున్నాయి కాని వాటన్నింటికి వెనక మారని నువ్వు ఉన్నావు. ఆ మారని, గుణాలు లేని, శాశ్వతమైన నేనుని చైతన్యంగా గుర్తించు. ఆ చైతన్యమే నా అసలు నేను. అదే ఆత్మ అని తెలుసుకో అంటాడు గురువు.

ఆత్మ నిర్వచనం ఏమిటి? ఆత్మ అంటే చైతన్యం. చైతన్యంయొక్క ఐదు లక్షణాలు నేర్చుకుంటాము ఉపనిషత్తుల్లో. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందిన వస్తువు కాని కాదు.
2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపచేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింబ చేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఈ ఆత్మజ్ఞానాన్ని శాస్త్రం ద్వారా గురువు ఒక క్రమపద్ధతిలో దశలవారీగా పొందేలా చేస్తాడు. ఆత్మానాత్మ వివేకం నేర్పిస్తాడు గురువు. నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది అనే దశనుంచి నేను ఆత్మను, నేను వ్యవహారం నడపటానికి నాకు శరీరం ఉంది అనే స్థాయికి వెళతాడు.

## 11. విషయానందం – ఆత్మానందం

**విషయానందం** అంటే బాహ్యప్రపంచంలో ఉన్న విషయవస్తువులనుంచి పొందే ఆనందం. **ఆత్మానందం** అంటే నేను ఆనందస్వరూపుణ్ణి అని అర్థం చేసుకోవటం.

మనమందరం చేస్తున్న ప్రాథమిక పొరపాటు ఈ విషయానందంనుంచి శాశ్వతానందాన్ని పొందాలనుకోవటం. బాహ్యవస్తువులలో మీరనుకుంటున్న ఆనందం స్వతహాగా వాటిలో లేదు అంటున్నది శాస్త్రం. మరయితే నాకు జీవితంలో కలిగే ఆనందం మాటేమిటి అంటే, అది మీరు తాత్కాలికంగా పొందే ఆనందం, అది విషయానందం, అది లౌకికానందం; నిజానికి ఈ విషయానందం కూడా బాహ్యప్రపంచంనుంచి రావటం లేదు, మీ ఆత్మానందమే విషయానందంగా ప్రకటితమవుతున్నది అంటున్నది శాస్త్రం.

దాన్ని డాగ్ లాజిక్ అంటారు. కుక్క ఒక ఎముకని కొరుకుతుంటే, దాని నోట్లోకిరక్తం వస్తుంది. అది ఆ ఎముకని కొరకకముందు రాలేదు కాబట్టి, ఆ ఎముకనుంచి తనకు రక్తం వస్తున్నదని పొరపాటు పడుతుంది కుక్క. నిజానికి ఆ ఎముక గట్టిగా ఉండటంవల్ల, దాని పళ్ళ మధ్యనుంచి రక్తం కారుతున్నది. కాని దానికా విషయం తెలియక, ఎముకనుంచి తనకు ఆనందం కలుగుతున్నదనుకుంటుంది.

మీరు చేస్తున్నదీ అదే అంటుంది శాస్త్రం. మీ మనస్సు ప్రశాంతంగా, నిశ్చలంగా ఉన్నప్పుడు, అంతకముందు మీకు కోపం తెప్పించిన విషయాలను కూడా ఇప్పుడు నవ్వుతూ స్వీకరించ గలుగుతారు. మీ అబ్బాయి ఐ.ఎ.యస్. ఆఫీసర్ అవాలని మీరెన్నాళ్ళగానో కలలు కంటున్నారు. ఒకరోజు ఆ శుభవార్తను వింటారు మీరు. ఆరోజు మీరెంత ఆనందంగా ఉంటారంటే, అందరిమీదా చిరునవ్వులు చిందించటమే కాకుండా, అడగకుండానే క్యాబ్ డ్రైవర్‌కో, హొటల్‌లో సర్వర్‌కో అదనంగా టిప్పు కూడా ఇస్తారు. అదే మీ వ్యాపారంలో అనుకోని నష్టం వచ్చిందని విన్నరోజు, మీరు అప్పుడు ఫైవ్‌స్టార్ హొటల్లో విందు భోజనం చేస్తున్నా అది మీకు రుచించదు.

అందువల్ల మీకు అప్పుడప్పుడూ బయటకు తెలుస్తున్న ఆనందం, నిజానికి మీనుంచే వస్తున్నది. కాకపోతే, అది బాహ్యంగా ఏదైనా జరిగినప్పుడు వెలికివస్తున్నది కాబట్టి, దానివల్ల వస్తున్నది అనుకుని పొరపాటు పడుతున్నారు అంతే. మీరు ఆనందస్వరూపులు అని మీరు అర్థం చేసుకుంటే, మీ ఆనందంకోసం దేనిమీదా, ఎవరిమీదా ఆధారపడనవసరం లేదు.

అందువల్ల సమస్య ఎక్కడ ఉందంటే, మీకు ఆత్మానందం గురించి తెలియక, విషయానందం శాశ్వతమైన ఆనందం ఇస్తుంది అనుకుంటున్నారు. పరిమితి ఉన్న వస్తువులను పొందితే పూర్ణత్వం వస్తుంది అనుకుంటున్నారు.

పరిమితి + పరిమితి = పరిమితి అవుతుంది కాని అది అపరిమితం ఎలా అవుతుంది?

కృష్ణపరమాత్మ మోక్షాన్ని నిర్వచిస్తూ, ఆధ్యాత్మిక జ్ఞానం పొందిన వ్యక్తికి కలిగే ఆనందం అనంతం అని చెబుతాడు. అందులోనే లౌకిక విషయాలవల్ల కలిగే ఆనందం కూడా వస్తుంది. లౌకిక విజయాలు అంటే ధనం, హొదా, అధికారం, భార్య, పిల్లలు – అన్నీ కొంతమేరకు ఆనందాన్ని కలుగజేస్తాయి. ఈ లౌకిక విజయాలవల్ల వచ్చే ఆనందం కూడా మోక్షానందంలోనే (ఆత్మానందంలోనే) ఇమిడి ఉంటుంది అంటాడు.

అన్నివైపులా జలంతో నిండివున్న మహాజలాశయంతో, చిన్న జలాశయంతో పొందే ఫలంతో పాటు, అధికఫలం కూడా పొందగలరు. అంటే చిన్న తటాకంతో కలిగే లాభం పెద్ద జలాశయంతో కలుగుతుంది కాని, పెద్ద జలాశయంతో కలిగే లాభం చిన్న తటాకంతో పొందలేరు.

చిన్న వయస్సులో సన్న్యాసం తీసుకున్న వ్యక్తిని చూసి మీరు జాలిపడతారు. అతను జీవితంలో ఎన్నో సరదాలను కోల్పోతున్నాడు అనుకుంటారు. కాని నిజానికి అతనే మిమ్మల్ని చూసి జాలిపడతాడు. ఎందుకంటే అతను పొందే మోక్షానందం ముందు మీరు పొందే విషయానందం చాలా తక్కువ. ఆ మోక్షానందంలోనే ఈ విషయానందం కూడా వస్తుంది కాని విషయానందంలో మోక్షానందం రాదు.

ఆత్మజ్ఞానం పొందితే ఆత్మానందం గురించి తెలుసుకోవటమే మోక్షం అని తెలుస్తుంది.

## 12. ఆత్మానందాన్నిచ్చే ఆత్మజ్ఞానం పొందటమెలా?

ఆత్మజ్ఞానం పొందితే ఆత్మానందం గురించి తెలుసుకోవటమే మోక్షం అని తెలుస్తుంది అని చూశాము ఇంతకుముందే. కాని ఆ ఆత్మజ్ఞానం పొందటమెలా?

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోஉపరాణి**

కృష్ణపరమాత్మ ఆత్మ గురించి వివరిస్తూ, ఈ అద్భుతమైన శ్లోకం చెబుతాడు. దీని సారం– జీర్ణవస్త్రాలను ఒక వ్యక్తి త్యజించి, కొత్త వస్త్రాలు ధరించినట్టుగా, జీవాత్మ జీర్ణమైన ఈ శరీరాన్ని వదిలి ఇంకొక కొత్త శరీరాన్ని ధరిస్తుంది.

'నేను ఈ శరీరాన్ని' అని ఇన్నాళ్ళూ భావిస్తూ వచ్చాము. అదే మీరు చేస్తున్న పెద్ద పొరపాటు అని కృష్ణపరమాత్మ తన బోధలో చెబుతాడు. మనం చేసే ఇంకొక పెద్ద పొరపాటు, 'నేను మనస్సును,' అనుకుంటాము. అది పొరపాటు అని ఎలా తెలుసు అంటే, మీరు ఒకసారి సుషుప్తి అవస్థ గురించి అధ్యయనం చేయండి అంటారు స్వామీజీ. సుషుప్తిలో మీ శరీరం పడుకుంటుంది, మీ మనస్సు కూడా పడుకుంటుంది, అందువల్ల మీరు జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడపటం లేదు. కాని అప్పుడు కూడా మీరు ఉన్నారు.

అంటే ఈ శరీరం మీరు కాదు. మీరు జాగ్రదావస్థలో వ్యవహారం నడపటానికి వాడే పరికరం మాత్రమే ఈ శరీరం. ఈ మనస్సు మీరు కాదు. మనస్సును కూడా నిద్రలో పక్కన పెట్టేస్తున్నారు. నేను శరీరం కాకపోతే, నేనెవరు? మీరు శరీరానికి చైతన్యాన్ని ఇచ్చే చిద్రూపం లేదా చైతన్యస్వరూపం లేదా ఆత్మ.

కృష్ణపరమాత్మ ఈ ఆత్మ లక్షణాలు ఆరింటిని పేర్కొంటాడు. అవి – ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అప్రమేయం, అకర్తా అభోక్తా, నిర్వికారం.

ఎ) **ఆత్మ నిత్యం** – ఆత్మ నిత్యం. ఆత్మ మూడు కాలాల్లోనూ ఉంటుంది. కాని శరీరం, మనస్సు నిత్యం కాదు.

బి) **ఆత్మ సత్యం** – ఆత్మకు స్వాభావికమైన ఉనికి ఉంది. అంటే దాని ఉనికికి వేరే దానిమీద ఆధారపడదు. కాని తక్కినవాటికి విడిగా ఉనికి లేదు. అనిత్యమైన వస్తువులకు స్వతంత్రంగా ఉనికి లేదు.

సి) **ఆత్మ సర్వవ్యాపకం** – ఆత్మ సర్వవ్యాపకం. ఆత్మ నిత్యం అంటే దానికి కాలపరిమితి లేదు, ఆత్మ సర్వవ్యాపకం అంటే దానికి దేశపరిమితి లేదు. చేతిని తీసుకుంటే, దానికి సరిహద్దులు ఉన్నాయి కాని చేతిని ప్రకాశింపజేసే కాంతికి సరిహద్దులు లేవు. అది చేతి సరిహద్దులని దాటి ఉంటుంది. అలా ఆత్మ శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. శరీరం బయట కూడా ఉంది. అలా ఆత్మ సర్వగతం, సర్వవ్యాపకం. శరీరంలో ఉంటే ఉన్నట్టు తెలుస్తుంది, మాధ్యమం లేకపోతే ఉన్నట్టు తెలియదు. ఫ్యాను తిరుగుతుంటేనూ, బల్బు వెలుగుతుంటేనూ కరెంట్ ఉన్నట్టు తెలుస్తుంది. అవి ఆపేసివుంటే తెలియదు.

డి) **ఆత్మ అప్రమేయం** – ప్రమేయం అంటే ఆబ్జెక్టు. అంటే దాని గురించి జ్ఞానం పొందాల్సిన వస్తువు. అప్రమేయం అంటే ఆబ్జెక్టు కాదు. అందువల్ల ఆత్మను ఎన్నడూ తెలుసుకోలేము. ఆత్మను ఎన్నడూ తెలుసుకోలేము అంటే ఆత్మకు ఉనికి లేదా? ఆత్మకు ఉనికి ఉంది. ఉనికి ఉండీ మరి తెలుసుకోలేని వస్తువెలా అవుతుంది?

దానికి ఉదాహరణ ఫోటో. ఒక ఫోటోలో మనుష్యులు ఉంటారు, కుర్చీలు ఉంటాయి, వస్తువులు ఉంటాయి. కాని ఒకటి మాత్రం కనబడదు అంటారు స్వామీజీ. ఏమిటది? **కెమెరా!** ఫోటో ఉండటమే కెమెరాకి నిదర్శనం. అలాగే మీకు జరిగే అనుభవాలే ఆత్మ ఉనికికి నిదర్శనం.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**
**అనుభవించే నువ్వే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఆత్మ ఎప్పటికీ దృక్, ఎన్నటికీ దృశ్యం కాదు. ఆత్మ ఎప్పటికీ సబ్జెక్ట్, ఎన్నటికీ ఆబ్జెక్ కాదు. ఆత్మవల్ల అన్నీ చూస్తారు కాని ఆత్మను చూడలేరు. అది అప్రమేయం.

ఇ) **ఆత్మ అకర్తా అభోక్తా** – ఆత్మ అకర్తా అంటే కర్మ చేయదు, అభోక్తా అంటే కర్మఫలాన్ని అనుభవించదు. నేను చేతితో ఏదో ముట్టుకుంటాను. ఆ చేతికి మట్టి అంటుకుంటుంది. ముట్టుకోవటం చేతిని కర్త చేసింది, మట్టి అంటుకోవటం చేతిని భోక్త చేసింది. కాని అదే చేతిమీద ప్రసరించే కాంతి దేన్నీ ముట్టుకోదు. దానికి మట్టీ అంటదు. ఆ విధంగా కాంతి అకర్తా అభోక్తా. అలా ఆత్మ కూడా అకర్తా అభోక్తా.

ఎఫ్) **ఆత్మ నిర్వికారం** – ఆత్మకు మార్పులేదు. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. తల్లిగర్భంలో ఉంటుంది, పుడుతుంది, ఎదుగుతుంది, మార్పు చెందుతుంది, కృశించిపోతుంది, మరణిస్తుంది. కాని ఆత్మ శరీరంతో అత్యంత సన్నిహితంగా ఉన్నా కూడా, శరీరానికి ఏర్పడిన ఈ షడ్వికారాలు ఆత్మను అంటవు. ఉదాహరణకు కాంతి మన చేతితో సన్నిహితంగా ఉన్నా కూడా, చేతికి ఏం జరిగినా, చేతిని అంటిపెట్టుకుని ఉన్నా, కాంతికి ఏమీ అవదు.

ముందు నేను శరీరాన్ని మాత్రమే అనుకుంటాము. తర్వాత నేను ఆత్మ, అనాత్మల మేలుకలయికను అని తెలుసుకుంటాము. రెండింటినీ విడదీసి చూడగలిగాక, నేను ఆత్మనా, అనాత్మనా? నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. నేను శరీరం అనుకుంటే నాకు చావు పుట్టుకలు ఉన్నాయి, సంసారం ఉంది. నేను ఆత్మను అని అర్థం చేసుకుంటే నేను శాశ్వతం, నేను ముక్తపురుషుణ్ణి. ఈ శరీరం నాకు తాత్కాలికంగా ఇవ్వబడిన కానుక. ఈ శరీరం ద్వారా నేను వ్యవహారం నడుపుతున్నాను. కృష్ణపరమాత్మ ఈ జ్ఞానాన్ని భగవద్గీతలో ఇస్తాడు. ఈ ఆత్మజ్ఞానమే సంసారమనే బంధంనుంచి శాశ్వతమైన ముక్తిని ప్రసాదించగలదని బోధిస్తాడు.

## 13. 'నేను' అంటే ఆత్మను అని ఎందుకంటుంది శాస్త్రం?

శాస్త్రం ప్రతివ్యక్తిలోనూ రెండు 'నేను'లు ఉన్నాయి అంటున్నది. వాటిని పెద్ద నేను, చిన్న నేను అంటారు. శాస్త్రంలో చిన్న నేనును అహంకారం అనీ, పెద్ద నేనును ఆత్మ అనీ అంటారు. మనలో ఈ రెండు నేనులూ ఉన్నప్పుడు నేను ఏ నేను? అది తెలియనంతవరకూ నేను సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటాను. ఈ రెండు నేనులు ఎలా వచ్చాయో కృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరిస్తాడు.

ప్రకృతి, పురుషుడు అనాదిగా వస్తున్నాయి. అనాది అంటే మొదటినుంచీ ఉన్నాయి. ప్రకృతి, పురుషుల మేలుకలయికను ఈశ్వరుడు అంటారు. ఈశ్వరుణ్ణి అర్థనారీశ్వరుడు అంటారు. పార్వతీపరమేశ్వరులిద్దరినీ కలిపి తల్లిదండ్రులుగా స్తుతిస్తారు. ప్రకృతిని పదార్థం అనీ, పురుషుణ్ణి తత్త్వం అనీ అంటారు. ప్రకృతి అచేతనతత్త్వం, పురుషుడు చేతనతత్త్వం.

ప్రకృతికి మూడు గుణాలు ఉన్నాయి. అవి సత్వ, రజో, తమోగుణాలు. పురుషుడు నిర్గుణం. ప్రకృతి సవికారం. పురుషుడు నిర్వికారం. శాస్త్రపరిభాషలో ప్రకృతిని మాయ అనీ, పురుషుణ్ణి బ్రహ్మ అనీ అంటారు.

సైన్స్ బిగ్ బ్యాంగ్ ముందు విశ్వం నాన్‌ఇన్‌ఫర్మేషన్ స్థితిలో ఉందంటే, శాస్త్రం దాన్ని మాయ అంటుంది. సైన్స్ విశ్వం సింగ్యులారిటీ స్థితినుంచి వచ్చిందంటే, శాస్త్రం బ్రహ్మనుంచి వచ్చింది అంటుంది.

సృష్టికి ముందు ఉన్నవి రెండే – ప్రకృతి, పురుషుడు. పురుషుడు మార్పుకు లోనుకాడు అంటే జరిగే మార్పులన్నీ ప్రకృతికి జరగాలి. ప్రకృతినుంచే ఈ విశ్వం వచ్చింది. శరీరం, మనస్సులు ప్రకృతినుంచి ఉత్పత్తి చెందాయి. కారణంలో ఉన్న గుణాలు కార్యంలోకి వస్తాయి. అందువల్ల ప్రకృతిలో ఉన్న గుణాలు ప్రపంచంలోనూ, మనశ్శరీరాల్లోనూ ఉంటాయి. ప్రకృతిలో ఉండే సత్వ, రజో, తమోగుణాలు వ్యక్తిలో కనిపిస్తాయి. అలాగే జగత్తులో శబ్దస్పర్శరూపరసగంధాలు ఉంటాయి.

మాయ అచేతనం కాబట్టి, మనశ్శరీరాలు కూడా అచేతనం. మరి వాటికి చైతన్యం ఎలా వచ్చింది? మనస్సు జడమైనా, మనస్సుకు చైతన్యాన్ని ప్రతిబింబించే లక్షణం ఉండటంవల్ల, ఇవి చేతనత్వం పొందాయి. మీలో ఉండే ఈ చైతన్యమే పురుషుడు. వ్యష్టిపరంగా ఆత్మ అంటాము, సాక్షిచైతన్యం అంటాము. అందువల్ల మీరు ప్రకృతి, పురుషుల మేలుకలయిక. అచేతనతత్త్వం, చేతనతత్త్వం రెండూ ఉన్నాయి. కంసాలి ఆభరణాలు చేయటానికి బంగారం, రాగిల కలయికను వాడితే ఆభరణాలలో కూడా ఈ రెండూ ఉంటాయి.

మీ మనస్సులో అనేక ఆలోచనలు వచ్చిపోతుంటాయి. మీకు మొదటి ఆలోచన వస్తున్నదని తెలుస్తుంది; రెండవ ఆలోచన వస్తున్నదని తెలుస్తుంది; రెండు ఆలోచనల మధ్య మనస్సు క్షణంసేపు శూన్యంగా ఉందని తెలుస్తుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసేదే ఆత్మ. అదే మీ పెద్ద నేను. ఈ సాక్షిచైతన్యంనుంచి చైతన్యాన్ని అరువు తెచ్చుకుని, చైతన్యవంతంగా మారుతుంది మనస్సు. దాన్ని ప్రతిబింబ చైతన్యం అనీ, అహంకారం అనీ అంటారు.

నేను ఎవరు? నేను అహంకారం + సాక్షిల మేలుకలయికను.

అంటే సవికార మాయ + నిర్వికార పురుషుల మేలుకలయికను.

ఇంకో విధంగా చెప్పాలంటే సగుణమాయ + నిర్గుణబ్రహ్మల మేలుకలయికను.

వీటిలో ఏది మీ స్వరూపమో అర్థం చేసుకోవాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మీరు అహంకారం వైపు మొగ్గుచూపితే, సంసారం వైపు మొగ్గు చూపినట్టే. అహంకారం జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కోకతప్పదు. అహంకారానికి మోక్షం సాధ్యం కాదు.

దానికి ఒక్కటే పరిష్కారం ఉంది. మీ ఉన్నతస్థాయి గురించి అర్థం చేసుకోవాలి. నేను ఆత్మను, నేను సాక్షిచైతన్యాన్ని అని అర్థం చేసుకోవాలి. అప్పుడే మోక్షం వస్తుంది. ఇదే ఆత్మవిద్య. ఇదే మీ అంతిమలక్ష్యంగా ఉండాలి.

## 14. ఆత్మ నిర్వచనం

వేద అంతభాగాన్ని ఉపనిషత్ అనికూడా అంటారు. వాటిల్లో ఒక ముఖ్యమైన ఉపనిషత్తు **కేనోపనిషత్**. అది శిష్యుడు వేసే ఈ ప్రశ్నతో మొదలవుతుంది. 'దేనివల్ల కోరబడి, ప్రేరేపించబడి, మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులు పనిచేస్తున్నాయి?' ఇంకో విధంగా చెప్పాలంటే ఈ అచేతనమైన వాటికి చైతనాన్ని ఇస్తున్నది ఏమిటి?

దానికి గురువు రెండు అతి ముఖ్యమైన నిర్వచనాలను ఇచ్చాడు.

1. **ఆత్మ లక్షణం** – శిష్యుడు అడిగిన ప్రశ్నకు ఒక్క మంత్రంలో జవాబు చెప్పాడు గురువు.

   **శ్రోత్రస్య శ్రోతం మనసో మనో యద్వాచో హ వాచం**
   **స ఉ ప్రాణస్య ప్రాణశ్చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః।**

ఈ మంత్రంయొక్క అర్థం అక్షరాలా చూస్తే ఆత్మ చెవియొక్క చెవి, ఆత్మ మనస్సుయొక్క మనస్సు, ఆత్మ వాక్కుయొక్క వాక్కు, ఆత్మ ప్రాణంయొక్క ప్రాణం; ఆత్మ కన్నుయొక్క కన్ను. కాని ఈ మంత్రాన్ని లోతుగా విశ్లేషిస్తే ఆత్మ గురించి మూడు విషయాలు తేటతెల్లమవుతాయి. మనసో మనోయత్ – పరంగా అవి చూద్దాము.

1. ఆత్మ వేరు, మనస్సు వేరు.
2. ఆత్మ మనస్సు అంతటా వ్యాపించివుంది.
3. ఆత్మ ఉండటంవల్లనే మనస్సును మనస్సు అనగలుగుతున్నాము. అంటే మనస్సుతో చూడగలుగుతున్నాము.

ఇదే సూత్రాన్ని తక్కిన నాలుగు అంగాలకూ వర్తింపజేయాలి. అంటే కన్నుకు చూసే శక్తి, చెవికి వినే శక్తి, వాక్కుకి మాట్లాడే శక్తి, ప్రాణానికి గాలి పీల్చే శక్తి ఆత్మవల్లనే వచ్చాయి. ఇది మొదటి నిర్వచనం. **ఆత్మ లక్షణం చైతన్యతత్వం.**

2. **ఆత్మ అప్రమేయం** – ఆత్మ ఎన్నటికీ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు. ఆత్మను కంటితో చూడలేము; ఆత్మను మాటలు కూడా వర్ణించలేవు; మనస్సు కూడా ఆత్మను తెలుసుకోలేదు; ధ్యానంలో తెలుసుకోలేము, తర్కానికి అందదు. నాకు కూడా తెలియదు అంటున్నాడు గురువు. ఆత్మమీద ఏ ప్రమాణమూ పనిచేయదు కాబట్టి ఆత్మను అప్రమేయం అంటారు. అందువల్ల నాకే కాదు, ఎవరైనా ఎలా చెప్పగలరు అంటాడు గురువు.

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు, తెలియని ఆబ్జెక్టు కాదు; ఇప్పుడు తెలియదు, ముందు కూడా తెలుసుకోలేము అంటే ఆత్మ అసలు లేనట్టా? ఆత్మ ఉందని గురువు చెప్పాడు కాబట్టి, ఆత్మ లేదనీ కొట్టిపారేయలేము. అయితే ఆత్మ ఏమిటి? ఆత్మ ఆబ్జెక్టు కాదు, ఆత్మ సబ్జెక్టు అయిన నేను.

**ఆత్మ, తెలుసుకునే నేను, తెలుసుకున్న లేదా తెలియని వస్తువు కాదు**
**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

పూజ్య స్వామీజీ ఈ విషయాన్ని చక్కగా వివరిస్తారు. మిమ్మల్ని ఎవరైనా ఫలానా వ్యక్తి వచ్చారా అని అడిగితే, ఒకసారి హాలంతా కలియజూస్తారు, అతను వచ్చాడో, లేదో తెలుసుకోవటానికి. కాని మిమ్మల్ని, 'నువ్వు వచ్చావా?' అని అడిగితే 'ఉండండి, ప్రమాణం ద్వారా తెలుసుకుని చెబుతాను,' అంటారా? లేదే! ప్రమాణం వాడకముందే మీరు ఉన్నారు, ప్రమాణం వాడటానికి మీరు ఉన్నారు. దానికి తర్కం కూడా అవసరం లేదు. ఇది రెండవ నిర్వచనం. ఆత్మ అప్రమేయం అంటే ప్రమాణాలకు అందదు. ఆత్మను నేను. నేను ఆత్మను అంటే ఆ ఆత్మ ఎవరో మర్చిపోకూడదు. నేను శరీరం కాదు, మనస్సు కాదు. వీటిని సాక్షిగా చూసే చైతన్యాన్ని.

ఈ కేనోపనిషత్ ఆత్మజ్ఞానం గురించి ఉన్న అపోహను తొలగిస్తుంది.

**ఆత్మ, మనస్సు తెలుసుకునే ఆబ్జెక్ట్ కాదు** – ఆత్మ, నీ మనస్సు లేదా ఆలోచన చూసే ఆబ్జెక్టు కాదు. ఆత్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము, ఆబ్జెక్టుగా అనుభవించలేము అంటున్నది.

మనస్సు తెలుసుకునే ఆబ్జెక్టు కాదు ఆత్మ. ఆత్మ (సాక్షిగా) చూసే ఆబ్జెక్టు మనస్సు.

చూడండి తమాషా! మనస్సు ద్వారా ఆత్మను తెలుసుకోలేము. ఎందుకంటే అన్నింటినీ మనస్సు చూస్తే, మనస్సుని ఆత్మ చూస్తుంది.

**జగత్తుపరంగా మనస్సు సబ్జెక్టు, జగత్తు ఆబ్జెక్టు**
**మనస్సుపరంగా ఆత్మ సబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు**

అందువల్ల ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది ఆత్మ. ఆత్మ అంటే మనస్సుకు ఇటువైపు ఉన్న నేను, మనస్సుకు అటువైపు ఉన్న వస్తువు కాదు.

**ఆత్మ, మనస్సుల మధ్య భేదం** – ఆత్మ అనుభవం ఎప్పుడూ ఉంటుంది. మారే ఆలోచనలున్న మనస్సులో మారని చైతన్యం ఉంది. ఆ మారని చైతన్యంవల్లనే అన్ని అనుభవాలు, అన్ని రకాల జ్ఞానమూ పొందగలము. ఆ చైతన్యమే ఆత్మ.

ఏదైనా జ్ఞానం పొందాలంటే రెండు విషయాలు ఉండాలి.

జ్ఞానం = మారే వృత్తి + మారని చైతన్యం

చైతన్యం వృత్తిమీద ఆధారపడిలేదు. వృత్తి మారుతుంది, చైతన్యం మారదు. బల్లను చూస్తే బల్ల వృత్తి (ఆలోచన) ఏర్పడుతున్నదని నాకు తెలుస్తున్నది. ఒక వస్తువును చూస్తే ఇంకో వస్తువు వెళ్ళిపోతున్నది. కాని ఈ వృత్తుల గురించిన నా ఎరుక మారటం లేదు. అందువల్ల మారే వృత్తినుంచి మారని చైతన్యం (ఎరుక) వైపుకు నా దృష్టిని మరల్చాలి. చైతన్యం వైపుకు మరల్చాక, ఆ చైతన్యం నేను అని అర్థం చేసుకోవాలి.

ఇలా ఆత్మయొక్క లక్షణం గురించి తెలుసుకోవటమే **ఆత్మవిద్య**.

## 15. ఆశ్చర్యాలలోకెల్ల ఆశ్చర్యం!

ఇంతకుముందు చేతనతత్త్వాన్ని పురుషుడు అనీ, అచేతనతత్త్వాన్ని ప్రకృతి అనీ శ్రీకృష్ణపరమాత్మ పేర్కొన్నాడని చూశాము. అదే 13వ అధ్యాయంలో ఇంకో రెండు పేర్లు కూడా చూస్తాము. అవి క్షేత్రజ్ఞుడు, క్షేత్రం. పురుషుడు–ప్రకృతి అన్నా, క్షేత్రజ్ఞుడు–క్షేత్రం అన్నా, బ్రహ్మ–మాయ అన్నా, ఆత్మ–అనాత్మ అన్నా ఒకటే. ఈ జగత్తంతా క్షేత్రజ్ఞుడు–క్షేత్రాల మేలుకలయికే. అంటే చైతన్యం, పదార్థాల మేలుకలయిక.

ఇక్కడొక సందేహం రావచ్చు. జగత్తంగా బ్రహ్మే సర్వవ్యాపకంగా,బ్రహ్మే అన్ని చేతన జీవుల్లోనూ చైతన్యంగా బ్రహ్మ ఉంటే, జడపదార్థాలలో బ్రహ్మను ఎలా తెలుసుకోగలము?

దానికి శాస్త్రం చెప్పే జవాబు – బ్రహ్మను జడపదార్థాల్లో కూడా **ఉనికి** రూపంలో తెలుసుకోగలము.

ఈ జగత్తులో కొన్ని వస్తువులను చూద్దాము. చెట్టు ఉంది, పుస్తకం ఉంది, కొండ ఉంది, గోడ ఉంది. ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? **ఉంది.** ఉంది అంటే దాని అర్థం – ఉనికి ఉంది అని. వీటినే ఇంగ్లీషులో దేర్ ఈజ్ ఎ ట్రీ, దేర్ ఈజ్ ఎ బుక్, దేర్ ఈజ్ ఎ మౌంటెన్, దేర్ ఈజ్ ఎ వాల్ అంటారు. అన్నింటిలోనూ సమానంగా ఉన్నది – ఈజ్, ఈజ్, ఈజ్. ఈ ఈజ్–నెస్స్ ఉనికిని సూచిస్తుంది. దీన్నే సత్ అంటారు. ఈ సత్ అనేది వస్తువుకు చెందదు, బ్రహ్మకు చెందుతుంది.

ఉదాహరణకు గాజు ఉంది, గొలుసు ఉంది, ఉంగరం ఉంది వాక్యాలలో ఆ ఉంది పదం బంగారానికి చెందుతుంది; ఆభరణాలకు కాదు. ఆభరణాలు గాజు, గొలుసు, ఉంగరం – నామరూపాలు మాత్రమే, వాటికి స్వతహాగా ఉనికి లేదు. ఎలా చెప్పగలరు? నమ్మలేకపోతే, ఆభరణాలనుంచి, బంగారాన్ని విడిగా తీసిచూడండి. బంగారం లేకపోతే, ఆభరణమే లేదు. మీరు ముట్టుకుంటున్నది ఆభరణాన్ని కాదు, బంగారాన్ని. బంగారం, ఆభరణాలకు ఉపాదానకారణం. ఉపాదానకారణం, కార్యం అంతటా ఉంటుంది.

ఈ సూత్రం ప్రకారం జగత్తుకు ఉపాదానకారణమైన బ్రహ్మ జగత్తు అంతటా ఉంటాడు. అందువల్ల మీరు చూస్తున్నది జగత్తును కాదు, జగత్తు అంతటా ఉన్న ఉనికిని. వేదాంతం జగత్తును **నామరూపాత్మకం** అంటుంది.

ఉనికి అంతటా ఉందని ఎలా చెప్పగలరు? ఉనికిలేని వస్తువును గూర్చి ఎన్నడూ చెప్పలేరు. ఒక వస్తువుకు ఉనికి లేకపోతే, ఆ వస్తువు లేదని చెప్పవచ్చు. అందువల్ల ఉనికి అంతటా ఉంది. మీలో, ఆ బల్లలో, ఇంకా చెప్పాలంటే మీకూ, ఆ బల్ల మధ్యలోనూ ఉనికి ఉంది. మీరు, 'నాకూ, బల్లకూ మధ్యలో ఏమీలేదు, శూన్యమే ఉంది,' అన్నారనుకోండి. అప్పుడు కూడా శూన్యమే **ఉంది**లో ఉంది అంటే అది ఉనికే. అందువల్ల ఉనికి లేకుండా దేని గురించీ మాట్లాడలేరు. ఆ విధంగా ఉనికి చేతన, అచేతన వస్తువులన్నింటిలోనూ ఉంది. అది **సత్** అంశం.

ఇప్పుడు ఆ ఉనికి గురించి చెప్పాలంటే, దాని గురించిన జ్ఞానం లేదా ఎరుక ఉండాలి. ఒక వస్తువు ఉందని మీకు తెలియకపోతే, దాని గురించి ఎలా మాట్లాడగలరు? అందువల్ల ఉనికి ఉంది అంటే, దాని గురించిన ఎరుక ఉన్నట్టు అర్థం, ఎరుక ఉంది అంటే దాని వెనుక చైతన్యం ఉన్నట్టు అర్థం. ఈ చైతన్యాన్ని చిత్ అంటారు. ఆ విధంగా సత్ ఉంటే చిత్ ఉంటుంది; చిత్ ఉంటే సత్ ఉంటుంది. నేను ఉన్నాను, వాక్యంలో నేను చిత్ అంశాన్ని సూచిస్తే, ఉన్నాను సత్ అంశాన్ని సూచిస్తుంది.

ఆ విధంగా బ్రహ్మ జగత్తంతటా ఉనికి రూపంలో, చైతన్యరూపంలో ఉన్నాడు. ఇంకో విధంగా చెప్పాలంటే సద్రూపంలో, చిద్రూపంలో ఉన్నాడు. అందువల్లనే సర్వం బ్రహ్మమయం అనే నానుడి వచ్చింది. ఈ సత్, చిత్‌లే బ్రహ్మ నిర్వచనం అయిన సచ్చిదానంద బ్రహ్మ (సత్+చిత్+ఆనందంబ్రహ్మ)లోని మొదటి రెండు పదాలు.

ఆనందం అంటే మామూలు అర్థం తీసుకుంటే మనస్సుకు కలిగే ఆనందం. కాని ఇక్కడ ఆనందాన్ని అనంతంగా తీసుకోవాలి. బ్రహ్మ సర్వవ్యాపకం, పరిపూర్ణం, అనంతం. అందువల్ల సచ్చిదానంద బ్రహ్మ అంటే సత్, చిత్, అనంతం బ్రహ్మ. శుద్ధసత్, శుద్ధచిత్, అనంతం బ్రహ్మ; అద్వయం బ్రహ్మ; నిర్గుణం బ్రహ్మ; అప్రమేయం బ్రహ్మ; అప్రమాణం బ్రహ్మ.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, బ్రహ్మ ప్రత్యక్షప్రమాణాలకు అందదు, అనుమాన ప్రమాణానికి అందదు, మాటలతో వర్ణించలేము, మనస్సుతో తెలుసుకోలేము అని అన్ని ఉపనిషత్తులూ ఘోషించినా, దాని గురించి అన్నీ అంతకంతకూ మాటలతో విశ్లేషించుకుంటూ వస్తాయి. అందువల్లనే కృష్ణపరమాత్మ గురువు, ఆత్మ గురించి ఆశ్చర్యంగా చెబుతాడనీ, శిష్యుడు అంతకన్నా ఆశ్చర్యంగా వింటాడనీ అంటాడు. అందువల్ల ఆత్మ లేదా బ్రహ్మ **ఆశ్చర్యాలలోకెల్ల ఆశ్చర్యం!**

## 16. సంసారం, కర్మ సిద్ధాంతం

సంసారాన్ని దుఃఖాలయంగా నిర్వచిస్తారు కొందరు. దైవభక్తి ఉన్నవారు కూడా జీర్ణించుకోలేని విషయం ఒకటుంది – మంచికి మారుపేరుగా ఉండి, చీమకు కూడా హాని తలపెట్టనివారేమో జీవితంలో చాలా అవస్థల పాలవుతుంటారు. దుర్మార్గానికి దుస్తులు తొడిగినట్టుగా ఉన్నవారు, ఒక్క మంచిపని కూడా చేసి ఎరుగనివారు ఐశ్వర్యాలలో తులతూగుతుంటారు. ఎందుకు? భగవంతుడికి జాలి లేదా? పక్షపాతం ఉందా?

ఈశ్వరుడు కర్మఫలదాత – నిజమే కాని ఈశ్వరుడు తనకు తోచినట్టుగా ఎవరికీ కర్మ ఫలాన్నివ్వడు. అందువల్ల ఎవరైనా కష్టాల కడలిలో మునిగితేలుతున్నా, ఐశ్వర్యాలలో తులతూగుతున్నా దానికి పరమాత్మను తప్పు పట్టకూడదు అంటుంది శాస్త్రం.

ఈ విశ్వంలో రెండురకాల సూత్రాలు ఉన్నాయి. జడమైన వస్తువులను నియంత్రించేందుకు ప్రకృతిసూత్రాలు ఉంటే, చేతనజీవులను నియంత్రించేందుకు ఆధ్యాత్మిక సూత్రాలు ఉంటాయి. ఈ ప్రకృతిసూత్రాలు సైంటిస్టుల మేధస్సుకు అందుతాయి. అందువల్ల వారు ఆ సూత్రాలను అందుకుని, మానవాళి జీవితాన్ని మరింత మెరుగు పరచటానికి కృషి చేస్తున్నారు. ఆధ్యాత్మిక సూత్రాలను కర్మ సిద్ధాంతం అంటారు. అది సైన్సుకు అందదు. శాస్త్రంలోనే దానికి వివరణ దొరుకుతుంది.

**సూత్రం 1: పుణ్యపాపాలు** – మీరు ప్రయత్నపూర్వకంగా చేసే ప్రతి ఒక్క కర్మకీ రెండురకాల ఫలాలు ఉంటాయి. అవి దృష్టఫలం, అదృష్టఫలం. దృష్టఫలం అంటే కనబడే ఫలం; అదృష్టఫలం అంటే కనబడని ఫలం. ఉదాహరణకు మీరు ఆకలిగా ఉన్న వ్యక్తికి కడుపునిండా భోజనం పెట్టారనుకోండి. అతను తనివితీరా భోజనం చేసి, మిమ్మల్ని మనసారా ఆశీర్వదిస్తాడు. దృష్టఫలం అతనికి మీవల్ల ఆకలి తీరటం; అదృష్టఫలం – మీరీ మంచిపని చేయటంవల్ల, మీ ఖాతాలో కొంత పుణ్యం వచ్చి చేరుతుంది. అదే విధంగా మీరు ఎవరినో మోసం చేసి, వారి డబ్బును మీరు అన్యాయంగా తీసుకున్నారనుకోండి, మీరు దానివల్ల అదనంగా ధనం పొందుతారు. అది దృష్టఫలం. అదృష్టఫలం – మీరీ చెడుపని చేయటంవల్ల, మీ ఖాతాలో కొంత పాపం వచ్చి చేరుతుంది. అది మీకు కష్టాన్ని కొనితెస్తుంది.

**సూత్రం 2: రెండు నియమాలు** – పుణ్యపాపాలు రెండు నియమాలవల్ల కలుగుతాయి. శాస్త్రం విధించిన కర్మలు చేస్తే పుణ్యం కలుగుతుంది. వాటిని విహితకర్మలు అంటారు. శాస్త్రం చేయవద్దన్న కర్మలు చేస్తే, పాపం వస్తుంది. వాటిని నిషిద్ధకర్మలు అంటారు. కొన్ని కర్మలు దృష్టఫలం దృష్ట్యా మంచివిగా కనబడవచ్చు, కాని అదృష్టఫలం దృష్ట్యా మంచివి కావు. అలాంటి పని పాపాన్ని కలుగజేస్తుంది. శాస్త్రం విధించే కర్మలను దృష్టఫలం, అదృష్టఫలం– రెండింటినీ దృష్టిలో పెట్టుకుని విధిస్తుంది. అది సుఖం, దుఃఖం, పుణ్యం, పాపం అన్నింటినీ ఆలోచిస్తుంది.

**రెండో నియమం** – ఒకవేళ అది శాస్త్రంలో చెప్పకపోతే, ఏం చేయాలి? ఏ పనన్నా ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నామో ఆలోచించాలి. కారణం ఉన్నతమైనదైతే అది పుణ్యాన్ని కలుగజేస్తుంది. లేకపోతే లేదు. అందువల్ల శాస్త్రం చెప్పినదాన్నిబట్టి, ఉద్దేశ్యాన్నిబట్టి పుణ్యపాపాలు నిర్ణయించబడతాయి.

**సూత్రం 3: దృష్ట సుఖదుఃఖాలు** – మీకు అదృష్టఫలంగా వచ్చి చేరిన పుణ్యపాపాలను సుఖదుఃఖాల రూపంలో అనుభవించాల్సి ఉంటుంది. కాకపోతే ఆ పుణ్యపాపాలు, సుఖదుఃఖాలుగా మారటానికి ఎంత సమయం పడుతుందో తెలియదు. కొన్ని వెంటనే మారవచ్చు, కొన్ని సంవత్సరాలు తీసుకోవచ్చు, కొన్ని ఫలించటానికి కొన్ని జన్మలు పట్టవచ్చు.

దీనికి శాస్త్రం అద్భుతమైన ఉదాహరణను ఇస్తుంది. మనం బొప్పాయిచెట్టు, మామిడిచెట్టు, కొబ్బరిచెట్టు పెరగటానికి విత్తనాలను ఒకేరోజు వేశాం. బొప్పాయి అతి త్వరగా పెరిగితే, తక్కిన రెండూ ఎక్కువకాలం తీసుకుంటాయి. అలాగే తక్కిన జీవరాశులు కూడా. పురుగులు గంటల్లో పెరిగిపోతే, మనిషి తల్లిగర్భంనుంచి రావటానికి తొమ్మిది నెలలు పడుతుంది. అందువల్ల అన్ని కర్మలకీ సమానమైన ఫలాలు ఉండవు.

ఎప్పుడో ఏదో జన్మలో చేసిన పుణ్యపాపాలను సుఖదుఃఖాల రూపంలో అనుభవించటానికి ఎన్నో జన్మలు ఎత్తాల్సి ఉంటుంది. అలా ఎన్నో జన్మలు ఎత్తి, ఈ జన్మకి వచ్చివుంటారు.

ఇప్పుడు ఈ నేపథ్యంతో చూస్తే, మంచికి మారుపేరుగా ఉన్నవారు కష్టాల కడలిలో కూరుకుపోతున్నారు అంటే, వారు ఈ జన్మలో చీమకు కూడా హాని తలపెట్టకపోయి ఉండవచ్చు కాని, గత జన్మల్లో ఏదో జన్మలో ఎన్నో ఘోరాలు, నేరాలు చేసి ఉండవచ్చు. అలాగే దుర్మార్గానికి దుస్తులు తొడిగినట్టు ఉన్నవ్యక్తి ఐశ్వర్యంలో ఓలలాడుతున్నాడంటే, గత జన్మల్లో ఎవో చాలా మంచిపనులు చేసి ఉండవచ్చు. అంటే జన్మజన్మలకూ ప్రోగు చేసుకువస్తున్న పుణ్యపాపాలు ఇవి.

కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే కలిగే లాభాలు ఇవి –

ఎ) **వైవిధ్యం** – ఇన్ని రకాల శరీరాలు ఎందుకు వచ్చాయో అనే సందేహానికి కూడా ఇదే జవాబు. చెట్లు, జంతువులు, మనుష్యులు ఉన్నారు ఈ సృష్టిలో. మనుష్యుల్లో కూడా ఎంత భిన్నత్వం? స్త్రీలు, పురుషులు ఉన్నారు. పురుషుల్లో బలవంతులు–బలహీనులు, గొప్పవారు–బీదవారు, మంచివారు–చెడ్డవారు. ఇలా చెప్పుకుంటూపోతే, ఏకత్వంలో భిన్నత్వం ఎంతగా ఉందో తెలుస్తుంది. ఒక మనిషి చేతివేళ్ళు ఐదు ఎలా సమానంగా ఉండవో అలా ఒక తల్లికి పుట్టిన ఐదుగురు పిల్లలూ ఒక్కలాగా ఉండరు అంటారు. దానికి కారణం ఈ కర్మ సిద్ధాంతమే. ప్రపంచంలో ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. ప్రతిదీ ప్రకృతి సూత్రాల పరంగానో, కర్మసిద్ధాంతం పరంగానో జరుగుతుంది.

బి) **బాధ** – ఈ కర్మ సిద్ధాంతం అర్థం చేసుకుంటే ఏదైనా కష్టం రాగానే, 'నాకే ఎందుకు వచ్చింది,' అని వాపోకుండా ఉండవచ్చు లేదా మీ కష్టానికి ఎదుటివారిని కారణం చేసి, వారిని తిట్టకుండా ఉండవచ్చు.

సి) **దైవదూషణ** – కొంతమంది అనుకోని కష్టాలు వస్తే, వారు నిత్యం కొలిచే భగవంతుణ్ణి నిందించటానికి కూడా వెనుకాడరు. 'చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా,' అనీ 'నీ కర్మకు నీవే బాధ్యుడివి,' అనీ ఊరికే అనలేదు పెద్దలు. మీరు ఇవాళ కష్టపడుతున్నారు అంటే కర్మఫలదాత అయిన ఈశ్వరుడు మీకు కోరి కష్టాలను ఇవ్వటంలేదు, ఆయనకు మీమీద ద్వేషమూ లేదు, ఎవరిమీదా పక్షపాతమూ చూపటం లేదు. మీరు చేసుకున్న పుణ్యపాపాలకు తగ్గ ఫలాలను, అదికూడా కర్మసిద్ధాంతం ప్రకారం ఇస్తున్నాడు అంతే.

డి) **భవిష్యత్తుపై జాగ్రత్త** – అందువల్ల మీకేదైనా కష్టం రాగానే, ముందు వెనుకలు ఆలోచించకుండా ఈశ్వరుణ్ణో, తోటిమానవులనో నిందించటం మాని, 'నేను చేసుకున్నదానికి నేను కాకపోతే ఎవరు అనుభవిస్తారు?' అనే సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. దీనివల్ల లాభం కూడా పొందవచ్చు. ఒకటి మీరు పూర్వజన్మలో చేసుకున్న కర్మవల్ల ఈ జన్మలో కష్టాలు పొందుతున్నారని అర్థం చేసుకుంటే, కనీసం ఈ జన్మలో తెలిసి తెలిసీ ఎవరికీ హాని తలపెట్టకుండా ఉంటారు. అంటే మీ వర్తమానాన్ని మార్చలేరు కాని కనీసం భవిష్యత్తును రంగులమయంగా తీర్చిదిద్దుకోగలరు.

ఇ) **ప్రారబ్ధకర్మ క్షయం –** మీరు ఇప్పుడు అవస్థ పడుతున్నారు అంటే మీ ప్రారబ్ధకర్మ కొంత క్షయమవుతున్నట్టేగా. దానివల్ల కొంత పాపం తగ్గుతోంది. అందువల్ల మీరు నేను కష్టపడుతున్నాను అనుకోకుండా నా పాపం తొలగిపోయి, నేను పునీతుణ్ణి అవుతున్నాను అని అర్థం చేసుకోవాలి.

## 17. కర్మ సిద్ధాంతం అంటే ఏమిటి?

ఒకజీవియొక్క పునర్జన్మ, అతను పూర్వజన్మలో చేసిన పుణ్యపాపాలమీద ఆధారపడి ఉంటుందని చూశాము. ఈ పుణ్యపాపాలను నిర్ణయించేది కర్మసిద్ధాంతం. ఒకవేళ, ఆ జీవికి పునర్జన్మ లేకపోతే, అతను ముందు జన్మల్లో చేసిన పుణ్యపాపాలు అనుభవించే అవకాశం ఉండదు. అలా అనుభవించే అవకాశం లేకపోతే, విశ్వంలో ఉన్న సూత్రాలు పనిచేయనట్టు అవుతుంది.

సైన్సు ప్రకారం, ప్రతి ఒక్క చర్యకూ సమానమైన ప్రతిచర్య ఉంటుంది. అలాగే ప్రతిజీవి చేసిన ప్రతి ఒక్క కర్మకు కూడా, కర్మఫలం ఉంటుంది. కర్మఫలం అదృష్టఫలంమీద ఆధారపడివుంటుందని శాస్త్రం చెబుతున్నది. అటు ప్రకృతిలో చర్యకు ప్రతిచర్య రాకపోతే, భౌతిక ప్రపంచంలో సమతుల్యత దెబ్బతింటుంది. అలాగే ఇటు కర్మ విషయంలో కర్మఫలం రాకపోతే ఆధ్యాత్మిక రంగంలో సమతుల్యత దెబ్బతింటుంది. సైన్స్ పునర్జన్మ విషయంలో ఏమీ చేయలేదు కాని శాస్త్రంలో, కర్మ సిద్ధాంతం ఉంటుంది, పునర్జన్మను నిర్ణయించేందుకు.

దేశపరంగా తీసుకుంటే, ఏ దేశానికి తగ్గ చట్టం ఆ దేశానికి ఉంటుంది. ఆ దేశప్రజలు మంచి చేసినా, చెడు చేసినా వారి చట్టాన్నిబట్టి వారికి పురస్కారాలు ఇవ్వటమో, శిక్షించటమో ఈ జన్మలోనే చేస్తుంది. ఇదే విధంగా విశ్వంలో, ఆధ్యాత్మిక పరంగా ఈశ్వరుడు ఒక చట్టం ఏర్పరచి, దాన్ని అమలులో పెడతాడు. ఒక న్యాయాధికారి న్యాయాన్ని, చట్టాన్ని రక్షించటం కోసం పాటుపడాలి కాని జాలి, దయ చూపించకూడదు. అలాగే, విశ్వంలోని జీవులకు న్యాయాధికారి కూడా నిర్దాక్షిణ్యంగానే ప్రకృతి సూత్రాలు అమలు పరచకపోతే, విశ్వం అంతా గందరగోళంగా అయిపోతుంది. పైనుంచి కింద పడుతున్న వ్యక్తి, 'ఓ దేవా, భూమ్యాకర్షణశక్తి పని చేయకుండా చేయి,' అని ప్రార్థిస్తే, ఈశ్వరుడు అతనిమీద జాలిపడి నిజంగానే భూమ్యాకర్షణశక్తిని పనిచేయకుండా చేశాడనుకోండి, మనమంతా గాలిలో తేలుతూ ఉంటాము, భూమిమీద స్థిరంగా ఉండి, పనిచేయలేము.

ప్రకృతి సూత్రాలు ఎలా పనిచేస్తాయో సైన్సులో కనుగొనగలరు కాని, కర్మ సిద్ధాంతం ఏ సూత్రాలమీద పనిచేస్తుందో, అది మానవమేధస్సుకు అందదు. అందువల్లనే దేవుని లీల అర్థం కాదు అని అనుకుంటుంటాము. మంచికి రోజులు లేవా అంటాము. ఎందుకంటే మంచితనం మూర్తీభవించిన వ్యక్తి, అష్టకష్టాలు పడుతుంటాడు; కాని మంచితనం అంటే

ఏమిటో బొత్తిగా తెలియని వ్యక్తి అన్ని విధాలా జీవితాన్ని అనుభవిస్తాడు. దేవుడు ఎందుకిలా చేస్తున్నాడో అర్థంకాక, ఈ కర్మ సిద్ధాంతం గురించి తెలియక, అనవసరంగా దేవుణ్ణి ఆడిపోసుకుంటాము. కాని వారి సుఖదుఃఖాలు, వారి అదృష్టపుణ్యాపాపాలమీద ఆధారపడివున్నాయి.

కర్మ సిద్ధాంతం ప్రకారం, ఒక వ్యక్తి ఈ జన్మలో అనుభవిస్తున్న పుణ్యాపాపాలు, ఈ జన్మలో చేసిన కర్మఫలం కాదు, అది పూర్వజన్మలోది కావచ్చు, కొన్ని జన్మల ముందుది కూడా కావచ్చు అని అర్థం అవుతుంది. కొన్ని జన్మల క్రిందట ఏం చేశామో ఎవరికీ తెలియదు కాబట్టి, కర్మఫలం ఇలాగే ఉంటుందని చెప్పలేము. మరి జ్యోతిష్యశాస్త్రం ప్రకారం భవిష్యత్తులో ఏమవుతుందో చెబుతారు కదా అంటే వారు కూడా నూరుశాతం ఇలాగే అవుతుందని చెప్పలేరు. ఆ మాటకొస్తే, ఒకే వ్యక్తి జాతకాన్ని ఇద్దరు జ్యోతిష్కులకు చూపిస్తే, ఇద్దరూ ఒకేలా చెప్పరు, చెప్పలేరు.

జీవితం అనుకోకుండా జరిగింది కాదు. అసలు ఏదీ అనుకోకుండా జరగదు. ప్రతిదీ ఒక నైతికమైన క్రమపద్ధతిమీద ఆధారపడివుంది.

మన పుట్టుకనీ, మన అనుభవాలనీ నిర్ణయించేది దేవుడు కాదని అర్థం చేసుకోవాలి అంటుంది శాస్త్రం. కర్మ సిద్ధాంతం, ఆత్మజ్ఞానంకన్నా మరింత ప్రాథమిక సూత్రం. అది ఎంత బాగా అర్థమయితే, మన జీవితం అంత సాఫీగా సాగుతుంది. నేరస్థుడు చట్టంనుంచి తప్పించుకోగలడేమో కాని, పుణ్యాపాపకర్మల సిద్ధాంతంనుంచి తప్పించుకోలేడు. అతని పుణ్యాపాపాలననుసరించే అతని పునర్జన్మ ఆధారపడివుంటుంది. అదృష్ట పుణ్యాపాపాలు మూడు రకాలు. అవి సంచితకర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామికర్మలు.

ఎ) **సంచిత కర్మలు** – గత జన్మలనుంచీ ప్రోగు చేసుకుని వస్తున్న పుణ్యాపాపాలన్నింటినీ సంచిత కర్మలు లేదా సంచిత అదృష్టం అంటారు.

బి) **ప్రారబ్ధ కర్మలు** – పోగుపడిన సంచిత కర్మల్లోంచి కొంతభాగం అనుభవించటానికి సిద్ధంగా ఉంటుంది. దానివల్లనే, దానికి తగ్గ జన్మనెత్తటం జరుగుతుంది. అలా దృష్టఫలంగా మారబోతున్న అదృష్ట పుణ్యాపాపాలను ప్రారబ్ధకర్మ అంటారు. మనం మనుష్యులుగా పుట్టాలా, జంతువుగానా; మనిషి అయితే స్త్రీగానా, పురుషునిగానా, ఆరోగ్యంగానా, అనారోగ్యంతోనా– ఇవన్నీ కూడా మన ప్రారబ్ధకర్మే నిశ్చయిస్తుంది. ప్రారబ్ధకర్మ ముగిసిన క్షణం ఈ శరీరం రాలిపోతుంది.

సి) **ఆగామి కర్మలు** – మన ప్రారబ్ధకర్మలని అనుభవించటానికి ఈ భూమిమీద పుట్టిన తరువాత వాటికోసం కొన్ని కర్మలు చేస్తాము. ఆ కొత్త కర్మలనుంచి మళ్ళీ దృష్టఫలం, అదృష్టఫలం కలుగుతాయి. వీటిని ఆగామికర్మలు అంటారు.

కొన్ని ఆగామికర్మల ఫలం ఈ జన్మలోనే అనుభవిస్తాము కాని మిగిలిపోయిన ఆగామికర్మలు సంచితకర్మను చేరుతాయి.

**ప్రోగుబడిన కర్మలు సంచితకర్మలు**

**అనుభవిస్తున్న కర్మలు ప్రారబ్ధకర్మలు**

**కొత్తగా పుడుతున్న కర్మలు ఆగామికర్మలు**

**జనన–మరణ వృత్తం** – ఈ జీవితం ముగించేసరికి ప్రారబ్ధకర్మ ముగిసిపోతుంది. నిజానికి ప్రారబ్ధకర్మ ముగిస్తేనే, జీవితం ముగుస్తుంది. ఈ జన్మలో ఫలించిన ఆగామి కర్మలు కూడా ముగిసిపోతాయి. పాత సంచితకర్మల్లో కొన్ని కొత్త ఆగామి కర్మలు చేరుతాయి.

ఈ సంచితకర్మనుంచి మళ్ళీ కొంచెం భాగం ప్రారబ్ధకర్మగా మారుతుంది, ఇంకో జన్మనివ్వటానికి. మళ్ళీ ప్రారబ్ధకర్మ తీరటానికి పుట్టిన జన్మలో, మళ్ళీ ఆగామికర్మ కలుస్తుంది. మళ్ళీ ఇదే కథ. ప్రారబ్ధకర్మ పూర్తిగా కరిగిపోతుంది, ఆగామికర్మ కొంత కరిగి, కొంత సంచితకర్మగా చేరుతుంది. సంచితకర్మనుంచి మళ్ళీ పునర్జన్మ వస్తుంది. పునరపి జననం, పునరపి మరణం వృత్తం – అలా సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు సాగుతూనే ఉంటాయి. ఇది ఒక అంతులేని కథ.

ఈ కర్మ సిద్ధాంతంవల్ల ఈ జన్మలో మీ జీవితం మీరు ముందు జన్మల్లో చేజేతులా చేసుకున్నదాని ఫలమే అని తెలుస్తున్నది. ఈ జన్మలో చేసే కర్మలవల్ల ఆగామి కర్మలు వస్తున్నాయి కదా, అసలు కర్మ చేయకుండా ఉంటేనో అనిపించవచ్చు మీకు. కాని అది సాధ్యం కాదని కృష్ణపరమాత్మ తేల్చి చెప్పేశాడు భగవద్గీతలో.

కర్మను ఎందుకు నిర్లక్ష్యం చేయకూడదో, చెప్పటానికి మూడు కారణాలు చూపించాడు. అవి కర్మను మానటంవల్ల మోక్షం రాదు, కర్మ మానటం అసాధ్యం, కర్మ మానటం చాలా ప్రమాదకరం కూడా. కర్మ చేయకతప్పదు కాబట్టి, దాన్ని కర్మయోగంగా మలుచుకోమని చెప్పాడు కృష్ణపరమాత్మ.

## 18. పురుష ప్రయత్నమా, ఈశ్వరకృపా?

కృష్ణపరమాత్మ, అధ్యాయం 7లో భగవంతుణ్ణి అంతిమలక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పాడు. దాన్ని భక్తి అంటారు.

ఆధ్యాత్మిక ఎదుగుదల ఒక కొండ ఎక్కటం వంటిది. ఒక రైలు కొండ ఎక్కేటప్పుడు దానికి రెండు ఇంజన్లు ఉంటాయి. పైకి లాగటానికి ముందువైపున ఒక ఇంజను ఉంటే, పైకి తొయ్యటానికి వెనకవైపున ఇంకో ఇంజను ఉంటుంది. అలాగే ఆధ్యాత్మిక ఎదుగుదలకు పురుషప్రయత్నం చేయాలి, ఈశ్వర అనుగ్రహం కూడా కోరాలి.

కొంతమంది విధి ఆడే వింతనాటకంలో మనమంతా కీలుబొమ్మలం, ఆ జగన్నాటక సూత్రధారి అంతా వెనకవుండి ఆడిస్తాడు అంటారు. మన తలరాత ఎలావుంటే అలా అవుతుందని అనుకోవటాన్ని ఫేటలిజమ్ అంటారు.

కొంతమందేమో భగవంతుని పాత్ర ఏమీలేదు, అంతా నా చేతిలోనే ఉంది, నా ఫ్రీవిల్‌మీద ఆధారపడివుంటుంది అంటారు. నేను కష్టపడి పైకి వచ్చాను, ఇందులో భగవంతుని ప్రమేయం ఏమీలేదు అంటారు. ఫ్రీవిల్ అంటే పురుషప్రయత్నం.

శాస్త్రం రెండు వాదనలూ తప్పే అంటుంది. ఫ్రీవిల్ + విధి మీ భవిష్యత్తును నిర్దేశిస్తాయి అంటుంది. ఎలాగైతే ఒక పక్షి రెండురెక్కల సహాయంతో ఎగురుతుందో, అలాగే మీరు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ఫ్రీవిల్ + విధి రెండూ తోడ్పడతాయి. దానికి ఏం చేయాలి?

దానికి కృష్ణపరమాత్మ అధ్యాయం 18లో నీ సర్వధర్మాలనీ పరిత్యజించి నన్నే శరణు వేడు అన్నాడు. దాని అర్థం –

1. సర్వకర్మలను త్యజించాలి.
2. కర్మత్యాగం చేయాలంటే దేహాభిమాన త్యాగం చేయాలి.
3. దేహాభిమాన త్యాగం చేయాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.
4. ఆత్మజ్ఞానం పొందాలంటే శాస్త్రం నేర్చుకోవాలి.

అందువల్ల నన్నే శరణు వేడు అని కృష్ణపరమాత్మ చెబితే, శాస్త్రంమీద నమ్మకం పెట్టుకోండి. అప్పుడు సంసారం బాధించకుండా సరియైన నిర్ణయాలు తీసుకుని, సరియైన కర్మలు చేయగలుగుతారు అని అర్థం.

నిష్కామభక్తుడు తనలో ఐక్యం అవుతాడని కృష్ణపరమాత్మ అధ్యాయం 9లో చెప్పాడు. అంటే భగవంతుడు కూడా పక్షపాతం చూపిస్తున్నాడా అని అనుమానం వస్తుంది. ఎందుకు కొంతమందికే మోక్షం వస్తోంది, కొంతమందికి రావటం లేదనే ప్రశ్న వేధిస్తూ ఉంటుంది చాలామందిని.

ఈ సందర్భంగా స్వామీజీ ఒక కథ చెబుతారు.

ఒక ఆలయంలో ఒక భక్తుడు రోజూ భగవంతుని ముందు నిల్చుని మొరపెట్టుకునేవాడట. 'ఓ దేవా, నన్ను నీలో ఐక్యం చేసుకో, నాకు నీలో ఐక్యం అవాలని ఉంది.' అలా చెబుతూ గుడి మూసే సమయం అయినా కూడా వెళ్ళేవాడు కాదుట. పూజారి గుడి మూయాలి, బయటకు వెళ్ళమని ఎన్ని రకాలుగా నచ్చచెప్పినా అతను కదిలేవాడు కాదుట.

ఇలా లాభంలేదని, ఒకరోజు పూజారి భగవంతుడి విగ్రహం వెనక్కివెళ్ళి, భగవంతుడు మాట్లాడినట్టుగా, 'ఓ భక్తా, నీ భక్తికి మెచ్చాను. నీ కోరిక తీరుస్తాను. తథాస్తు! రేపు నువ్వు వచ్చినప్పుడు నిన్ను నాలో ఐక్యం చేసుకుంటాను. మళ్ళీ నువ్వు రేపు ఇంటికి తిరిగి వెళ్ళవు,' అన్నాడు. ఇంక అతను మర్నాటినుంచీ ఆలయంకు వెళితే ఒట్టు.

అందువల్ల కృష్ణపరమాత్మ చెబుతున్నాడు, 'మీకు మోక్షం కావాలా, వద్దా అని నిర్ణయించేది నేను కాదు; నేను మీకు మోక్షం ఇవ్వటానికి సిద్ధమే. కాని నేను ఇద్దామనుకున్నా అందుకోవటానికి మీరు సిద్ధంగా లేరు.'

అందువల్ల ఫ్రీవిల్‌ను ఉపయోగించటానికి నిర్ణయించుకుని, భగవంతుని కృప కోరేవారికి, భగవంతుడు సహాయపడగలడు. ఫ్రీవిల్‌ను ఉపయోగించి, ముందు ఆధ్యాత్మిక సాధనకు కావాల్సిన అర్హతను పొందాలి. అంటే జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందాలి. దానికి సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందించుకోవాలి, నైతిక విలువలను పెంపొందించుకోవాలి, కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి.

ఆధ్యాత్మిక జీవనంలో నాలుగు కృపలు తోడ్పడుతాయి. అవి దైవకృప, గురుకృప, శాస్త్రకృప, ఆత్మకృప. తనమీద తనకు నమ్మకంలేని వ్యక్తికి బాహ్యంగా సహాయం అందించినా అందుకోలేడు. అతనికి ఈశ్వరకృప, గురుకృప, శాస్త్రకృప ఏవీ పనిచేయవు. నేను ఆధ్యాత్మిక మార్గంలో పయనించి, నేను విజయం సాధిస్తాను అనుకునే నమ్మకం ఉండాలి. దీన్నే ఆత్మకృప అంటారు.

విధిని నమ్ముకునే వ్యక్తులకు మనం ఏమీ బోధించలేము. ప్రతిదీ భగవంతునిమీద వేసేసి వారు తప్పుకుంటారు. 'భగవంతుడు నాకు మోక్షాన్నివ్వాలని సంకల్పించుకుంటే **నా ప్రయత్నం అవసరం లేదు**. కాదూ, నాకు మోక్షాన్నివ్వకూడదని భగవంతుడు సంకల్పించుకుంటే, **నా ప్రయత్నం ఫలించదు**. ఎలా చూసినా, నేను ప్రయత్నించి లాభంలేదు,' అంటారు వీరు.

పురుషప్రయత్నం చేస్తేనే ఈశ్వరకృప తోడ్పడుతుంది. రెండూ ఉండాలి అంటుంది శాస్త్రం.

## 19. వేదాంతంయొక్క ప్రాథమిక బోధ ఏమిటి?

సంసారం అంటే పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో పడి తిరుగుతుండటం. వేదాంతశాస్త్రంయొక్క ప్రాథమిక లక్ష్యం ఈ సంసారచక్రంనుంచి మానవాళికి మోక్షాన్ని కలిగించటం. ఆ మోక్షాన్ని ఎలా పొందాలో, శాస్త్రం ఒక క్రమపద్ధతిలో, తర్కసహితంగా బోధిస్తుంది.

ముందు ఈ సంసారచక్రంలో పడి ఎందుకు తిరుగుతున్నామో, వివరిస్తుంది. దానికి మనం చేసుకున్న కర్మలే కారణమని చూశాము. మనం చేసుకున్న కర్మలే మనకు దృష్ట, అదృష్ట ఫలాలను ఇస్తాయనీ చూశాము. కర్మలు ఎందుకు చేస్తున్నాము? కామం లేదా కోరిక వల్ల చేస్తున్నాము. జీవితంలో ఏదో తక్కువైందనే భావనవల్ల వాటిని కోరుతాము. ఒక వస్తువును పొందితేనో, ఒక సంఘటన జరిగితేనో, ఒక బంధం ఉంటేనో నాకు ఆనందం

కలుగుతుంది అనుకుంటాము. శాస్త్రం ఈ కోరికని విశ్లేషించి, దీన్ని పూర్ణత్వం అని నిర్వచించింది.

**పూర్ణత్వం** – ఈ పూర్ణత్వాన్ని పొందటం ఎలా? అది సరిగ్గా తెలియకే మనం బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తున్నాము. లౌకిక విజయాలు పూర్ణత్వాన్ని ఇస్తాయని పొరపాటు పడుతున్నాము. అందువల్ల ఆస్తి, అంతస్తు, హొదా, పేరు ప్రతిష్ఠలు, బంధుబలగం, కుటుంబసభ్యులు – వీటిలో పూర్ణత్వాన్ని వెతుక్కుంటాము. వాటిలో పొందకపోతే, భగవంతుని వైపు తిరుగుతాము. ప్రార్థనలు, యజ్ఞాలు, తీర్థయాత్రలు, ధ్యానం, జపం చేస్తాము. కానీ అప్పుడూ పూర్ణత్వం కలగదు.

పూర్ణత్వం ఈ కర్మలు చేస్తే కలుగుతుందని ఏవో నాలుగు కర్మలను నిర్దేశించుకుంటాము. కాని ఆ నాలుగు కర్మలు చేస్తే, పూర్ణత్వం కలుగకపోగా, మరో వంద కోరికలు చోటు చేసుకుంటాయి. ఈ కోరికలను **కామం** అంటుంది శాస్త్రం. స్వామీజీ అంటారు, 'ఈ కామ, ఇంగ్లీషులో వాడే కామా లాగానే ఉంటుంది, కామా అంటే ఫుల్‌స్టాప్ లేనిది. అలాగే మన కామాలకు (కోరికలకు) కూడా ఫుల్‌స్టాప్ లేదు.'

ఎందుకలా కామాలు లేకుండా కామాల వెంట పరుగులు తీస్తున్నాము మనము? వేదాంతం దానికి కారణం ఒక్కటే అంటుంది. 'మీకు పూర్ణత్వం అంటే ఏమిటో అర్థం తెలియక అలా పరుగులు తీస్తున్నారు.' అజ్ఞానంవల్ల పొరపాటు జరుగుతుంది. పూర్ణత్వం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే సంఘటన అనుకోవటం పొరపాటు. ప్రకృతిసూత్రం తెలియకపోవటం అజ్ఞానం.

ఒక కాలంలో వచ్చింది, ఇంకొక కాలంలో పోతుంది. రాకపోకలు ఉన్నదేదీ శాశ్వతం కాదు. అలా ఒక కాలంలో వచ్చి, వెళ్ళకుండా శాశ్వతంగా నిలిచిపోయిన వస్తువు కాని, సంఘటన కాని, శరీరం కాని ఏదైనా ఉంటే చూపించండి అని సవాలు చేస్తున్నారు స్వామీజీ. రాకపోకలు ఉన్నవాటికి కాలపరిమితి ఉంటుంది.

**శాశ్వతత్త్వం** – అంతేకాదు, రాకపోకలు ఉన్నవాటికి దేశపరిమితి కూడా ఉంటుంది. ఇక్కడ ఉన్న వస్తువును పక్కగ్రామంలో చూడలేము; పక్కగ్రామం దాకా ఎందుకు, పక్క ఇంటిలో చూడలేము, పక్క ఇంటిలో ఎందుకు, పక్క గదిలో చూడలేము. అంటే దానికి దేశపరిమితి ఉంది. అందువల్ల అన్ని వస్తువులూ, మనుష్యులూ, అన్ని సంఘటనలూ దేశ, కాల పరిమితులకు లోబడివుంటాయి.

అందువల్ల పూర్ణమైనది, శాశ్వతమైనది కావాలంటే, దానికి దేశపరిమితి, కాలపరిమితి ఉండకూడదు. అంటే మోక్షం దేశకాలాతీతమై ఉండాలి. దాన్ని ఇప్పుడే, ఇక్కడే అనుభవించ గలిగివుండాలి. శాస్త్రం, మోక్షం లేదా ఆనందం మీ స్వరూపమనీ, అది మీకు దూరంగా లేదనీ అంటుంటే, మాకెందుకు ఆ ఆనందం లేదా పూర్ణత్వం అనుభవంలోకి రావటం

లేదు? దానికి శాస్త్రం చెప్పే జవాబు ఒకటే. దానికి మీ అజ్ఞానమే కారణం అంటుంది. మీ గురించి మీకు అంతా తెలుసునుకునే అపోహలో ఉన్నారు. 'నేనెవరు?' ప్రశ్నను వేసుకోవటం లేదు. అందువల్ల అపూర్ణత్వం కాదు మీ సంసారకారణం, అపూర్ణత్వమనే పొరపాటుకి దారితీసిన మీ అజ్ఞానమే మీ సంసారానికి కారణం.

ఆత్మ అజ్ఞానం కారణం అని తెలిసింది. ఆ అజ్ఞానాన్ని పారద్రోలటం ఎలా? ఫిజిక్స్ అజ్ఞానం పోవాలంటే ఎలా ఫిజిక్స్ జ్ఞానం పొందాలో, అలా ఆత్మ అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గం. దీన్నే ఆత్మవిద్య అంటారు. మీరు ఏదైనా పూజ చేస్తేనో, లేకపోతే ఫిజిక్స్ మాష్టారు నామజపం చేస్తేనో, లేదా ఫిజిక్స్ డిపార్టుమెంటు చుట్టూ ప్రదక్షిణ చేస్తేనో ఫిజిక్స్ జ్ఞానం పొందగలరా? లేదే! అలాగే ఏదైనా సహస్రనామం చదివితేనో, లేకపోతే గీతా నామజపం చేస్తేనో, వేదాలకు పూజ చేస్తేనో ఆత్మజ్ఞానం పొందగలరా? మనం వీటినేమీ కించపరచటం లేదు, వాటివల్ల కలిగే ఫలం వాటికి ఉంటుంది కాని, వాటివల్ల ఆత్మజ్ఞానం కలగదు. ఇది అర్థం చేసుకోవాలి.

ఆత్మజ్ఞానం శాస్త్రాధ్యయనం చేస్తేనే కలుగుతుంది. అది కూడా ఒక క్రమపద్ధతిలో చేయాలి. శాస్త్రాన్ని శ్రవణం చేయాలి. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువువద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఆ గురువు తన గురువువద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేసివుండాలి.

మీకు జ్ఞాన ఇచ్ఛ, శాస్త్ర ఇచ్ఛ, గురు ఇచ్ఛ తీవ్రంగా ఉంటే, గురువే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాడని కృష్ణపరమాత్మ అంటాడు. పరమాత్మ దగ్గర అనేక గురువులు ఉన్నారు, వారిలో ఎవరినైనా పరమాత్మ పంపుతాడు, లేకపోతే బోధ చేయటానికి తనే స్వయంగా దిగివస్తాడు. అర్జునునికి స్వయంగా కృష్ణపరమాత్మే బోధ చేయటమే దానికి నిదర్శనం.

## 20. ఆత్మజ్ఞానం సాధ్యం అయితే, ఏది సాధన?

ఆత్మ అజ్ఞానమే అపూర్ణత్వం అనే పొరపాటుకి దారి తీస్తున్నదనీ, ఆ పొరపాటే సంసారకారణం అనీ, సంసారం తొలగి మోక్షం పొందాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒక్కటే మార్గమనీ చూశాము. కాని ఈ ఆత్మజ్ఞానాన్ని తేలికగా పొందకుండా మనలో ఉన్న మూడు మలినాలు అడ్డుపడుతున్నాయి. స్థూలమైన మలినాన్ని పోగొట్టటానికి స్థూలమైన పద్ధతిని వాడితే, సూక్ష్మాతి సూక్ష్మమైన మలినాన్ని పోగొట్టటానికి సూక్ష్మాతి సూక్ష్మమైన పద్ధతిని వాడాలి.

మనలో మలినం మూడు స్థాయిల్లో ఉంది. అవి మలం, విక్షేపం, ఆవరణ.

**మలం** – మలం అతి స్థూలస్థాయిలో ఉంది. అది మనలో కలిగే రాగద్వేషాలు. మనస్సులో కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు చోటు చేసుకుంటాయి. వాటిని అరిషడ్వర్గాలు అంటారు. అవి వరుసగా కోరిక, కోపం, పీనాసితనం, భ్రమ, గర్వం, ఈర్ష్య.

**విక్షేపం** – అది సూక్ష్మస్థాయిలో ఉంది. అది నిలకడలేని, బాహ్యంగా పరుగులు తీసే, చలించే మనస్సు. మనస్సు నిలకడగా లేకపోవటంవల్ల, కుదురుగా, శ్రద్ధగా, ఏకాగ్రతతో ఆత్మజ్ఞానం పొందలేము.

**ఆవరణ** – అది సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఆవరణ అంటే అజ్ఞానం. మనం చైతన్యం అనే జ్ఞానం లేకపోవటంవల్ల, అహంకారంతో మమేకం చెందుతాము. మనం జీవితంలో కోరుకునే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో దొరుకుతాయనుకుని బాహ్యముఖంగా పరుగులు తీస్తాము; కాని అవి ఎండమావులలాగా అందకుండా పోతాయి.

ఈ మూడు మలినాలను పోగొట్టటానికి శాస్త్రం మూడు సాధనలను నిర్దేశించింది. ఒక్కొక్క సాధనను యోగం అంటుంది. యోగం అర్థం అక్షరాలా చూస్తే సాధకుణ్ణి, అతని సాధ్యానికి చేర్చేది అని అర్థం. కర్మయోగం మలనివృత్తి చేస్తే, ఉపాసనయోగం విక్షేపనివృత్తి చేస్తే, జ్ఞానయోగం ఆవరణనివృత్తి చేస్తుంది.

ఈ మూడు యోగాలూ కొత్తగా ఏమీ తీసుకురావు, కాని మనలను మన స్వస్వరూపంతో కలుపుతాయి. కర్మయోగం ఆవరణాన్ని తొలగించలేదు; జ్ఞానయోగం మలాన్ని తొలగించలేదు. ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ రావాలి. అవి వాడే క్రమం కూడా ముఖ్యం. జ్ఞానయోగంతో మొదలుపెట్టి, కర్మయోగంతో ముగించటం సాధ్యం కాదు. కర్మయోగంతో మొదలుపెట్టి, ఉపాసనాయోగానికి వచ్చి, జ్ఞానయోగానికి రావాలి.

**కర్మయోగం** – కర్మయోగంలో రెండు పదాలున్నాయి. కర్మ, యోగం. కర్మ అంటే ఇక్కడ అర్థం – సరియైన కర్మ చేయటం; యోగం అంటే సరియైన దృక్పథం ఉండటం. కామక్రోధాలను, లోభమోహాలను, మదమాత్సర్యాలను తగ్గించటానికి తోడ్పడే ఏ కర్మ అయినా కూడా సరియైన కర్మే. ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేయాలి; ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించాలి. ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించగలిగితే, ఎటువంటి ఫలం వచ్చినా, అది మనకు ఎంత దుఃఖాన్ని, బాధను కలిగించినా చిరునవ్వుతో స్వీకరించ గలుగుతాము. ఆ విధంగా కర్మయోగం రాగద్వేషాలను పారద్రోలి, చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. అంటే మలనివృత్తి చేస్తుంది.

**ఉపాసనయోగం** – బాహ్యముఖంగా పరుగులు తీసే మనస్సును లోపలికి లాగి, అంతర్ముఖంగా చేస్తుంది. అన్నిరకాల ధ్యానాలూ మానసిక తపస్సు క్రిందికి వస్తాయి. ధ్యానం చేయటంవల్ల బాహ్యంగా పరుగులు తీసే మనస్సును అంతర్ముఖం చేయగలుగుతాము, చలించే మనస్సును

మనం చేసే ఉపాసన ద్వారా దానిమీద నిలపగలుగుతాము. అలాగే నిలకడలేని మనస్సు ధ్యానవస్తువుమీద ఏకాగ్రత చూపటం నేర్చుకుంటుంది. అంటే ఉపాసన, చిత్తఏకాగ్రతను కలుగజేస్తుంది. అంటే విక్షేపనివృత్తి చేస్తుంది.

**జ్ఞానయోగం** – జ్ఞానయోగం అంటే జ్ఞానసముపార్జనకు వాడే పద్ధతి. జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానయోగం. అది అత్యుత్తమ పురుషార్థమైన మోక్షాన్ని పొందటానికి ఉపయోగపడుతుంది. మీరు కోరుకునే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో లేవు, మీలోనే దొరుకుతాయని శాస్త్రం నేర్పిస్తుంది. అంటే మీరే పూర్ణపురుషులు, ఆనందస్వరూపులు అంటుంది. ఆ విధంగా శాస్త్రం మీ గురించి మీకున్న అజ్ఞానాన్ని పోగొడుతుంది. అంటే ఆవరణనివృత్తి చేస్తుంది.

ముందే చూసినట్టుగా ఒక సాధకుడు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రావాలి. అవి వాడే క్రమం కూడా ముఖ్యం. ఒక సాధకుని ప్రయాణం ఇలా సాగాలి.

కర్మయోగం → ఉపాసనయోగం → జ్ఞానయోగం → మోక్షం

కృష్ణపరమాత్మ ఈ ఆత్మవిద్యను తొమ్మిదవ అధ్యాయంలో రాజవిద్యా రాజగుహ్యం అన్నాడు.

**రాజవిద్య** – ఆత్మవిద్య అన్ని జ్ఞానాలలోకి తలమానికం అయినది. దీన్నే ముండకోపనిషత్తులో పరావిద్య అంటారు. దీన్ని రాజవిద్య అని ఎందుకు అన్నాడు కృష్ణపరమాత్మ?

1. ఇది అత్యున్నతమైన నిర్గుణబ్రహ్మ గురించి చెబుతుంది. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని బోధిస్తుంది.

2. ఇది ఒక్కటే మోక్షాన్ని ఇస్తుంది. అదికూడా శరీరపరంగా, మనస్సుపరంగా, బుద్ధిపరంగా.

3. ఏ ఒక్క విద్య గురించి తెలుసుకుంటే, ఇంక ఈ జగత్తులో తెలుసుకోవాల్సింది ఏదీ మిగలదో, అది ఆత్మవిద్య అని వస్తుంది ముండకోపనిషత్‌లో.

ఈ కారణాలవల్ల ఇది రాజవిద్య అయింది.

**రాజగుహ్యమ్** – ఆత్మవిద్య అత్యంత గొప్ప రహస్యవిద్య. ఈ బోధ అందరికీ అందుబాటులో ఉండదు. పైగా ఇది ఒక అద్భుతం. చాలామంది అనేక సంవత్సరాలు నేర్చుకున్నా కూడా అర్థం చేసుకోకుండా ఉండగలరు. ఇంకా గొప్ప ఆశ్చర్యం – విన్నాక కూడా రహస్యం రహస్యంగానే ఉండిపోతుంది. అంతకన్నా గొప్ప రహస్యం ఏముంటుంది? అంటే ఈ విద్య విద్యల్లోకెల్ల రాజు; రహస్యాల్లోకెల్ల రహస్యం. అందువల్ల రాజవిద్య, రాజగుహ్యం అయింది.

ఇంత గొప్ప విద్యను శ్రద్ధలేనివారికి నేర్పిస్తే అది బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. శ్రద్ధా, తపన ఉన్నవారికే నేర్పించాలి. లేకపోతే అది అరణ్యరోదనం అవుతుంది. అంతేకాదు, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. తప్పుగా అర్థం చేసుకుంటే ప్రతికూలఫలం కలుగుతుంది.

ఈ రాజవిద్యా, రాజగుహ్యం అయిన ఆత్మజ్ఞానాన్ని పొందటానికి శిష్యునికి అర్హత ఉండాలి. దాన్ని అధికారిత్వం అంటారు. సాధన చతుష్టయ సంపత్తి ఉన్న వ్యక్తినే అధికారి అంటారు. ఆత్మజ్ఞానం అనే సాధ్యాన్ని పొందటానికి చేయాల్సిన మొదటి సాధన అధికారిత్వం పొందటం. ఆ అధికారిత్వం ఏమిటో రాబోయే వాటిల్లో చూద్దాము.

## 21. సాధన చతుష్టయ సంపత్తి

ఏ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్నాకూడా, మనకి కొంత అర్హత ఉండాలి. ఆ సూత్రం వేదాంతశాస్త్రం లేదా ఆత్మవిచారణకు కూడా వర్తిస్తుంది. ఈ అర్హతని సాధన చతుష్టయ సంపత్తి అంటారు. సాధన అంటే అర్హత. చతుష్టయం అంటే నాలుగు. అందువల్ల సాధన చతుష్టయ సంపత్తి అంటే అర్హత లేదా అధికారిత్వం పొందటానికి నాలుగు సంపదలను పెంపొందించుకోవటం.

నిజానికి వేదాంతానికి రాకముందే, శాస్త్రం మతపరమైన, నైతికమైన జీవనవిధానాన్ని నిర్దేశించింది. అటువంటి జీవనవిధానాన్ని గడపటంవల్ల దైవకృప కోరటానికి, తద్వారా ముముక్షుత్వం పెంపొందించుకోవటానికి వీలవుతుంది. అంతేకాదు, విచ్చలవిడిగా జీవించకుండా వైదిక జీవనవిధానాన్ని గడుపుతారు. వైదిక జీవనవిధానంలో అడుగడుగునా దైవంతో మీ అనుబంధాన్ని ఏర్పరచుకుని, దాన్ని దృఢపరుచుకుంటారు.

కృష్ణపరమాత్మ భగవద్గీతలో ఇరవై విలువలను పేర్కొన్నాడు. అవి పాటించిన వ్యక్తి మనస్సులోనే ఆత్మవిద్య కలుగుతుందన్నాడు కూడా. ఎందుకు? వాటిల్లో ఒక విలువగా ఆత్మవిద్య పొందాలనే తపనను కూడా పేర్కొన్నాడు.

ముందే చూసినట్టుగా ఆత్మవిద్యను పొందాలంటే శిష్యునికి అర్హత ఉండాలి. దాన్నే సాధన చతుష్టయ సంపత్తి అంటారు. సాధన చతుష్టయ సంపత్తిలో నాలుగు సాధనలు వస్తాయి. అవి – వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్క సంపత్తి. వీటినే ఇంగ్లీషులో వరుసగా – డిస్క్రిమినేషన్, డిస్పాషన్, డిజైర్ ఫర్ మోక్ష, డిసిప్లిన్ అంటారు. స్వామీజీ వీటిని 'ఫోర్ డి స్' అంటారు.

వీటిలో ఏ ఒకటో పాటిస్తే చాలదు. నాలుగూ పాటించి తీరాలి. అవి ఉంటేనే జ్ఞానయోగ్యతాప్రాప్తి కలిగి, తర్వాత జ్ఞానం కలుగుతుంది. సన్న్యాసం కూడా స్వీకరించి తీరాలనే నియమం లేదు; కాని ఈ నాలుగు సాధనలూ పెంపొందించుకుని తీరాలి. వాటిని వివరంగా చూద్దాము.

1. **వివేకం** – వివేకం అంటే నిత్యానిత్యవస్తువివేకం అని నిర్వచించింది తత్త్వబోధ. ఏది అనిత్యం లేదా అశాశ్వతం, ఏది నిత్యం లేదా శాశ్వతం అనేది తెలుసుకోవాలి. ఆ తెలుసుకోవటమే వివేకం.

సృష్టిలో కాలానికీ, ప్రదేశానికీ అతీతంగా ఏదీలేదు. ప్రతిదీ కాలం కబంధహస్తాల్లో చిక్కాల్సిందే. అంటే ప్రతిదానికీ పుట్టుక, ఆ తరువాత మరణం తప్పనిసరి. పుట్టుట గిట్టుట కొరకే అంటారు పెద్దలు. సృష్టిలో వస్తువులూ, మనుష్యులూ, పరిస్థితులూ, బంధుత్వాలూ – ప్రతిదీ నశించటమన్నది దాని స్వతః సిద్ధలక్షణం.

ప్రపంచంలో ఏదీ శాశ్వతం కానప్పుడు, అశాశ్వతమైన దాన్నుంచి శాశ్వతమైన రక్షణ కోరుకుంటే, మన ఆశ అడియాసే అవుతుంది. కాని అది తెలియక వాటి వెంట ఎంతగా పరుగులు పెడుతున్నామంటే, మనం సరియైన దిశలో వెళుతున్నామో లేదో ఆగి, ఆలోచించే తీరిక కూడా లేదు. అనిత్యవస్తువునుంచి నిత్యవస్తువు వైపుకు దృష్టి మరల్చాలి. అంటే జగత్తునుంచి బ్రహ్మవైపుకు తిరగాలి. ఇదీ నిత్యానిత్యవస్తువివేకం.

2. **వైరాగ్యం** – రెండో అర్హత వైరాగ్యం. వైరాగ్యం అంటే కోరిక లేకపోవటం. కోరిక అంటే భద్రతకోసం, రక్షణకోసం ప్రపంచాన్ని పట్టుకు ప్రాకులాడటం. నిత్యానిత్యవస్తువివేకం పెంపొందించుకుంటే, దాని సహజ పరిణామంగా వైరాగ్యం అదే పెరుగుతుంది. మీరు ఏవైతే భద్రత, రక్షణ ఇస్తాయనుకుని వాటి వెంట పరుగులు తీశారో, అవి నిత్యవస్తువులు కావని, అవి శాశ్వతమైన భద్రత, రక్షణ ఇవ్వలేవని తెలుసుకుంటే, వాటినుంచి మీరే రక్షణ కోరరు.

వైరాగ్యం పెంచుకోవటం అంటే ప్రపంచంనుంచి పారిపొమ్మని కాదు అర్థం; దాన్ని పూర్తిగా కాలదన్నమనీ కాదు అర్థం. మనకు సరదాలూ, ధనమూ కావాలంటే ప్రపంచం ఛానెల్ కావాలి. భద్రతా, రక్షణా కావాలంటే భగవంతుని ఛానెల్ కావాలి. ఇదీ వైరాగ్యం.

3. **ముముక్షుత్వం** – మూడో అర్హత ముముక్షుత్వం. నిత్యానిత్యవస్తువివేకం, అనిత్యవస్తువుమీద వైరాగ్యాన్ని పెంచితే, నిత్యవస్తువుమీద ముముక్షుత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంమీద ఆధారపడితే సైకలాజికల్‌గా అనేక సమస్యలు. అందులో మొట్టమొదటిది అభద్రతా భావన. ఎందుకంటే మనం దేనిమీద ఆధారపడతామో, దాన్ని కోల్పోతామేమోననే భయం.

ఇక్కడ సమస్య అనిత్యవస్తువులో లేదు. అనిత్యవస్తువుని నిత్యవస్తువని భ్రమపడటంలో ఉంది. ఇలా తప్పుగా ఆశించటంవల్ల ఏర్పడిన దుఃఖాన్ని సంసారం అంటారు. ముముక్షుత్వం అంటే ఈ సంసారంనుంచి బయటపడాలనే తపన. దానికోసం నిత్యవస్తువుమీద తీవ్రతపన ఏర్పడుతుంది. ఇదీ ముముక్షుత్వం.

4. **శమాది షట్కసంపత్తి** – నాలుగో అర్హత శమాది షట్కసంపత్తి. షట్క అంటే ఆరు విధాలు. షట్కసంపత్తి ఆరు విధాల అంతర్గత నియంత్రణ. అవి శమం, దమం, ఉపరమం, తితిక్ష, శ్రద్ధ, సమాధానం. వీటిని వివరంగా తరువాత అంశంలో చూద్దాము.

## 22. శమాది షట్కసంపత్తి

ఆత్మజ్ఞానం అనే విశ్వవిద్యాలయంలో శిష్యులుగా అడుగుపెట్టాలంటే దానికి మనకు కావాలసిన అర్హత – సాధన చతుష్టయ సంపత్తి అని చూశాము. అది వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. శమాది షట్కసంపత్తి అంటే శమం, దమం, ఉపరమం, తితిక్ష, శ్రద్ధ, సమాధానం. వాటిని వివరంగా చూద్దాము.

ఎ) **శమం** – శమం అంటే మనోనిగ్రహం. మనోనిగ్రహం ఇంద్రియనిగ్రహంకన్నా కష్టతరమైనది. మీ కంటికి నచ్చని విషయం ఒకటి ఎదురుగా ఉంటే, మీరు కళ్ళు మూసుకోవచ్చు. కాని మనస్సు విషయంలో అలాకాదు. మీరెక్కడికి వెళ్ళినా మీ మనస్సు మీ వెన్నంటే వస్తుంది.

మనస్సును అదుపులో పెట్టటమంటే ఆలోచనలను అదుపులో పెట్టటం. ఆలోచనల సంఖ్యను, ఆలోచనల తీరును కూడా అదుపులో పెట్టాలి. ముందు సంఖ్యను తగ్గించుకుంటే, తీరుతెన్నులు గమనించటం తేలిక అవుతుంది. సంఖ్య ఎక్కువ ఉంటే నాణ్యత గమనించటం కష్టమవుతుంది.

మనోనిగ్రహం పాటిస్తే పది ఇంద్రియాలూ మీ అధీనంలో ఉంటాయి. ఒక్క నోరుని అదుపులో పెడితేనే తక్కిన ఇంద్రియాలు లొంగుతాయి. నోటిని కూడా అదుపులో పెట్టేది మనస్సు. దీన్ని శమం అంటారు.

బి) **దమం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం వేరు, ఇంద్రియాలను అణగద్రొక్కటం వేరు. అణగద్రొక్కటం ఎవరో బలవంతపెడితే జరుగుతుంది. ఇంద్రియనిగ్రహం మీ స్వయం నిర్ణయంతో జరుగుతుంది. మీ ఇష్టపూర్వకంగా మీరు కొన్ని వదులుకోవటానికి సిద్ధపడటం. ఇది వివేకంతో కూడిన, ఇచ్ఛాపూర్వకమైన నిగ్రహం; బలవంతంగా చేసేది కాదు.

ఇంద్రియాలు అదుపు తప్పితే అవి మీకు యజమాని అయి కూర్చుంటాయి. మీరు వాటికి బానిస అవుతారు. మీరు కాఫీకి బానిస కాకూడదు. మీకిష్టమైనప్పుడు త్రాగాలి. నాలిక పీకుతున్నదని త్రాగితే, మీరు నాలుకకు బానిస అయినట్టు అర్థం.

ఒక్క నోరుని అదుపులో పెడితేనే తక్కిన ఇంద్రియాలు లొంగుతాయి. నోరు అంటే తినే నోరు, మాట్లాడే నోరు కూడా. మీరు కాఫీకి బానిసవుతుంటే, వారం రోజులు కాఫీ త్రాగనని నియమం పెట్టుకోవాలి. అలా నియమం పెట్టుకున్నప్పుడు నోరు మిమ్మల్ని ఆడించకూడదు. దీన్ని దమం అంటారు.

సి) **ఉపరమం** – దీన్నే ఉపరతి అనికూడా అంటారు. శమం, దమం పాటిస్తే ఉపరమం సహజంగా అబ్బుతుంది. బాహ్యముఖంగా పరుగులు తీస్తున్న ఇంద్రియాలను, మనస్సును

ప్రశాంతంగా ఉంచుకోవటం. తల్లి పిల్లలను ప్రమాదకరమైన అగ్ని దగ్గరకు వెళ్ళనీయకుండా కాపాడినట్టుగా, మనస్సు, ఇంద్రియాలను బాహ్యంగా పరుగులు తీయకుండా కాపాడాలి. వాటిని విశ్రాంతిగా, ఒత్తిడి లేకుండా ఉండేలాగా సాధన చేయాలి. దాన్ని ఉపరమం అంటారు.

డి) **తితిక్ష** – తితిక్ష అంటే శాంతి లేదా సహనం. జీవితంలో ఏదొచ్చినా సహించగలిగే ఓర్పు. అలాగని అందని ద్రాక్షపళ్ళు పుల్లన అనే సూత్రం ప్రకారం కాదు. జీవితమన్నాక ద్వంద్వాలు తప్పవు. కష్టసుఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు రెండింటినీ సమానంగా స్వీకరించే ఓర్పు. నాకే ఎందుకు వచ్చిందని వాపోకూడదు. అన్నింటిని ఎదుర్కొనే మానసిక ధైర్యం. ఇవి స్థితప్రజ్ఞుని లక్షణాలను పోలివుంటాయి. దీన్ని తితిక్ష అంటారు.

ఇ) **శ్రద్ధ** – శ్రద్ధ అంటే శాస్త్రంమీద, శాస్త్రాన్ని అధ్యయనం చేయటానికి తోడ్పడే గురువుమీద నమ్మకం కలిగివుండటం. నమ్మకం అంటే గ్రుడ్డినమ్మకం కాదు. అసలు శ్రద్ధ లేకుండానూ ఉండకూడదు, గుడ్డినమ్మకమూ పెట్టుకోకూడదు. శాస్త్రం చెప్పినది మీకు నమ్మశక్యంగా లేకపోయినా, అది సరిగ్గా అర్థం కాకపోయినా శాస్త్రాన్ని త్రోసిపుచ్చకూడదు. శ్రద్ధ అంటే శాస్త్రం చెప్పిన విషయం సరిగ్గా అర్థమయ్యేదాకా, శాస్త్రం చెప్పింది అంగీకరించటానికి సిద్ధపడే మనస్సు. ఒకవేళ అంగీకరించలేకపోతే, మళ్ళీ మళ్ళీ వినాలి; అంతేకాని నాకే అన్నీ తెలుసనే జ్ఞానమదం ఉండకూడదు. శాస్త్ర అధ్యయనానికి ఈ జ్ఞానమదం పెద్ద అడ్డంకి. ఆ విధంగా శాస్త్రంమీద, గురువుమీద నమ్మకం ఉండాలి. దీన్ని శ్రద్ధ అంటారు.

ఎఫ్) **సమాధానం** – సమాధానం అంటే ఏకాగ్రత. మనం నిర్ణయించుకున్న లక్ష్యంమీద ఏకాగ్రత చూపటం. దానికి ఒక గంటసేపు ప్రసంగం వినాలంటే, మనస్సు ఆ గంటా చలించకుండా ఉండాలి. పతంజలి యోగసూత్రాల్లో సమాధి అని వస్తుంది. ఆ సమాధినే ఇక్కడ సమాధానం అంటుంది తత్త్వబోధ. దీన్ని సమాధానం అంటారు.

ఈ ఆరింటిని కలిపి శమాదిషట్కసంపత్తి అంటారు. ఇది సాధన చతుష్టయ సంపత్తిలో నాలుగవ అంశం. ఈ సాంకేతిక పదాలు అర్థమయినా, కాకపోయినా, ఒక విషయం అర్థం చేసుకుంటే చాలు. ఆత్మజ్ఞానం పొందాలంటే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఉండాలి. అప్పుడు అధికారి అవుతారు.

## 23. సృష్టి, స్థితి, లయకారకుడు పరమాత్మ

ఇంతవరకూ మోక్షం పొందాలంటే ఆత్మజ్ఞానం పొందటం ఒకటే మార్గమనీ, ఆత్మజ్ఞానం పొందాలంటే దానికి చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత ఉండాలనీ చూశాము. ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. మీరు మోక్షం పొందటానికి మీ ప్రయత్నమే కారణం అంటే, ఇందులో భగవంతుని పాత్ర ఏమీ లేదా? శాస్త్రం ఈ విషయంలో ఏమంటుందో చూద్దాము.

శాస్త్రం భగవంతుణ్ణి సృష్టి, స్థితి, లయకారకుడిగా అభివర్ణిస్తుంది.

**సృష్టి** – నిజానికి సృష్టి అనే పదం తప్పు అంటుంది శాస్త్రం. సైన్సు కూడా పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అంటుంది. శాస్త్రం కూడా దేన్నీ కొత్తగా సృష్టించలేము అంటుంది. జగత్తు, జీవులు అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి వస్తారని, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతారని చెబుతుంది. అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి రావటాన్నే సృష్టి అంటున్నాము.

దీనికి గొప్ప ఉదాహరణ మన నిద్ర. మనం సుషుప్తిలోకి వెళ్ళినప్పుడు జాగ్రత్ పురుషుడు, జాగ్రత్ ప్రపంచం అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. మళ్ళీ మర్నాడు నిద్ర లేచినప్పుడు రెండూ వ్యక్తంలోకి వస్తాయి. అది వ్యష్టిపరంగా సృష్టి, లయ.

అదే విధంగా, ఈ జగత్తు వ్యక్తంలోకి రావటం సృష్టి అనీ, అవ్యక్తంలోకి వెళ్ళటం ప్రళయం అనీ అంటారు. భగవంతుడు కొత్తగా సృష్టి చేయటం లేదు, ప్రళయం కలిగించటం లేదు అంటే ఇందులో భగవంతుని పాత్ర ఏం ఉందనే సందేహం రావచ్చు. జగత్తు, జగత్తులోని జీవులు యాదృచ్ఛికంగా రావు. ఈ సృష్టి జరగాలంటే, దానికి కర్మసిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని రావాలి.

ఒక కుటుంబంలో కొంతమంది ఉన్నారంటే, వారి ప్రారబ్ధకర్మలు వారిని ఒకచోట చేరుస్తాయి. ఒక వ్యక్తి అంగవిహీనంగా పుట్టే దురదృష్టం ఉంటే, అతన్ని సాకాల్సిన ప్రారబ్ధకర్మ అతని తల్లిదండ్రులకి రాసిపెట్టి ఉంటుంది. వారిని ఒకచోట చేర్చాలి. అలా ఒకే సంఘటనలో అనేకమంది పుణ్య, పాపాలు క్షయమయ్యేలాగా ఏర్పాటు చేయాలంటే దానికి ఎంత జ్ఞానం ఉండాలో ఆలోచించండి! అందువల్లనే భగవంతుణ్ణి సర్వజ్ఞుడు అంటారు. భగవంతుడు సమష్టి ప్రారబ్ధకర్మలను దృష్టిలో పెట్టుకుని, సృష్టికారకుడు, లయకారకుడు అవుతాడు.

**లయ** – వ్యష్టిపరంగా మన ప్రారబ్ధకర్మ అయిపోతే ఎలా మన జీవితం ముగిసిపోతుందో, అలా సమష్టిపరంగా, సమష్టి ప్రారబ్ధకర్మ ముగిసినప్పుడు ఈ జగత్తుయొక్క లయ జరుగుతుంది.

**స్థితి** – భగవంతుడు సృష్టికర్త, లయకర్తే కాదు, స్థితికర్త కూడా. భగవంతుడు, ఈ జగత్తును నాలుగు విధాలుగా రక్షిస్తాడు.

ఎ) **ప్రకృతి సూత్రాలు** – అనేక ప్రకృతి సూత్రాల ద్వారా జగత్తును రక్షిస్తాడు. జీవితంలో ఇన్ని సుఖాలు పొందగలుగుతున్నామంటే, ఇన్ని ఆధునిక పరికరాలను వినియోగించ గలుగుతున్నామంటే, దానికి ప్రకృతి సూత్రాలే కారణం.

బి) **శాస్త్రం** – శాస్త్రంలోని కర్మకాండలో అనేక పూజలు, జపాలు, యజ్ఞాలు ఇవ్వబడ్డాయి. మనకు ఏ సమస్యలున్నా వాటికి తగ్గ పూజలు అందులో ఉంటాయి. వాటి ద్వారా మన జీవితాన్ని మెరుగుపరచుకోవచ్చు.

సి) **భగవంతుని లీలలు** – భగవంతుణ్ణి ఆర్తత్రాణపరాయణుడు అంటారు. భక్తుడు ఆర్తితో గొంతెత్తి పిలిస్తే, భగవంతుడు స్వయంగా దిగివచ్చి, భక్తులను ఆదుకున్న కథలెన్నో మన పురాణాల్లో వింటాము. ప్రహ్లాదచరిత్ర, ధృవచరిత్ర, ద్రౌపది ఉదంతం, గజేంద్రమోక్షం భగవంతుని లీలలకు నిదర్శనాలు.

డి) **దృక్పథంలో మార్పు** – దీన్ని ఆధ్యాత్మిక సాధన అంటారు. దానివల్ల బాహ్యంగా పరిస్థితి మెరుగుపడదు కాని, ఆ సమస్యను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం వస్తుంది. దీనికి నిదర్శనం కౌసల్య ఉదంతం. శ్రీరాముడు అర్ధాంతరంగా రాజ్యాన్ని విడిచిపెట్టి, లక్ష్మణుడు, సీతతో అడవులకు వెళ్ళాల్సివచ్చినప్పుడు, కౌసల్య కుప్పకూలిపోతుంది. అదే పరిస్థితికి, సుమిత్ర నిబ్బరంగా ఉంటుంది. సుమిత్ర తను నిబ్బరంగా ఉండటమే కాక కౌసల్యకు బోధ కూడా చేస్తుంది.

ఈ బోధవల్ల కౌసల్య దుఃఖం పోయింది. ఆవిడకు సమస్య తీరలేదు కాని అక్కడ సమస్య లేదని అర్థమయింది. ఈ మార్పు ఆవిడ భావనలో మార్పు రావటంవల్ల జరిగింది.

ఆ విధంగా భగవంతుడు ప్రకృతి సూత్రాల ద్వారా, శాస్త్రం ద్వారా, తన లీలల ద్వారా, దృక్పథంలో మార్పు తీసుకురావటం ద్వారా తన శిష్యులను రక్షించి, వారికి చిత్తశుద్ధిని కలుగజేస్తాడు. ఈ నాలుగు పద్ధతుల్లో మొదటి మూడూ తాత్కాలికమనీ, జరిగితీరుతాయన్న నమ్మకం లేదనీ, నాలుగవ పద్ధతి మాత్రం శాశ్వత పరిష్కారమనీ, నమ్మకమైన పరిష్కారమనీ, జరిగితీరుతుందనీ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

వీటన్నిటి సారాంశం, ఒక్కముక్కలో చెప్పాలంటే, దైవకృప లేనిదే చిత్తశుద్ధి పొందటం అసాధ్యం; చిత్తశుద్ధి లేనిదే ఆత్మవిద్య పొందటం ఇంకా అసాధ్యం.

## 24. పురుషార్థాలు

మనుష్యులకూ, తక్కిన జీవరాశులకూ కొన్ని అంశాలలో పోలికలున్నాయి. పశువులు కూడా ఆహారం కోరుతాయి. అలాగే నిద్ర, భయం, వంశాభివృద్ధి వాటికి కూడా ఉంటుంది. కాని మనిషిని మాత్రమే **బుద్ధిజీవి** అంటారు. అతను తన బుద్ధివల్లనే తక్కిన వాటికన్నా ఉన్నతుడయ్యాడు. ఆ బుద్ధివల్లనే, తన ఫ్రీవిల్‌ను ఉపయోగించి, లక్ష్యాలను ఎన్నుకోగలడు.

జంతువులకు ఆహారం, నిద్ర, రక్షణ ముందే వాటిలో ఏర్పరచి పంపిస్తాడు భగవంతుడు. అందువల్ల వాటికి ఏమీ లక్ష్యాలుండవు. డాగ్‌షోలో పాల్గొని మూడవ బహుమతి వచ్చిన కుక్కను నీ లక్ష్యమేమిటని మీరు అడిగితే, 'వచ్చే డాగ్‌షోలో మొదటి బహుమతిని పొందాలి,' అని చెప్పదు అది. ఆ లక్ష్యం దాని యజమానికి ఉంటుంది.

కొంతమంది ఈ ఫ్రీవిల్‌ను నమ్మరు. ఫ్రీవిల్‌ను పురుషబుద్ధి అంటారు. వారి వాదన – మన తలరాతను బ్రహ్మ ముందే రాసిపెట్టి, మనను భూమిమీదకు వదిలాడు. మనం భగవంతుని చేతిలో కీలుబొమ్మలం మాత్రమే. అలా బుద్ధిని వాడకపోతే, వారు పశువుతో సమానం. ప్రస్తుతం మనకు అటువంటి వారితో సంబంధం లేదు. కాని ఫ్రీవిల్‌ను నమ్మేవారిని, వారి ఫ్రీవిల్‌తో జీవితలక్ష్యాలను ఏర్పరచుకోగలిగేవారి గురించి చూస్తాము ఇక్కడ. మనుష్యులకున్న లక్ష్యాలు అనేకం. వాటిని చెప్పుకుంటూపోతే, అనంతంగా సాగిపోతుంది పట్టిక. శాస్త్రం వాటిని చతుర్విధపురుషార్థాలు అంటుంది. పురుషః అంటే మనిషి; అర్థః అంటే ఈ సందర్భంలో లక్ష్యాలు; చతుర్విధ అంటే నాలుగు. మొత్తం కలిపితే మనిషికున్న లక్ష్యాలను నాలుగుగా విభజించవచ్చు. వాటిని ధర్మార్థకామమోక్షాలు అంటారు. వాటిని వివరంగా చూద్దాము.

1. **అర్థం** – ముందు అర్థ పురుషార్థాన్ని చూద్దాము. అర్థం పదానికి అనేక అర్థాలున్నాయి. ఇక్కడ భద్రత అని అర్థం. మీ భద్రతకోసం మీరు సేకరించేదంతా అర్థలక్ష్యం కిందికి వస్తుంది. భౌతికమైన ఉనికికోసం చేసేదేమైనా అర్థం కిందికి వస్తుంది. అవి తిండి, బట్ట, గూడు, ఆరోగ్యం. ముందుగా తక్షణ భద్రతకోసం పాటుపడి, తర్వాత భవిష్యత్ భద్రతకోసం పాటుపడతారు. అంటే వృద్ధాప్యంకోసం జాగ్రత్త పడతారు.

వృద్ధాప్యంలో అండ పిల్లలు, మనం తీసుకునే జీవితభీమాలు. మన భద్రతకోసం ఇల్లు కొంటాము. కాని ఇంటి భద్రత గురించిన భయం కొద్దీ మనం భద్రతా సిబ్బందిని పెట్టుకుంటాము. వారి భద్రతకోసం కుక్కను పెంచుతాము. అంటే భద్రత, భద్రతకోసం భద్రత, భద్రతకోసం భద్రతకోసం భద్రత. ఈ కథ ఇలా అనంతంగా సాగిపోతుంది.

2. **కామం** – తరువాత లక్ష్యం కామపురుషార్థం. ఒకసారి భద్రత ఏర్పరచుకున్నాక, మనం కామపురుషార్థం గురించి ఆలోచిస్తాము. కామం అంటే అన్నిరకాల సౌఖ్యాలు. ఇది భద్రత కాదు, సరదాకి చెందినది. ఈ సౌఖ్యాలు ఉంటే జీవితం అద్భుతంగా ఉంటుంది. కేవలం మనుగడ సాగటానికి సౌఖ్యాలు కాని, సరదాలు కాని అవసరం లేదు. కాని మనకు ఆనందంగా, హాయిగా ఉండాలని ఉంటుంది. పాటలు, టీవీ కార్యక్రమాలు, సినిమాలు అన్నీ ఆనందించేశాక, విదేశాలకు వెళ్ళాలనుకుంటాము. ఈ పురుషార్థానికి అంతూపొంతూ ఉండదు.

3. **ధర్మం** – తరువాత లక్ష్యం, ధర్మపురుషార్థం. దీన్ని కనబడని ఐశ్వర్యంగా వర్ణించవచ్చు. దీన్నే అదృష్టం, పుణ్యం అని కూడా అంటారు. మనం పూర్వజన్మలో నడిచిన ధర్మమార్గాన్ని అనుసరించే ఈ జన్మ ఏర్పడుతుంది. అందువల్ల ఈ జన్మలో మనం పుణ్యకర్మలు చేయటం వల్ల మన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చు. మనం ధర్మమార్గంలో అర్థకామాలను పొందటానికి ప్రయత్నిస్తే, మన భవిష్యత్తు నిశ్చింతగా ఉంటుంది. అందువల్ల ధర్మాన్ని కూడా ఒక

పురుషార్థంగా నిర్ణయించింది శాస్త్రం. ఈ పురుషార్థం ఈ జన్మ, వచ్చే జన్మ బాగుండటానికి తోడ్పడుతుంది. అందువల్లనే అర్థకామధర్మాలను, ధర్మార్థకామాలంటారు.

ఈ మూడింటిలో ధర్మం సూక్ష్మమైనదీ, చాలా శక్తివంతమైనదీ కూడా. ఈ మూడు పురుషార్థాలనీ కలిపి ప్రేయస్సు అనీ, వాటిని సాధించే మార్గాలను ప్రేయోమార్గమనీ అంటారు. ప్రేయోమార్గం అంటే మనకు ప్రియమైన మార్గం.

4. **మోక్షం** – తరువాత లక్ష్యం, మోక్షపురుషార్థం. దీన్ని ముక్తి అని అంటారు. ఈ ముక్తి అనేది అంతర్గత స్వేచ్ఛ. బంధకత్వంనుంచి విముక్తి. ప్రేయస్సు లేదా ధర్మార్థకామాలనుంచి విముక్తి.

దేనికన్నా ఎలా బందీ అవుతాము? ఒక వస్తువు గాని, వ్యక్తిగాని మనను రెండు రకాలుగా బందీని చేయవచ్చు. మనం అమితంగా కోరే వస్తువు గాని, అమితంగా ప్రేమించే వ్యక్తిగాని దూరమైతే, ఆ ఎడబాటుని తట్టుకోలేక బాధపడతాము. ఒక విధమైన శూన్యతా భావన కలుగుతుంది. ఒంటరితనం ముప్పిరిగొంటుంది. ఒక వస్తువుగాని, ఒక వ్యక్తిగాని మన దగ్గర ఉండి మనను బాధించవచ్చు. వారు మనం కోరుకున్నట్టుగా లేకపోతేనో, చెప్పినట్టు వినకపోతేనో మనం బాధపడతాము. ఆ విధంగా కొందరు దూరమై బాధపెడితే, కొందరు దగ్గరగా ఉండి బాధపెడతారు. మోక్షం అంటే ధర్మార్థకామాలు ఉన్నా లేకపోయినా బాధపడకపోవటం.

మోక్షపురుషార్థాన్ని శ్రేయస్సు అనీ, దాన్ని పొందే మార్గాన్ని శ్రేయోమార్గమని అంటారు. ధర్మార్థకామాలు మనకు ప్రియమైనవి కాని అవి ఉన్నా, లేకపోయినా కూడా బాధిస్తాయి. అవి మనను సంసారంలో పడేసి బంధిస్తాయి. మోక్షం మనకు శ్రేయస్కరమైనది. అది సంసారబంధంనుంచి విముక్తినిస్తుంది. మనను వాటికి బానిసకాకుండా, స్వామిని చేస్తుంది. అంటే సమత్వభావన కలుగజేస్తుంది. సమత్వం అంటే వస్తువులు లేకపోయినా కృంగిపోనీయదు, ఉన్నా బాధపడనీయదు.

ఈ నాలుగింటినీ కలిపి చతుర్విధ పురుషార్థాలు అంటారు. తక్కిన మూడింటిని ఎన్నుకున్నా, ఎన్నుకోకపోయినా, మోక్షాన్ని ఎన్నుకుని తీరాలంటుంది శాస్త్రం.

## 25. ఆశ్రమవ్యవస్థ

మానవ లక్ష్యాలన్నింటిని కలిపి శాస్త్రం నాలుగు పురుషార్థాలుగా విభజించిందని చూశాము. అవి ధర్మార్థకామమోక్షాలు. ఏ లక్ష్యం అన్నా తీసుకోండి, అది ఈ నాలుగింటిలో ఏదో ఒకదాని కిందకు వస్తుంది. ఆ లక్షాలను ప్రేయోమార్గం, శ్రేయోమార్గం అంది. ఆ లక్ష్యాలను సాధించటానికి, శాస్త్రం జంటకవులయిన వర్ణాశ్రమ వ్యవస్థను సూచించింది. అంటే వర్ణవ్యవస్థ, ఆశ్రమవ్యవస్థ.

వర్ణవ్యవస్థ సాంఘిక వ్యవస్థను సూచిస్తుంది. మనిషి సంఘజీవి. సంఘం మన జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మన జీవితం ప్రశాంతంగా సాగటానికి మనకొక వ్యవస్థ ఉండాలి.

మనం వ్యక్తిగా ఎదగాలి. దీన్ని ఆశ్రమవ్యవస్థ అంటారు. ఈ రెండింటినీ మనం సమతుల్యం చేయగలిగితేనే మన జీవితం సాఫీగా సాగుతుంది. ఈ వర్ణాశ్రమవ్యవస్థ మనిషి, సంఘం కూడా లౌకికంగా, ఆధ్యాత్మికంగా ఎదగటానికి తోడ్పడుతుంది.

ఇప్పుడు ఒక ఆధ్యాత్మిక సాధకుడు పాటించాల్సిన నాలుగు ఆశ్రమ ధర్మాల గురించి చూద్దాము. ఆశ్రమం అన్న పదాన్ని సాధారణంగా జీవితంలో ఒక దశ కింద చెబుతారు. ఒక వైదిక జీవనంలో నాలుగు దశలుంటాయి. అవి బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థ ఆశ్రమం, వానప్రస్థ ఆశ్రమం, సన్న్యాస ఆశ్రమం.

ఆశ్రమం అంటే కావాలని, మనస్ఫూర్తిగా, ఒక నిర్దిష్టదిశ వైపు పెట్టే శ్రమ. ఇక్కడ శ్రమ ఆధ్యాత్మిక సాధన. ఆశ్రమం అంటే ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలకోసం శ్రమించే దశ. జీవితం మొత్తం నాలుగు ఆశ్రమాలుగా విభజించబడిందీ అంటే, శాస్త్రం ప్రకారం జీవితం మొత్తం ఆధ్యాత్మిక సాధనే. కాకపోతే, ఒక్కో దశలో సాధనదిశ మారుతూ ఉంటుంది. ఒక సీతాకోకచిలుక నాలుగు దశలను పోలి ఉంటాయి మన జీవితంలో దశలు కూడా. వీటిని వివరంగా చూద్దాము.

1. **బ్రహ్మచర్య ఆశ్రమం** – ఇందులో విద్య నేర్చుకుంటాము. విద్య ఏమిటి? ఎందుకు?

ఇప్పటి నిర్వచనం మారిపోయింది. సంపాదనకోసం, అర్థకామాలకోసమే విద్య అయిపోయింది. శాస్త్రం ప్రకారం విద్య అంటే ఒక వ్యక్తిని తీర్చిదిద్దేది, మంచి నడవడికని పెంపొందించేది, తను నేర్చుకుని తనని తానూ, సంఘాన్నీ ఉద్ధరించేటట్టు చేసేది.

స్వామి చిన్మయానంద అందంగా ఈ నిర్వచనాన్ని ఇచ్చారు. పశుప్రవృత్తి ఉన్న మనిషి, సంస్కారం ద్వారా మనుష్య ప్రవృత్తిని పెంపొందించుకోవాలి. అప్పుడు మనుష్యప్రవృత్తినుంచి దైవప్రవృత్తి పెంపొందించుకోగలుగుతాడు.

విద్యార్థి దశను బ్రహ్మచర్య ఆశ్రమం అంటారు. ఇక్కడ బ్రహ్మ అంటే శాస్త్రం లేదా వేదాలు. బ్రహ్మచారి అంటే దాని గురించి ఆలోచించేవాడు. వేదశాస్త్రంలో మానసికంగా పయనించేవాడు. శాస్త్రం నాలుగు విషయాలు నేర్పిస్తుంది. అవి –

ఎ) మన అంతిమలక్ష్యం మోక్షాన్నిచ్చే ఆధ్యాత్మిక సాధన. దీన్ని సాధించటానికి ఫ్రీవిల్‌ను ఉపయోగించాలి.

బి) భగవంతునిమీద భక్తిభావనను పెంపొందించుకోవాలి. జీవితంలో ఏది సాధించాలన్నా ఈశ్వరకృప కూడా తోడవాలి అని అర్థమవుతుంది.

సి) మానవతా విలువలను పాటించాలి. అవి శాశ్వతమైనవి.

డి) ధార్మికమైన జీవితాన్ని గడపాలి. అనైతికంగా ప్రవర్తించకూడదు.

ఆ విధంగా ఒక బ్రహ్మచారి తన జీవితాన్ని ఫ్రీవిల్‌తో నిర్దేశించుకుని, దానికి ఈశ్వరకృప కోరుతూ, విలువలతో కూడిన ధార్మికమైన జీవితాన్ని గడపాలి.

2. **గృహస్థ ఆశ్రమం** – ఇది రెండోదశ, చాలా ముఖ్యమైన దశ. శాస్త్రప్రకారం గృహస్థ ఆశ్రమం ఒక మతపరమైన సంస్థలాంటిది. గృహస్థు అంటే ఇంటిలో ఉండేవాడు అని అర్థం. ఆ భావం ఉన్నచోట, భార్యాభర్తల మధ్య బంధం దైవనిర్ణయంలా కనిపిస్తుంది. దైవమే ముడిపెట్టాడు తమకి, చివరికి దైవమే విడదీయాలి కాని, తామే విడిపోకూడదు అన్న అవగాహన ఉన్నచోటే కుటుంబం పటిష్టంగా నిలుస్తుంది. పటిష్టంగా ఉన్న కుటుంబంలోనే సర్దుకుపోవటం, క్షమించటం, భరించటం ఏర్పడతాయి.

ఒకప్పుడు స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ లేదు. ఇప్పుడు ఆ సమస్య లేదు. ప్రేమ కూడా అశాశ్వతమై పోతోంది. అందువల్ల కుటుంబజీవనం పదికాలాల పాటు నిలవటం లేదు. కుటుంబ జీవనాన్ని ప్రాపంచిక సుఖాలకోసమే అనుకుంటే, సంస్థలాంటి కుటుంబం బీటలు పడుతుంది.

గృహస్థ ఆశ్రమం తన కుటుంబానికే పరిమితమవదు. సంఘంలో తక్కిన మూడు ఆశ్రమాల వారికీ ఆర్థిక సహాయాన్ని అందించాల్సింది గృహస్థే. తక్కినవారు భిక్షాటన చేయాలి. వారికి భిక్ష ఇవ్వాల్సింది గృహస్థే. అందువల్ల గృహస్థ ఆశ్రమం చాలా ముఖ్యమైనది.

3. **వానప్రస్థ ఆశ్రమం** – ఇది మూడోదశ. వానప్రస్థ ఆశ్రమంలో నెమ్మదిగా వైరాగ్యం పెంచుకోవటానికి శిక్షణ పొందుతాము. మనస్సు ఇంకా హుషారుగా ఉండి, శరీరం సహకరించకపోతే, మనకు ఒత్తిడి పెరుగుతుంది. అందువల్ల నెమ్మదిగా మనస్సును బాహ్యప్రపంచంనుంచి దృష్టి మరల్చి, నెమ్మదిగా అంతర్ముఖం చేయాలి. అంటే కర్మకాండ నుంచి, ఉపాసనకాండకి రావాలి.

ఈ రోజుల్లో ఈ మూడవదశ పూర్తిగా మాయమైపోయింది. కాని గృహస్థుగా ఉంటూనే, మన ఇంట్లోనే మనం అతిథిగా ఉండటం నేర్చుకోవాలి.

4. **సన్న్యాస ఆశ్రమం** – ఇది నాలుగోదశ. సన్న్యాసం అంటే అసలు అర్థం అన్నీ పరిత్యజించటం. శారీరకంగా అన్నీ, అందరినీ పరిత్యజించి, కాషాయవస్త్రాలు ధరించి, ఆశ్రమంలో ఒంటరిగా జీవితం గడపటం ఒక పద్ధతి. కుటుంబంలోనే ఉంటూ, ఆంతరిక సన్న్యాసం పాటించటం ఇంకొక పద్ధతి. ఆంతరిక సన్న్యాసాన్నే గౌణసన్న్యాసం అంటారు. ఈ ఆశ్రమం ఆత్మజ్ఞానం పొందటానికి అనువుగా ఉంటుంది.

ఈ విధంగా ఈ నాలుగు ఆశ్రమధర్మాలనూ, అక్షరాలా కాకపోయినా, వాటిలో ఉన్న నియమాలను పాటిస్తే, మానవలక్ష్యాలలో ప్రాథమికమైన, అంతిమలక్ష్యమైన మోక్షాన్ని పొందుతారు.

## 26. వర్ణవ్యవస్థ

మానవలక్ష్యాలను సాధించటానికి, శాస్త్రం జంటకవులయిన వర్ణాశ్రమవ్యవస్థను సూచించిందని చూశాము. అవి వర్ణవ్యవస్థ, ఆశ్రమవ్యవస్థ. వ్యక్తిగా ఎదగటానికి ఆశ్రమ వ్యవస్థ తోడ్పడుతుందని చూశాము. ఇప్పుడు వర్ణవ్యవస్థను చూద్దాము.

వర్ణవ్యవస్థ సాంఘిక వ్యవస్థను సూచిస్తుంది. సమాజం సమతుల్యతతో నడవాలంటే, సమాజంలో ఉన్న వ్యక్తులను, వారు చేసే పనులనుబట్టి నాలుగు తెగలుగా విభజించింది శాస్త్రం. వారు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. ఈ విభజనను మూడు కోణాలనుంచి చూడవచ్చు. అవి జాతి, గుణం, కర్మ.

**జాతివ్యవస్థ** – ఏ కులంలో పుడితే ఆ కులానికి చెందటాన్ని జాతివ్యవస్థ అంటారు. జాతి అంటే జన్మ. దీన్నిబట్టి జాతిబ్రాహ్మణుడు, జాతిక్షత్రియుడు, జాతివైశ్యుడు, జాతిశూద్రుడు ఉన్నారు.

**కర్మవ్యవస్థ** – వర్ణవిభేదాలు కర్మనుబట్టి కూడా ఉంటాయి. అతను చేసే కర్మనుబట్టి సమాజాన్ని నాలుగు తెగలుగా విభజించారు. శాస్త్రపఠనం, పాఠనం చేసేవారిని కర్మబ్రాహ్మణులు అంటారు. పఠనం అంటే వారు నేర్చుకోవటం, పాఠనం అంటే ఇతరులకు నేర్పించటం. శాస్త్రాన్ని నేర్పించటం ద్వారా సమాజాన్ని ఆధ్యాత్మికంగా ప్రభావితం చేస్తారు.

సమాజంయొక్క శాంతి, భద్రతలను చేపట్టేవారిని కర్మక్షత్రియులు అంటారు. వీరు సంఘసేవకు లేదా దేశసేవకు అంకితమవుతారు. వ్యాపారం చేసి, సమాజంయొక్క ఆర్థిక వ్యవస్థకు తోడ్పడేవారిని కర్మవైశ్యులు అంటారు. ఈ ముగ్గురికి సేవ చేసేవారిని కర్మశూద్రులు అంటారు.

**గుణవ్యవస్థ** – స్వభావాన్నిబట్టి లేదా గుణాన్నిబట్టి విభజనలు చేయవచ్చు. దీన్ని గుణవ్యవస్థ అంటారు. ఆధ్యాత్మిక చింతన ఉండి, సత్త్వగుణం ఎక్కువగా ఉన్నవారిని గుణబ్రాహ్మణులు అంటారు. రజోగుణం ఎక్కువగా ఉండి, సమాజానికి నిస్వార్థంగా సేవ చేసేవారిని గుణక్షత్రియులు అంటారు.

సమాజసేవ చేసినా, రజోగుణం ఎక్కువగా ఉన్నా, దానితో తమోగుణం తోడయి, వారు చేసే సేవ స్వార్థపూరితంగా ఉంటే, వారిని గుణవైశ్యులు అంటారు. ఏదో సాధించాలనే తపన ఉండకుండా, మందకొడిగా ఉంటూ, తక్కిన ముగ్గురికీ వారి పనులను యాంత్రికంగా చేసి పెట్టేవారిని గుణశూద్రులు అంటారు.

**వర్ణాల్లోని హెచ్చుతగ్గులు** – ఈ వర్ణాల్లో హెచ్చుతగ్గులున్నాయా? జాతిపరంగా ఏర్పడిన వర్ణాల్లో హెచ్చుతగ్గులు లేవు. సమాజం ఒక సమతుల్యతతో నడవాలంటే నాలుగు వర్ణాలూ సమానంగా కావాలి. వారిలో భేదాలు లేవని పురుషసూక్తంలో వస్తుంది. భగవంతునియొక్క వివిధ అంగాలతో ఈ వర్ణాలను పోలుస్తారు అందులో. భగవంతుని ముఖం బ్రాహ్మణులు

అనీ, బాహువులు క్షత్రియులనీ, ఊరువులు వైశ్యులనీ, పాదాలు శూద్రులనీ వస్తుంది. ఈ అంగాలన్నీ పవిత్రమూ, ముఖ్యమూ. ఏ రూపంలో భగవంతుణ్ణి కొలిచినా, పాదాలను కొలుస్తాము. అందువల్ల ఎవరూ తక్కువ కాదు.

కర్మ ఆధారంగా ఏర్పడిన వర్ణాల్లో కూడా హెచ్చుతగ్గులు లేవు. అన్ని వృత్తులూ సమానంగా అవసరమే.

గుణం ఆధారంగా ఏర్పడిన వర్ణాల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయి. ఉన్నతగుణం ఉన్న వ్యక్తిని ఖచ్చితంగా గౌరవిస్తుంది సమాజం. ఒక వ్యక్తి జాతిపరంగా, కర్మపరంగా ఏ వర్ణానికి చెందినా, అతను గుణబ్రాహ్మణుడు అయితే అతనికి సమాజం నీరాజనాలర్పిస్తుంది. ఎందుకంటే అతను స్వభావరీత్యా, భగవంతునికి దగ్గరగా ఉంటాడు.

పుట్టినప్పుడు మనం అజ్ఞానమనే పెట్టుబడితో పుడతాము. అంటే గుణశూద్రునితో సమానం. అందువల్ల మన సాధన ఏ దిశగా సాగాలంటే అజ్ఞానంతో ఉన్న గుణశూద్రుని స్థాయినుంచి, స్వార్థపూరితంగా సమాజసేవ చేసే గుణవైశ్యుని స్థాయికి ఎదిగి, అక్కడనుంచి నిస్వార్థంగా సమాజసేవ చేసే గుణక్షత్రియుని స్థాయికి ఎదిగి, సత్త్వగుణం ప్రధానంగా ఉండి, భగవంతునితో అనుసంధానం చెందే గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదగాలి.

**ఎన్నుకునే స్వేచ్ఛ** – జాతి, గుణ, కర్మ వ్యవస్థలలో ఎక్కడన్నా మనం ఎన్నుకునే అవకాశం ఉందా? జాతిపరంగా మనమేమీ చేయలేము. ఏదో ఒక కులంలో పుట్టేశాము. గుణపరంగా గుణశూద్రుణ్ణుంచి గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదగాలని చూశాము. అలాగే కర్మపరంగా ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. మనం చేసే కర్మ పుట్టినజాతినిబట్టి గాని, మన గుణాన్నిబట్టి గాని ఎన్నుకోవచ్చు. జాతినిబట్టి ఎన్నుకుంటే కలిగే లాభం మన జీవితం వడ్డించిన విస్తరి అవుతుంది. అన్ని వనరులూ ఉంటాయి. కాని ఇప్పుడు బ్రాహ్మణవృత్తి చేపట్టేవారు అరుదై పోయారు. ఎంతసేపూ ధనం వెంట పరుగులు తీస్తున్నారు. ఎవరూ శాస్త్రపఠనం, పాఠనం చేయటానికి ముందుకు రావటంలేదు. ఇకముందైనా, ఈ వర్ణవ్యవస్థయొక్క ప్రాముఖ్యతను గుర్తించి మళ్ళీ శాస్త్రాన్ని పునరుద్ధరించటానికి కొందరైనా కంకణం కట్టుకుంటారని ఆశిద్దాము.

## 27. దేవతాదృష్ట్యా భక్తిత్రయం

చిన్నప్పటినుంచీ, భక్తి అంటే దేవుడు అనుకునేవారం. అంటే రెండూ ఒకటే అనుకునేవారం. కాని నిజానికి భక్తి వేరు, దైవం వేరు. భక్తి అంటే దేవునిమీద ఆరాధన. శాస్త్రం భక్తికి మూడు నిర్వచనాలు, దైవానికి మూడు నిర్వచనాలు ఇచ్చింది. ఇక్కడ దైవానికి మూడు నిర్వచనాలు చూద్దాము. అవి జగత్ కర్త, జగత్కారణం, జగదధిష్ఠానం.

1. **జగత్ కర్త** – ఇది మొదటిస్థాయిలో ఉన్న భక్తునికి భగవంతుని గురించి ఇచ్చే నిర్వచనం. ముందు భగవంతుణ్ణి సృష్టికర్తగా చూస్తాము. శాస్త్రపరిభాషలో చెప్పాలంటే నిమిత్తకారణం.

కుమ్మరి కుండ చేసినట్టుగా, కంసాలి ఆభరణాలు చేసినట్టుగా, భగవంతుడు జగత్తును సృష్టించాడు. ఇంగ్లీషులో ఇంటిలిజెంట్ కాజ్ అంటారు. అటువంటి భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయివుండాలి. ఈ భగవంతుణ్ణి ఇష్టదేవతారూపంలో కొలుస్తారు. రాముడు, కృష్ణుడు, శివుడు, దేవి – ఏ రూపంలోనైనా కావచ్చు. స్వామీజీ, ఈ దశలో భగవంతుణ్ణి ఏకరూప ఈశ్వరుడు అంటారు.

2. **జగత్ కారణం** – ఏకరూప ఈశ్వరుని భక్తిలో నిలిచాక, శాస్త్రం ఇంకొక మెట్టు ఎక్కమంటుంది. మొదటి నిర్వచనంలో భగవంతుణ్ణి జగత్ కర్త లేదా నిమిత్తకారణం అంది. నిమిత్తకారణం ముడిసరుకు లేకుండా దేనినీ సృష్టించలేడు. కుండకు నిమిత్తకారణం కుమ్మరి, ఆయనకు ముడిసరుకు మట్టి. ఈ మట్టిని ఉపాదానకారణం అంటారు. దీన్నే మెటీరియల్ కాజ్ అంటారు ఇంగ్లీషులో.

సృష్టికి ముందు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు కాబట్టి, నిమిత్తకారణమూ, ఉపాదాన కారణమూ భగవంతుడే. మేకర్ అండ్ మెటీరియల్ ఆర్ రోల్డ్ ఇంటు వన్ అంటారు పూజ్య స్వామీజీ. దీనికి ఉదాహరణగా సాలెపురుగుని ఇస్తుంది శాస్త్రం. సాలెపురుగు తన గూడుని తనలోంచే నిర్మించుకుంటుంది.

ఉపాదానకారణం, కార్యం అంతటా ఉంటుంది. మట్టి కుండ అంతటా ఉంటుంది. అదే విధంగా ఉపాదానకారణంగా భగవంతుడు కార్యజగత్తు అంతటా ఉన్నాడు. ఇక్కడ భగవంతుడు జగత్తును సృష్టించాడు అనకుండా, భగవంతుడు **తానే జగత్తు అయ్యాడు** అంటుంది శాస్త్రం.

ఈ దశలో భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అంటే – భగవంతుడు ఎక్కడ లేడు అనగలగాలి. నిజానికి అనేక రూపాలుగా కనిపిస్తున్న ఈ జగత్తు, రూపంలేని ఈశ్వరుడు తప్ప వేరే ఏమి కాదు. ఈ ఈశ్వరుణ్ణి విశ్వరూప ఈశ్వరుడు లేదా అనేకరూప ఈశ్వరుడు అంటారు. అనేకరూప ఈశ్వరుడు అంటే అనేక భిన్నదేవుళ్ళు కాదు. మనం కొలిచే ఏకరూప ఈశ్వరుడే జగత్తంతా నిండివున్నాడు. అందువల్ల భగవంతుని దర్శనం పొందటానికి, ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. భగవంతుడు అంతటా ఉన్నాడు. భగవంతునియొక్క విశ్వరూపదర్శనం చేయిస్తాడు కృష్ణపరమాత్మ పదకొండవ అధ్యాయంలో. స్వామీజీ, ఈ దశలో భగవంతుణ్ణి **అనేకరూప ఈశ్వరుడు** అంటారు.

3. **జగదధిష్ఠానం** – రెండవస్థాయి భక్తిలో ఇన్నాళ్ళు ఉన్నాక, అరూప ఈశ్వరుని స్థాయికి ఎదగాలి అంటుంది శాస్త్రం. ముందేమో భగవంతుడు జగత్తును సృష్టించాడు అంది; తర్వాత ఆయనే అనుప్రవేశం చేశాడు, అందువల్ల తానే జగత్తు అయ్యాడు అంది. ఇప్పుడు భగవంతుడు అనేకంగా అయినట్టు అనిపిస్తాడు కాని నిజానికి ఆయనకు రూపం లేదు. వీటన్నిటికీ అధిష్ఠానంగా ఉన్నాడు అంటున్నది. **కార్యకారణ విలక్షణం బ్రహ్మ.**

ఆకాశం అన్నింటికీ ఆధారం కాని ఆకాశానికి ఏమీ అంటదు. ఆకాశం అసంగం. సూర్యుడు అన్నింటినీ ప్రకాశింపజేస్తాడు కాని సూర్యుడు అసంగం. అలాగే బ్రహ్మ కూడా అన్ని వస్తువుల సద్రూపం. తను అన్ని నామరూపాలకు అధిష్ఠానం. స్వామీజీ, ఈ దశలో భగవంతుణ్ణి **అరూప ఈశ్వరుడు** అంటారు.

ఈ విధంగా భగవంతుడు మూడు రూపాల్లో ఉన్నాడు – ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. ఇంకో విధంగా చెప్పాలంటే భగవంతుడు జగత్తును సృష్టించాడు, జగత్తు తానే అయ్యాడు, జగత్తుకు అధిష్ఠానదేవతగా ఉన్నాడు.

మీ స్థాయీభేదాలనుబట్టి భగవంతుణ్ణి కొలుస్తారు. ఆరంభదశలో ఏకరూప ఈశ్వరుణ్ణి కొలిచినా, తరువాత అనేకరూప ఈశ్వరుణ్ణి కొలిచే స్థాయికి రావాలి. ఏదో ఒకనాటికి, అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఒక స్థాయినుంచి ఇంకొక స్థాయికి ఎదిగితే, మొదటి స్థాయిని త్రోసిపుచ్చము. మన దృక్కోణం విశాలమవుతూ వస్తుంది.

ముందు ఈశ్వరుడు కైలాసంలో ఉన్నాడు అంటారు. తరువాత వాట్ ఈజ్ గాడ్ అంటే వాట్ ఈజ్, ఈజ్ గాడ్ అంటారు. దాని తర్వాత ఈశ్వరుడు లేనిదే ఈ జగత్తుకు ఉనికే లేదు. ఉన్నదంతా ఈశ్వరుడే అంటారు.

## 28. భావనాదృష్ట్యా భక్తిత్రయం

ఇంతకుముందు దేవతాదృష్ట్యా భక్తిత్రయం చూశాము. అంటే భగవంతుణ్ణి మనం మూడు స్థాయిల్లో కొలుస్తాము. భగవంతుణ్ణి జగత్ కర్తగా, జగత్ కారణంగా, జగదధిష్ఠానంగా కొలుస్తాము. అంటే ఒక ఇష్టదేవతా ప్రార్థనతో మొదలుపెట్టి, అనేకరూప ఈశ్వరునిగా ప్రార్థించి, తరువాత అరూప ఈశ్వరుడిగా అర్థం చేసుకుంటాము. ఇది భగవంతుని పరంగా.

ఇప్పుడు భక్తిపరంగా చూద్దాము. భక్తి అంటే దేవునిమీద ఆరాధన. భక్తి అంటే ఉన్నతమైన వ్యక్తి మీద ప్రేమ; ముఖ్యంగా దేవునిమీద ప్రేమ. ముందు దేవునిలో స్థాయీభేదాలు చూశాము. ఇప్పుడు ఆ భక్తిలో లేదా ప్రేమలో మూడు స్థాయీభేదాలను చూద్దాము.

**ప్రేమకు మూడు దశలు** – ప్రేమను మన శాస్త్రం చక్కగా విశ్లేషించింది. మామూలు వ్యక్తులమీద ప్రేమ అవనీ, దేవునిమీద ఉన్న ప్రత్యేకమైన ప్రేమ అవనీ, అది మూడు దశల్లో ఉన్నాయంటుంది.

ఎ) **గమ్యం ప్రేమ** – మొదటిది లక్ష్యంమీద ప్రేమ. మనం జీవితంలో సాధించాలనుకున్న అంతిమలక్ష్యాన్ని ప్రేమిస్తాము. వాటిని ప్రేమిస్తున్నాము కాబట్టి వాటిని సాధిద్దామనుకుంటున్నాము.

బి) **మార్గం ప్రేమ** – ఈ గమ్యాన్ని చేరుకోవటానికి మనం అనేక మార్గాలను ఉపయోగించాలి. మార్గంవల్లనే మన గమ్యం చేరుకోగలము కాబట్టి మార్గాన్ని కూడా ప్రేమిస్తాము.

సి) **స్వయం ప్రేమ** – మూడోది మనమీద మనకు ఉన్న ప్రేమ. మనకు ఆనందం కలిగించే లక్ష్యాన్ని ఎన్నుకుంటాము.

**ప్రేమలో స్థాయీభేదాలు** – ప్రేమలో రకాలు ఉన్నప్పుడు, వాటిమీద ఉన్న తీవ్రతలో కూడా స్థాయీ భేదాలు ఉంటాయని శాస్త్రం చెబుతుంది. మార్గంమీద ప్రేమ స్థాయి చాలా తక్కువ, గమ్యంమీద మధ్యస్థం, స్వయంమీద హెచ్చుస్థాయి ఉంటుంది. ఎందుకంటే మార్గాన్ని మార్గంకోసం ప్రేమించటం లేదు. దాని ద్వారా గమ్యం చేరుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. గమ్యం చేరుకున్నాక మార్గాన్ని మర్చిపోతాము.

అధికశాతం తోటివారిమీద ప్రేమ, గమ్యమనే డబ్బుని చేరుకోవటానికి మార్గం. అందువల్ల గమ్యంమీద ప్రేమ మార్గంమీద ప్రేమకన్నా ఎక్కువ. ఒక గమ్యం ఎన్నుకునే కారణం అది మనకు ఆనందాన్నిస్తుందనే భావనవల్ల. అందువల్ల గమ్యం ప్రేమకన్నా స్వయం ప్రేమ ఎక్కువ. బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు భార్య భర్తను, భర్తకోసం ప్రేమించదు, అతను తనకు ఆనందాన్ని కలుగజేస్తాడు కాబట్టి ప్రేమిస్తుంది అంటాడు. ఇది మానవప్రేమ గురించి సాధారణ సూత్రం.

**మూడు స్థాయిల భక్తి** – ఇప్పుడు దీన్ని భగవంతునిమీద భక్తికి అన్వయించి చూద్దాము. భక్తుల భక్తిస్థాయి, వారు దేవుణ్ణి చూసే పద్ధతినిబట్టి ఉంటుందంటుంది శాస్త్రం.

ఎ) **మందభక్తి** – చాలామంది దేవుణ్ణి వారి ప్రాపంచిక గమ్యాలు చేరుకునేందుకు ఒక మార్గంగా కొలుస్తారు. ఇలా దేవుణ్ణి కొలిస్తే, దాన్ని మందభక్తి అంటారు. అలాంటివారు దేవునిమీద అలుగుతారు కూడా. అమ్మాయి పెళ్ళి కుదర్చకపోతే, వారు నాస్తికులుగా మారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇటువంటి వారిది షరతులతో కూడుకున్న భక్తి.

బి) **మధ్యమ భక్తి** – రెండోస్థాయి వారు కొంచెం అరుదుగా ఉంటారు. వారు దేవుణ్ణి గమ్యం చేర్చే మార్గంగా కొలవరు. వారు భగవంతుణ్ణే వారి గమ్యంగా కొలుస్తారు. జీవిత లక్ష్యం గమ్యాన్ని చేరటం. దేవుడు భద్రతకు చిహ్నం, దేవుడు శాంతికి చిహ్నం, దేవుడు ఆనందానికి నెలవు. వారికి కావాల్సింది ఈ శాంతి, ఆనందం, భద్రతే. అందుకని దేవుణ్ణి గమ్యం ప్రేమ పద్ధతిలో ప్రేమిస్తారు. ఇది ముందు పద్ధతికన్నా ఎక్కువ కాబట్టి దీన్ని మధ్యమ భక్తి అంటారు.

సి) **ఉత్తమ భక్తి** – ఇందులో భగవంతుణ్ణి మార్గంగానూ చూడరు, గమ్యంగానూ చూడరు. జీవాత్మ పరమాత్మ ఐక్యత చూస్తారు. '**సోఽహమస్మి**' అని అర్థం చేసుకుంటారు. అందువల్ల పరమాత్మమీద భక్తి స్వయం ప్రేమతో సమానం. స్వయం ప్రేమ ఎలా ఉత్తమమైనదో, పరమాత్మమీద అలాంటి ప్రేమ కూడా ఉత్తమమైనదే.

భక్తి అంటే దైవంమీద మంద, మధ్యమ, ఉత్తమ రూపంలో ఉన్న ప్రేమ. ఓం ప్రథమంగా భక్తి చూపేటప్పుడు పరమాత్మను లౌకిక లక్ష్యాలను తీర్చే మార్గంగా కొలిచినా, నెమ్మదిగా పరమాత్మను శాంతి, ఆనందం, భద్రత ఇచ్చే గమ్యంగా కొలిచి, అక్కడితో ఆగకుండా భగవంతునికీ, వారికీ మధ్య ఐక్యదర్శనాన్ని చేయాలి. అంటే భేదభావనను వదులుకుని, జీవాత్మ–పరమాత్మ ఐక్యాన్ని అర్థం చేసుకోవాలి. ఇది భావనాదృష్ట్యా భక్తిత్రయం.

## 29. సాధనాదృష్ట్యా భక్తిత్రయం

ఇంతకు ముందు రెండు అంశాల్లోనూ దేవతాదృష్ట్యా భక్తిత్రయం, భావనాదృష్ట్యా భక్తిత్రయం చూశాము. ఇప్పుడు సాధనాదృష్ట్యా భక్తిత్రయం చూద్దాము.

**భక్తి నిర్వచనం** – భక్తి అంటే ఒక ప్రత్యేక సాధన కాదు,అనేక ఆధ్యాత్మిక సాధనలతో కూడినది. ఈ భక్తియోగం ఫలం మోక్షం. ఈ ఆధ్యాత్మిక సాధనలను వేదాలు మూడుగా వర్ణిస్తాయి. అవి కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం. భగవద్గీత ఉపనిషత్తుల సారం కాబట్టి ఇందులో కూడా ఈ మూడు సాధనలనూ చూస్తాము. నిజానికి భక్తి అనే పదాన్ని విడిగా వేదాల్లో కాని, ఉపనిషత్తుల్లో కాని చూడము.

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తియోగం**

ఎందుకు ఈ మూడింటినీ శాస్త్రం భక్తియోగంగా పేర్కొంది? ఎందుకంటే, ఈశ్వరభక్తి ఉంటేనే ఈ మూడు యోగాలూ సాధ్యమని కృష్ణపరమాత్మ కూడా భావిస్తున్నాడు. ఈశ్వరభక్తి లేనిదే వీటిని ఆచరించలేము. అందువల్ల ఈ మూడింటినీ కలిపి భక్తియోగం అనవచ్చు. కాని వాటి మధ్య భేదాలను చూడాలనుకుంటే వాటికి స్థాయీ భేదాలను ఆపాదించవచ్చు.

భక్తియోగం స్థాయి 1 – కర్మయోగలక్షణ భక్తియోగం

భక్తియోగం స్థాయి 2 – ఉపాసనయోగలక్షణ భక్తియోగం

భక్తియోగం స్థాయి 3 – జ్ఞానయోగలక్షణ భక్తియోగం

లక్షణం అంటే ఆ రూపంలో అని అర్థము.

ఈ మూడు దశలనే కృష్ణపరమాత్మ ఐదు దశలుగా విభజించాడు. కొన్నిచోట్ల మెట్లు చాలా ఎత్తుగా ఉంటే, వాటిని పడగొట్టి ఇంకా చిన్న మెట్లు చేస్తారు. ఆ విధంగా కృష్ణపరమాత్మ కూడా ఈ మూడు స్థాయిలను ఐదు స్థాయిలు చేశాడు.

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం స్థాయి | 1 | – సకామకర్మ ప్రధాన కర్మయోగం | – 1 |
| కర్మయోగం స్థాయి | 2 | – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం | – 2 |
| ఉపాసనయోగం స్థాయి | 1 | – ఏకరూప ఈశ్వరధ్యానం | – 3 |

| | | |
|---|---|---|
| ఉపాసనయోగం స్థాయి 2 | – అనేకరూప ఈశ్వరధ్యానం | – 4 |
| జ్ఞానయోగం | – అక్షర ఉపాసన | – 5 |

కర్మయోగం + ఉపాసనా యోగం + జ్ఞానయోగం = భక్తియోగం.

ఎందుకు ఈ మూడింటినీ కలిపి భక్తియోగం అంటున్నాం? ఎందుకు విడిగా చూడలేము? ఎందుకంటే, ఈ మూడు యోగాల్లోనూ సమానంగా ఉన్న అంశం భక్తి. కర్మయోగంలో భక్తి కలగలపాలి. ఉపాసనా యోగంలో భక్తిలో మునగాలి, జ్ఞానయోగంలో భక్తిరసంలో తేలాలి, రసగుల్లా చక్కెర పాకంలో తేలినట్టుగా.

**కర్మయోగం** :– కర్మయోగంలో ఏం చేసినా ప్రతిచర్యనీ దైవానికి అంకితం చేసి, ఏమాత్రం వ్యతిరిక్తత చూపించకుండా, మన చర్యల – మంచి కాని, చెడు కాని – ఫలితాలని ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాం. ఈశ్వరార్పణభావన లేదా ప్రసాదభావన లేకుండా కర్మయోగం ఉంటుందా? అంటే కర్మ యోగికి భక్తి ఉండి తీరాలి.

**ఉపాసనయోగం** :– ఉపాసనయోగంలో దైవం గురించి ధ్యానం చేయాలి, చిత్తశుద్ధికోసం, చిత్త ఏకాగ్రతకోసం. భక్తి లేకపోతే ధ్యానం ఎలా చేస్తాము? మానసపూజ, మానసపారాయణం, మానసజపం అన్నీ ఉపాసనలో భాగాలు. ఉపాసన కూడా భక్తితత్త్వంతో జరగాలి.

**జ్ఞానయోగం** :– ఇందులో కూడా భక్తి ఉంది. శాస్త్రం అధ్యయనం చేసేటప్పుడు, ప్రార్థనతోమొదలెట్టి, ప్రార్థనతో ముగిస్తాము. అంతేకాదు జ్ఞానయోగంలో మనం ఆత్మ విచారణ చేస్తున్నాం. చివరికి జీవేశ్వర ఐక్యం తెలుసుకుంటాం. ఆత్మజ్ఞానం పొందితే, బ్రహ్మజ్ఞానం పొందినట్టే. అది విడిగా లేదు. అందువల్ల జ్ఞానయోగంలో కూడా భక్తి ఉంది. అందువల్ల, భక్తి అంటే ఆధ్యాత్మిక సాధనలో ఆచరించే మొత్తం పద్ధతి.

ఇప్పుడు చెప్పండి! ప్రగాఢమైన భక్తి లేకుండా ఈ మూడు యోగాలను పాటించగలరా!

ఆ విధంగా భక్తిని మూడు కోణాల్లో చూశాము. దేవతారూప భక్తిత్రయం, భావనారూప భక్తిత్రయం, సాధనారూపభక్తిత్రయం. అందువల్ల భక్తితత్త్వం గురించి సరిగ్గా అర్థం చేసుకుని, దశలవారిగా భక్తిని పాటించి, ఆఖరిదశ అయిన జ్ఞానభక్తిని చేరుకోవాలి.

## 30 కర్మయోగం – ఆధ్యాత్మిక రంగంలో తొలిమెట్టు

మనిషి కోరుకునే అన్ని పురుషార్థాలనూ, మోక్షపురుషార్థంతో సహా, పొందటానికి పాటించాల్సిన మొట్టమొదటి సాధన కర్మయోగం అంటుంది శాస్త్రం.

కర్మయోగంలో రెండు పదాలు ఉన్నాయి. కర్మ + యోగం. కర్మ అంటే సరియైన కర్మ; యోగం అంటే సరియైన దృక్పథం.

**కర్మ** – కర్మ అంటే సరియైన పనిచేయటం అని చూశాము. కర్మలను మూడు రకాలుగా విభజించింది శాస్త్రం. అవి – సాత్త్వికకర్మ, రాజసకర్మ, తామసకర్మ. సాత్త్వికకర్మ ఉత్తమం, రాజసకర్మ మధ్యమం, తామసకర్మ అధమం.

**సాత్త్వికకర్మ** – సాత్త్వికకర్మ ఉత్తమకర్మ. దీనివల్ల ఎక్కువమంది లాభం పొందుతారు. నేను కూడా లాభం పొందవచ్చు, కాని ఆ లాభం నా ఒక్కడికే కాక, అందరికీ వస్తుంది. దీన్ని **నిష్కామకర్మ** అంటారు. దీనిలో నేను ఇచ్చేది ఎక్కువ, తీసుకునేది తక్కువ ఉంటుంది. సాత్త్వికకర్మలను శాస్త్రం పంచమహాయజ్ఞాలుగా పేర్కొంది. (ఆ పంచమహాయజ్ఞాలను తరువాత అంశంగా చూద్దాము.)

**రాజసకర్మ** – రాజసకర్మ మధ్యమ కర్మ. దీనివల్ల లాభం పొందేవారు చాలా తక్కువ. మేమిద్దరం, మాకిద్దరులాగా నా కుటుంబం మాత్రం లాభం పొందితే చాలు. ఇది స్వార్థపూరితమైన కర్మ. అందువల్ల నేను ఎక్కువ లాభం పొందుతాను. మహా అయితే నా భార్య, పిల్లలు లాభం పొందుతారు.

**తామసకర్మ** – తామసకర్మ అధమకర్మ. ఇది ఇతరులను బాధపెట్టే కర్మ. నా లాభంకోసం, ఎదుటివారిని బాధపెట్టటానికి కూడా వెనుకాడను. ఇతరులను ఇబ్బంది పెట్టే ఏ కర్మ అయినా కూడా అది తామసకర్మ. రాజసకర్మలో కూడా స్వార్థం ఉంటుంది కాని అందులో ఇతరులకు హాని కలుగజేయను. తామసకర్మలో నా స్వార్థంకోసం ఇతరులకు హాని కలుగజేస్తాను.

**నిష్కామకర్మ సాత్త్వికకర్మ, స్వార్థపూరిత కర్మ రాజసకర్మ, హానికరమైన కర్మ తామసకర్మ.** సాత్త్వికకర్మలో ఆధ్యాత్మిక ఉన్నతిని శీఘ్రంగా పొందుతారు; రాజసిక కర్మలో ఆధ్యాత్మిక ఉన్నతీ కలుగదు, పతనమూ చెందరు; తామసకర్మలో ఆధ్యాత్మిక ఉన్నతి కలుగకపోగా, పతనం చెందుతారు. అందువల్ల సాత్త్వికకర్మను పెంచుకుంటూ పోవాలి, రాజసకర్మను తగ్గించాలి, తామసకర్మను పూర్తిగా మానాలి.

**యోగం** – యోగం అంటే సరియైన దృక్పథం. మీరు చేసే కర్మను చిన్నచూపు చూస్తే, ఎంత గొప్ప కర్మ చేసినా మీకు ఫలితాన్నివ్వదు. కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయంలో నాలుగు కర్మయోగ సూత్రాలను ఇస్తున్నాడు.

1. **ఈశ్వర ఆజ్ఞ** – సాత్త్వికకర్మను లేదా పంచమహాయజ్ఞాలను ఈశ్వర ఆజ్ఞగా చేయమంటున్నాడు. ఎప్పుడైతే అది ఆజ్ఞ అవుతుందో, అప్పుడే దానిలో భయం చోటు చేసుకుంటుంది. ఆజ్ఞను ఉల్లంఘిస్తే దానికి శిక్ష ఉంటుంది. ఈ పంచమహాయజ్ఞాలను నియతం కర్మ అంటున్నాడు కృష్ణపరమాత్మ. వాటిని పాటించకపోతే ప్రత్యవాయపాపం అంటుకుంటుందని హెచ్చరిస్తున్నాడు.

2. **ఈశ్వరయజ్ఞం** – ఇప్పుడు అదే విషయాన్ని మెరుగ్గా చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. కర్మయోగాన్ని ఈశ్వరయజ్ఞంలాగా చేయాలి అంటున్నాడు. జీవితాన్ని ఒక పూజగా మలుచుకోవాలి. శంకరులవారు శివమానస పూజలో నేనెక్కడికి వెళ్ళినా అది నీకు చేసే ప్రదక్షిణగా భావించమంటారు. అలాగే ఏం తిన్నా బ్రహ్మార్పణం అనుకోవాలి. భగవంతుడు అంటే ఉండాల్సింది భయం కాదు, భక్తి.

దేవతలు మనకు అనేక వస్తువులను దీవెనలుగా కురిపించారు. ధర్మార్థకామమోక్షాలను ఇచ్చారు. అటువంటి దేవతలకు కృతజ్ఞతలు చూపకుండా ప్రాపంచిక విషయాలను అనుభవిస్తే, మనం దొంగలతో సమానం. అందువల్ల ఏ పని చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి.

కర్మ దానంతట అదే మోక్షాన్నివ్వదు, బంధించదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దాన్ని మనం చేసే తీరులో ఉంది. భక్తితో కూడిన కర్మ మోక్షాన్నిస్తే, భక్తిలేని కర్మ బంధంలో పడవేస్తుంది.

3. **చిత్తశోధకం** – మోక్షం పొందటానికి ఒక్కటే మార్గం ఉంది. అది ఆత్మజ్ఞానం పొందటం. చిత్తశుద్ధి లేకపోతే ఆత్మజ్ఞానం పొందలేము. కర్మయోగాన్ని పాటిస్తే చిత్తశుద్ధి పొందుతాము. ఆధ్యాత్మిక చింతనకు ప్రాథమిక ఆటంకం మోహం, అవివేకం. ఆశించిన ఫలం వస్తే పొంగిపోతాము, రాకపోతే కృంగిపోతాము. ఏ ఫలం వచ్చినా దాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తే, ఎటువంటి ఫలం వచ్చినా చలించము. అది చిత్తశుద్ధికి తోడ్పడుతుంది.

4. **ధర్మాచరణం** – సృష్టిలో సమతుల్యతను నిలిపేది ధర్మం. సృష్టి అంతా లయబద్ధంగా ఉందని ఒప్పుకుని తీరాలి. సృష్టిలోని ప్రతిదీ, ఒకదానితో ఒకటి ముడిపడివుంది. ప్రతిదీ, ఒక వృత్తాకారంలో జరుగుతుంది. శక్తి, పదార్థం ఒక వృత్తం. కర్మయోగం ద్వారా, ఈ విశ్వంలోని సమతుల్యతను పాటించాలి.

ఈ విధంగా కర్మయోగ సూత్రాలు – కర్మని ఈశ్వర ఆజ్ఞగా పాటించాలి, ఈశ్వరయజ్ఞంలా చేయాలి, చిత్తశోధకంగా మలచుకోవాలి, ధర్మాచరణ చేయాలి. వీటిలో ఏది పాటించినా, కర్మయోగం, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తుంది.

## 31. పంచమహాయజ్ఞాలు

జ్ఞానంవల్లనే మోక్షం పొందగలమని శాస్త్రం ఘోషిస్తుంది. అలాంటప్పుడు కర్మయోగం ఎందుకు పాటించాలి అనే సందేహం కలిగే అవకాశం ఉంది. కర్మయోగం అనే ద్వారం ద్వారానే జ్ఞానయోగానికి రాగలము.

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

శంకరాచార్యులవారు కర్మకాండను పడవతో పోలుస్తున్నారు. నది దాటటానికి పడవ వాడతారు. ఆవలితీరానికి చేరగానే, పడవని వదిలేసి, ముందుకు సాగుతారు. నన్ను ఆవలి తీరానికి చేర్చింది కదా అని, పడవలోనే కూర్చోరు కదా. అలా కూర్చుంటే అక్కడిదాకా వెళ్ళిన ఫలితం దక్కదు. అలాగే కర్మయోగం పాటించాలి, జ్ఞానయోగ్యతను పొందాలి, కర్మయోగాన్ని వదిలేసి, జ్ఞానయోగాన్ని పాటించాలి.

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + | సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్విక‌ కర్మ | + | పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణ బుద్ధి | + | ఈశ్వరప్రసాదబుద్ధి |

ఇప్పుడు పంచమహాయజ్ఞాలు అంటే ఏమిటో చూద్దాము. సాత్త్వికఁ కర్మలను పంచమహాయజ్ఞాలుగా పేర్కొంది శాస్త్రం. వాటిలో ఏదో ఒకటి కాదు, అన్నీ చేసితీరాలి. ఏవి ఎంత చేయాలి అనేది మనిషినిబట్టి మారుతుంది కానీ, చేయటం మాత్రం అన్నీ చేసితీరాలి. యజ్ఞం అంటే మానవాళి మేలుకోసం చేసే పని. పంచ అంటే ఐదు. శాస్త్రం పేర్కొన్న ఐదు సత్కర్మలు – దేవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం.

1. **దేవయజ్ఞం** – మీరు ఎంత బిజీగా ఉన్నా కూడా, రోజులో కొంతభాగం ప్రార్థనకు అంకితం చేయాలి. ఏం ప్రార్థన చేయాలనేది మీ ఇష్టం. మీ ఇష్టదేవత ముందు నిల్చుని, మనస్ఫూర్తిగా ఒక చిన్న శ్లోకం అయినా చదవాలి. మన శాస్త్రం నిర్దేశించిన అత్యుత్తమ ప్రార్థన – **లోకాః సమస్తా సుఖినో భవంతు**. లోకంలో అందరూ సుఖంగా ఉండుగాక అని దైవానికి మనస్ఫూర్తిగా చేసే ప్రార్థన ఇది. ఈ ప్రార్థనతో పాటు, మీరు ఏ కాస్త సొమ్మును ఇచ్చినా కూడా, అది దేవుని ఖజానాలో పడి, మానవాళి అంతటికీ చేరుతుంది.

ఉదాహరణకు ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు మీరు ఒక్కరూపాయిని ఇచ్చినా కూడా అది మానవాళికి మేలు చేస్తుంది. మీ ఒక్కరూపాయివల్ల ఏమీ జరగకపోవచ్చు, కాని మీలాగా అనేకమంది ఇచ్చిన లక్షరూపాయలతో అది కూడా జతకలిపి, మేలు చేస్తుంది. అందువల్ల భగవంతునికి చేసే పూజలు, అభిషేకాలు వృథా అని ఎన్నడూ భావించకండి. రోజులో కనీసం కొంతసేపు భగవంతునికోసం కేటాయించండి. అప్పుడే దేవయజ్ఞంమీద మీకు గౌరవం ఉన్నట్టు.

2. **పితృయజ్ఞం** – పితృదేవతలను పూజించటం. మనం మన పితృదేవతలను స్మరించు కోకపోతే, వారికి కృతజ్ఞత చూపించని వారమవుతాము. ఈరోజు మనం ఇలా చక్కగా ఉన్నామంటే దానికి పితృదేవతలే కారణం. అందువల్ల వారికి శ్రాద్ధకర్మలు పెట్టాలి, తర్పణాలు వదలాలి. అంతేకాదు, మీరిలా పితృయజ్ఞం చేస్తే పితృదేవతల రిలీఫ్ ఫండ్‌కు మీరు సహాయం చేసినట్టు అవుతుంది అంటారు స్వామీజీ. శ్రాద్ధకర్మలు అందుకోలేని వారికి కూడా మీరు పెట్టే కర్మలు అందుతాయి. అందువల్ల పితృయజ్ఞం కూడా కృతజ్ఞతలు చూపించే కర్మ, పర ఉపకారకర్మ అవుతుంది.

3. **బ్రహ్మయజ్ఞం** – దీన్ని ఋషియజ్ఞం అనికూడా అంటారు. మన ఋషులు సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచి అందుకున్న మన శాస్త్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనమీద ఉంది. మన శాస్త్రంవల్లనే మన సాంప్రదాయం అంత పురాతనమైనది, అంత గొప్పది అయింది. అందువల్ల వాటిని పదికాలాలు నిలబెట్టటానికి, నలుగురికీ అందజేయటానికి మనవంతు కృషి మనం చేయాలి. వేదపారాయణం చేస్తే, ఆ వేదఘోషే అందరినీ పునీతులను చేస్తుంది. వేదపఠనం, పాఠనం చేస్తే ఇంకా మంచి కర్మ అవుతుంది. శాస్త్రం అంటే కేవలం నమ్మేది కాదు, దాన్ని లోతుగా విశ్లేషించి, అర్థం చేసుకోవాలి కూడా.

4. **మనుష్యయజ్ఞం** – సాంఘిక సంక్షేమ సేవలన్నీ మనుష్యయజ్ఞంలోకి వస్తాయి. అన్నదానం చేయటం, అనాథాశ్రమానికి దానాలు ఇవ్వటం, పాతబట్టలు పంచిపెట్టటం, వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కొంత సమయం గడపటం – ఇవన్నీ మనుష్యయజ్ఞంలోకి వస్తాయి.

పెద్దలకు శ్రాద్ధకర్మలు చేయకుండా, బీదలకు అన్నదానం చేస్తే చాలనుకుంటారు కొందరు. భగవంతునికి పూజలు, అభిషేకాలు చేయకుండా అన్నదానం చాలనుకుంటారు మరికొందరు. శ్రాద్ధకర్మలు పితృయజ్ఞంలోకి వస్తాయి; పూజలు, అభిషేకాలు దేవయజ్ఞంలోకి వస్తాయి; అన్నదానం మనుష్యయజ్ఞంలోకి వస్తుంది. అలా చేసే అవకాశమే ఉంటే శాస్త్రమే వీటిలో ఏదో ఒకటి చేయండి అని ఉండేది. కాని శాస్త్రమే అన్నీ చేయాలని నిర్దేశించింది.

మానవసేవయే మాధవసేవ కాబట్టి మానవసేవ చేస్తాను అనేవారికి స్వామీజీ, వారు ఆ ఈక్వేషను రెండవ వైపు చూడటం లేదు అంటారు. దాని ప్రకారం, మాధవసేవే మానవసేవ కూడా అవుతుంది. కాని అన్నిసేవలూ చేయాలి.

5. **భూతయజ్ఞం** – పరిసరాలను పరిరక్షించటం భూతయజ్ఞం కిందికి వస్తుంది. దీనికి సూచనగా పూర్వం అందరూ ఆవుకు, తులసిచెట్టుకు పూజ చేసేవారు. ప్రకృతిని రక్షించటం మన ధర్మం. దీన్ని సైన్సులో పర్యావరణ రక్షణ అంటారు.

ఈ పంచమహాయజ్ఞాలను చేస్తే అవి కృతజ్ఞతలు చూపించే కర్మలు కాబట్టి సాత్త్విక కర్మలలోకి వస్తాయి. దానివల్ల అసలైన కర్మయోగి అవుతారు.

## 32. కర్మయోగానికి ఐదు మెట్లు

కర్మయోగం అంటే సరియైన కర్మ + సరియైన దృక్పథం అని చూశాము. ఒక విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే, సరియైన దృక్పథం ఏర్పడుతుంది. మనం ఏదైనా కర్మ చేస్తే, ఆ కర్మ చేసిన వెంటనే అది విశ్వంలో ఒక భాగమవుతుంది. అప్పుడు ప్రకృతి సూత్రాలు, మనం చేసిన కర్మమీద పనిచేస్తాయి. మన చేతినుంచి ఒక బంతిని వదిలితే, భూమ్యాకర్షణ శక్తి అందుకుంటుంది. ఆ ప్రకృతి సూత్రానికి అనుగుణంగా మన కర్మకు తగ్గ **ఫలం** వస్తుంది. ఆ కర్మఫలాన్ని మనం ఈ జన్మలోనో, వచ్చే జన్మలోనో అనుభవిస్తాము.

ఈశ్వరుడు కర్మఫలదాత. ఈశ్వరుడు ఈ ప్రకృతి సూత్రాలను, ఆధ్యాత్మిక సూత్రాలను ఆధారంగా చేసుకుని విశ్వంలో సమతుల్యతను నెలకొల్పుతాడు. అందువల్ల మనకొచ్చిన కర్మఫలం కూడా, ఈశ్వరుడు, ఈ సూత్రాలను దృష్టిలో పెట్టుకుని ఇచ్చినవే. సాక్షాత్తూ ఈశ్వరుడే కర్మఫలాన్ని ఇస్తాడు కాబట్టి, దాన్ని మనం ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి తప్పితే, దాన్ని తిరస్కరించకూడదు, విమర్శించకూడదు.

అదే విధంగా మనం చేసే కర్మను కూడా ఈశ్వరార్పణబుద్ధితో చేస్తే, మన మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఏ పని చేసినా ఉత్సాహంగా చేస్తాము తప్పితే నీరసంగా, బద్ధకంగా చేయము. ఎందుకంటే మనం చేసే ప్రతి చిన్నపని కూడా ఈశ్వరునికి అర్పిస్తాము కాబట్టి, కృష్ణపరమాత్మ, ఉత్సాహంతో చిందులు వేయాలి అంటాడు. భగవంతునికి అర్పించే పని నిర్లక్ష్యంగా చేయలేము కాబట్టి ఆ కర్మను మనస్ఫూర్తిగా, ఉత్సాహంగా చేస్తాము. వర్క్ ఈజ్ వర్షిప్ అంటారు, చేసే కర్మ పూజ అవుతుంది.

కృష్ణపరమాత్మ మూడవ అధ్యాయం అయిన కర్మయోగంలో కర్మయోగానికి ఐదు మెట్లు అని ఒక శ్లోకంలో పేర్కొన్నాడు. అవేమిటో చూద్దాము. అది శ్లోకం 30. అవి – వివేకబుద్ధి, ఈశ్వరర్పాణబుద్ధి, ప్రసాదబుద్ధి, అమానిత్వం, సమత్వం.

1. **వివేకబుద్ధి** – మీ జీవితం అర్థవంతంగానూ, ప్రయోజనకరంగానూ, విలువైనదిగానూ ఉండాలంటే మీరు మోక్షానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ అంతిమలక్ష్యంమీద దృష్టి పెట్టకపోతే ఏదీ సాధించలేరు. మీరు ఒక సుదీర్ఘ రైలుప్రయాణం చేస్తున్నారు. మధ్యలో వచ్చే స్టేషన్లలో దిగుతారు, ఏవో కొనుక్కుంటారు, కాని వ్యవహారం నడుపుతున్నంతసేపూ రైలుమీదే దృష్టి పెడతారు. అలాగే మీ జీవితమనే ప్రయాణంలో, మీ అంతిమలక్ష్యమైన మోక్షాన్ని గుర్తు పెట్టుకోవాలి.

2. **ఈశ్వరార్పణబుద్ధి** – మీరు చేసే కర్మలన్నీ ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి. అప్పుడు ఏ పనిచేసినా దానిని అద్భుతంగా చేయటానికి ప్రయత్నిస్తారు.

3. **ప్రసాదబుద్ధి** – మీరు చేసిన కర్మకు ఏ కర్మఫలం వచ్చినా బెంగ పెట్టుకోకూడదు. ప్రణాళిక వేరు, బెంగ వేరు. ప్రణాళిక మీరు కావాలని చేసే కర్మ. మీకిష్టమైనప్పుడు మీరు

చేయవచ్చు. ప్రణాళిక మిమ్మల్ని సమర్థవంతులుగా చేస్తే, ఆందోళన చెందటం మీ సమర్థతను తగ్గించి వేస్తుంది. అందువల్ల ప్రణాళిక వేయండి, దానికి తగ్గట్టుగా కర్మ చేయండి, ఫలితాన్ని ఈశ్వరునికి వదిలేయండి.

4. **అమానిత్వం** – మమకారం లేకపోవటం. ఏ విజయం కూడా, మీ ఒక్కరివల్లనే సాధ్యం కాదు. మీ అధీనంలో లేని అనేక అంశాలు తోడ్పడతాయి. అందువల్ల విజయం వస్తే, 'నేను గెలిచాను,' అని చెప్పండి కాని గెలిచాను తరువాత, 'ఈశ్వర అనుగ్రహంవల్ల,' అని కలపండి. గర్వం కిందికి లాగితే, అమానిత్వం మీకు ఆభరణమవుతుంది.

5. **సమత్వం** – ఈ అంశం ముందు చెప్పిన నాలుగు అంశాల సహజ పరిణామమే అయినా ముఖ్యం కాబట్టి కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెబుతున్నాడు. ఏ పని చేసినా ఉత్సాహానికి మారుపేరులా ఉండాలి. అప్పుడు కర్తగా సమత్వం ఏర్పడుతుంది. ఏ ఫలం వచ్చినా, భగవంతుడు అన్యాయం చేయడని అర్థం చేసుకుంటే, భోక్తగా సమత్వం ఏర్పడుతుంది.

ఈ ఐదు మెట్ల కర్మయోగాన్ని పాటిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. అది జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తుంది. చిత్తశుద్ధి అంటే నాకు జీవితంలో ఎదురైన సమస్యలకు కారణం ప్రపంచం కాదు, నా అజ్ఞానంవల్ల నేను ప్రపంచాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటంవల్ల ఏర్పడ్డాయి అని అర్థం చేసుకోగలగటం. అందువల్ల సమస్య అజ్ఞానం, దానికి పరిష్కారం జ్ఞానం. కాని జ్ఞానం పొందాలంటే మనస్సు శుద్ధంగా, ప్రశాంతంగా ఉండకపోతే అది సాధ్యం కాదు.

అజ్ఞానం పోవాలంటే, దానికి సంబంధించిన జ్ఞానం పొందితే చాలదా, మళ్ళీ దానికి చిత్తశుద్ధి తోడవాలని ఎందుకంటారు అని అడగవచ్చు మీరు. ఆత్మజ్ఞానం అంత తేలికగా అర్థంకాదు. దానికి చాలా సూక్ష్మబుద్ధి ఉండాలి. క్షురకుని కత్తిలా పదునుగా ఉండాలి. పగలు రణగొణ ధ్వనుల్లో గడియారం శబ్దం అసలు వినబడదు. కాని రాత్రి అందరూ పడుకొని, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు గడియారం చేసే టిక్–టిక్ శబ్దం చాలా స్పష్టంగా వినిపిస్తుంది. అలాగే శుద్ధమైన, ప్రశాంతమైన మనస్సు ఉంటేనే ఆత్మజ్ఞానం పొందటం తేలిక అవుతుంది.

## 33. ఉపాసనయోగం

శాస్త్రంయొక్క ప్రాథమిక ఉద్దేశ్యం మనిషి మోక్షం పొందటానికి చేయూతనివ్వటం అని చూస్తున్నాము. మోక్షం అంటే బంధంనుంచి విడుదల చేయటం. మనం శాంతి, ఆనందం, భద్రత కోసం బాహ్యప్రపంచంమీద, తోటి మనుష్యులమీద ఆధారపడుతున్నామనీ, అశాశ్వతమైన వస్తువులు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవనీ శాస్త్రం ఘోషిస్తున్నది. శాస్త్రం శాంతి, ఆనందం, భద్రత మీలోనే దొరుకుతుందనీ, మీలో మాత్రమే దొరుకుతుందనీ చెబుతుంది. మీరు పూర్ణస్వరూపులు, ఆనందస్వరూపులు అంటుంది.

ఇది మనకు తెలియకపోవటానికి కారణం అజ్ఞానం, మన స్వరూపం గురించి తెలియని అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానాన్ని పొందాలి. దాన్ని ఆత్మవిద్య అంటారు. మనం ఆత్మవిద్య పొందకుండా మూడు మలినాలు అడ్డుపడుతున్నాయని చూశాము. అవి– మలం, విక్షేపం, ఆవరణ.

మలం అతి స్థూలస్థాయిలో ఉంది. అది మనలో కలిగే రాగద్వేషాలు. విక్షేపం సూక్ష్మస్థాయిలో ఉంది. అది నిలకడలేని, పరుగులు తీసే మనస్సు. ఆవరణ సూక్ష్మాతి సూక్ష్మమైనది. అది అజ్ఞానం. ఈ మూడు మలినాలను పోగొట్టటానికి శాస్త్రం మూడు సాధనలను నిర్దేశించింది. అవి కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం. కర్మయోగం మలనివృత్తి చేస్తే, ఉపాసనయోగం విక్షేపనివృత్తి చేస్తే, జ్ఞానయోగం ఆవరణనివృత్తి చేస్తుంది. యోగం అంటే సాధకుణ్ణి అతని సాధ్యానికి చేర్చేది. సాధ్యం మోక్షం కాబట్టి మోక్షాన్ని కలుగజేసేది.

ముందు రెండింటిలో కర్మయోగం గురించి చూశాము.

కర్మయోగం టూకీగా –

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + | సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్విక కర్మ | + | పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణబుద్ధి | + | ఈశ్వరప్రసాదబుద్ధి |

శాస్త్రం నిర్దేశించిన రెండవ యోగం ఉపాసనయోగం. అది నిలకడలేని, పరుగులు తీసే మనస్సును నియంత్రించటానికి తోడ్పడుతుంది. ఉపాసన ఎలా తోడ్పడుతుందో తెలుసుకునేముందు ధ్యానం ఏ విషయంకోసం చేయకూడదో తెలుసుకోవాలి అంటున్నారు స్వామీజీ.

1. **ధ్యానం మోక్షమార్గం కాదు** – ధ్యానంవల్ల మోక్షం రాదు. ఎందుకంటే మోక్షం సాధ్య వస్తువు కాదు, సిద్ధవస్తువు. మనం ముందే ముక్తపురుషులం.

2. **ధ్యానం జ్ఞానప్రమాణం కాదు** – ధ్యానంవల్ల లౌకికజ్ఞానం, ఆధ్యాత్మిక జ్ఞానం కూడా రావు. ధ్యానం ప్రమాణంలోకి రాదు.

3. **ధ్యానం సిద్ధులు పొందటానికి కాదు** – సిద్ధులు లేవని అనటం లేదు. అవి ఆబ్జెక్టుకు చెందుతాయి కాని సబ్జెక్టు అయిన మీకు చెందవు. అందువల్ల మీకు మోక్షం కావాలంటే, సిద్ధుల వెంట పడకూడదు.

ధ్యానం ఎందుకు చేయాలి? జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం, నిదిధ్యాసనంకోసం.

1. **జ్ఞానయోగ్యతాప్రాప్తి** – ధ్యానం మనస్సును శుద్ధి చేస్తుంది, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. నేలలో విత్తనం నాటేముందు, నేలను చదును చేసి, నీరు పోసి, అవసరమైన ఎరువులు వేసి, దాన్ని సిద్ధం చేస్తారు. అలా జ్ఞానయోగ్యతాప్రాప్తికి ధ్యానం, మనస్సును సిద్ధం చేస్తుంది.

2. **నిదిధ్యాసనం** – శాస్త్రంయొక్క శ్రవణ, మననాలు చేసి, నిశ్చయజ్ఞానం పొందాక, మనస్సులో ఉన్న విపరీతభావనలను పారద్రోలటానికి చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు.

ఉపాసనకీ, నిదిధ్యాసనానికీ మధ్య భేదం ఉంది. ఉపాసన జ్ఞానం పొందకముందు చేస్తారు. అది జ్ఞానయోగ్యతాప్రాప్తికి తోడ్పడుతుంది. అందులో భగవంతుని నామం ఏదైనా తీసుకుని, ఆ నామజపం చేస్తారు. నిదిధ్యాసనం నిశ్చయజ్ఞానం కలిగాక చేస్తారు. మనస్సును శూన్యం చేయరు. ఆలోచనలను ప్రయత్నపూర్వకంగా తెచ్చుకుంటారు. వేదాంతంలో నేర్చుకున్న కొన్ని అంశాలను మీకు అన్వయించుకుని, వాటిమీద ధ్యానం చేస్తారు. ఆత్మ నిత్యం, సత్యం, అకర్తా అభోక్తా అని నేర్చుకున్నవి నేను నిత్యం, నేను సత్యం, నేను అకర్తా అభోక్తా అని పదేపదే తలచుకోవాలి. అవి సుప్తచేతనంలోకి జీర్ణమవాలి. ఈ ఉపాసనకు పతంజలి యోగసూత్రాల్లో చెప్పబడిన ధారణ, ధ్యానం, సమాధి కూడా తీసుకుంటాము.

1. **ధారణ** – ధారణ అంటే ఏకాగ్రత చూపటం. బాహ్యప్రపంచంనుంచి దృష్టిని మరల్చి, ధ్యానం చేసే వస్తువుమీద దృష్టి నిలపాలి. మనస్సును శూన్యం చేయమనటం లేదు, ఆలోచనలు ఉండాలనే చెబుతున్నాము.

2. **ధ్యానం** – ధ్యానం అంటే ధ్యానవస్తువుమీద మనస్సును నిలపటం. ధారణ, ధ్యానం ఇంచుమించు ఒకటే. ధారణ అంటే ఒక వస్తువుమీద దృష్టి పెట్టటం, ధ్యానం అంటే ఆ దృష్టిని దానిమీదే నిలపటం. ఉదాహరణకు ఒక ఫోటో తీయాలంటే, ముందు ఒక వ్యక్తి మీద దృష్టిపెట్టి, తరువాత ఏకాగ్రత చెదరకుండా, ఫోటో తీసేవరకూ, అతనిమీదే కెమెరా దృష్టిని నిలపటం.

3. **సమాధి** – ధ్యానవస్తువుమీద మనస్సును నిలబెట్టటం ధ్యానం అయితే, ధ్యానవస్తువులో సహజంగా స్థిరపడటం సమాధి అవుతుంది. ధ్యానంలో చిన్న యుద్ధం చేయాలి మనస్సుతో. సమాధిలో యుద్ధం ముగిసి, మనస్సు నిలకడ చెందుతుంది.

ఈ సూత్రాలను పాటించి నిదిధ్యాసనం చేయాలి. నిదిధ్యాసనంలో ఆలోచనల ప్రవాహం ఉండాలి. అది అహం బ్రహ్మ అస్మి ఆలోచన.

## 34. ఉపాసనకు బహిరంగ సాధనలు

కృష్ణపరమాత్మ ఒక అధ్యాయం మొత్తాన్ని ఉపాసనయోగానికి కేటాయించాడు. దాన్ని **ఆత్మసంయమయోగం** అంటారు. అందులో కృష్ణపరమాత్మ ధ్యానం చేయటానికి కొన్ని బహిరంగ సాధనలను కేవలం ధ్యానం చేసేముందే కాకుండా, రోజంతా పాటించటానికి సూచించాడు. వీటిని సామాన్య సాధనలు అని కూడా అంటారు. అంతరంగ సాధనలను ధ్యానం చేసే ముందు పాటించాలి. వీటిని విశేష సాధనలు అనికూడా అంటారు.

ఇందులో బహిరంగసాధనలు చూద్దాము. అవి కర్మయోగం, ఆత్మకృప, ఆత్మ నియంతృత్వం, మధ్యేమార్గం.

1. **కర్మయోగం** – మొదటి సాధనగా కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని పేర్కొన్నాడు. ఎందుకంటే కేవల కర్మఠుడు ధ్యానాన్ని ఏకాగ్రతతో చేయలేడు. కర్మయోగి గురించి చూస్తూ వస్తున్నాము. కర్మయోగి ఈశ్వరార్పణభావనతో పనులు చేసి, ఈశ్వరప్రసాదబుద్ధితో ఫలాన్ని స్వీకరిస్తాడు కాబట్టి, అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ధ్యానం చేసేటప్పుడు మాత్రమే కాదు, రోజంతా! దీన్ని సమత్వం అంటాడు కృష్ణపరమాత్మ. కర్మయోగి తీవ్రంగా స్పందించడు. అతను ధ్యానంలో కూర్చున్నప్పుడు చిన్నచిన్న చికాకులను మర్చిపోయి, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోగలడు. అందువల్ల ధ్యానయోగి కావాలంటే, ముందు కర్మయోగి అయివుండాలి.

2. **ఆత్మకృప** – ఎప్పుడూ మిమ్మల్ని మీరు కించపరచుకోకూడదు. మీరు దేవుని సృష్టినుంచి వచ్చారు, దేవునికి చెందినవారు కాబట్టి, మీకంటూ గొప్ప లక్షణాలు లేకపోయినా, మీరు గొప్పవారు. నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మీమీద మీకు నమ్మకం లేకపోతే, మీకు ఎవరైనా బాహ్యంగా సహాయం అందించినా అందుకోలేరు. మీకు ఈశ్వరకృప, గురుకృప, శాస్త్రకృప మెండుగా ఉన్నా ఆత్మకృప లేకపోతే ఇవేవీ పని చేయలేవు.

విధిని నమ్ముకునే వారికి మనమేమీ బోధించలేము. వారు నాకు మోక్షం రావాలని రాసిపెట్టి ఉంటే, నేను మోక్షం పొందుతాను, లేకపోతే పొందలేను అంటారు. అలా కాకుండా ఫ్రీవిల్‌ను ఉపయోగించి నేను ధ్యానంవల్ల లాభం పొందుతాను అనుకోగలగాలి.

3. **ఆత్మ నియంతృత్వం** – భగవంతుడు ఈ శరీరమనే పరికరాన్ని మీకు ఇచ్చాడు. శరీరంతో పాటు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి అన్నీ ఇచ్చాడు. వాటిని మీరు నియంత్రిస్తేనే, అవి మీ మాట వింటాయి. లేకపోతే వాటికి మీరు బానిసలవుతారు. అంతేకాదు, ఈ పరికరాలేవీ మీ స్వంతం కాదు. ఇవన్నీ మీరు వాడుకోవటానికి భగవంతుడు ఇచ్చాడు, వాటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తీసేసుకునే హక్కు భగవంతునికి ఉంది. భగవంతుడు అడిగినప్పుడు, ఆయనకు కృతజ్ఞతలు చెబుతూ, సంతోషంగా తిరిగి ఇవ్వగలగాలి.

4. **మధ్యేమార్గం** – ఏదీ అతిగా చేయకూడదు. శాస్త్రం కూడా ఇంద్రియసుఖాలను అనుభవించవచ్చు అంటుంది. కాని దానికి కూడా ఒక హద్దు ఉంటుంది. అతిగా తీసుకుంటే

అమృతం కూడా విషమవుతుంది. ఏదీ అతిగా చేయకూడదు – అతిగా పని చేయకూడదు, అతిగా విశ్రాంతి తీసుకోకూడదు, అతిగా తినకూడదు, అతిగా ఉపవాసం చేయకూడదు, అతిగా నిద్రపోకూడదు, అతిగా ఆనందాల్లో మునిగి తేలకూడదు.

**మాట్లాడేందుకు నియమాలు** – కృష్ణపరమాత్మ ఎలా మాట్లాడాలో నిర్దేశించటానికి నాలుగు నియమాలను సూచించాడు.

ఎ) **అనుద్వేగకరం** – మీ మాటలు ఇతరుల మనస్సును బాధించకుండా ఉండాలి. శారీరక దెబ్బకన్నా, మానసికదెబ్బ బాధ ఎక్కువకాలం ఉంటుంది.

బి) **సత్యం** – మీ ఆలోచన, మీ వాక్కు ఒక్క తాటిమీద నడవాలి. రెండింటి మధ్యా సమతుల్యత ఉండాలి.

సి) **ప్రియం** – ప్రియం అంటే మర్యాదగా, మన్ననగా మాట్లాడాలి. హావభావాలు, గొంతులోని మాధుర్యం అన్నీ ప్రియంగా ఉండాలి.

డి) **హితం** – మీరు మాట్లాడేది ఎదుటివారికి లాభదాయకమా, కాదా బేరీజు వేసుకోవాలి.

ఆహారం కూడా మితంగా ఎలా తీసుకోవాలో స్వామీజీ వివరిస్తున్నారు. మనం కడుపును నాలుగు భాగాలుగా మానసికంగా చేయాలి. అందులో రెండు భాగాలను అన్నంతో నింపాలి. మూడవ భాగాన్ని నీటితోనూ, మజ్జిగతోనూ నింపాలి. నాలుగవ భాగాన్ని అలా వదిలేయాలి. మితభుక్ హితభుక్ అంటారు. దానికి తేలిక సూత్రం, ఇంకా కొంచెం తినగలను అనిపించగానే, తినటం ఆపేయాలి. అలాగే అతిగా తినకూడదు, అతి తక్కువగానూ తినకూడదు.

అలాగే నిద్ర కూడా అతిగా నిద్రపోకూడదు, అతిగా మేలుకోకూడదు. వీటన్నింటి వెనుకనున్న సామాన్యసూత్రం – **ఉన్నతంగా ఆలోచించు, సాధారణంగా జీవించు**.

ధ్యానం ఎందుకు చేస్తున్నారో ముందు అర్థం చేసుకోవాలి. శ్రవణ, మననాలు చేసే ముందు మనస్సును సిద్ధం చేసుకోవటానికి చేస్తే, నిశ్చయజ్ఞానం పొందాక, ఆ బోధను జీర్ణించుకోవటానికి నిదిధ్యాసనం చేస్తారు. వివేకానందులవారు అంటారు, 'అసలైన ధ్యానంలో శరీరాన్ని మర్చిపోతారు. మీ శరీరాన్ని కోసినా, ఆ బాధ మీకు తెలియదు.' ధ్యానంలో అంత ఆనందం పొందుతారు. మనస్సు, శరీరం దూదిపింజలా చాలా తేలికగా అవుతాయి. అంతటి విశ్రాంతిని పొందుతారు ధ్యానంలో.

## 35. ఉపాసనకు అంతరంగ సాధనలు

ఇంతకుముందు దానిలో ఉపాసనకు బహిరంగ సాధనలు చూశాము. వాటిని ప్రతి వ్యవహారంలోనూ పాటించాలి. అంతరంగ సాధనలు సరిగ్గా ధ్యానం చేయబోయే ముందు పాటించాలి. వీటిని పాటిస్తే ధ్యానఫలితం బాగుంటుంది. ధ్యానం సరిగ్గా చేస్తేనే ప్రశాంతత చేకూరుతుంది. అలాంటి అంతరంగసాధనలను కృష్ణపరమాత్మ ఎనిమిది చెబుతున్నాడు. వాటిని ఈ వరుసక్రమంలో చూద్దాము. అవి దేశం, కాలం, ఆసనం, శరీరస్థితి, ప్రాణస్వామ్యం, ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, బుద్ధినిశ్చయం.

1. **దేశం** – ధ్యానం చేసే ప్రదేశం. అది ఏకాంత ప్రదేశమై ఉండాలి. వీలున్నంత ప్రశాంతంగా ఉండాలి, మైకుల రొదలు, కుక్కల అరుపులు అండకూడదు. ఒంటరిగా చేయాలి. నలుగురితో కలిపి చేస్తే, కబుర్లతో గడిచిపోవచ్చు. ఆధ్యాత్మికంగా శుద్ధప్రదేశమై ఉండాలి. ధ్యానం చేసే చోట దేవుని పటం పెట్టుకుని, దీపం వెలిగించి, ధ్యానం చేస్తే మంచిది.

2. **కాలం** – ధ్యానం చేసే సమయం. మన సాంప్రదాయంలో ధ్యానం చేయటానికి ప్రాతఃకాలం మంచి అనువైన సమయం అంటారు. అప్పుడు మనస్సు సాత్త్వికస్థితిలో ఉంటుంది. బాగా నిద్రపోయారు కాబట్టి తామసికస్థితిలో ఉండరు. ఇంకా కార్యక్రమాలు చేపట్టలేదు కాబట్టి రాజసికస్థితి మొదలవదు.

3. **ఆసనం** – కూర్చుని చేయాలి, నిల్చుని చేయకూడదు. కింద కూర్చోగలిగితే మంచిదే కాని, కూర్చోలేకపోతే, ఎక్కడ కూర్చుంటే హాయిగా ఉంటుందో, అక్కడ కూర్చోవచ్చు. పూర్తిగా నేలమీద కూర్చోకూడదు. ఒక ఆసనం వేసుకోవాలి. అది మరీ గట్టిగా ఉండకూడదు, మరీ మెత్తగా ఉండకూడదు. మరీ ఎత్తుగా ఉండకూడదు, మరీ కిందికి ఉండకూడదు.

4. **శరీరస్థితి** – కదలకుండా, నిశ్చలంగా కూర్చోవాలి. కిందభాగం ఎక్కువ ఉంటే, అంటే కాళ్ళు వీలున్నంత వెడల్పుగా పెడితే, నిశ్చలంగా కూర్చోవటానికి వీలుంటుంది. అంతేకాదు, శరీరాన్ని, మెడని, శిరస్సును నిటారుగా ఉంచాలి. అలాగని బిగుసుకుపోకూడదు. విశ్రాంతిగా ఉండాలి.

5. **ప్రాణస్వామ్యం** – శ్వాస కూడా సమానంగా, మెత్తగా, విశ్రాంతిగా రావాలి. మీ ఆలోచనలకూ, శ్వాసకూ మధ్య అనుబంధం ఉంటుంది. అందువల్ల ఊపిరి సమంగా లేకపోతే, మనస్సు కలత చెందుతుంది. నిజానికి శ్వాసను అదుపులో పెట్టుకోవటంవల్ల, మనస్సును అదుపులో పెట్టుకోగలరు. అందువల్ల ప్రాణాపాన వాయువులను సమస్థితిలో నడపాలి.

6. **ఇంద్రియనిగ్రహం** – ఇంద్రియాలకు మనస్సును ప్రభావితం చేసే శక్తి ఉంది. టీవీలోంచి మీకిష్టమైన పాట వస్తుంటే, మనస్సు అటు వెళ్ళిపోతుంది. అందువల్ల ఇంద్రియాలను

అదుపులో పెట్టుకోవాలి. కళ్ళను పూర్తిగా తెరుచుకుంటే ఏకాగ్రత కుదరదు; పూర్తిగా మూసుకుంటే నిద్రలోకి జారుకునే ప్రమాదం ఉంది. అందువల్ల కళ్ళను పూర్తిగా తెరిచీ ఉంచక, పూర్తిగా మూయక, అర్ధనిమీలిత నేత్రంగా ఉంచాలి.

కళ్ళను సగం మూసి నాసికాగ్రాన్ని చూడాలి. స్వామీజీ ఈ సందర్భంలో, ఈ వివరాలన్నీ సూచనలు మాత్రమే. నిబంధనలు కాదు అని చెబుతున్నారు. వాటిని అక్షరాలా తీసుకోకూడదు. ముక్కు చివర చూస్తుంటే, కళ్ళు అరమోద్పులవుతాయి. శంకరాచార్యులవారు ఈ విషయంలో ఒక వివరణ కూడా ఇస్తారు. ముక్కుచివర చూడమంటే, దాన్నే పట్టుకు కూర్చోకూడదు. అది ముక్కు ధ్యానం అవుతుంది. దానివల్ల చిత్తశుద్ధి కలగదు. కళ్ళను సగం మూస్తే, అది ఇంద్రియ నిగ్రహానికి సూచన.

7. **మనోనిగ్రహం** – మనస్సును నిగ్రహించుకోవాలి. ఒక్కొక్క అంతరసాధనకు వెళ్ళినకొద్దీ, అది మరింత కష్టమవుతూ వస్తుంది. మనస్సును నిగ్రహించుకోవటం చాలా కష్టం. ధ్యానం చేసే 15 నిముషాలు మీరు వేసే పాత్రలనీ మర్చిపోవాలి. నేను తండ్రిని, నేను భర్తను, నేను ఉద్యోగిని – ఇవన్నీ మర్చిపోవాలి. వాటితో కూడిన బెంగలను కూడా మర్చిపోవాలి. ఏదైనా బంధం ఉండితీరాలంటే భగవంతునితోనో, గురువుతోనో బంధం గుర్తు పెట్టుకోండి. ఆ ఇద్దరితో ఏ సమస్యా ఉండదు.

కైవల్యోపనిషత్తులో గురువును తలుచుకోమని వస్తుంది. ఎందుకంటే గురువును తలుచుకుంటే, గురువు చేసిన బోధ గుర్తుకు వస్తుంది. అందువల్ల భక్తునిగానో, శిష్యునిగానో, సన్న్యాసిగానో ధ్యానం చేయండి.

8. **బుద్ధినిశ్చయం** – ఈ ధ్యానం మీకు తోడ్పడుతుందని మీ బుద్ధికి నచ్చచెప్పాలి. ధ్యానంయొక్క ప్రయోజనం గురించి తెలియకుండా ధ్యానం చేస్తే అది యాంత్రికంగా మారుతుంది. కొంతమంది పూజ, సంధ్యావందనం ఎవరో తరుముకు వస్తున్నట్టు హడావుడిగా చేసి ముగిస్తారు. అలా చేయకూడదు. అలాగే ధ్యానంలో కూర్చుని ఆరోజు చేసే పనులను ప్రణాళిక వేసుకోకూడదు.

శాస్త్ర అధ్యయనం చేస్తే మీకే తెలుస్తుంది నిదిధ్యాసనం ఎంత అవసరమో. అప్పుడు మీరే బుద్ధికి నచ్చచెప్పుకుంటారు. ఈ నమ్మకంతో అనువైన ప్రదేశంలో, అనువైన సమయంలో, అనువైన ఆసనంలో కూర్చుని, ఇంద్రియాలను, మనస్సును, శ్వాసను నియంత్రించుకుని, బుద్ధికి నచ్చచెప్పుకుని ధ్యానానికి కూర్చోవాలి. గుర్తుంచుకోండి. ఈ ఎనిమిది దశలు అసలు ధ్యానం కాదు. అవి ధ్యానానికి మిమ్మల్ని సంసిద్ధులను చేసే అంతరంగసాధనలు మాత్రమే.

## 36. జ్ఞానయోగం

శాస్త్రం మనిషికోరే నాలుగు పురుషార్థాలను వివరించి, వాటిని సాధించటానికి మూడు మార్గాలను సూచించింది. అవి కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం. వీటిల్లో మనం కర్మయోగం గురించీ, ఉపాసనయోగం గురించీ చూశాము. ఇప్పుడు జ్ఞానయోగం గురించి చూద్దాము.

జ్ఞానయోగం అంటే జ్ఞానసముపార్జనకు వాడే పద్ధతి. దేని గురించిన జ్ఞానం? జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానం, మనలను గురించి మనం తెలుసుకోవటం. దాన్ని ఆత్మవిద్య అంటారు. మనలను గురించి మనం తెలుసుకోవటం అంటే, 'నా గురించి నేను కొత్తగా తెలుసుకునేది ఏముంది? నేనెవరు, నా ఉద్యోగమేమిటి, నా తల్లిదండ్రులు ఎవరు, అన్నీ నాకు తెలుసు కదా,' అనిపించవచ్చు మీకు. కాని శాస్త్రం అది ఆత్మవిద్యలోకి రాదు అంటుంది. మీ గురించి మీకు తెలిసిన విషయాలు పైపై విషయాలు, లేకపోతే లౌకిక వివరాలు.

కాని ఆత్మవిద్య అంటే మీ గురించిన ముఖ్యమైన విషయం లేదా అసలు విషయం తెలుసుకోవటం. దాన్ని అసలు నేను, ఉన్నతమైన నేను అనవచ్చు. దాన్ని పరాప్రకృతి అంటారు. శాస్త్రంలో అసలు నేనుని ఆత్మ అంటారు. కాబట్టి జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానయోగం.

జ్ఞానయోగం అత్యుత్తమ పురుషార్థమైన మోక్షాన్ని పొందటానికి ఉపయోగపడుతుంది. ధర్మార్థకామమోక్షాలను పురుషార్థాలంటారని చూశాము. మోక్షం అంటే బంధకత్వంనుంచి లేదా ఆధారపడటంనుంచి స్వేచ్ఛ పొందటం. దేనితో బంధం? తక్కిన మూడు పురుషార్థాలతో బంధం.

ఈ బంధం రెండు రకాలు. ఒక వస్తువు గాని, ఒక వ్యక్తి గాని ఎదురుగా ఉంటే భారంగా ఉంటుంది. ముఖ్యంగా తోటి మనుష్యులతో ఏర్పడే సంబంధబాంధవ్యాలలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అలాగని ఎవరూ లేకపోతే ఒంటరితనం వేధిస్తుంది. జీవితం శూన్యంగా అనిపిస్తుంది. ఉంటే ఒక బాధ, లేకపోతే ఇంకొక బాధ. మనకు మనుష్యులు కావాలో వద్దో తేల్చుకోలేకపోతున్నాము.

మోక్షం అంటే ఈ రెండు బంధాలూ ఉండవు. మనిషి ఎదురుగా ఉంటే ఒత్తిడికి లోనవటమూ ఉండదు, దూరమయితే శూన్యతా భావమూ ఉండదు. ఆ విధంగా ప్రపంచం చూపే నియంతృత్వంనుంచి విముక్తి చెందుతారు. ప్రపంచంలోని వస్తువులు ఉన్నా, లేకపోయినా ఆనందంగా ఉండగలగటమే మోక్షం. ఈ మోక్షం ఆత్మజ్ఞానంవల్ల పొందుతారు.

ఆత్మజ్ఞానం పొందటం ఎలా? ఏ జ్ఞానం సంపాదించాలన్నా కూడా దానికి ఒకటే పద్ధతి ఉంది. జ్ఞానసముపార్జనకి ఒక పరికరం కావాలి. దాన్ని ప్రమాణం అంటారు. మనకు పంచజ్ఞానేంద్రియాలు ఉన్నాయి. అవి కళ్ళు, చెవులు, చర్మం, ముక్కు, నోరు. వాటితో మనం

శబ్దస్పర్శరూపరసగంధాలను (అదే వరుసలో లేవు) అనుభవిస్తాము. వీటి ద్వారా ప్రపంచం గురించిన ప్రత్యేక జ్ఞానం పొందుతాము. అందువల్ల పంచజ్ఞానేంద్రియాలను ప్రత్యక్ష ప్రమాణం అంటారు. వీటిని ఆధారంగా చేసుకుని మరో నాలుగు ప్రమాణాలు ఉన్నాయి. అవి అనుమాన ప్రమాణం, అర్థాపత్తి ప్రమాణం, ఉపమానం, అనుపలబ్ధి.

వీటిలో ఎప్పుడు ఏ ప్రమాణం వాడాలి? ఆ ప్రమాణం మనం తెలుసుకోవాలనుకుంటున్న వస్తువుమీద ఆధారపడివుంటుంది. మనం రంగు గురించి తెలుసుకోవాలనుకుంటే, కన్ను అనే ప్రమాణం వాడాలి. నేను చెవులు వాడతానంటే, గుడ్డివాడు రంగుల ప్రపంచాన్ని చూడలేనట్టుగా మీరు కూడా రంగుల ప్రపంచాన్ని చూడలేరు.

సరే, ఇప్పుడు ఆత్మజ్ఞానం పొందటానికి ఏ ప్రమాణం వాడాలి? మీకు అందుబాటులో ఉన్న ఐదు ప్రమాణాలూ, బాహ్యప్రపంచాన్ని అంటే ఆబ్జెక్టును అంటే వస్తువును(కర్మను) మాత్రమే తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి తప్పితే, వీటిలో ఏవీ వాటివెనుక ఉన్న సబ్జెక్టు, అంటే కర్తయైన మిమ్మల్ని చూడవు. అక్షరాలా మీ కళ్ళలాగా. మీ కళ్ళు బాహ్యప్రపంచాన్ని చూడగలవు కాని మిమ్మల్ని చూడలేవు. కర్తను కర్మలాగా చూడలేరు. కర్త, కర్మలాగా అందుబాటులో లేదు. ఇలా అయితే ఆత్మజ్ఞానం ఐదు ప్రమాణాలకు అందదు, సైన్సుకు కూడా అందదు. మరేదైనా మార్గం ఉందా?

కళ్ళను చూడటానికి ఇంకో బాహ్యవస్తువు కావాలి. మీ కళ్ళను చూసుకోవటానికి అద్దం కావాలి. అలాగే ఆత్మజ్ఞానం విషయంలో కూడా ఈ పంచప్రమాణాలు సరిపోవు. దీనికి ఆరవ ప్రమాణం కావాలి. దాన్ని శాస్త్రప్రమాణం లేదా శబ్దప్రమాణం అంటారు. ఇది అపౌరుషేయప్రమాణం. పంచజ్ఞానేంద్రియాలను ఎలా ప్రత్యక్షప్రమాణాలుగా స్వీకరిస్తామో, అలా శాస్త్రమనే దర్పణాన్ని కూడా ఆరవ ప్రమాణంగా స్వీకరించాలి. అంతేకాదు, శాస్త్రమనే ప్రమాణం ఇచ్చిన జ్ఞానాన్ని వేరే ఏ ప్రమాణం కూడా అవుననీ నిరూపించలేదు, కాదనీ ఖండంచలేదు. ఉదాహరణకు కన్ను చూసిన గులాబీపువ్వును చెవి అవుననీ నిరూపించలేదు, చెవి కాదనీ ఖండించలేదు.

అద్దం ఉండగానే సరిపోదు. దాన్ని ఎలా వాడాలో తెలియాలి. ఏది ముందువైపో, ఏది వెనకవైపో తెలియాలి. అలాగే శాస్త్రాన్ని సరిగ్గా అధ్యయనం చేయాలి. శాస్త్రాన్ని మనం స్వంతంగా అధ్యయనం చేస్తే, సరిగ్గా అర్థం చేసుకోలేము. అర్థం చేసుకోకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అందువల్ల శాస్త్రాన్ని గురువు ద్వారానే అధ్యయనం చేయాలి. కృష్ణపరమాత్మ కూడా శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు వద్దనే నేర్చుకోవాలి అంటాడు.

గురువుకోసం మీరు వెతుక్కుంటూ వెళ్ళనవసరం లేదు; 21, 22 అంశాల్లో వివరించిన సాధన చతుష్టయ సంపత్తిని అలవరచుకుని, జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందితే, సరియైన

సమయం ఆసన్నమవగానే, కృష్ణపరమాత్మే మీకు గురువును ఏర్పాటు చేస్తాడు లేదా అర్జునునికి బోధించినట్టుగా తనే స్వయంగా బోధ చేస్తాడు.

## 37. జ్ఞానయోగానికి సాక్షాత్ సాధనలు

ముందు అంశాల్లో జ్ఞానయోగం అంటే ఆత్మవిద్య అనీ, ఆత్మజ్ఞానమొక్కటే మోక్షపురుషార్థాన్ని ఇస్తుందనీ చూశాము. అంతేకాదు, జ్ఞానం పొందాలంటే ముందు జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందాలనీ, అది సాధన చతుష్టయ సంపత్తి అనీ చూశాము.

ఒక సాధకుని ప్రయాణం ఈ దశల్లో సాగాలి. కర్మయోగం పాటించి చిత్తశుద్ధిని పొంది, ఉపాసనయోగం పాటించి చిత్తఏకాగ్రతను పొంది, జ్ఞానయోగానికి వచ్చి జ్ఞానం పొందాలి. ఈ దశలు దాటకుండా సరాసరి జ్ఞానానికి వస్తే జ్ఞానం పొందుతారేమో కానీ, దానివల్ల ఆధ్యాత్మికంగా ఎదగలేరు. తక్కిన జ్ఞానాల్లాగా అది కూడా ఒక జ్ఞానంగా మిగిలిపోతుంది.

అర్హత పొందిన వ్యక్తిని అధికారి అంటారు. ఈ అధికారి జ్ఞానయోగాన్ని ఎలా పొందాలి? శాస్త్రం దానికి మూడు దశలను నిర్దేశించింది. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

1. **శ్రవణం** – శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు సమర్థవంతమైన గురువు దగ్గర శాస్త్ర అధ్యయనం చేయటం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. శ్రవణం దశలో గురువుమీద, శాస్త్రంమీద శ్రద్ధ పెట్టుకుని, ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా, వినాలి. శ్రద్ధ పెట్టుకోమన్నారని, గుడ్డినమ్మకం పెట్టుకోనవసరం లేదు. కాని శ్రవణం దశలో గురువు చెప్పింది వింటూపోవాలి. మధ్యలో ఏమైనా సందేహాలు కలిగినా, అప్పుడు అడగకుండా, విడిగా రాసిపెట్టుకోవాలి. అలా వింటూ ఉంటే మీకు కలిగే సందేహాలు చాలా మటుకు వాటంతటవే తీరిపోతాయి. అజ్ఞానం పోయి, జ్ఞానం పొందే వరకూ వినాలి. శ్రవణం అంటే **అజ్ఞాన నివృత్తి**.

2. **మననం** – శ్రవణం దశలో అనేక సందేహాలు కలుగుతాయి. గురువును ప్రశ్నలు అడగండి. గురువు ప్రశ్నలకు భయపడడు. జవాబులు చెప్పటానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. నిజానికి మన ఉపనిషత్తులు గురుశిష్య సంవాదరూపంలో ఉంటాయి. భగవద్గీతను కూడా కృష్ణార్జున సంవాదం అంటారు. అర్జునుడు, కృష్ణపరమాత్మను అనేక ప్రశ్నలు అడుగుతూనే వస్తాడు; కృష్ణపరమాత్మ కూడా ఎక్కడా విసుక్కోకుండా జవాబు చెబుతూనే వస్తాడు.

సందేహాలు తీర్చటానికి సిద్ధిగ్రంథాలు ప్రత్యేకంగా ఉన్నాయి. మనం ఎటువంటి ప్రశ్నలను వేయాలో అవే సూచిస్తాయి. ఏదైనా అర్థం కాకపోతే శాస్త్రాన్ని ప్రశ్నించకూడదు, మనమే సరిగ్గా అర్థం చేసుకున్నామో లేదో చూడాలి. శాస్త్రం నిస్సంశయ జ్ఞానం పొందటానికి

దోహదం చేస్తుంది. ఎందుకంటే సందేహంతో కూడిన జ్ఞానం, అజ్ఞానంతో సమానం. మననం అంటే **సంశయ నివృత్తి**.

3. **నిదిధ్యాసనం** – బుద్ధిలో నిశ్చయజ్ఞానం కలగగానే సరిపోదు, అది మానసికశక్తిగా మారాలి. నిదిధ్యాసనాన్ని అనేక విధాలుగా చేయవచ్చు. మళ్ళీ శ్రవణం చేయవచ్చు, మీరు రాసుకున్న నోట్సుని చదువుకోవచ్చు, ఇంకొకరికి బోధ చేయవచ్చు. శాస్త్రం వివరించే పద్ధతి సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం. దానికి ఆత్మసంయమయోగంలో వివరించిన అంతరంగ సాధనలు పాటిస్తూ, మీరు పొందిన నిస్సంశయ జ్ఞానంలోంచి ఆత్మ గురించిన వాక్యాలను మీ పరంగా మనస్సులో పదేపదే తలచుకోవాలి. ఉదాహరణకు ఆత్మ నిత్యం, ఆత్మ సత్యం వాక్యాలను నేను నిత్యం, నేను సత్యం అని పదేపదే అనుకోవాలి. అలా సుప్తచేతన మనస్సుకు పంపించకపోతే, మీరు పొందిన జ్ఞానం చేతన మనస్సులోనే ఉండిపోతుంది. అప్పుడు సుప్తచేతన మనస్సులో పాత సంసారి, అజ్ఞాని అలాగే తిష్ఠ వేసుకుని కూర్చుని ఉంటారు.

కాఫీలో పంచదార ఎన్ని చెంచాలు వేసుకున్నా, దాన్ని బాగా కలపకపోతే కాఫీ తీయగా ఉండదు. పంచదార కాఫీలో అంతటా ఉండాలంటే దాన్ని బాగా కలపాలి. అలాగే మీరు నేర్చుకున్న జ్ఞానం మీలో అంతటా నిండాలంటే, దానికి ధ్యానం చేయాలంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఆ జ్ఞానం ప్రతిక్షణమూ, ముఖ్యంగా క్లిష్టపరిస్థితుల్లో మనకు తోడ్పడేలా ఉండాలి. అలా జ్ఞానాన్ని ప్రజ్ఞగా మార్చుకున్న వ్యక్తిని జ్ఞాననిష్ఠలో ఉన్నాడంటారు. దీనికి స్వామీజీ ఒక గ్రీకు వ్యాపారస్థుని ఉదంతం చెబుతారు. అతని సరుకులను మోసుకొస్తున్న ఓడ నీటిలో మునిగిపోయిందనీ, బాగా నష్టం వస్తుందనీ వార్త మోసుకొచ్చారెవరో. ఆ దారుణమైన వార్త వినగానే ముందు కంగారుగా 'ఏమిటీ!' అన్నాడుట. కాని వెంటనే నిలదొక్కుకుని, తను నేర్చుకున్న జ్ఞానాన్ని గుర్తు తెచ్చుకుని, 'అయితే ఏమిటి?' అన్నాడుట. అదీ తేడా. జ్ఞానికీ, అజ్ఞానికీ.

ప్రతి ఒక్కరికీ చిన్నప్పటినుంచీ పోగేసుకున్న అనేక భావాలు సుప్తచేతన మనస్సులో వాసనల రూపంలో నిక్షిప్తమై ఉంటాయి. వాటిని విపర్యయ భావాలు అంటారు. ఆ విపర్యయ భావాలను పారద్రోలి, జ్ఞాననిష్ఠలో నిలబడటానికి, నిదిధ్యాసనం తోడ్పడుతుంది. నిదిధ్యాసనం అంటే **విపర్యయ నివృత్తి**.

ఆ విధంగా శ్రవణం అంటే **అజ్ఞాన నివృత్తి**, మననం అంటే **సంశయ నివృత్తి**, నిదిధ్యాసనం అంటే **విపర్యయ నివృత్తి**. ప్రతి ఒక్కరూ జీవితంలో కోరుకునేది శాంతి, భద్రత, ఆనందాలే అని అంతకుముందు అంశాల్లో చూశాము. ఆత్మజ్ఞానం పొందితే నేను శుద్ధస్వరూపుడను, నేను పరిపూర్ణుడను, నేను ఆనందస్వరూపుడను, నేను ప్రేమతత్త్వాన్ని అని అర్థం చేసుకుంటారు. స్వామీజీ అంటున్నారు, 'మీరే ప్రేమతత్త్వం కాబట్టి మీలో కరిగిపోనంత ప్రేమ ఉంది.

ఎవరినీ నన్ను ప్రేమించమని బ్రతిమాలనవసరం లేదు. నిజానికి ఎవరైనా నేను నిన్ను ప్రేమించటం లేదన్నా కూడా, మీరు నిశ్చింతగా చెప్పవచ్చు; అది నీ సమస్య, నువ్వు నన్ను ప్రేమించినా, ప్రేమించకపోయినా నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్నే కాదు ఈ ప్రపంచం మొత్తాన్ని ప్రేమిస్తున్నాను అని చెప్పవచ్చు.'

## 38. జ్ఞానయోగానికి సహకారీ సాధనలు

జ్ఞానయోగానికి సాక్షాత్ సాధనలు శ్రవణం, మననం, నిదిధ్యాసనం అని చూశాము. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు దగ్గర శాస్త్ర అధ్యయనం చేయటం. శ్రవణం అంటే అజ్ఞాన నివృత్తి, మననం అంటే సంశయ నివృత్తి, నిదిధ్యాసనం అంటే విపర్యయ నివృత్తి, ఈ సాధనలు చేయాలంటే, సాధకుడు PORT reduction, CLASP rejection చేయటం నేర్చుకోవాలి అంటారు స్వామీజీ.

**PORT** – PORT అంటే ఏమిటి? లౌకిక బంధాలు తగ్గించుకోవటం అని చెప్పవచ్చు. P అంటే Possessions; O అంటే Obligations; R అంటే Relationships; T అంటే Transactions. వాటిని వరుసగా తెలుగులో చూస్తే ఆస్తిపాస్తులు, మొహమాటాలు, బంధుత్వాలు, వ్యవహారాలు. ఈ నాలుగూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. అందువల్ల ఒకటి పెరిగితే, తక్కినవి వాటంతట అవే పెరుగుతాయి. ఉదాహరణకు బంధుత్వాలు పెరిగితే, వారి ఇంట్లో పెళ్ళిళ్ళలకు వెళ్ళాల్సిన మొహమాటాలు పెరుగుతాయి.

అదే విధంగా ఒకటి తగ్గించుకుంటే తక్కినవి కూడా వాటంతట అవే తగ్గుతాయి. ఈ పోర్ట్ అనేది ఆధ్యాత్మిక ఎదుగుదలకు పెద్ద ఆటంకం. ఎందుకంటే అది అంతకంతకూ వ్యవహారాల్లో కూరుకుపోయేలా చేస్తుంది. అందువల్ల జ్ఞానయోగానికి రావటానికి PORT reduction అంటే ఈ పోర్ట్‌ను తగ్గించుకోవటం చాలా అవసరం.

**CLASP** – CLASP అంటే ఏమిటి? CL అంటే CLaiming ownership; A అంటే Anxiety; SP అంటే Special Prayers. వీటిని వరుసగా తెలుగులో చూస్తే అభిమానం, ఆందోళన, సకామ ప్రార్థన.

ఈ అభిమానాన్నే అహంకార, మమకారాలు అంటారు. అహంకారం అంటే నా శరీరం, నా మనస్సు అనుకోవటం; మమకారం అంటే నావారు, నా ఆస్తిపాస్తులు అనుకోవటం. దీన్నే అహం మమ అభిమానం అంటారు. అభిమానం ఉన్నచోట, దాన్ని వెన్నంటే ఆందోళన ఉంటుంది. లౌకికసుఖాలు పొందటంకోసం సకామ ప్రార్థనలు చేస్తారు. జ్ఞానయోగంలోకి అడుగు పెట్టేటప్పుడు, మీరు నిష్కామ ప్రార్థనలే చేయటం అలవరచుకోవాలి. ఎందుకంటే

మీ ప్రార్థనలు లోకక్షేమంకోసం చేసేవి అవుతాయి. అప్పుడు ఈ సకామ ప్రార్థనలు మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆటంకాలవుతాయి.

సన్న్యాసాశ్రమం ఈ CLASP rejection కు సంకేతం. మీరు సన్న్యాసం స్వీకరించ నవసరం లేదు, ఆంతరసన్న్యాసం పెంచుకుంటే చాలు. ఆందోళన రాకుండా ఆపలేరు, కాని మీరు అహంకారమమకారాలను తగ్గించుకుంటే ఆందోళనను పెంచి పోషించకుండా ఉండగలరు. అహంకారమమకారాలను తగ్గించుకోవాలంటే మీ మనశ్శరీరాలతో సహా కుటుంబం, మీ ఆస్తిపాస్తులు, ఏవీ మీవి కావని, అన్నీ ఈశ్వరునికి చెందినవనీ, ఈశ్వరుడు వాటిని మీకు తాత్కాలికంగా ఇచ్చాడని గుర్తుంచుకోవాలి. మీరు వాటికి అధిపతి కాదు, మీరు వాటిని సంరక్షించే ధర్మకర్త మాత్రమే. ఈశ్వరుడు మీకు ఎప్పుడైనా, ఏదైనా ఇవ్వగలడు. అలాగే ఎప్పుడైనా, ఏదైనా, ఆఖరికి మీ శ్వాసకూడా వెనక్కి తీసేసుకునే హక్కు ఉంది ఈశ్వరునికి. ఈ జ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి తోడ్పడుతుంది CLASP rejection.

ఈ రెండూ పాటిస్తే లౌకిక బంధాలను తగ్గించుకుని ఆంతరసన్న్యాసం ఏర్పడుతుంది. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తే ఆత్మజ్ఞానంలో నెలకొని ఉంటారు. ఆత్మజ్ఞానం మీలో జీర్ణించుకుపోయేలా స్వామీజీ ఐదు వేదాంతరత్నాలను రూపొందించారు.

**ఐదు వేదాంతరత్నాలు**

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు నానుంచే వస్తున్నాయి.
3. కేవలం నా ఉనికివల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, అది ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతున్నది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా, అది నన్ను చలింపజేయలేదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. నా స్వరూపనిష్ఠలో నిలబడి, నా జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

ఈ వేదాంతసారం మీ నరనరాల్లోనూ జీర్ణించుకుపోవాలి. అదే విధంగా ఆత్మ లేదా చైతన్యం గురించి చెప్పినప్పుడల్లా స్వామీజీ ఐదు చైతన్యలక్షణాలను కూడా చెబుతూనే ఉంటారు.

**ఐదు చైతన్య లక్షణాలు**

1. చైతన్యం, శరీరంలో ఒక భాగంకాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. చైతన్యం, స్వతంత్ర మైనది. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

నిదిధ్యాసనంలో చైతన్యం గురించి చెప్పిన ఈ ఐదు లక్షణాలనూ మీకు అన్వయించి చెప్పుకోవాలి. అలా ఈ వేదాంతసారాన్ని జీర్ణించుకోగలిగితే మీరు జ్ఞానయోగి అవుతారు.

ఇంకో కోణంలోంచి చెప్పాలంటే కర్మయోగం పాటించేటప్పుడు మీరు త్రిపుటిలో ఉంటారు. అవి జీవ–జగత్తు–ఈశ్వరుడు. జీవుడైన మిమ్మల్ని జగత్తు బాధిస్తోందని భావించి, ఈశ్వరునికి మొరపెట్టుకుంటారు. జ్ఞానయోగానికి వచ్చాక, త్రిపుటినుంచి ద్విపుటికి వస్తారు. ఉన్నవి రెండే – ఆత్మ–అనాత్మ. నేను ఆత్మ–అనాత్మల మేలుకలయిక. ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య అని నేర్చుకుంటారు. అక్కడితో ఆగితే అది పరోక్షజ్ఞానం అవుతుంది. నేను ఆత్మను, నేను సత్యం, ఉన్నదొకటే అద్వైతం. ఆత్మ = బ్రహ్మ. అలా మూడునుంచి రెండుకి వచ్చి, ఒకటిలో నిలబడితే అదే జ్ఞాననిష్ఠ. అదే మోక్షం. మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు. నేను నిత్యముక్తస్వరూపుణ్ణి, నాకు జనన, మరణాలు లేవు అని అర్థం చేసుకుంటారు.

## 39. ఆత్మ గురించి తెలుసుకోవటమెలా?

మీ ఆధ్యాత్మిక ప్రయాణం కర్మయోగంతో మొదలై, జ్ఞానయోగంతో ముగియాలని చూశాము. జ్ఞానయోగం అంటే ఆత్మవిద్యను పొందటం అని కూడా చూశాము. ఆత్మవిద్యను పొందటానికి జగద్గురువైన కృష్ణపరమాత్మే ఉండగా, వేరే గురువెందుకు?

అర్జునుడు వరద గోదావరిలా సుదీర్ఘమైన ప్రసంగం చేశాక, చివరికి అలసిపోయి నాకు ఏమీ తెలియటంలేదు, నేను నీ శిష్యుణ్ణి, నాకు శ్రేయస్కరమైనదేమిటో నువ్వే బోధించు అని శరణువేడాక, కృష్ణపరమాత్మ ఓం ప్రథమంగానే, ఆత్మజ్ఞానాన్ని ఒక్క శ్లోకంలో బోధించేశాడు. అది అధ్యాయం రెండులో, పదకొండవ శ్లోకం.

అజ్ఞానమే మన సమస్యలన్నింటికీ కారణం. దేని గురించిన అజ్ఞానం? ఆత్మను గురించిన అజ్ఞానం. ఆత్మజ్ఞానమే వాటికి పరిష్కారం. ఆత్మ అజ్ఞానం సంసారకారణం, ఆత్మజ్ఞానం మోక్షకారణం. పండితులు శోకించరు అని చెప్పాడు. పండితులు అంటే ఆత్మవిద్యను పొందిన జ్ఞానులు. దేనికి శోకించరు? వారు జీవించి ఉన్నవారికోసం బాధపడరు; మరణించిన వారికోసం బాధపడరు. మనుష్యలకోసమే కాదు, వస్తువుల గురించి కూడా అలాగే బాధపడతాము. అంటే అయిపోయిన వాటి గురించో, రాబోయే వాటి గురించో బాధపడతాము. జ్ఞానులు మనుష్యుల గురించీ, వస్తువుల గురించీ దుఃఖించరు.

ఆత్మ లక్షణాలను తరువాత వచ్చే పన్నెండు శ్లోకాలలో వివరిస్తాడు కృష్ణపరమాత్మ. ప్రతివ్యక్తిలో ఒక చైతన్యం ఉంటుంది. దాన్ని **చిత్** అంటారు. చైతన్యం శరీరం ఉన్నా, లేకపోయినా ఉంటుంది. అలా నిత్యమూ ఉండే చైతన్యాన్ని ఆత్మ అంటారు. శరీరంలో మనస్సు కూడా వస్తుంది. దాన్ని బాడీ మైండ్‌సెన్స్ కాంప్లెక్స్ అంటారు. అంటే కార్యకరణ సంఘాతం. దీన్నిబట్టి ప్రతివ్యక్తీ ఆత్మ, అనాత్మల మేలుకలయిక. మీరు ఎవరినైనా చూస్తే, రెండు విషయాలు చూస్తున్నట్టు. అవి ఆత్మ, అనాత్మ. దీనికి చేయి–కాంతి ఉదాహరణ చూద్దాము. దీన్ని మూడు దశల్లో అర్థం చేసుకోవాలి. మీకు చేయి చూపించి ఇక్కడేముంది అని అడిగితే –

1. చేయి ఉంది
2. చేయి+ కాంతి ఉంది
3. అన్నింటినీ ప్రకాశింపజేసే కాంతి ఉంది

అని దశలవారీగా నేర్చుకుంటారు. ఇప్పుడు ఈ దృష్టాంతాన్ని ఆత్మ, అనాత్మలకు అన్వయించి చూద్దాము. నేను ఎవరు అని అడిగితే –

1. నేను శరీరాన్ని
2. నేను శరీరం + చైతన్యాన్ని
3. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని

అని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు నేను శరీరాన్ని మాత్రమే అనుకుంటాము. తరువాత నేను ఆత్మ అనాత్మల మేలుకలయికను అని నేర్చుకుంటాము. తరువాత నేను ఆత్మను అని అర్థం చేసుకుంటాము. చైతన్యం అంటే ఆత్మ.

మరణానికి లోనయ్యే శరీర అభిమానంనుంచి శాశ్వతమైన ఆత్మ నేను అని తెలుసుకుంటాము. శరీరం అశాశ్వతం కాబట్టి శాశ్వతం అవలేదు, ఆత్మ శాశ్వతం కాబట్టి, శాశ్వతం అవవలసిన పనిలేదు. మన దృష్టి అశాశ్వతమైన శరీరంనుంచి శాశ్వతమైన ఆత్మకు మారాలి. దీన్ని ఆధ్యాత్మిక సాధన అంటారు.

ఆత్మ శాశ్వతం అంటే ఆత్మ గతంలోనూ ఉంది, ఆత్మ వర్తమానంలోనూ ఉంది, ఆత్మ భవిష్యత్తులోనూ ఉంటుంది. ఆత్మ లేదా చైతన్యం ఐదు లక్షణాలను చూశాము. వాటిలో నాలుగు, ఐదు లక్షణాలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి.

4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఫోనులో మాట్లాడుతుండగా, అది హఠాత్తుగా ఆగిపోతే, 'ఫోన్ డెడ్ అయింది,' అంటాము కాని 'నేను డెడ్,' అయ్యాను అని ఎలాగైతే అనమో, అలాగే మరణం అనేది ఈ శరీరానికి చెందుతుంది కాని ఆత్మకు కాదు.

ఈ శరీరం కౌమారం, యౌవనం, వృద్ధాప్యం దశలు దాటుకుంటూ వస్తుంది. శరీరంలో ఈ మార్పులు అవుతున్నప్పుడు, నేను మారతానా? నేను బాల్యంలో ఆ స్కూల్లో చదివాను, కౌమారంలో అలా చేశాను, నాకు వృద్ధాప్యం వచ్చింది అంటూ చెబుతాము. శరీరం మారుతున్నా, మారకుండా ఉన్నది నేను, నేను, నేను. సైన్సు ప్రకారం మన శరీరంలో ఉన్న కణాలన్నీ మారతాయి. శరీరం పూర్తిగా మారుతుంది. కాని ఇన్ని మార్పులు జరుగుతున్నా, మారకుండా ఉన్నది ఏమిటి? నేను.

దీన్నే మరికొంచెం పొడిగించమంటున్నాడు కృష్ణపరమాత్మ. అన్ని మార్పులూ అయ్యాక, మొత్తం శరీరాన్ని మార్చమంటున్నాడు. జీర్ణించుకుపోయిన పాత వస్త్రాన్ని మార్చినట్టుగా, మీరు జీర్ణించుకుపోయిన శరీరాన్ని కూడా ఇంకొక శరీరంతో మారుస్తారు అంతే. అందువల్ల ఆనందంగా ఉండాలి. మీరేమీ పోగొట్టుకోలేదు.

పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇంటిని కట్టినట్టు అన్నమాట. ఆకాశంలో ఏమీ మార్పులేదు. గోడలు ఇటునుంచి అటు కదిలాయి అంతే. అలాగే చైతన్యం ఆకాశం వంటిది. దానికి శరీరమనే గోడలు వస్తూ ఉంటాయి; శరీరమనే గోడలు పోతూ ఉంటాయి.

ఆత్మ నిత్యత్వస్వరూపాన్ని ఎలాగైతే అర్థం చేసుకుని స్వీకరిస్తామో, అలాగే అనాత్మ అనిత్యత్వ స్వరూపాన్ని కూడా అర్థం చేసుకుని స్వీకరించాలని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని ఎన్నడూ మార్చలేము. దేన్నైతే మార్చలేమో, దాన్నే స్వరూపం అంటారు. తెలివైన వ్యక్తి ఒక వస్తువుయొక్క స్వరూపాన్ని మార్చటానికి ప్రయత్నించకుండా, దానిమీద తనకున్న దృక్పథాన్ని మార్చుకుంటాడు. దృక్పథాన్ని మార్చటాన్ని స్వీకరించటం అంటారు.

## 40. శరీరత్రయం

అనాత్మ అంటే న ఆత్మా, ఆత్మ కానిది అనాత్మ. ఈ చరాచర ప్రపంచం అంతా అనాత్మ. కాని అత్యంత సమీపమైనది, అత్యంత ముఖ్యమైనది అయిన అనాత్మ కార్యకరణసంఘాతం లేదా బాడీమైండ్ సెన్స్ కాంప్లెక్స్. అందువల్ల జ్ఞానయోగంలో ఇంకా ముందుకు వెళ్ళేముందు, శరీరత్రయం గురించిన జ్ఞానం పొందాలి.

శాస్త్రం ప్రతి ఒక్కవ్యక్తికీ శరీరత్రయం ఉందని చెబుతున్నది. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం. వీటిని దేహత్రయం అనికూడా అనవచ్చు. ఈ మూడు శరీరాలను

నాలుగు అంశాల ద్వారా విశ్లేషిద్దాము. అవి ముడిపదార్థం, వాటిలోని భాగాలు, వాటి పనులు, వాటి లక్షణాలు.

1. **స్థూల శరీరం**

**ముడిపదార్థం** – స్థూలశరీరం స్థూలపంచభూతాలనుంచీ తయారు చేయబడింది. పంచభూతాలు – ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. ఈ స్థూలశరీరం స్థూలభూతాలనుంచి ఏర్పడటంవల్ల దీన్ని భౌతికశరీరం అనీ, పంచభూతాలనుంచి ఏర్పడటంవల్ల పాంచభౌతికం అనీ అంటారు.

**వివిధ భాగాలు** – స్థూలశరీరంలో ముఖ్యభాగాలు తల, చేతులు, శరీర మధ్యభాగం, కాళ్ళు.

**పనులు** – ఈ స్థూల శరీరాన్ని కేవలం ఒక తాత్కాలిక నివాసంగా అభివర్ణిస్తుంది శాస్త్రం. స్థూలశరీరం అద్దెకిచ్చిన ఇల్లు. దానికిచ్చే అద్దె పుణ్య, పాప కర్మల రూపంలో ఉంటుంది. దాని మూల్యం చెల్లిస్తున్నన్నాళ్ళూ అద్దె ఇల్లు ఉంటూనే ఉంటుంది.

**స్వభావం** – స్థూలశరీరం ఆరు వికారాలకు లోనవుతుంది. అవి తల్లిగర్భంలో ఉండటం, పుట్టటం, పెరగటం, పరిణామం చెందటం, క్షీణించటం, మరణించటం. స్థూలశరీరం మనకూ, ఎదుటివారికీ కూడా కనబడుతుంది. దీని ఆయుఃపరిమాణం వంద సంవత్సరాలు.

2. **సూక్ష్మ శరీరం**

**ముడిపదార్థం** – సూక్ష్మశరీరం, సూక్ష్మ పంచభూతాలతో ఏర్పడింది.

**వివిధ భాగాలు** – సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉన్నాయి. స్థూలశరీరం కార్యాలయం అయితే, వ్యవహారం నడపటానికి పరికరాలు కావాలి. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు.

పంచజ్ఞానేంద్రియాలు – కళ్ళు, చెవి, ముక్కు, నాలుక, చర్మం.

వాటి పనులు – చూడటం, వినటం, వాసన చూడటం, రుచి చూడటం, స్పర్శ తెలుసుకోవటం.

పంచకర్మేంద్రియాలు – వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ

వాటి పనులు – మాట్లాడటం, పట్టుకోవటం, నడవటం, విసర్జన చేయటం, పునరుత్పత్తి చేయటం.

పంచప్రాణాలు – ప్రాణం, అపానం, వ్యానం, సమానం, ఉదానం.

వాటి పనులు – శ్వాసక్రియ, విసర్జన క్రియ, రక్తప్రసరణ క్రియ, జీర్ణక్రియ, తిరోగమన క్రియ.

నాలుగు అంతఃకరణలు – మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం.

వాటి పనులు – **మనస్సు** – అన్ని రకాల భావోద్రేకాలకు ప్రతీక. ఉద్రేకపరమైన ఆలోచనలు, శంకలు ఉన్నది అని చెప్పవచ్చు. శంకలు ఉండటంవల్ల ఎప్పుడూ ఇది చేయాలా వద్దా, ఇలా ఉండాలా లేదా అని సందేహ పడుతూనే ఉంటుంది.

**బుద్ధి** – నిర్ణయాత్మకశక్తి. ఏం చేయాలో నిశ్చయించి చెబుతుంది.

**చిత్తం** – జ్ఞాపకశక్తి. మన మనస్సులో మన అనుభవాలను నిక్షిప్తం చేస్తుంది. ఈ జన్మలోని గతం, పూర్వజన్మలోని గతం అందులో నిక్షిప్తమై ఉంటుంది.

**అహంకారం** – మన గురించి చెప్పుకునేది. ఇది మనుష్యుల్లో ఉన్నంతగా జంతువులకు ఉండదు.

ఈ 19 అంగాలు కలిసి సూక్ష్మశరీరంలోని భాగాలు. సూక్ష్మశరీరం భోగసాధనం. ఇంద్రియాలు సూక్ష్మశరీరంలో అగోచరంగా ఉంటాయి. ప్రతి ఇంద్రియానికి తత్సంబంధిత అధిష్ఠానదేవత ఉంటుంది. ఆ దేవత అనుగ్రహంవల్ల ఆ ఇంద్రియం పనిచేస్తుంది. ఉదాహరణకు కన్నుకు అధిష్ఠానదేవత సూర్యుడు; వాక్కుకు అధిష్ఠానదేవత అగ్ని. స్థూలశరీరానికి బాహ్యముఖంగా కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం, కాళ్ళు, చేతులు ఉంటాయి. వీటిని గోళకాలు అంటారు.

**పనులు** – అన్నిరకాల పనులు ఈ 19 పరికరాల సహాయంతో సూక్ష్మశరీరం జరుపుతుంది. కొన్ని బాహ్యప్రపంచంనుంచి గ్రహించటానికైతే, కొన్ని బాహ్యప్రపంచానికి ఇవ్వటానికి. నోరు రెండింటికీ పనికి వస్తుంది.

**లక్షణాలు** – ఇది కూడా మార్పుకు లోనవుతుంది. ఈ భాగాలు కూడా క్షీణిస్తాయి. చూపు సరిగా ఆనదు. జ్ఞాపకశక్తి లోపిస్తుంది. సూక్ష్మశరీరం ఎదుటివారికి కనిపించదు. ఎవరికి వారికే తెలుస్తుంది. మన మనస్సేమిటో, మన భావాలేమిటో మనకే తెలుస్తుంది. అది మనకే తెలుస్తుంది కాబట్టి సూక్ష్మశరీరం అన్నారు.

స్థూలశరీరం రాలిపోయాక, సూక్ష్మశరీరం ప్రయాణం చేసి ఆ జీవి సంచితకర్మల్లోంచి, ఏది ప్రారబ్ధకర్మగా మళ్ళీ మారుతుందో, దానికి తగ్గ శరీరాన్ని వచ్చే జన్మలో ధరిస్తుంది. శరీరం మారుతుంది కాని, మనస్సు కొనసాగుతుంది.

3. **కారణ శరీరం**

**ముడిపదార్థం** – ఇది ఏర్పడటానికి ఉపయోగపడిన ముడిపదార్థాన్ని కారణపదార్థం అని అంటారు. అది సూక్ష్మాతి సూక్ష్మమైన పదార్థం. ఒక్కోసారి దీన్ని ప్రకృతి లేదా మాయ అని కూడా అంటారు.

**వివిధ భాగాలు** – కారణ శరీరంలోని వివిధ భాగాలు స్థూలశరీరం, సూక్ష్మశరీరాలే. అంటే వాటిని సృష్టించకముందు పిండరూపంలో ఉన్నాయి. అందువల్ల ప్రపంచం సృష్టించబడకముందు లేదా ప్రళయకాలంలో సూక్ష్మ, స్థూలశరీరాలు కారణశరీరంలో అవ్యక్తంగా ఉన్నాయి.

**పనులు** – స్థూల, సూక్ష్మ శరీరాలు ఏర్పడటానికి కారణశరీరం ఆధారమవుతుంది. సైన్సు ప్రకారం కూడా నాశనమైన పదార్థం శక్తిగా మారుతుంది. శక్తి అంటే అవ్యక్త పదార్థం. వ్యక్తి పుట్టినప్పుడు సూక్ష్మశరీరం అవ్యక్తస్థితినుంచి వ్యక్తస్థితికి వస్తుంది, మరణించినప్పుడు సూక్ష్మశరీరం వ్యక్తస్థితినుంచి అవ్యక్తంలోకి వెళుతుంది.

**లక్షణాలు** – సూక్ష్మశరీరంకన్నా అత్యంత సుదీర్ఘ జీవితం ఉంది కారణశరీరానికి. కారణశరీరం అదృశ్యం. అది అగోచరం.

స్థూలశరీరాన్ని అందరూ చూడవచ్చు, సూక్ష్మశరీరాన్ని ఎవరికి వారే గ్రహించగలరు, కారణ శరీరం ఎవరికీ తెలియదు. ప్రతివ్యక్తిలోనూ ఈ మూడు శరీరాలు ఉంటాయి. ఆత్మ గురించి అర్థం చేసుకోవటానికి ఈ జ్ఞానం చాలా ముఖ్యం.

## 41. అవస్థాత్రయం

అవస్థాత్రయం మూడు దశల అనుభవాన్ని సూచిస్తుంది. అవి జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ. ఆత్మ గురించి అర్థం చేసుకోవటానికి ఈ జ్ఞానం చాలా ముఖ్యం. మూడు అవస్థలకూ మూడు అంశాలను పరిశీలిద్దాం. అవి మనస్సు, స్వభావం, మాధ్యమం.

1. **జాగ్రదావస్థ** – అవస్థ అంటే ఒక అనుభవం లేదా దశ. జాగ్రదావస్థ అంటే మెలకువగా ఉన్న దశ.

**మనస్సు** – జాగ్రదావస్థలో మనస్సు పూర్తిగా వికసించి పనిచేస్తుంది. అంటే అన్ని పరికరాలూ – మనస్సు, చిత్తం, బుద్ధి, అహంకారం – పూర్తిగా పనిచేస్తాయి. మనస్సు పూర్తిగా విచ్చుకున్న పువ్వులా ఉంటుంది.

**స్వభావం** – జాగ్రదావస్థలో బాహ్యప్రపంచాన్ని అంటే మన శరీరం, మనస్సులకు భిన్నంగా ఉన్నదానిని అనుభవిస్తాము. అందువల్ల అది బాహ్యమైనది, కంటికి కనబడేది, అందరికీ అందుబాటులో ఉండేది.

ఇది అందరికీ కనబడే ప్రపంచం కాబట్టి ఈ అనుభవం వ్యక్తిగతం కాదు. జాగ్రదావస్థలో ప్రపంచాన్ని ఇంద్రియాల ద్వారా, శబ్దస్పర్శరూపరసగంధాల ద్వారా, వాటివల్ల కలిగే సుఖదుఃఖాల ద్వారా అనుభవిస్తాము. ప్రపంచంనుంచి అనుభవం పొందుతాము, ప్రపంచానికి తిరిగి ఇస్తాము కాబట్టి మనం కర్తా, భోక్తలం. అంటే కర్మ చేస్తాము, కర్మఫలాన్ని అనుభవిస్తాము.

**మాధ్యమం** – జాగ్రదావస్థలో మనం ఇంద్రియాల ద్వారా ప్రపంచాన్ని చూస్తున్నాం. ఇంద్రియాలకు గోళకాలు కావాలి. గోళకాలకు భౌతికశరీరం కావాలి. అంటే ఇంద్రియాలు పనిచేయటానికి స్థూలశరీరం కావాలి. జాగ్రదావస్థ ఇంద్రియజన్యం కాబట్టి **జాగ్రదావస్థను స్థూలశరీర ప్రధాన అవస్థ** అంటాము. స్థూలశరీరం లేకపోతే బాహ్యప్రపంచాన్ని అనుభవించలేము.

2. **స్వప్నావస్థ** – స్వప్నావస్థ అంటే కలలో జరిగే అనుభవం.

**మనస్సు** – స్వప్నావస్థలో మన మనస్సు మాత్రమే పనిచేస్తుంది. ఇక్కడ మనస్సు అంటే మనస్సు, చిత్తం. స్వామీజీ జాగ్రదావస్థను రికార్డ్ ప్లేయర్‌తోనూ, స్వప్నావస్థను వాటిని రీప్లే చేసే వి.సి.పి.తోనూ పోలుస్తారు. జాగ్రదావస్థలో మనస్సు శబ్దస్పర్శరూపరసగంధాలతో కూడిన అనుభవాలను టేప్‌రికార్డర్‌లాగా రికార్డు చేస్తుంది. అది బాహ్యప్రపంచాన్నే కాదు, సుఖదుఃఖాలనే భావాలను కూడా రికార్డు చేస్తుంది. దాన్ని చిత్తం అంటారు. చిత్తం లోపల రికార్డయి ఉన్నవాటిని, బయటకు పంపిస్తుంది వీడియో కాసెట్ ప్లేయర్‌లాగా.

అందువల్ల మనం కలలో అనుభవించే భావాలు, కొత్తగా అందుకున్న భావాలు కాదు. ముందే మనస్సులో నిక్షిప్తమై ఉండి, జ్ఞాపకంలో వెలికితీసినవి. స్వప్నావస్థలో చిత్తం ఒక్కటే పనిచేస్తుంది. మనస్సు, బుద్ధి, అహంకారం పనిచేయవు. అందువల్ల స్వప్నావస్థను అరవిచ్చుకున్న పువ్వుతో పోలుస్తారు.

**స్వభావం** – స్వప్నావస్థలో కనబడే ప్రపంచం అంతర్గత ప్రపంచం. ఇది మన వ్యక్తిగత, స్వంత జ్ఞాపకశక్తినుంచి పుట్టింది కాబట్టి ఇది బాహ్యప్రపంచం కాదు. అసలు స్వప్నప్రపంచానికీ, బాహ్యప్రపంచానికీ సంబంధం లేదు. ఒకచోట పడుకుని, ఇంకోచోటు గురించి కలలు కనవచ్చు. అంటే చెన్నైలో పడుకుని న్యూయార్క్‌లో నడుస్తున్నట్టు కలలు కనవచ్చు.

ఇది అంతర్గతప్రపంచం కాబట్టి, మన జ్ఞాపకాలలోంచి పుట్టినది కాబట్టి, దీన్ని వాసనామయ ప్రపంచం అంటారు. ఇది ఆలోచనలనుంచి పుట్టింది కాబట్టి కంటికి కనబడేది కాదు. బాహ్యప్రపంచం భౌతికప్రపంచం కాబట్టి కంటికి కనబడుతుంది. స్వాప్నిక ప్రపంచం వాసనామయ ప్రపంచం కాబట్టి కంటికి కనబడదు. కలలో మనకు కనబడే ప్రపంచం ఎదుటివారికి కనబడదు. అందువల్ల అది వ్యక్తిగత ప్రపంచం. ఇంద్రియాలకు కనబడదు. ప్రతి స్వప్నావస్థా, జాగ్రదావస్థమీద ఆధారపడివుంది. ఆ అనుభవాలు ఈ జన్మదే కానవసరం లేదు, అనేక జన్మలవి కావచ్చు.

**మాధ్యమం** – స్వప్నావస్థ జ్ఞాపకాలమీద ఆధారపడింది. జ్ఞాపకాలు చిత్తానికి సంబంధించినవి, చిత్తం సూక్ష్మశరీరానికి చెందినది. అందువల్ల స్వప్నం కూడా సూక్ష్మ శరీరానికి చెందినది. అందువల్ల **స్వప్నావస్థను సూక్ష్మశరీర ప్రధాన అవస్థ** అంటారు.

3. **సుషుప్తి అవస్థ** – గాఢనిద్రను సుషుప్తి అంటారు. అది కలలు రాని నిద్రావస్థ.

**మనస్సు** – సుషుప్తి అవస్థలో మనస్సు కూడా పడుకుంటుంది. అంటే మనస్సు, చిత్తం, బుద్ధి, అహంకారం – అన్నీ పడుకుంటాయి. అందువల్ల మనస్సును మొగ్గతో పోల్చవచ్చు.

**స్వభావం** – ఇంద్రియాలు పనిచేయవు కాబట్టి బాహ్యప్రపంచం లేదు; జ్ఞాపకాలు పనిచేయవు కాబట్టి, అంతర్గత ప్రపంచమూ లేదు. అందువల్ల ఇది అనుభవశూన్యం. దీన్ని అజ్ఞాన అనుభవం అంటారు.

**మాధ్యమం** – ఇంద్రియాలు పనిచేయవు కాబట్టి, స్థూలశరీరం లేదు, జ్ఞాపకాలు పనిచేయవు కాబట్టి సూక్ష్మశరీరం లేదు. ఈ రెండు శరీరాలు మాయమయినట్టుగా కనబడినప్పుడు, కారణశరీరం ప్రధానమవుతుంది. అందువల్ల **సుషుప్తి అవస్థను కారణశరీర ప్రధాన అవస్థ** అంటారు. ఇందులో మన అంతర్గత, బాహ్య అనుభవాలు అవ్యక్తంలోకి వెళ్ళి, మర్నాడు పొద్దున్న మళ్ళీ వ్యక్తంలోకి వస్తాయి.

ఈ విధంగా మనలో మూడు అవస్థలు ఉన్నాయి; అవి మూడు శరీరాలకు చెందినవి. వీటికి శాస్త్రం సాంకేతిక పదాలను ఇస్తుంది. అవి విశ్వ, తైజస, ప్రాజ్ఞ.

విశ్వ – జాగ్రద్ పురుషుడు. పూర్తిగా జాగ్రద్ ప్రపంచ అనుభవం ఉంది.

తైజస – స్వప్నపురుషుడు. వాసనామయ ప్రపంచ సృష్టికర్త.

ప్రాజ్ఞ – సుప్తపురుషుడు. అజ్ఞానంతో కూడిన ఆనందం ఉంది.

ఈ సాంకేతిక పదాలను కొత్తగా ఎందుకు నేర్చుకోవాలని మీకు అనిపించవచ్చు. తత్త్వబోధ వీటన్నిటిని మనకు పరిచయం చేస్తుంది. ఇది అద్వైత వేదాంతాన్ని మనకు పరిచయం చేస్తుంది. ఆత్మవిద్య నేర్చుకునేటప్పుడు, ఈ మూడు కాక వీటికి విలక్షణంగా ఒకటి ఉందని శాస్త్రం నేర్పిస్తుంది. దానిని ఆత్మ లేదా సాక్షిచైతన్యం అంటుంది.

'నేను మంచి సంగీతాన్ని వింటున్నాను,' 'నేను స్వప్నంలో పులిని చూశాము,' 'నేను గాఢనిద్ర పోయాను.' ఈ వాక్యాలను అంటున్నది వరుసగా విశ్వ, తైజస, ప్రాజ్ఞ అన్నట్టు అనిపించినా, ఈ మూడింటిలోనూ సమానంగా ఉన్నది నేను, నేను, నేను. వీటిని నేను సాక్షిగా చూసే సాక్షిచైతన్యం లేదా ఆత్మ అని ముందు ముందు నేర్చుకుంటాము.

## 42. ఆత్మ అంటే ఏమిటి?

శరీరత్రయం అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలని చూశాము. అవి పదార్థంతో చేయబడ్డాయి. పదార్థాన్ని భౌతికం అనవచ్చు. పదార్థం జడంగా ఉంటుంది. దీన్నిబట్టి కొన్ని ముఖ్యమైన ఉపసిద్ధాంతాలను గ్రహించవచ్చు.

ఏ పదార్థమైనా జడంగా ఉంటుంది. జడం అంటే చైతన్యం లేనిది, చైతన్యాన్ని పుట్టించ లేనిది. శరీరత్రయం జడం కాబట్టి, పదార్థంతో చేయబడింది కాబట్టి, దానికి స్వతహాగా చైతన్యం లేదు, చైతన్యంనుంచి పుట్టించలేదు. అంటే భౌతిక శరీరం జడం. సూక్ష్మశరీరంలో భాగమైన మనస్సు జడం. కారణశరీరం కూడా జడమే. అందువల్ల స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడూ జడమే. తార్కికంగా చూస్తే అవి జడం.

కాని మన అనుభవం వేరేగా ఉంది. అనుభవం ఈ శరీరాలు చైతన్యం అంటుంది. స్థూలశరీరానికి చుట్టుపక్కల ఏమవుతుందో తెలుస్తోంది. అలాగే మనస్సుకు కూడా అనేక

విషయాలు తెలుస్తున్నాయి. ఈ విభిన్న దృక్పథాలను కలిపేదెలా? వీటిని కలపటం సాధ్యమే అంటుంది శాస్త్రం. మనకు ఒక స్త్రీ చాలా బీదదని తెలుసు, కాని ఆమె ఒక విందుకు ఖరీదైన దుస్తులు, బంగారు ఆభరణాలు వేసుకుని వచ్చిందంటే దాని అర్థం ఏమిటి? వాటిని ఎవరి దగ్గరో అరువు తీసుకుంది.

అలాగే శరీరత్రయానికి స్వాభావిక చైతన్యం లేదు. కాని ఈ శరీరత్రయానికి ఆగంతుక చైతన్యం లేదా అరువు తెచ్చుకున్న చైతన్యం ఉంది. అరువు తెచ్చుకున్న చైతన్యంవల్ల మూడు శరీరాలూ నెమలిలా గర్వంగా నాట్యం చేస్తున్నాయి. శరీరత్రయం అరువు తెచ్చుకుందంటే, అప్పిచ్చేందుకు ఒకరు ఉండాలి కదా. అంటే మనలో ఒక చైతన్యం ఉండాలి, చైతన్యాన్ని అప్పివ్వటానికి. ఈ అప్పిచ్చే చైతన్యం మనిషి శరీరంలో ఉన్న నాలుగవ అంశం. ఈ మూడు శరీరాలూ కాని, అసలు చైతన్యాన్ని అప్పిచ్చేది ఏమిటి? దీన్నే ఆత్మ అంటారు.

శరీరత్రయాన్ని చైతన్యవంతం చేస్తుంది ఆత్మ. దీన్ని అర్థం చేసుకోవటానికి స్వామీజీ, దానికి సమీప ఉదాహరణగా విద్యుచ్ఛక్తిని ఇస్తారు. బల్బు, బల్బులో ఉన్న ఫిలమెంట్. వాటంతట అవి వెలగలేవని మనకు తెలుసు. విద్యుచ్ఛక్తి వాటిని వెలిగింపజేస్తుంది. కాని విద్యుచ్ఛక్తి కంటికి కనబడదు. బల్బు, ఫిలమెంట్ కనబడతాయి. అలాగే ఆత్మ కనబడదు, శరీరాలే తెలుస్తాయి. ఇప్పుడు ఆత్మకూ, విద్యుచ్ఛక్తికీ మధ్యనున్న పోలికలను చూద్దాము.

1. **ఆత్మ ఏకం** – ఒకటే విద్యుచ్ఛక్తి అనేక బల్బులకు వెలిగే శక్తిని ఇచ్చినా, కొన్ని బల్బులు బాగా ప్రకాశవంతంగా ఉంటే, కొన్నింటి కాంతి చాలా తక్కువగా ఉంటుంది. దానికి కారణం బల్బుల్లో ఉన్న వ్యత్యాసమే కాని విద్యుచ్ఛక్తిలో కాదు. 100 వాల్ట్‌బల్బు ప్రకాశవంతంగా ఉంటే, జీరోవాల్ట్ బల్బు చాలా తక్కువగా వెలుగుతుంది. అలాగే ఒకటే ఆత్మ అనేక శరీరాలకు చైతన్యాన్ని ఇస్తుంది. శరీరంలో కూడా మూడు అవస్థల్లో మనస్సు మూడు రకాలుగా ఉంటుందని, వాటిని విశ్వ, తైజస, ప్రాజ్ఞ అంటారనీ చూశాము. అందువల్ల ప్రతిబింబంలో భేదాలు ఉంటాయి కాని, బింబచైతన్యంలో ఉండదు. అందువల్ల ఆత్మ ఏకం, శరీరాలు అనేకం.

2. **ఆత్మ చైతన్యస్వరూపం** – ఆత్మ చైతన్యస్వరూపం, ఇది వస్తుస్వరూపం కాదు. అది కూడా వస్తువు అయితే ఆత్మ కూడా జడం అవుతుంది కాని తన ప్రకాశానికి వస్తువుమీద ఆధారపడలేదు. చైతన్యం, ఆత్మయొక్క స్వరూప లక్షణం, ఆగంతుక లక్షణం కాదు. ఈ చైతన్యస్వరూపాన్నే శాస్త్రం **చిత్** స్వరూపం అంటుంది.

3. **ఆత్మ స్వతంత్రం** – ఆత్మ స్వతంత్రం. ఎందుకంటే అది తన ప్రకాశానికి కాని, దాని ఉనికికి కాని, ఉత్పత్తికి కాని దేనిమీద ఆధారపడలేదు. చైతన్యం వస్తువు కాదు కాబట్టి, వస్తువుచేత ఉత్పత్తి చేయబడలేదు కాబట్టి, ఆత్మ స్వతంత్రం.

4. **ఆత్మ నిర్గుణం** – ఆత్మ పదార్థం కాదు కాబట్టి, దానికి పదార్థంలా గుణాలు అంటవు. మనకు తెలిసిన గుణాలన్నీ మనం ప్రత్యక్షంగా కంటితో కాని, తక్కిన ప్రమాణాలతో కాని చూస్తాము. శబ్దస్పర్శరూపరసగంధాలు అనే గుణాలు పదార్థానికి చెందినవి. అందువల్ల ఆత్మ నిర్గుణమైనది.

5. **ఆత్మ నిత్యం** – ఆత్మ పదార్థంమీద కాని, శరీరత్రంమీద కాని ఆధారపడదు కాబట్టి, పదార్థం నాశనమైనా, ఆత్మకు నాశనం లేదు. బల్బు మాడిపోయినా, విద్యుత్తు ఉంటుంది. బల్బులో వ్యక్తం అవనంత మాత్రాన విద్యుచ్ఛక్తి లేనట్టు కాదు. అలాగే శరీరం నాశనమైనా ఆత్మ ఉంటుంది. కాకపోతే ఆత్మను ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి ఆత్మ ఉన్నట్టు తెలియదు. అంతమాత్రాన ఆత్మ లేనట్టు కాదు. ఆత్మకు మరణం లేదు.

6. **ఆత్మ సర్వగతం** – ఆత్మకు మరణం లేదు కాబట్టి కాలాతీతం. ఆత్మ ఒక్క శరీరానికే పరిమితమవలేదు కాబట్టి, ఆత్మ దేశాతీతం కూడా. విద్యుచ్ఛక్తి అనేక బల్బుల్లో ఉన్నట్టుగా, ఆత్మ అతిచిన్న ప్రాణియైన చీమలో ఉంది, అతిపెద్ద ప్రాణియైన ఏనుగులోనూ ఉంది. అందువల్ల ఆత్మ సర్వగతం.

ఆ విధంగా ఆత్మ ఏకం, చైతన్యస్వరూపం, స్వతంత్రం, నిర్గుణం, నిత్యం, సర్వగతం. అందువల్ల ఆత్మ రెండవది లేని అద్వయం. అంటే అద్వితీయ ఆత్మ.

## 43. విజ్ఞానశాస్త్రం – వేదాంతశాస్త్రం

వేదాంతశాస్త్రం ప్రకారం **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**. బ్రహ్మ అంటే చైతన్యం. చైతన్యం ఒక్కటే సత్యం, మిగతాదంతా మిథ్య. ఎందుకంటే వాటికి చైతన్యం లేకుండా విడిగా ఉనికి లేదు కాబట్టి. అంతేకాదు, బ్రహ్మ కారణం, జగత్తు కార్యం; బ్రహ్మనుంచే ఈ చరాచర సృష్టి జరిగింది అంటుంది వేదాంతశాస్త్రం.

విజ్ఞానశాస్త్రం దానికి భిన్నంగా ఉంటుంది. శాస్త్రజ్ఞులు పదార్థం ప్రాథమిక వస్తువనీ, శక్తి (చైతన్యం) పదార్థంనుంచి పుట్టిందనీ అంటారు వారు. కాని వారు కూడా చైతన్యాన్ని అంత తేలికగా తెలుసుకోలేమనీ, అది మానవమేధస్సుకు అందదనీ అంటారు.

స్వామీజీ, కొంతమంది ప్రఖ్యాతి చెందిన శాస్త్రజ్ఞులు చైతన్యం గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలు వేదాంతానికి దగ్గరగా ఉంటాయని చెబుతూ కొందరు ఇచ్చిన నిర్వచనాలను ఈ విధంగా ఉటంకిస్తున్నారు.

Ervin Schrodinger says, 'Consciousness is a singular of which the plural is unknown. There is only one thing and that which seems to be a plurality is merely a series of different aspects of this one thing, produced by a deception, the Indian Maya, as in a gallery of mirrors.'

ఇర్విన్ ష్రోడింగెర్, నోబెల్ ప్రైజ్ గ్రహీత, అంటున్నారు, 'చైతన్యం ఒకటే ఉంది, దానికి నానాత్వం లేదు. ఉన్నదొకటే చైతన్యం, అది అనేకంగా భాసిస్తున్నది అంటే, అది ఒకే చైతన్యంయొక్క అనేక అంశాలు. ఒకటే వస్తువు అనేక అద్దాలలో అనేకంగా ప్రతిబింబించబడి, అనేకంగా ఉన్నట్టు ఎలా భ్రమకు లోనుచేస్తుందో, అలాగే ఒకటే చైతన్యం అనేకంగా అయినట్టు భారతీయ తత్త్వశాస్త్రంలో చెప్పబడే మాయ భ్రమింపజేస్తుంది.'

Max Plank says, 'I regard consciousness as fundamental. I regard matter as derivative from consciousness. We cannot get behind consciousness. Everything that we talk about, everything that we regard existing, postulates consciousness.'

మాక్స్ ప్లాంక్, మరొక ప్రఖ్యాతి చెందిన శాస్త్రజ్ఞుడు, నోబెల్ బహుమతి పొందినవారు ప్రశ్నిస్తున్నాడు. 'పదార్థం ద్వారా, పదార్థంయొక్క సూత్రాల ద్వారా చైతన్యాన్ని వివరించగలము అనుకుంటున్నారా? అది సాధ్యం కాదు. నేను చైతన్యాన్ని ప్రాథమికంగా భావిస్తున్నాను. పదార్థమే చైతన్యంనుంచి వచ్చిందని నేను భావిస్తున్నాను. చైతన్యాన్ని మనం అర్థం చేసుకోలేము. మనం మాట్లాడుతున్న ప్రతిదీ మనం ఉనికి ఉందనుకుంటున్న ప్రతిదీ, చైతన్యాన్ని సూచిస్తుంది.'

చైతన్యం మానవ మేధస్సుకు అందదు అంటే, మాక్స్ ప్లాంక్ గౌడపాదాచార్యులవారు మాండూక్య కారికల్లో తురీయం (చైతన్యం) గురించి వివరించిన అంశాన్ని ఒప్పుకుంటున్నట్టు అర్థం. అంటే మన వేదాంతం బోధించే సూత్రం – కంటికి కనబడే జగత్తంతటా కనబడని బ్రహ్మే ఉన్నాడు.

Professor George Wald says, 'So that is the problem of mind. Consciousness – a vast, unchartable domain that includes all science, yet that, science cannot deal with, has no way of approaching; not even to identify its presence or absence; that offers nothing to measure, and nothing to locate, since it has no location.'

ఇంకొక నోబెల్ ప్రైజ్ గ్రహీత, ప్రొఫెసర్ జార్జ్ వాల్డ్ అంటున్నారు, 'అదీ మనస్సుయొక్క సమస్య – చైతన్యం – అనంతమైన, అంతుచిక్కని సామ్రాజ్యంలో సైన్సులోని అన్ని శాఖలు ఉన్నా, సైన్సుకు అందనిది, ఏ విధంగా దాన్ని చేరుకోలేనిది; చివరికి అది ఉందనీ లేదా లేదనీ గుర్తించలేనిది; కొలతలకు అందనిది; ఇక్కడ ఉందని ఒక దేశంలో చూపలేనిది; ఎందుకంటే దానికి దేశపరమితి లేదు.'

ఈ విధంగా చైతన్యం మానవమేధస్సుకు అందనిదని ఎంతో మేధావులైన శాస్త్రజ్ఞులు ఒప్పుకుని, మన వేదాంతానికి వస్తుంటే, దురదృష్టవశాత్తూ, మనం వేదాంతాన్ని సైన్సుపరంగా నిరూపించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. మరేం బాధపడకండి అంటున్నారు స్వామీజీ.

ఎందుకంటే వారికి సైన్సుమీద ఉన్న గౌరవం అటువంటిది. తార్కికంగా ఆలోచించే బుద్ధి ఉన్న మనిషికి 'ఆత్మ ఇదీ,' అని చెబితే దాన్ని అంత తేలికగా జీర్ణించుకోలేడు.

తెలిసో, తెలియకో ప్రతి ఒక్కరూ జీవితంలో కోరుకునే లక్ష్యాలు – పూర్ణత్వం, భద్రత, ఆనందం. వేదాంతం ప్రకారం, ఈ మూడు లక్ష్యాలనూ ఒక పదంతో సూచించవచ్చు. అది ఆత్మ లేదా బ్రహ్మ. నిజానికి ఆత్మ అంటే పూర్ణత్వం; ఆత్మ అంటే భద్రత; ఆత్మ అంటే ఆనందం. ఆ వెతకటంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వెతుకుతున్న ఆత్మ ఎక్కడో లేదు. అది వెతుకుతున్న వ్యక్తి స్వరూపమే. ఇన్నాళ్ళూ అది తెలియక బాహ్యంగా వెతికారు. ఒకసారన్నా ఆ పరుగులు ఆపి, నేను సరియైన దారిలోనే పరుగులు తీస్తున్నానా అని ఆలోచించరు.

అదృష్టం బాగుండి, ఎప్పుడో వేదాంతానికి వస్తే మాత్రం, అతను పొందే ఆశ్చర్యాలకు అంతు ఉండదు. అతను ఇన్నాళ్ళూ ఈ ఆత్మతత్త్వాన్ని ఎలా తెలుసుకోలేకపోయాను అని ఆశ్చర్యపోతాడు. ఇంకొక మహాత్ముడు దీని తత్త్వాన్ని ఆశ్చర్యకరంగా వర్ణిస్తాడు. వేరొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన విషయంగా వింటాడు. అన్నింటికన్నా గొప్ప ఆశ్చర్యం, కొన్ని సంవత్సరాలు ఈ విద్యను నేర్చుకున్నాకూడా కొంతమందికి అర్థంకాదు.

## 44. ఆత్మవిద్యను శ్రేష్ఠం అని ఎందుకంటారు?

**ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య.**

ఈ సత్యాన్ని శాస్త్రం ఘోషిస్తుంది; కృష్ణపరమాత్మ కూడా తన బోధలో వివరిస్తాడు. ఎందుకు? ఆత్మకు స్వతంత్రంగా ఉనికి ఉంది, కాని అనాత్మకు విడిగా ఉనికి లేదు. అనాత్మ, తన ఉనికికోసం ఆత్మమీద ఆధారపడివుంది. ఇంకొక కారణం, ఆత్మ నిర్వికారం. దానికి వికారాలు అంటే మార్పులు లేవు. కాని అనాత్మ అయిన శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి. అవి – గర్భంలో ఉండటం, పుట్టటం, ఎదగటం, పరిణామం చెందటం, క్షీణించటం, మరణించటం.

షడ్వికారాలు చెందే శరీరం అనాత్మ అనీ, ఆత్మ నిర్వికారమనీ, తను నిర్వకార ఆత్మ అనీ ఎవరైతే తెలుసుకుంటారో, వారు మోక్షం పొందుతారు. నేను పరిమితి ఉన్న జీవిని అనే భావననుంచి విడుదల అవుతారు.

ఇంకా ఇంకా డబ్బు సంపాదించుకోవాలి, ఆస్తిని కూడబెట్టుకోవాలి అనే కోరిక శారీరక పరిమితిని సూచిస్తుంది. గుప్పెడు ప్రేమకోసం అందరినీ యాచించటం మానసిక పరిమితిని సూచిస్తుంది. ఇంకా ఇంకా లౌకికవిద్యను నేర్చుకోవాలనే విద్యాదాహం బుద్ధిపరంగా పరిమితిని సూచిస్తుంది. ఈ జ్ఞానం ఎంత పొందినా జ్ఞానతృష్ణను తీర్చదు. వందలకొద్దీ కొత్త విషయాలు కనుగొన్న శాస్త్రజ్ఞులకు తనివితీరేది కాదు. సముద్రమంత సత్యం వారి

ఎదురుగా ఉంటే, వారు కొన్ని గుళకరాళ్ళనే ఏరుకున్నట్టుగా భావించేవారు. ఇలా మనిషి శరీరపరంగా, మనస్సు పరంగా, బుద్ధిపరంగా పరిమితులను అనుభవిస్తాడు.

ఆత్మ లేదా చైతన్యానికి ఏ పరిమితీ లేదు. చైతన్యం ఆకాశంలాగా సర్వవ్యాపకం. అందువల్ల అనేక ఆత్మలు ఉండటానికి ఆస్కారం లేదు. నాలో ఉన్న ఆత్మ, మీలో ఉన్న ఆత్మ, తక్కిన జీవుల్లో ఉన్న ఆత్మ, జడపదార్థాలలో ఉన్న ఆత్మ – అన్నింటిలో ఉన్నదీ ఒక్కటే ఆత్మ. ఇన్నిరకాల ఆత్మలు లేవు. ఋగ్వేదం మంత్రం ఒకటి ఈ సర్వాత్మభావనను వివరిస్తుంది.

ఆత్మ లేదా చైతన్యం లేదా బ్రహ్మ సర్వవ్యాపకం కాబట్టి, అది దేశ, కాలాతీతం. అంతటా సర్వవ్యాపకంగా ఉన్న చైతన్యం, కార్యకరణసంఘాతంలో ప్రతిబింబిస్తే, అది శరీరంలో ఉన్నట్టుగా అనిపిస్తుంది. అందువల్ల ఆత్మ ఈ శరీరం సరిహద్దులకే పరిమితమై ఉందనే పొరపాటు పడతారు.

ఐతరేయోపనిషత్తులో అలా పరమాత్మ శరీరంలో ప్రవేశించటం రెండు కారణాలకోసం చేస్తాడని వస్తుంది. అవి లోకవ్యవహారంకోసం, బ్రహ్మజ్ఞానం పొందటంకోసం. ఆత్మ, శరీరం ద్వారా వ్యవహారం నడుపుతుంది. జీవి ముందు తను శరీరం, ఇంద్రియాలు, మనస్సు అనుకుని వ్యవహారం చేసినా, కొన్నాళ్ళయ్యాక అయినా కొంత విశ్లేషణ చేస్తాడు. నేను కన్ను, చెవులు, మనస్సు కాను. అవి పనిచేస్తున్నట్టు నాకు తెలుస్తున్నాయంటే, అవి నేను కాదు. అవి నేను కాకపోతే నేనెవరు అని తెలుసుకోలేకపోతారా అనుకుని, అనుప్రవేశం చేశాడు పరమాత్మ. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాలంటే మనశ్శరీరాలు ఉండాలి.

సూర్యుడు అద్దంలో ప్రతిబింబరూపంలో కనిపిస్తాడు. అదే అనేక అద్దాలు పెడితే అనేక సూర్యులు ఉన్నట్టుగా అనిపిస్తాడు కాని సూర్యుడు ఒకడే; ప్రతిబింబాలు అనేకం. అదే విధంగా ఒకటే సర్వవ్యాపకమైన పరమాత్మ అనేక శరీరాల్లో ప్రతిబింబచైతన్యాలుగా వ్యక్తమవుతున్నాడు. మాయవల్ల అనేక ఆత్మలుగా అనిపిస్తున్నాడు కాని నిజానికి ఉన్నది ఒకటే ఆత్మ. ఆత్మ లేదా బింబచైతన్యం ఏకం, ప్రతిబింబచైతన్యం అనేకం. కాని మనం ఈ విషయం తెలియక, అజ్ఞానంలో ఉన్నాము.

అజ్ఞానం అంటే శుద్ధచైతన్యం గురించిన అజ్ఞానం. ఈ అజ్ఞానంలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది మన అసలు స్వరూపం తెలుసుకోనీయకుండా మన మనస్సును కప్పివేస్తుంది. రెండవది మన మనస్సును అనాత్మవైపు దృష్టి మరలుస్తుంది. అందువల్ల మనం జగత్తులోని వస్తువులమీద మోహంలో పడిపోయి, వాటివెంట పరుగులు తీస్తాము. ఈ రెండింటిలో దేనికి ఏది కారణమో తేల్చి చెప్పటం కష్టం. ఆత్మ అజ్ఞానంవల్ల బాహ్యప్రపంచం వెంట పరుగులు తీస్తాము. బాహ్యప్రపంచం వెంట పరుగులు తీయటంలో మునిగిపోయి, ఆత్మ గురించిన అజ్ఞానంలోనే ఉండిపోతారు. ఒక దానివల్ల ఇంకొకటి ఎక్కువవుతున్నది.

పదిమంది శిష్యులు నది దాటివచ్చాక, అందరూ వచ్చారో లేదోనని తేల్చుకోవటానికి ఒక శిష్యుడు తక్కినవారిని లెక్కపెట్టటం మొదలుపెట్టాడు. అతను ఎన్నిసార్లు లెక్కపెట్టినా తొమ్మిది మందే వస్తున్నారు కాని, పదవ వ్యక్తి రావటం లేదు. పదవవ్యక్తి ఎంతసేపూ ఇతరులను లెక్కపెట్టే తపనలో ఉన్నాడు కాబట్టి తనను తాను మర్చిపోయాడు. దాని ఫలితం ఆత్మ అజ్ఞానం, అజ్ఞానంవల్ల ఏర్పడిన పొరపాటు. ఆ అజ్ఞానజనిత పొరపాటునే సంసారం అంటుంది శాస్త్రం.

నిజానికి అతను తొమ్మిదిమందిని చూడగలుగుతున్నాడు అంటేనే, చూస్తున్న అతను ఉన్నాడని చెప్పకనే చెప్పినట్టు అర్థం. చూసే అతను చూడబడేవారికి భిన్నంగా ఉంటాడు. చూసే అతను, చూడబడే తొమ్మిదికి భిన్నంగా ఉన్నాడు అంటేనే, అతను తను వెతుకుతున్న పదవవ్యక్తి అని చెప్పకనే చెప్పినట్టు అర్థం. దానికి విడిగా వేరే నిదర్శనం అవసరం లేదు. కాని వచ్చిన చిక్కేమిటంటే, ఈ పదవ వ్యక్తి, తను పదవవ్యక్తిని అనే విషయంలో అజ్ఞానంలో పడగలిగేలా చేసుకోవటమే కాక, దాని గురించి ఆందోళనలో పడ్డాడు కూడా. అలా మనం ఏడుస్తున్న ప్రతిసారీ, ఆత్మ అజ్ఞానం మనను చూసి మనసారా నవ్వుకుంటుంది, అది కూడా పగలబడి నవ్వుకుంటుంది.

ఆత్మవిద్య నిర్వచనాన్ని ముండకోపనిషత్తులో చూస్తాము. ఏ ఒక్క జ్ఞానం పొందితే, సర్వజ్ఞానమూ పొందినట్టు అవుతుందో, అది ఆత్మజ్ఞానం.

## 45. చైతన్యం - కాంతి

చైతన్యాన్ని అర్థం చేసుకోవటానికి దాన్ని కాంతితో పోల్చటం చూస్తాము తైత్తిరీయోపనిషత్తులో. చైతన్యంయొక్క ఐదు లక్షణాలు అంతకుముందు చూశాము. అవి చెయ్యి-కాంతి ఉదాహరణనుంచి గ్రహించబడ్డాయి. వాటిని వివరంగా చూద్దాము.

1. కాంతి ఇక్కడ ఉన్న అన్ని వస్తువులమీదా పడి, వాటిని ప్రకాశింపజేస్తుంది. నిజానికి కాంతివల్లనే ఈ వస్తువులన్నింటినీ చూడగలుగుతున్నాము. మనం చేతిని చూపించి ఇక్కడేముంది అంటే చేయి ఉంది అంటాము. కాని అక్కడ రెండు ఉన్నాయి. అవి చేయి+కాంతి. కాని కాంతిని పట్టించుకోము. అందువల్లనే ఈ గదిలో ఏమున్నాయి అంటే పుస్తకం, కలం, బల్ల అంటామే కాని పుస్తకం+కాంతి; కలం+కాంతి; బల్ల+కాంతి అనము.

ఇదే సూత్రాన్ని శరీరం, చైతన్యాలను అన్వయించి చూద్దాము. నువ్వెవరు అని ఎవరైనా అడిగితే నేను శరీరం అంటాము కాని అక్కడ రెండు ఉన్నాయి. అవి శరీరం+చైతన్యం. నిజానికి చైతన్యంవల్లనే శరీరం చైతన్యం అవుతుంది కాని చైతన్యాన్ని పట్టించుకోము. మనకు జరిగే ప్రతి అనుభవం చైతన్యంవల్లనే అవుతున్నది కాని ఆ విషయం తెలియదు మనకు. అలా కాంతిని పట్టించుకోము, చైతన్యం ఉన్నట్టు తెలియదు.

2. నిజానికి కాంతి అన్ని వస్తువులమీదా పడి ఆ వస్తువులను ప్రకాశింపజేస్తున్నా, కాంతి స్వతంత్రం. కాంతి ఆ వస్తువుల్లో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందింది కాని కాదు. అదే విధంగా, చైతన్యం ఈ శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది. కాని చైతన్యం స్వతంత్రం. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందింది కాని కాదు. ఒకవేళ చైతన్యం, శరీరంయొక్క స్వరూపం అయితే, ఎవరూ మరణించకూడదు, చైతన్యం శాశ్వతం కాబట్టి.

3. కాంతి చేతిని ప్రకాశింపజేస్తుంది కాని చేతికి దేశపరిమితి ఉంది. అలాగే కాంతి అనేక వస్తువులను ప్రకాశింపజేస్తుంది. వాటికి కూడా సరిహద్దులు ఉన్నాయి. కాని కాంతి వస్తువుల సరిహద్దులకే పరిమితమవలేదు. అది ఆ వస్తువుల సరిహద్దులను దాటి ఉంది. అదే విధంగా చైతన్యం, నా శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. చైతన్యం అన్ని శరీరాల్లో ఉండి, అంతటా వ్యాపిస్తుంది. ఆ విధంగా కాంతి–చైతన్యం సర్వవ్యాపకం.

4. కాంతి చేతిని ప్రకాశింపజేస్తుంది అని చూశాము. చేతిని అక్కడినుంచి తీసేస్తే, కాంతి మాయమవదు. అలాగే కాంతి ప్రకాశింపజేసే వస్తువులు నాశనమయితే, కాంతి నాశనమవదు. కాంతి అక్కడే ఉంటుంది. అదే విధంగా శరీరం నాశనమయితే, చైతన్యం నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.

5. కాంతి, తను ప్రకాశింపజేసే వస్తువులు లేకపోయినా ఉంటుంది, కాని తెలియదు. కాంతిని ప్రకటింపజేసే వస్తువు లేదు కాబట్టి అది తెలియదు. వ్యోమగాములు, స్పేస్‌క్రాఫ్ట్‌లో వెళ్ళినప్పుడు, ఆకాశంలో అంతా చీకటిగా ఉంటుంది వారికి. నిజానికి వారు సూర్యుని దిశగా వెళుతున్నారు, అక్కడ సూర్యకాంతి ఇంకా ఎక్కువగా ఉండాలి; కాని సూర్యకాంతిని ప్రకటింపజేసే వస్తువులు అక్కడ ఉండవు కాబట్టి తెలియదు.

అదేవిధంగా చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబంపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు. ఈ ఐదు అంశాలను మళ్ళీ టూకీగా చూద్దాము. అవి –

1. కాంతి, చైతన్యంవల్లనే ప్రతి ఒక్క అనుభవము తెలుస్తున్నది.
2. కాంతి, చైతన్యం, అవి ప్రకాశింపజేస్తే వస్తువులకు భిన్నంగా ఉంటాయి. అవి స్వతంత్రం.
3. కాంతి, చైతన్యం, అవి ప్రకాశింపజేసే వస్తువుల సరిహద్దులకే పరిమితమవలేదు.
4. కాంతి, చైతన్యం, అవి ప్రకాశింపజేసే వస్తువుల మాధ్యమం ద్వారానే ప్రకటితమవుతున్నాయి.
5. కాంతి, చైతన్యం, అవి ప్రకాశింపజేసే వస్తువులు ఉన్నా, లేకపోయినా ఉంటాయి కాని మాధ్యమం లేదు కాబట్టి తెలియదు.

కాంతి సమీప ఉదాహరణ మాత్రమే. కాంతి కూడా శాశ్వతం కాదు కాని చైతన్యం శాశ్వతం, నిత్యం.

## 46. ఆత్మకు నిదర్శనం ఏమిటి?

ఐతరేయోపనిషత్తులో, ఆధ్యాత్మికతమీద జిజ్ఞాస ఉన్న కొందరు ముముక్షువులు ఆత్మ విచారణ మొదలుపెడతారు అని వస్తుంది. వారు వేసుకున్న ప్రశ్న – **నేను ఎవరు**? నేను, నేను అని పదేపదే చెప్పే ఆ నేను ఎవరు? మనలో పంచకోశాలు ఉన్నాయి. మనకు కలిగే అనుభవాలు ఏదో ఒక కోశానికి చెందుతాయి.

| | |
|---|---|
| నేను లావుగా ఉన్నాను | – అన్నమయకోశం |
| నాకు ఆకలి వేస్తున్నది | – ప్రాణమయకోశం |
| నాకు కోపంగా ఉంది | – మనోమయకోశం |
| నేను ఇలా నిశ్చయించుకున్నాను | – విజ్ఞానమయకోశం |
| నేను హాయిగా నిద్రపోయాను | – ఆనందమయకోశం |

ఇలా ఏదో ఒక అనుభవం అవుతూనే ఉంటుంది. నా గురించి కాకుండా, ఎదుటివారి గురించి ఆలోచించినా కూడా వారు నాకు సంబంధించినవారే అయివుంటారు. అందువల్ల నేను, నేను అని చెబితే, ఆ నేను ఎవరు? రూపాలను చూసే కన్ను ఆత్మా? శబ్దాన్ని వినే చెవి ఆత్మా? వాసన చూసే ముక్కు ఆత్మా? మాట్లాడే వాక్కు ఆత్మా? రుచులను తెలుసుకునే నోరు ఆత్మా?

నేను కన్ను, చెవులు, మనస్సు మొదలైనవి కాను. అవి పని చేస్తున్నట్టు నాకు తెలుస్తున్నాయంటే అవి నేను కాను. అవి నేను కాకపోతే, నేనెవరను అని మనిషి ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నించుకోకపోతాడా అనుకుంటాడు పరమాత్మ. సరిగ్గా అలాగే చర్చ జరుగుతున్నది ఇక్కడ.

ఇంద్రియాలు ప్రమాణం. ప్రమాణం ప్రమా అవలేదు. వాడబడే పరికరం వాడే నేను కాలేదు.

అంతేకాదు, ఈ ఇంద్రియాలు మార్పుకు లోనవుతాయి. మనస్సులో ఆనందం, దుఃఖం మారుతూ ఉంటుంది. అందువల్ల ఇవేవీ ఆత్మ కాదు. ఎందుకంటే ఆత్మకు మార్పులు లేవు. ఆత్మ నిర్వికారం. ఈ శుద్ధచైతన్యాన్ని ఎలా తెలుసుకోవాలి? నేను కానిది, ఏమిటో ఎలా తెలుసుకుంటాను?

నేను ఒక వస్తువుగా చూడగలిగినది ఏదీ నేను కాదు. వాటన్నింటినీ నేతి నేతి అని కొట్టివేస్తాము. నేతి అంటే న ఇతి; ఇది కాదు. ఇంద్రియాలు నేను కాదు, శరీరం నేను కాదు, మనస్సు నేను కాదు, బుద్ధి కూడా నేను కాదు. అలా అన్నీ నేతి, నేతి అని కొట్టివేస్తూ వస్తే మిగిలేది ఏమిటి? శూన్యం కాదు. శూన్యం ఉందని తెలుసుకుంటున్నది ఒకటి ఉంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఒకటి సాక్షీభూతంగా చూస్తున్నది. దాన్ని సాక్షిచైతన్యం అంటారు.

ఐతరేయోపనిషత్తు దాన్ని **ప్రజ్ఞానం** అంటున్నది. ఈ ప్రజ్ఞానాన్ని తెలుసుకోవటమెలా? ప్రతి అనుభవంలోనూ తెలుస్తుంది. ఒక వృత్తితో (ఆలోచనతో) కలిస్తే చైతన్యం అనుభవం అవుతుంది.

చైతన్యం ఒకటే, వృత్తులు అనేకం. అందువల్ల అనుభవాలు కూడా అనేకం. అందువల్ల మారుతున్న అనుభవాలు, మారుతున్న ఆలోచనల వెనకవుండి, ఎప్పుడూ అందుబాటులో ఉండే, ఎన్నడూ మారని, రాకపోకలులేని చైతన్యమే ప్రజ్ఞానం – అది నా అసలు స్వరూపం.

ప్రతి అనుభవం = చైతన్యం + భిన్ననామరూపాలు

ఉదాహరణకు నేను ఒక చెట్టును చూస్తే, నా మనస్సులో చెట్టు వృత్తి ఏర్పడుతుంది. చెట్టు వృత్తి రాగానే, చెట్టు అనుభవం కలుగుతుంది. ఒక మనిషిని చూస్తే, మనిషి వృత్తి ఏర్పడుతుంది. మనిషి వృత్తి రాగానే, మనిషి అనుభవం ఏర్పడుతుంది.

**చైతన్యం + చెట్టు వృత్తి = చెట్టు అనుభవం**

**చైతన్యం + మనిషి వృత్తి = మనిషి అనుభవం**

ఇప్పుడు వృత్తిని కుడివైపుకు తీసుకువెళితే ఏమవుతుంది?

**చైతన్యం = అనుభవం – వృత్తి**

**అనుభవంలోంచి వృత్తిని తీసేస్తే మిగిలేది చైతన్యం ఒకటే**

**మారే అనుభవాలు – మారే వృత్తులు = మారని చైతన్యం**

మారే చైతన్యం అనకూడదు; మారని చైతన్యం.

దీన్నే జ్ఞానపరంగా చెప్పాలంటే మారే జ్ఞానంలోంచి మారే వృత్తులను తీసేస్తే, మిగిలేది మారే ఎరుక అనకూడదు, మారని ఎరుక. చైతన్యమే ఎరుక. చైతన్యమే ఆత్మ.

ఒక ఆలోచనలో ఉంటే, ఆ జ్ఞానమే వస్తుంది. ఇంకో జ్ఞానం రావాలంటే వృత్తి మారాలి. అందువల్ల వృత్తులు మారుతాయి, జ్ఞానం మారుతుంది, కాని ఎరుక మారదు.

మారని ఎరుకను ప్రజ్ఞానం అంది ఉపనిషత్తు.

సవిశేష ఎరుకని జ్ఞానం అంటారు. సవిశేష అంటే ఒక వస్తువును గురించిన జ్ఞానం. నిర్విశేష ఎరుకను ప్రజ్ఞానం అంటారు. సవిశేష జ్ఞానం మారుతుంది. నిర్విశేష జ్ఞానం మారదు. నిర్విశేష జ్ఞానం, సవిశేష జ్ఞానంలో ఇమిడివుంటుంది.

మారని నీరు మారే అలలలో ఉన్నట్టుగా,

మారని బంగారం మారే ఆభరణాలలో ఉన్నట్టుగా,

మారని ప్రజ్ఞానం మారే జ్ఞానంలో ఉంటుంది.

నిర్విశేషజ్ఞానాన్ని అనుభవించటం ఎలా? దాన్ని అనుభవించలేము. అది ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. అనుభవం కలగాలంటే అనుభవించే కర్త వేరు, అనుభవించబడే వస్తువు వేరు అవాలి. అందువల్ల సవిశేష జ్ఞానం ద్వారానే నిర్విశేష జ్ఞానాన్ని అనుభవించాలి.

ప్రతి ఆలోచన ద్వారా, ఆలోచనారహిత ఎరుకను గుర్తించాలి. ఆలోచనలు లేని ఎరుకను, ఆలోచనల ద్వారా తెలుసుకోవచ్చు. ఏ ఆలోచన? ఏదైనా తీసుకోవచ్చు. ఐతరేయోపనిషత్తు అలాంటి కొన్ని ఆలోచనలను పేర్కొంటుంది. వాటిలో కొన్ని విజ్ఞానం, మేధ, దృష్టి, స్మృతి, సంకల్పం. ఈ ఆలోచనలను తీసుకుని, ఆ ఆలోచనలను వదిలివేస్తే మిగిలేది శుద్ధ ఎరుక. దీన్నే ప్రజ్ఞానం అంటారు.

**ప్రతిబోధ విదితం మతమ్** – కేన

చైతన్యం ప్రతి అనుభవంలోనూ తెలుస్తుంది అంటుంది కేనోపనిషత్తు. ఇది అనిర్వచనీయమైన ఆత్మకు గొప్ప నిర్వచనం.

## 47. ఆత్మ నా స్వస్వరూపం

కేనోపనిషత్తు, ఒక శిష్యుడు వేసే ఈ ప్రశ్నతో మొదలవుతుంది. 'దేనివల్ల కోరబడి, ప్రేరేపించబడి, మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులు పనిచేస్తున్నాయి?' దానికి గురువు రెండు అతి ముఖ్యమైన నిర్వచనాలను ఇచ్చారు.

1. **ఆత్మలక్షణం** – శిష్యుడు అడిగిన ప్రశ్నకు ఒక్క మంత్రంలో జవాబు చెప్పాడు గురువు. ఈ మంత్రంయొక్క అర్థం అక్షరాలా చూస్తే ఆత్మ చెవియొక్క చెవి, మనస్సుయొక్క మనస్సు, వాక్కుయొక్క వాక్కు, అది ప్రాణంయొక్క ప్రాణం, కన్నుయొక్క కన్ను.

కాని ఈ మంత్రాన్ని లోతుగా విశ్లేషిస్తే ఆత్మ గురించి మూడు విషయాలు తేటతెల్లమవుతాయి. ఇప్పుడు చెవిపరంగా చూద్దాము.

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మ ఉండటంవల్లనే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

అంటే ఆత్మ స్వతంత్రం. ఆత్మ సమక్షంలో ఇంద్రియాలు పనిచేస్తాయి కాని ఆత్మ ఏ పనీ చేయదు, ఆత్మకు ఆ కర్మయొక్క ఫలమూ అంటదు.

2. **ఆత్మ అప్రమేయం** – గురువు ఇచ్చిన రెండవ నిర్వచనం, 'ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు.' తెలియని వస్తువు అంటే ఇప్పుడు తెలియకపోయినా ముందు ముందు తెలియవచ్చు కదా! అందువల్ల ఆత్మ తెలియని ఆబ్జెక్టు కాదు. అంటే ముందు కూడా తెలుసుకునే ఆబ్జెక్టు కాదని అర్థం. ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు; తెలియని, ముందు తెలుసుకోగలిగిన ఆబ్జెక్టు కాదు అంటే అసలు ఆత్మ లేనట్టా? కాని గురువు ఆత్మ ఉంది అంటే ఆత్మ ఉంది. అయితే ఆత్మ ఏమిటి?

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు, ఆత్మ తెలియని ఆబ్జెక్టు కాదు. ఈ రెండింటిలోనూ సమానంగా ఉన్న పదం ఆబ్జెక్టు. ఆత్మ ఆబ్జెక్టు కాదు. ఆత్మ ఆబ్జెక్టు కాదు అంటే ఆత్మ సబ్జెక్టు అయిన నేను. సృష్టిలో ఉన్నదంతా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి సబ్జెక్టు, ఆబ్జెక్టు. ఆత్మ తెలుసుకునే నేను, తెలుసుకున్న లేదా తెలియని వస్తువు కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియెన్స్‌డ్**

**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

**తెలుసుకునే సబ్జెక్టే ఎప్పటికీ, తెలుసుకోబడే ఆబ్జెక్టు కాదు ఎన్నటికీ**

అందువల్ల నేను ఆత్మ అని అర్థం చేసుకోవాలి. కాకపోతే ఆ నేను అన్నది ఏదో మర్చిపోకూడదు. నేను శరీరం కాను, నేను ఇంద్రియాలు కాను, నేను మనస్సు కాను. వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని. ఆ విధంగా మనశ్శరీరాలతో మమేకం చెందే స్థాయినుంచి, నేను ఆత్మను అని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం.

గురువు ఆత్మ గురించి వివరించాక ఆత్మ గురించి అర్థం అయిందా అని అడిగాడు. శిష్యుడు నాకు తెలుసు అంటే ఆత్మ తెలిసిన వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు నాకు తెలియదు అంటే ఆత్మ తెలియని వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు మౌనంగా ఉంటే జవాబు చెప్పని పొగరు కనిపిస్తుంది. అలా శిష్యుణ్ణి ఇరకాటంలో పెట్టాడు గురువు. కాని శిష్యుడు గురువును మించిన శిష్యుడు అయి, పదాల గారడీతో, తెలివిగా జవాబు చెప్పాడు. అతను నాలుగు వాక్యాలతో జవాబు చెప్పాడు.

1. నాకు బ్రహ్మ తెలుసు అనను.
2. నాకు బ్రహ్మ తెలియదు అనను.
3. నాకు తెలుసు.
4. నాకు తెలియదు.

నాకు బ్రహ్మ తెలుసు అనే పొరపాటు ఎన్నటికీ చేయనంటున్నాడు. ఎందుకు? నాకు బ్రహ్మ తెలుసు అని చెపితే, బ్రహ్మ తెలిసిన వస్తువు కిందకు వస్తుంది. నాకు బ్రహ్మ తెలియదు అంటాడా? ఆ పొరపాటు కూడా చేయనంటున్నాడు. నాకు బ్రహ్మ తెలియదు అంటే బ్రహ్మ తెలియని వస్తువు కిందికి వస్తుంది.

నాకు తెలుసు అంటున్నాడు. అంటే బ్రహ్మ సబ్జెక్టని నాకు తెలుసు; నాకు తెలియదు అంటున్నాడు. అంటే బ్రహ్మ ఆబ్జెక్టుగా నాకు తెలియదు.

ఈ పదాలు గారడీ అర్థం బ్రహ్మ తెలుసుకునే సబ్జెక్టే ఎప్పటికీ, తెలుసుకోబడే ఆబ్జెక్టు కాదు ఎన్నటికీ అని గురువు చెప్పిన సూత్రాన్ని వల్లెవేస్తున్నాడు. ముందు మంత్రంలో గురువును మెచ్చుకున్నాడు కూడా. మీ బోధ బాగా అర్థమయింది. మీరు బాగా చెప్పారు. బ్రహ్మ వస్తువుగా తెలుసుకునేది కాదని మీ బోధవల్ల తెలిసిందని అర్థం.

ఆత్మజ్ఞానం అంటే స్వయంప్రకాశక ఆత్మ నేను అని స్వీకరించటమే అని చూశాము. అందువల్ల, ఆత్మజ్ఞానంలో నేను ఆత్మను అనుభవించను, ఆత్మను చూడను, ఆత్మగా మారను, ఆత్మ నా స్వస్వరూపం అని అర్థం చేసుకుంటాను.

## 48 బ్రహ్మస్వరూపం

శాస్త్రం బ్రహ్మను జగత్ కారణ బ్రహ్మగా వర్ణిస్తుంది. అంటే జగత్తు అనే కార్యంయొక్క సృష్టికర్తగా వర్ణిస్తుంది. ప్రతి కార్యానికీ రెండు కారణాలు ఉంటాయి. అవి నిమిత్తకారణం, ఉపాదానకారణం. ఉదాహరణకు ఆభరణాలకు కంసాలి నిమిత్తకారణం, బంగారం ఉపాదానకారణం; ఇది ప్రకృతి సూత్రం. కాని ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది.

ఆ ఉల్లఘంన ప్రకారం నిమిత్తకారణం, ఉపాదానకారణం రెండూ ఒకరే అయ్యే ఆస్కారం ఉంది. ముండకోపనిషత్తు సాలెపురుగు ఉదాహరణను ఇస్తుంది దీనికి. సాలెపురుగు తనలోంచే దారాన్ని తీసుకుని సాలెగూడు కడుతుంది.

అదే విధంగా బ్రహ్మ కూడా తానే నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా. బ్రహ్మ నిమిత్తకారణంగా ఈ జగత్తును సృష్టించాడు. సృష్టికి ముందు బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు అంటుంది శాస్త్రం. బ్రహ్మ ఒక్కడే ఉంటే ఈ సృష్టికి కావాల్సిన ముడిసరుకులు ఎక్కడనుంచి వచ్చాయి? ముందేమన్నాం బ్రహ్మ **జగత్తును సృష్టించాడు** అన్నాము. ఇప్పుడు **బ్రహ్మ తానే జగత్తు అయ్యాడు** అంటున్నాము. ముడిసరుకులు కూడా బ్రహ్మనుంచే వచ్చాయి. సృష్టికి ముందు అద్వైతబ్రహ్మ మాత్రమే ఉన్నాడు. మాయతో కలిసి, ఈ జగత్తుయొక్క నిమిత్తకారణమూ, ఉపాదానకారణమూ తానే అయ్యాడు.

నిజానికి **సృష్టి** అనే పదం వాడటం కుదరదు. ఎందుకంటే అటు శాస్త్రపరంగానూ, ఇటు సైన్సుపరంగా కూడా పదార్థాన్ని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము. అవ్యక్తంలో ఉన్నది, వ్యక్తంలోకి రావటాన్ని సృష్టి అంటున్నాము అంతే. దీనికి శంకరాచార్యులవారు విత్తనంనుంచి చెట్టు మొలకెత్తటం ఉదాహరణను ఇస్తున్నారు. అంత పెద్ద వృక్షం, అనేక భాగాలున్న వృక్షం, విత్తనంలో అవ్యక్తంగా, భాగాలు తెలియనిరూపంలో ఉంటుంది. సైన్సులో కూడా మానవ డి.ఎన్.ఏ.లో పూర్తిగా వికసించిన మధ్య వయస్కుడైన మనిషియొక్క అంశాలన్నీ ఉంటాయని అంటుంది.

అందువల్ల సృష్టి అంటే ఏకం బ్రహ్మ అనేకంగా కనిపించటం. అందువల్ల సృష్టి అంటే అవ్యక్తంనుంచి వ్యక్తమవటం అనీ, ప్రళయాన్ని వ్యక్తంనుంచి అవ్యక్తంలోకి వెళ్ళటమనీ చెప్పవచ్చు. అది కూడా ఒక ఆది, అంతం ఉన్న ఒక సరళరేఖలా జరగదు. ఈ సృష్టి ఒక వృత్తాకారంలో జరుగుతుంది. అందువల్ల మొట్టమొదటి సృష్టి ఎప్పుడు జరిగిందో, జగత్తు

ఎప్పుడు అంతమవుతుందో ఎవరూ చెప్పలేరు. శాస్త్రజ్ఞులు కూడా విశ్వం ఎలా పుట్టింది, ఎప్పుడు పుట్టింది అనేది వారి మేధస్సుకు అందని లీల అనీ, దానికి మతమే జవాబు చెప్పగలదనీ అంటారు.

ఈ కనబడే జగత్తు సృష్టించబడింది అనండి, అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి వచ్చింది అనండి, ఎలా అన్నా, మనం నేర్చుకోవాల్సిన పాఠం జగత్తు అంటే వేరే ఏమిటో కాదు, జగత్తు అంటే బ్రహ్మే.

బ్రహ్మను ఉనికి లేదా సత్ లేదా సత్తా అంటుంది శాస్త్రం. దీనికి అర్థం మనం అనుభవిస్తున్న ఈ జగత్తును ఉనికి ఉన్న జగత్తు అనవచ్చు. ఉనికిని బ్రహ్మనుంచి అరువు తెచ్చుకుంది జగత్తు. మనం 'ఇది ఒక పుస్తకం,' అని అంటే మన ఉద్దేశ్యం ఉనికి ఉన్న పుస్తకం, కాని ఉనికిని పట్టించుకోము. ఇంగ్లీషులో దేర్ ఈజ్ ఎ బుక్, దేర్ ఈజ్ ఎ టేబుల్, దేర్ ఈజ్ ఎ స్టార్ అని వరుసగా చెప్పుకుంటూపోతే, ఆ ఈజ్-నెస్ ఏదైతే ఉందో, దాన్నే ఎక్సిస్టెన్స్ అంటారు.

తెలుగులో ఈ వాక్యాలను చూస్తే, పుస్తకం ఉంది, బల్ల ఉంది, నక్షత్రం ఉంది అని వరుసగా చెప్పుకుంటూపోతే ఆ ఉంది, ఉంది, ఉంది ఏదైతే ఉందో, దాన్నే ఉనికి లేదా సత్ లేదా సత్తా అంటారు.

మనం అంతకుముందు చైతన్యం గురించి నేర్చుకున్నప్పుడు చైతన్యానికి ఐదు లక్షణాలను పేర్కొన్నాము. ఇప్పుడు అవే ఐదు లక్షణాలను కొంచెంగా మార్చి సత్‌కు చెబుతాము. దీన్ని సత్, జగత్తు పరంగా చూద్దాము.

**సత్ ఐదు లక్షణాలు**

1. సత్, జగత్తులో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి చెందింది కాని కాదు.
2. సత్ స్వతంత్రమైనది. అది జగత్తంతటా వ్యాపించి, జగత్తుకు ఉనికిని ఇస్తుంది.
3. సత్, ఒక వస్తువు సరిహద్దులకే పరిమితమవలేదు. అది చైతన్యంలాగా సర్వవ్యాపకం.
4. సత్, జగత్తు నాశనమయినా, నాశనమవదు. జగత్తు లయమయ్యాక కూడా, సత్ ఉంటుంది.
5. సత్, జగత్తు లేకపోయినా ఉంటుంది కాని అనుభవంలోకి రాదు. దాన్ని ప్రతిబింబింపజేసే జగత్తు లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన సత్ లేనట్టు కాదు.

స్పేస్‌లోకి వెళితే అక్కడ చీకటిగా ఉంటుంది. అంతమాత్రాన సూర్యకాంతి లేనట్టు కాదు. కాని దాన్ని ప్రతిబింబింబజేసే మాధ్యమం లేదు కాబట్టి తెలియదు.

విశ్వరూప దర్శనంలోనూ, విభూతియోగంలోనూ కృష్ణపరమాత్మ తానే జగత్తంతా ఎలా ఉన్నాడో వివరిస్తాడు.

స్వామీజీ ఎప్పుడూ చెప్పే మాట ఇది –

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ.**

## 49. సత్, చిత్ రెండు భిన్నవస్తువులా?

ఇంతకుముందు అంశాల్లో ప్రతి ఒక్కవ్యక్తిలోనూ రెండు 'నేను'లు ఉన్నాయని చూశాము. వాటిని పెద్ద నేను, చిన్న నేను అంటారు. శాస్త్రంలో చిన్న నేనును అహంకారమనీ, పెద్ద నేనును ఆత్మ అనీ అంటారు. అహంకారాన్ని అనాత్మ అనీ, మనశ్శరీరాలనీ అంటారు. పెద్ద నేనును సాక్షి అనీ, సాక్షిచైతన్యం అనీ, చైతన్యం అనీ, బింబచైతన్యం అనీ అంటారు.

ఉపనిషత్తులన్నింటిలోనూ, ఆత్మ సత్యం అనీ, అనాత్మ మిథ్య అనీ అనేక కోణాల్లో విశ్లేషణ ఉంటుంది. అంతకముందు అవస్థాత్రయం గురించి చూశాము. ఇప్పుడు ఆ అవస్థాత్రయం పరంగా చూద్దాము. జాగ్రదావస్థలో శరీరం, ఇంద్రియాలు, మనస్సు అన్నీ వ్యవహారం నడుపుతాయి. మనస్సు పూర్తిగా విచ్చుకున్న పువ్వులా ఉంటుంది. ఈ మూడూ పనిచేస్తున్నాయని నాకు తెలుస్తున్నది.

స్వప్నావస్థలో శరీరం, ఇంద్రియాలు పడుకుంటాయి. మనస్సు(చిత్తం) మాత్రమే మేలుకుని ఉంటుంది. మనస్సు తన చిత్తంలో నిక్షిప్తమై ఉన్న జ్ఞాపకాలనుంచి వాసనామయ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. దాన్నే స్వప్నప్రపంచం అంటారు. నిద్రనుంచి లేచాక నేను స్వప్నంలో ఇది చూశాను, అది చూశాను అని చెబుతాను అంటే స్వప్నంలో కూడా నేను ఉన్నాను.

సుషుప్తిలో శరీరం, ఇంద్రియాలతో పాటు మనస్సు,చిత్తం,బుద్ధి,అహంకారం కూడా పడుకుంటాయి. కాని నిద్రపోయి లేచాక, 'నేను హాయిగా నిద్రపోయాను, నాకేమీ తెలియలేదు,' అంటాను. అంటే సుషుప్తిలో కూడా నేను ఉన్నాను. ఈ మూడు అవస్థల్లోనూ ఉన్న నేను ఎవరు? జాగ్రదావస్థలో జాగ్రత్ పురుషుడే ఉంటాడు, స్వప్నావస్థలో స్వప్నపురుషుడే ఉంటాడు, సుషుప్తి అవస్థలో సుప్తపురుషుడే ఉంటాడు. కానీ ఈ మూడు అవస్థలోనూ ఉన్నదే చైతన్యం అంటుంది శాస్త్రం. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేది సాక్షిచైతన్యం. ఈ చైతన్యమే నా స్వస్వరూపం కాని, మాయయొక్క ఆవరణశక్తివల్ల అది నాకు తెలియటం లేదు. అందువల్ల జీవాత్మ చైతన్యస్వరూపం లేదా చిత్.

జగత్తు కార్యం అనీ, ఈ కార్యం జగత్తుకు బ్రహ్మే ఉపాదానకారణం, నిమిత్తకారణం కూడా అనీ చూశాము. జగత్తు ఉంది, నక్షత్రం ఉంది, చెట్టు ఉంది – ఈ వాక్యాల్లో ఉంది అనే పదం **ఉనికి**ని సూచిస్తుంది అని కూడా చూశాము.

మామూలుగా అయితే భారీపుస్తకం అనే వాక్యంలో పుస్తకం నామవాచకం, భారీ విశేషణం. అందులో విశేషణానికి విడిగా ఉనికి లేదు కాని నామవాచకానికి ఉంది. ఎలా చెప్పగలము? మిమ్మల్ని పుస్తకం తీసుకురమ్మని చెప్పగలను కాని, భారీ తెమ్మని చెప్పలేను.

ఇదే పద్ధతిలో బంగారుగాజు, మట్టికుండ పదాలు వాడేస్తాము. పై సూత్రం ప్రకారం బంగారు, మట్టి విశేషణాలు. వాటికి విడిగా ఉనికి ఉండకూడదు. కాని ఈ రెండు వాక్యాల్లో బంగారు, మట్టి – ఇవే సత్యం, వాటికి విడిగా ఉనికి ఉంది. అలా ఎలా చెప్పగలము? బంగారాన్ని ముట్టుకోకుండా గాజుని ముట్టుకోలేము. అలాగే మట్టిని ముట్టుకోకుండా, కుండను పట్టుకోలేము. అంటే గాజుకి, కుండకి విడిగా ఉనికి లేదు. అందువల్ల వాటిని గాజైన బంగారం, కుండైన మట్టి అనాలి. ఆ విధంగా ఈ వాక్యాలన్నింటిలోనూ ఉనికిని ఏరాలి.

ఇక్కడేముంది అని చేతిని చూపించి అడిగితే, మూడు దశల్లో జవాబు చెబుతాము.

1. చేయి ఉంది
2. చేయి + కాంతి ఉంది
3. కాంతి మాత్రమే ఉంది.

ఇదే సూత్రాన్ని జగత్తు, ఉనికికి అన్వయిస్తే,

1. జగత్తు ఉంది
2. జగత్తు + ఉనికి ఉంది
3. ఉనికి మాత్రమే ఉంది.

ఈ ఉనికినే సత్ లేదా సత్తా అంటుంది శాస్త్రం.

ఈ విధంగా జగత్తంతా సర్వవ్యాపకంగా సత్ ఉంటే, వ్యష్టిలో చిత్ ఉంది. ఇప్పుడు ఈ సత్, చిత్ రెండు భిన్న అంశాలా? చూడటానికి రెండింటి లక్షణాలూ ఒక్కటే; ముఖ్యంగా రెండూ నిత్యం, రెండూ సర్వవ్యాపకం అంటే అనంతం. శాస్త్రం ప్రకారం రెండు అనంతాలు ఉండవు. సత్, చిత్ రెండూ అనంతం, కాని రెండు అనంతాలు ఉండవు అంటే దీని అర్థం రెండూ రెండు భిన్న వస్తువులు కావు; ఒకే వస్తువుకు ఉన్న రెండు అంశాలు. నాణేనికి రెండు వైపులు ఉన్నట్టుగా, ఒకే ఆత్మకు రెండు లక్షణాలు.

జగత్తంతా సర్వవ్యాపకంగా ఉనికిరూపంలో ఉన్న బ్రహ్మను, వ్యష్టిలో చైతన్యరూపంలో తెలుసుకోగలము అని అర్థం చేసుకోవాలి. సమష్టిపరంగా పరమాత్మ, వ్యష్టిపరంగా జీవాత్మ. ఇంకో విధంగా చెప్పాలంటే సమష్టిపరంగా శుద్ధ సత్తే, వ్యష్టిపరంగా శుద్ధచిత్.

జీవాత్మ = పరమాత్మ. ఇది మహావాక్యం.

జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధించే వాక్యాన్ని మహావాక్యం అంటారు శాస్త్రంలో. జీవాత్మ అన్నప్పుడల్లా ఆత్మ అంటే ఏమిటో మర్చిపోకూడదు. ఆత్మ అంటే శరీరం కాదు, మనస్సు కాదు; ఆత్మ అంటే చైతన్యం.

## 50. సచ్చిదానంద ఆత్మ విశ్లేషణ

ఆత్మకు ఒక నిర్వచనం – సచ్చిదానంద ఆత్మ. దీనిలో మూడు పదాలు ఉన్నాయి. అవి సత్, చిత్, ఆనందం. సత్ అంటే శుద్ధసత్యం; చిత్ అంటే శుద్ధచైతన్యం; ఆనందం అంటే అనంతం.

**చిత్** – నేను ఆత్మనా, శరీరాన్నా? నేను చైతన్యం నాలో ఉన్న శరీరాన్నా, నేను శరీరం నాకు ఉన్న చైతన్యాన్నా? ఇంతవరకు మనకు తెలిసినది, మనం అనుకుంటున్నది – నేను శరీరాన్ని. ఇప్పుడు మనం మన దృక్పథాన్ని మార్చుకోవాలి. నేను శరీరాన్ని కాను. శరీరం నాకు ఆగంతుకంగా వచ్చింది, నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. నేను సర్వవ్యాపకమైన, శాశ్వతమైన ఆత్మను. ఈ శరీరమనే మాధ్యమం ద్వారా వ్యవహారం నడుపుతున్నాను. జాగ్రదావస్థలో ఈ శరీరాన్ని ఉపయోగిస్తాను; స్వప్నావస్థలో ఇంకో స్వప్నశరీరం ఉపయోగిస్తాను; సుషుప్తిలో ఈ రెండు శరీరాలూ పడుకుంటాయి, కాని చైతన్యమైన నేను ఉంటాను. ఉండనిది వ్యవహారం మాత్రమే. శరీరం ఉన్నా, లేకపోయినా నేను ఉంటూనే ఉంటాను. ఇంకొక శరీరం తీసుకున్నాక, దాని ద్వారా వ్యవహారం నడుపుతాను.

స్వప్నంనుంచి జాగ్రదావస్థకు లేస్తే, స్వప్నం ఎలా మిథ్యగా తేలిపోతుందో, అలా జాగ్రదావస్థనుంచి నా ఉన్నతమైన నేనుకు లేస్తే, జాగ్రదావస్థ కూడా స్వప్నం–2 అయి, అది కూడా మిథ్యగా తేలిపోతుంది అంటుంది శాస్త్రం. ఆ విధంగా నేను చిత్‌రూపంలో ఎప్పుడూ ఉంటాను.

**సత్** – సత్‌ను అర్థం చేసుకునే ముందు, ఒక ముఖ్యమైన సూత్రాన్ని అర్థం చేసుకోవాలి. ఏదైనా వస్తువుకు ఉనికి ఉండాలంటే, అది తెలుసుకోబడే వస్తువై ఉండాలి. ఒక వస్తువు ఉందని ఎప్పుడు చెప్పగలను? దాని గురించిన జ్ఞానం నాకు ఉంటేనే! నిజానికి రెండూ పరస్పర సంబంధం గలవి. ఇక్కడ గడియారం ఉందని నేను చెబితే, నాకు గడియారం గురించిన జ్ఞానం ఉంది. అంటే గడియారం ఉనికి గురించి నేను చెప్పగలుగుతాను. ఆ విధంగా నేను – సత్‌ను, చిత్‌ను. సత్తే చిత్, చిత్తే సత్.

**ఆనందం** – ఆనందాన్ని భూమ అనే పదంతో నిర్వచిస్తుంది ఛాందోగ్యోపనిషత్తు. పరిమితిలేని, పరిపూర్ణమైన ఆనందమే భూమ. అల్పమైన వస్తువుల్లో అంటే పరిమితి ఉన్న వస్తువుల్లో సుఖం లేదు. ఇది వింటే మనకొక సందేహం కలుగుతుంది. వస్తువుల్లో సుఖం లేదని ఎలా అంటారు? నాకు ఒక వస్తువు **కొంటే** ఆనందం వస్తుంది, ఇష్టమైన ఆహారం **తింటే** ఆనందం వస్తుంది కదా!

కాని శాస్త్రం అది నిజంకాదు అంటుంది. ఉదాహరణకు సంగీతం విషయమే తీసుకోండి. సంగీతంలో కనుక ఆనందం ఉంటే, ఎవరు ఏ సంగీతం విన్నా ఆనందించాలి కదా! కాని

యువతకు ఇష్టమైన పాశ్చాత్య సంగీతం వృద్ధులకు ఇష్టం ఉండదు. వృద్ధులకు ఇష్టమైన శాస్త్రీయ సంగీతం యువతకు ఇష్టం ఉండదు. నిప్పు విషయం అలా కాదు. నిప్పులో చేయి పెడితే ఎవరికైనా, ఎప్పుడైనా, ఏ దేశంలోనైనా, చేయి కాలక మానదు. అంటే ఆ వేడి తత్త్వం అగ్నిలో స్వతహాగా ఉంది. కాని ఆనందం ఆ వస్తువులో స్వతహాగా లేదు.

అయినా నాకు ఒక వస్తువువల్ల ఎందుకు ఆనందం వస్తోంది? దానికి కారణం ఉంది. నేను కావాలనుకున్న వస్తువు పొందేసరికి, నా మనస్సు ప్రశాంతంగా అవుతుంది. ఆ ప్రశాంత మనస్సులో నా స్వరూప ఆనందం, ప్రతిబింబించబడి, మనస్సులో ప్రకటితం అవుతుంది.

దీనికి ఎప్పుడూ ఇచ్చే ఉదాహరణ **కుక్క-ఎముక**. ఒక కుక్క ఎండిన ఎముకను కొరికి తింటుంటే, రక్తం కారుతుంది. దానికి ఎముక తినకముందు రక్తం కారలేదు. అందువల్ల అది ఆ రక్తం ఎముకనుంచి వచ్చింది అనుకుంటుంది. శాస్త్రం మనమేమీ తక్కువ తినలేదు అంటుంది. వేదాంతం ఈ ప్రపంచం ఆ ఎముకలాంటిది అంటుంది. ప్రపంచంవల్ల ఒక్క బొట్టు ఆనందం కూడా అనుభవించలేము. అదంతా నా ఆనందమే.

ఏ వస్తువు తిని, అనుభవించి, ఆనందం పొందినా, అది బ్రహ్మానందంనుంచి వచ్చిన ఆనందమే. జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య భేదం ఇందులో ఉంది. అజ్ఞాని ఒక వస్తువువల్ల ఆనందం పొందాననుకుంటాడు. అజ్ఞానికి అది విషయానందం మాత్రమే. కాని జ్ఞాని అది కూడా ఆత్మానందంనుంచే వస్తుంది అంటాడు. ఇద్దరూ సంగీతం వింటూ ఆనందం పొందుతారు.

అజ్ఞాని సంగీతం ఆగిపోగానే ఆనందం పోయింది అనుకుంటాడు. జ్ఞాని ఆనందం ప్రకటితమవటానికి అవసరమైన మాధ్యమం పోయింది అంతే అంటాడు. అందువల్ల దుఃఖం అంటే ప్రకటితమవని ఆనందం అతనికి. ఆనందం ప్రకటితమైనా, అవకపోయినా నేను ఆనందస్వరూపుణ్ణే అంటాడు జ్ఞాని.

ఇంతకుముందు సత్తే చిత్, చిత్తే సత్ అని చూశాము. ఇప్పుడు సత్తే ఆనందం, ఆనందమే సత్, చిత్తే ఆనందం, ఆనందమే చిత్ అని అర్థం చేసుకోవాలి. ఆ విధంగా మనం సత్, చిత్, ఆనందస్వరూపులం అంటున్నది శాస్త్రం. ఈ సత్ చిత్ ఆనందం శరీరం ద్వారా ప్రకటితమవుతుంది.

శాస్త్రం బ్రహ్మను వివరించేటప్పుడు సచ్చిదానంద బ్రహ్మ అంటుంది. నా అనుభవం ద్వారా నేను సచ్చిదానందం అని తెలిసింది. అందువల్ల నేను బ్రహ్మను. **అహం బ్రహ్మ అస్మి** శరీరంలో ఉన్న ఆత్మను జీవాత్మ అంటే, సమష్టిలో ఉన్న ఆత్మను పరమాత్మ అంటారు. గదిలోపల ఉన్న ఆకాశం, గది బయట ఉన్న ఆకాశం ఒకటే అయితే, దానికి గోడలు కట్టటం ఎందుకు? ఎందుకంటే గోడలు కట్టబడి, గదిలో ఆకాశం వస్తేనే, ఆకాశాన్ని

వినియోగించుకోగలము. అలాగే అంతటా సర్వవ్యాపకంగా ఉన్న చైతన్యం, మనస్సనే గోడల మధ్య ఉంటేనే అది చైతన్యవంతమవుతుంది. దాన్ని జీవాత్మ అంటారు.

## 51. మోక్షం అంటే ఏమిటి?

ఆత్మజ్ఞానం అర్థం చేసుకోవటానికి శంకరాచార్యులవారు ఒక అద్భుతమైన ఉదాహరణను ఇస్తున్నారు. బంగారం మకిల పట్టితే, అది అంతకుముందులా మెరవదు. దాన్ని మెరుగుపెడితేనే, పూర్వపు మెరుపు మళ్ళీ వస్తుంది. అలాగే ఈ జీవునికి కూడా తన స్వస్వరూపమైన ఆనందానికి మకిల పట్టింది. అతని అజ్ఞానంవల్ల అతను పోగేసుకున్న అనేక అశుద్ధాలవల్ల పట్టిన మకిల అది.

బంగారం విషయంలో మురికి పోవాలంటే, దాన్ని అగ్నిలో కాల్చాలి. జీవుని విషయంలో మురికి పోవాలంటే అజ్ఞానాన్ని జ్ఞానాగ్నిలో కాల్చాలి. దాన్నే వేదాంతంలో ఆత్మజ్ఞానం అంటారు. ఇక్కడ మలినం అజ్ఞానం; దానికి జ్ఞానం ఒక్కటే పరిష్కారం. చీకటిని పారద్రోలటానికి వెలుగొక్కటే ఎలా మార్గమో, అలా అజ్ఞానమనే చీకటిని పారద్రోలటానికి జ్ఞానమనే వెలుగొక్కటే మార్గం.

అర్థం చేసుకున్న మీరు అనుభవిస్తే, అర్థం కాని మీరు భయం, దుఃఖం, బాధలకు లోను అవుతారు. మీ జీవితమంతా మీరు కోరితెచ్చుకున్న అభద్రతా భావనలతోనే నడుస్తుంది. ఉదాహరణకు, చీకట్లో దూరంగా ఒక చెట్టుబోదెని చూస్తే, అది మనిషిగా కనిపిస్తుంది. అంతేకాదు, అతను దొంగ అయివుంటాడనే భయం రాజుకుంటుంది. ఆ దొంగను గురించి భయాన్ని పారద్రోలటానికి, మీరు పారిపోతారు అక్కడనుంచి. అలా జీవితమంతా మీ అజ్ఞానం మీకు భయం, దుఃఖం, బాధలను కొనితెస్తుంది.

ఈ విషయంలోని సత్యాన్ని మీరు జీర్ణించుకోవాలంటే, మీరు ప్రకృతి సూత్రాలను అర్థం చేసుకోవాలి. ఆనందం మీ స్వస్వరూపం. ఆనందం అనుభవిస్తున్నారంటే కొత్తగా ఏమీ పొందటం లేదు. మీ స్వస్వరూపంలో ఉన్నారు. దుఃఖం మీ తప్పుడు ఆలోచనలవల్ల, పొరపాటువల్ల మీరు కొనితెచ్చుకున్నది. ప్రకృతిలో ఏదైనా దాని సహజగుణంలో ఉండటానికి ప్రయత్నిస్తుంది. నీరు ఎప్పటికీ వేడిగా ఉండలేదు. ఎందుకంటే వేడి అరువు తెచ్చుకున్న లక్షణం. దాన్ని ఆగంతుక లక్షణం అంటారు. అందువల్ల కాసేపటికే చల్లారిపోతుంది.

అదేవిధంగా, దుఃఖం మీ ఆగంతుక లక్షణం. అందువల్లనే దుఃఖాన్ని పారద్రోలి, ఆనందంలో నిలబడటానికి ప్రయత్నిస్తారు. అలాగే ఆరోగ్యవిషయం కూడా. ఆరోగ్యం మీ స్వరూపం, అనారోగ్యం ఆగంతుకం. వైద్యుడు వైద్యం చేస్తే, మీకు ఆరోగ్యం కొత్తగా

రాదు. మీ ఆరోగ్యానికి ఆటంకం కలిగించిన ఆగంతుకాన్ని తొలగిస్తారు. అందువల్లనే ఆరోగ్యాన్ని స్వస్థత అంటారు. స్వస్థత అంటే మన స్వస్వరూపంలో ఉండటం. అందువల్లనే ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే, 'ఏమయింది?' అని అడగగలము కాని ఎవరైనా ఆరోగ్యంతో మిసమిసలాడుతుంటే, 'ఎందుకింత ఆరోగ్యంగా ఉన్నావు?' అని అడగము.

అదే విధంగా ఆత్మ లక్షణం నిత్యం. అందువల్లనే మనం నిత్యంగా, చిరకాలం జీవించి ఉండాలని కోరుకుంటాము. కాకపోతే, ఆత్మ అంటే చైతన్యం అని తెలియక, శరీరం నిత్యంగా ఉండాలి అనుకుంటాము. దానికోసం పడరాని పాట్లు పడతాము. శరీరపరంగా శాశ్వతంగా ఉండలేము కాబట్టి కనీసం మన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయేందుకు పాట్లు పడతాము. ఏదైనా సంస్థకు దానం ఇవ్వటమో, ఒక ట్రస్టు ఏర్పరచటమో చేస్తాము.

నిజానికి అసలు 'నేను' నిత్యం, శాశ్వతం. ఈ ఆత్యంతిక ఆనందం వచ్చిపోయేది కాదు. మోక్షం అంటే ఆత్యంతిక ఆనందప్రాప్తి. ఆత్యంతిక ఆనందప్రాప్తి అంటే మన స్వరూపంమీద ఆపాదించిన దుఃఖాన్ని పోగొట్టటం. ఆనందప్రాప్తి = దుఃఖనివృత్తి. కొత్తగా ఆనందం రాదు; మన స్వరూపమైన ఆనందాన్ని మేఘంలా కప్పిన ఆటంకాలను తొలగించటం. ఆ మేఘాలను తొలగించటానికి జ్ఞానమార్గమొక్కటే మార్గం. నేను పూర్ణుడుని, నేను ఆనందస్వరూపుణ్ణి అని అర్థం చేసుకుంటే శాంతి, భద్రత, ఆనందాలకోసం బాహ్యంగా పరుగులు తీయకుండా, అవి మనలోనే దొరుకుతాయని అర్థం చేసుకుంటాము. దీన్నే జీవన్ముక్తి అంటారు.

ఈ ఆత్మజ్ఞానంవల్ల కలిగే ఒక గొప్ప లాభం జ్ఞాని శరీరాన్ని తనకు భిన్నంగా చూస్తాడు. అది ఆత్యంతిక దుఃఖనివృత్తిని కలుగజేస్తుంది. అత్యంత క్లిష్టపరిస్థితి కూడా అతన్ని కుదిపివేయదు. అనాత్మలో తన మనశ్శరీరాలు కూడా వస్తాయనీ, అనాత్మ స్థాయిలో సుఖదుఃఖాలు వచ్చిపోతాయనీ తెలుసు. జ్ఞాని తన శరీరాన్ని తనకు భిన్నంగా చూడగలుగుతాడు. తక్కిన శరీరాలు ఈ భూమ్మీదకు వచ్చిపోయినట్టుగా తన శరీరం కూడా ఎప్పుడో వెళ్ళిపోతుందని అర్థం చేసుకుంటాడు. మామూలుగా ఆబిచ్యుయరీలో ఎవరో చనిపోయారని చదివితే వైరాగ్యం ప్రదర్శిస్తాము కాని అదే వైరాగ్యాన్ని జ్ఞాని తన శరీరంమీద కూడా పెంచుకుంటాడు.

స్వాతంత్ర్య పోరాటం సలిపిన వీరులు, వారిని కొట్టినా, హింసించినా, **వందేమాతరం** నినాదం మానలేదు. వారి శరీరానికి నొప్పి కలిగినా వారు దాన్ని పట్టించుకోలేదు. వారిలో శారీరక నేను, భారతీయుడనైన నేను ఉన్నారు. భారతీయుడనైన నేను పడే బాధల ముందు శారీరమైన నేను పడే బాధలు తక్కువనుకున్నారు వారు.

అలాగే జ్ఞానికి శారీరక బాధలు ఉండవని కాదు అర్థం. గుర్తుంచుకోండి, జ్ఞానం శారీరక బాధలనుంచి విముక్తి కలిగించదు. అయితే జ్ఞానం పొందటం ఎందుకు అనకూడదు. శారీరక బాధలను సంసారం అనరు. మానసిక బాధలనే సంసారం అంటారు. ఏదైనా వస్తే

నాకే ఎందుకు వచ్చింది అంటాము. జ్ఞాని అలా చేయడు. ఉన్నతస్థితికి ఎదిగితే, తక్కినవి చిన్నవిగా కనిపిస్తాయి.

ఒక పెద్ద చెట్టును నేలమీంచి చూస్తే మహావృక్షంగా కనిపిస్తుంది. దాన్నే హెలికాప్టర్‌నుంచి చూస్తే చాలా చిన్నదిగా కనిపిస్తుంది. మొదటి లాభం శరీరాన్ని తనకు భిన్నంగా చూడటం.

సర్వత్ర సమదర్శనం ఇంకొక ఫలం. జ్ఞాని తనను తాను ఆత్మగా ఎలా అర్థం చేసుకుంటాడో, అలాగే తక్కినవారిని కూడా ఆత్మగానే చూస్తాడు. కృష్ణపరమాత్మ కొన్నింటిని పేర్కొన్నాడు. బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగు, కుక్క, కుక్కమాంసం తినే వ్యక్తి – అందరిలోనూ ఆత్మనే చూస్తాడు. దానివల్ల సర్వజనీన ప్రేమ చూపిస్తాడు.

అమృతః భవతి – ఇది ఇంకొక ఫలం. శాశ్వతత్వం పొందుతాడు. మృత్యుభయం పోతుంది.

విదేహముక్తి చివరి ఫలం. జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడు. అంటే జననమరణవృత్తాలలో పడి తిరగడు. కుండ పగిలిపోతే ఘటాకాశం మహదాకాశంలో ఏకమైపోయినట్టుగా, జ్ఞానికి ఈ స్థూలశరీరం రాలిపోతే, ఇందులో ఉన్న జీవాత్మ అంతటా ఉన్న పరమాత్మలో ఏకమవుతుంది.

## 52. మహావాక్యం

జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి చెప్పే వేదవాక్యాన్ని మహావాక్యం అంటారు. ఐక్యం అనేటప్పుడు స్వరూప ఐక్యం అనాలి. ఉపనిషత్తుల్లో చాలా మహావాక్యాలు ఉన్నాయి కాని, వాటిలో పేరెన్నికగలవి నాలుగు వేదాలనుంచి నాలుగు మహావాక్యాలు.

| **సంఖ్య** | **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** | **అర్థం** |
|---|---|---|---|---|
| 1 | ఋగ్వేదం | ఐతరేయోపనిషత్తు | ప్రజ్ఞానం బ్రహ్మ | శుద్ధ ఎరుకే బ్రహ్మ |
| 2 | అథర్వణవేదం | మాండూక్యోపనిషత్తు | అయమాత్మా బ్రహ్మ | ఈ ఆత్మే బ్రహ్మ |
| 3 | సామవేదం | ఛాందోగ్యోపనిషత్తు | తత్త్వమసి | ఆ బ్రహ్మవు నువ్వే |
| 4 | యజుర్వేదం | బృహదారణ్యకోపనిషత్తు | అహం బ్రహ్మ అస్మి | నేను బహ్మను అయివున్నాను |

ఈ నాలుగింటిలో మళ్ళీ **తత్త్వమసి** మహావాక్యం ప్రఖ్యాతి చెందినది. ఎందుకంటే గురువు ఆత్మజ్ఞానం కలుగజేసి, **ఆ బ్రహ్మవు నువ్వు** అని దశలవారీగా చెప్పుకొస్తాడు. ఆ నువ్వు ఎవరు కాదో కూడా ఒక్కొక్కటీ కాదని నిరూపించుకుంటూ వస్తాడు. నువ్వు శరీరం కాదు; ఎందుకంటే శరీరం నీ అసలు స్వరూపం కాదు. దానికి రాకపోకలు ఉన్నాయి; దానికి షడ్వికారాలు ఉన్నాయి; నీకు రాకపోకలు లేవు, వికారాలు లేవు.

అలాగే నువ్వు మనస్సు కూడా కాదు, మనస్సులోని ఆలోచనలకు కూడా రాకపోకలు ఉన్నాయి కూడా; వికారాలు ఉన్నాయి, రాగద్వేషాలు ఉన్నాయి; కాని నీకు రాకపోకలు

లేవు, వికారాలు లేవు. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఏదైతే సాక్షీభూతంగా చూస్తుందో అదే చైతన్యం, అదే నువ్వు. ఇంతవరకూ వేదాంతం ఎలా నేతి, నేతి పద్ధతి ద్వారా నువ్వు శరీరం కాదు, నువ్వు మనస్సు కాదు అని ఖండించుకుంటూ వస్తుందో చూస్తూ వచ్చాము. శుద్ధ చైతన్యం, శుద్ధ ఉనికి నువ్వు అంటుంది.

నేను తండ్రిని, నేను డిగ్రీ చదివాను, నేను కోపంగా ఉన్నాను, నేను లావుగా ఉన్నాను– ఈ వాక్యాలన్నిటిలోనూ నేను పదం సమానంగా ఉంది. నేను చైతన్యాన్ని సూచిస్తుంది; ఉన్నాను – ఉనికిని సూచిస్తుంది. నేను ఉన్నాను తర్వాత ఏ పదం వాడినా అవి నా అసలు నేనుకి వాడిన గుణాలు మాత్రమే అవుతాయి. అసలు నేను గుణాతీతుణ్ణి, నిర్వికారచైతన్యాన్ని; శుద్ధ చిత్‌ను, శుద్ధ సత్‌ను. నాకు అనుభవంలోకి వచ్చే ప్రతిదీ ఆబ్జెక్టు అవుతుంది. అది అనాత్మ. అనుభవంలోకి రానిది సబ్జెక్టు. అది ఆత్మ అంటే నేను.

స్వామీ చిన్మయానంద, శిల్పి ఉదాహరణను ఇస్తారు. ఒక శిల్పిని నువ్వు ఇంత అద్భుతంగా ఈ శిల్పాన్ని ఎలా చెక్కావు అని అడిగితే, అతను నేనేమీ కొత్తగా కృష్ణపరమాత్మ విగ్రహాన్ని చెక్కలేదు అంటాడు. అతను చేసిందల్లా ఒక శిలను తీసుకుని, దాన్ని రోజుల తరబడి, ఇంకా మాట్లాడితే నెలల తరబడి అందులో ఉన్న అనవసరమైన భాగాన్ని పెద్ద ఉలితో చెక్కుతూ వచ్చాడు. అలా కొంతభాగం చెక్కాక, ఒక ఆకారం ఏర్పడితే, ఆ ఆకారం కాకుండా అధికంగా ఉన్న చిన్న భాగాలను మధ్యరకం ఉలితో తీసివేస్తూ వచ్చాడు.

ఒక పూర్తి ఆకారం ఏర్పడ్డాక, అతి సూక్ష్మమైన ఉలిని తీసుకుని, కొన్ని సూక్ష్మాతి సూక్ష్మమైన అనవసరమైన భాగాలను తీస్తూ వచ్చాడు. అలా శిల్పంలో స్థూలభాగంనుంచి సూక్ష్మాతి సూక్ష్మమైన భాగాల దాకా తీస్తూవస్తే మిగిలింది ఏదైతే ఉందో, అదే కృష్ణపరమాత్మ ఆకారంగా రూపుదిద్దుకుంటుంది. అంటే శిల్పి కొత్తగా ఒక శిల్పాన్ని చెక్కలేదు, శిలలో ఉన్న వ్యర్థమైన భాగాలను తీసివేశాడు అంతే.

ఇక్కడ కూడా వేదాంతం ఒక సూక్ష్మమైన ఉలిని తీసుకుంటుంది. నేను కొడుకును కాదు, నేను భర్తను కాదు, నేను తండ్రిని కాదు, నేను డిగ్రీ చదవలేదు, నేను ఆందోళన కాదు, నేను శరీరాన్ని కాదు, నేను మనస్సు కాదు అని – నాకు నేను ఆపాదించుకున్న గుణాలన్నింటినీ కొట్టివేయమంటుంది.

దీన్ని నేతి–నేతి పద్ధతి అంటారు శాస్త్రంలో. న ఇతి, న ఇతి అంటూ ఒక్కొక్కదాన్నీ ఇది కాదు, ఇది అని నిషేధించుకుంటూ వస్తాము. అలా నిషేధించుకుంటూ వస్తే ఏం మిగులుతుంది? ఏమీ మిగలదు అనకూడదు. ఈ గదిలో ఎవరూ లేరని నేను చెబితే, చెప్పిన నేను తప్ప ఎవరూ లేరని అర్థం. అలా ప్రతిదీ నిషేధించుకుంటూ వస్తే నిషేధించిన నేను మిగులుతాను. అలా మిగిలిన నేను సాక్షి లేదా ఆత్మ. అన్నీ నిషేధించాక మిగిలింది

సాక్షి అని నాకెలా తెలుస్తుంది? ఆ సాక్షిని ఎవరు చూపిస్తారు? సాక్షిని ఎవరూ చూపించనవసరం లేదు. సాక్షి **స్వయంప్రకాశక జ్యోతి**, సాక్షి అంటే నేను.

సాక్షి స్వయంప్రకాశక జ్యోతి అయితే, అన్నింటినీ నిషేధించక ముందు కూడా సాక్షి ఉండాలి. అలా ముందు కూడా ఉంటే, నిషేధం ఎందుకు చేయాలి? నిషేధం చేయకముందూ సాక్షి ఉంది అంటే నేను ఉన్నాను కాని ఆ నేనుమీద అనేక గుణాలను ఆరోపించి, ఆ గుణాలే నేను అనుకుంటున్నాను. నేను శరీరం కాదు, నేను ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు అని నిషేధించుకుంటూ వస్తే మిగిలేది గుణాలు లేని నేను. ఈ గుణాలు లేని నేనే అక్షరబ్రహ్మను.

నిద్రనుంచి లేవగానే ముందు మనస్సు మేలుకుంటుంది. నేను ప్రమాత అనే గుణం వస్తుంది. తర్వాత నేను మనిషిని, నేను భర్తను గుణాలు వచ్చి చేరతాయి. బృహదారణ్యకంలో సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాలతో పాటు అనేకం, 25 నిషేధ పదాల ద్వారా కొట్టివేస్తూ వస్తుంది. ఆత్మ స్థూలశరీరం కాదు, ఆత్మకు గుణాలు లేవు, ఆత్మ పంచభూతాలు కాదు. దేనితోనూ సంగత్వం లేదు, జ్ఞానేంద్రియాలు లేవు. కర్మేంద్రియాలు లేవు, మనస్సు లేదు, తేజస్సు లేదు, పంచప్రాణాలు లేవు. కర్త కాదు, భోక్త కాదు.

అంటే అది అనుభవించదు, అనుభవించబడే వస్తువూ కాదు. ఎందుకంటే ఆ బ్రహ్మను నేనే కాబట్టి. అంతకుముందు మామూలు శిలగా ఉన్నదానినుంచి అనవసర భాగం చెక్కివేస్తే, అద్భుతమైన కృష్ణవిగ్రహంగా అది మారింది. అలాగే కార్యకరణసంఘాతమైన అనాత్మతో నేను మమేకం చెందితే, నేను ఒక పరిమితి ఉన్న, దుఃఖాలయమైన జీవాత్మను; అదే నేతి నేతి పద్ధతి ద్వారా నాకు ఆపాదించుకున్న గుణాలన్నింటినీ కొట్టివేస్తూ వస్తే మిగిలేది సత్, చిత్, ఆనంద ఆత్మను. గురువు తత్ త్వం అసి అని బోధిస్తే, నేను అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకోవాలి.

అలా మన వేదాలు ఒక్కొక్క మెట్టూ ఎక్కించుకు వెళ్ళి, జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని బోధిస్తాయి.

హరిః ఓమ్